


'పారదర్శకతతో పథకాలు
అమలు చేస్తే చిట్టచివరి వ్యక్తికి కూడా
సంక్షేమం అందుతుంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16
సంచిక: 99

శుక్రవారం 30-6-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



ఫ్యాషన్

చినుకుల్లో స్టయిల్‌గా...

ఈ సీజన్‌లో బయటకు వస్తే ఎప్పుడు చినుకు పడుతుందో తెలియదు. ఆ చినుకుల్లో ఏ డ్రెస్ ఉంటే బాగుంటుందో... ఎలా ఉండాలో తెలియక ఇబ్బందులు అందుకే ఈ సీజన్‌లో మీ వార్డ్‌రోబ్, బ్యూటీ రొటీన్‌లలో కూడా మార్పులు చేసుకోక తప్పదు. డల్‌గా ఉండే వానాకాలం వాతావరణాన్ని బ్రైట్‌గా మార్చే ట్రెండ్స్ గురించి తెలుసుకుని ఆచరణలో పెడితే ఈ సీజన్‌ని కూడా చక్కగా ఎంజాయ్ చేయచ్చు.

ఎండకాలం మాదిరిగా ఇప్పుడు డ్రెస్సింగ్ కుదరదు. అలాగని, వెచ్చగా ఉంచే దుస్తులు కూడా. ఎందుకంటే, వాతావరణంలో మార్పుల వల్ల వేడి– తేమ అధికమై చెమటకు దారి తీయవచ్చు. డల్‌గా ఉండే వాతావరణాన్ని బ్రైట్‌గా మార్చేయడంలోనే కాదు, వానల్లో తడవకుండానూ స్టైలిష్ లుక్‌తో ఆకట్టుకునేలా దుస్తుల ఎంపికలో ప్రత్యేక శ్రద్ధ అవసరం అవుతుంది.



గొడుగు ఎంపిక

వర్షంలో గొడుగు తప్పని అవసరం. అయితే, అది ఎప్పుడూ బ్లాక్ కలర్‌లో రొటీన్‌గా ఉంటే బోర్‌గా అనిపిస్తుంది. మంచి బ్రైట్ కలర్స్ ఉన్నవి, స్టైలిష్‌గా ఉన్న గొడుగులను ఎంచుకుంటే బాగుంటుంది. ముఖ్యంగా మిగతా అన్నింటికన్నా పోల్కా డాట్స్, లైన్స్ ఎప్పుడూ స్పెషల్ లుక్‌తో ఆకట్టుకుంటాయి.



వాటర్ ప్రూఫ్ షూస్

వర్షపు రోజులలో బురద గుంటలు సాధారణం. రోడ్లపై పారే నీటి నుంచి, వర్షపు ధారల నుంచి పాదాలను కాపాడుకోవాలంటే వాతావరణానికి అనువైనవి ఉండాలి. అందుకు వాటర్ ప్రూఫ్ బూట్లను ఎంచుకోవాలి. బ్లాక్ బూట్లు అయితే ఏ డ్రెస్సులకైనా బాగా నప్పుతాయి.





రెయిన్ పోంచో

ఇవి సాధారణంగా మొత్తం ఒంటిని కప్పేసే విధంగా ఉంటాయి అని అనుకుంటారు కానీ, ఇప్పుడు మార్కెట్‌లో విభిన్న మోడల్స్‌లో రెయిన్ పోంచోస్ వచ్చాయి. ఇవి చాలా సౌకర్యవంతంగా, స్టైలిష్‌గా ఉంటాయి. అలాగే వేసుకున్న దుస్తులను వానకు తడవకుండా కాపాడుకోవచ్చు. గొడుగు కూడా వాడలేనంత వర్షం కురుస్తున్నప్పుడు ఇవి చాలా బాగా పనిచేస్తాయి. అంతేకాదు, వర్షాకాలానికి తల తడిస్తే, జుట్టు చిట్లిపోతుంది. జుట్టుకు రక్షణగా కూడా రెయిన్ పోంచో హుడ్ ను కప్పుకోవచ్చు. స్టైలిష్‌గానూ కనిపిస్తారు. మీ రెయిన్ పోంచో వాటర్‌ప్రూఫ్ ఫ్యాబ్రిక్ కింద పొడిగా ఉండగలుగుతారు.



రెయినీ హ్యాట్

వర్షపు రోజుల్లో టోపీ ని ధరించడం ద్వారా మీ స్టైల్‌ని అప్‌గ్రేడ్ చేయవచ్చు. మీ పోంచో, కోటుకు హుడీ లేకపోతే ఒక ట్రెండీ హ్యాట్‌ను వాడచ్చు. అయితే, టోపీ ఉన్నప్పటికీ వెంట గొడుగు మాత్రం వాడాల్సిందే.



ట్రెంచ్ కోట్

వర్షం రోజుల్లో డ్రెస్సింగ్ గురించి ఆలోచించినప్పుడు ఖాకీ రంగు డబుల్ బ్రెస్ట్ ట్రెంచ్ కోట్ గుర్తుకు వస్తుంది. అయితే, వీటిలో ఇప్పుడు విభిన్నరకాల కలర్స్... ఫ్యాబ్రిక్‌లో మార్పులు చేసినవి మార్కెట్లోకి వచ్చాయి. నేటి కాలానికి తగినట్టుగా ఆకట్టుకుంటున్నాయి.



మిలిటరీ స్టైల్ కోట్లు

జీన్స్, టీ షర్ట్ పైకి ఓ మిలిటరీ స్టైల్ కోటు ధరిస్తే చాలు మీ రూపం మరింత ఆధునికంగా మారిపోతుంది. మగవారికి అనువుగా రూపొందిన ఈ డ్రెస్ మగువలకు మరింత ప్రత్యేకమైన డ్రెస్సింగ్‌గా ఈ సీజన్ మార్చేసింది.

కొత్త కెరీర్‌కు కుంకుమ బొట్టు

కుంకుమ పువ్వు ఎలా వస్తుంది? కుంకుమతో తయారు చేస్తారా? లేక... మొక్కకు పూస్తుందా? ఇది నిజంగా పువ్వేనా? చూస్తే పువ్వులా కనిపించదే మరి! అయినా... ఈ మొక్కలు ఎక్కడ ఉంటాయి? ఎవరు పెంచుతారు? ఎలా పెంచుతారు? ఈ సందేహాలకు చక్కటి వివరణ ఇస్తోంది... ఎర్ర బంగారాన్ని పండిస్తున్న శ్రీనిధి.



• శ్రీనిధి

కశ్మీర్ కుంకుమ పువ్వుకు మన తెలుగు నేల కేరాఫ్ అడ్రస్‌గా మారింది. వీపుకు బుట్ట కట్టుకుని టీ తోటలో కలియతిరుగుతూ మునివేళ్లతో లేత చివుళ్లను కోసి బుట్టలో వేసుకునే అస్సామీ అమ్మాయిలను చూస్తుంటాం. భూతల స్వర్గం లాంటి కశ్మీర్ నేల మీద లేతనీలిరంగు పూలను కోసి బుట్టలో వేస్తున్న మహిళలనూ చూస్తాం. కానీ అది కుంకుమ పువ్వు అని నమ్మాలంటే ఏదో సందేహం వెంటాడుతూనే ఉంటుంది. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం, అన్నమయ్య జిల్లా, మదనపల్లె, పొన్నేటిపాలేనికి చెందిన ఓ తెలుగమ్మాయి శ్రీనిధి ఆ సందేహాలను నివృత్తి చేస్తోంది. కుంకుమ పువ్వు సాగు చేస్తూ మనకు పెద్దగా పరిచయం లేని రంగాన్ని ఎంచుకుని ట్రెండ్ సెట్టర్ అవుతోంది. కెరీర్ అంటే... ఇంటర్ తర్వాత బీటెక్ చేసి సాఫ్ట్‌వేర్ కంపెనీలో కంప్యూటర్ ముందు చేసే ఉద్యోగాలే అనుకుంటున్న సమాజానికి కొత్త దారి చూపిస్తోంది శ్రీనిధి. 'వ్యవసాయ రంగం విస్తారమైనది. ఒకింత సృజనాత్మకతతో ముందుకెళ్తే మనమే మరికొందరికి మార్గదర్శనం చేసినవారమవుతాం' అంటూ... కుంకుమ పువ్వు సాగులో తన అనుభవాలను ఆమె సాక్షితో పంచుకుంది.

''నేను బెంగళూరులో ఏజీ బీఎస్సీ, వారణాసిలోని బీహెచ్‌యూలో ఎమ్మెస్సీ సాయిల్ సైన్స్ చేశాను. 'వ్యవసాయ రంగం ఎంతో విస్తారమైనది, అందులో నీకు తెలియని ఎంతో జ్ఞానం ఉంది' అని నాన్న చెప్పిన మాటలే నన్ను నడిపించాయి. ఆ ఇంటరెస్ట్‌తో సాగు కోర్సునే చదివాను. కుంకుమ పువ్వు సాగును ఎంచుకోవడానికి మా పర్పుల్ స్ప్రింగ్స్ కంపెనీ కో పార్టనర్ శ్రీనాథ్ కారణం. తను అగ్రికల్చర్‌లో పీహెచ్‌డీ స్కాలర్. కుంకుమ పువ్వు సాగును సిలబస్‌లో ఒక భాగంగా చదివాను, కానీ ఆచరణలో విజయం సాధించడానికి మరింతగా అధ్యయనం చేశాను, ఇంకా చేస్తున్నాను.



• నీలి రెక్కల మధ్య తలలూపుతున్న ఎర్రటి కేసరాలే కుంకుమ పూలు

సాగు శోధన

ఈ ఆలోచన 2021లో వచ్చింది. మరుసటి ఏడాది ఫిబ్రవరికి రంగంలోకి దిగాం. అది నేరుగా సాగు కాదు, రీసెర్చ్ అండ్ డెవలప్‌మెంట్. రెండు వందల యాభై చదరపు అడుగుల గదిలో అరలను ఏర్పాటు చేసి దాదాపు 550 అడుగుల విస్తీర్ణంలో కుంకుమ పువ్వు గింజలు నాటాం. మట్టి లేకుండా ఏరోఫోనిక్ విధానంలో సాగు చేస్తున్నాం. గదిలో ర్యాక్‌లు, చిల్లర్‌లు, కశ్మీర్‌కి వెళ్లి సీడ్ కొనుగోలు, రవాణా ఇతర ఖర్చులన్నీ కలిపి పది లక్షలు ఖర్చయింది. ఇది ఏడాదికి ఒక పంట వస్తుంది. తొలి ఏడాది దిగుబడి రెండు వందల గ్రాములు వచ్చింది. ఇప్పుడు రెండో పంట సాగు చేస్తున్నాం.

ఈ సాగు సెలవు ఇవ్వదు

కుంకుమ పువ్వు సాగు అంటే నిరంతరం పంట క్షేత్రాన్ని కనిపెట్టుకుని ఉండాల్సిందే. వెకేషన్‌కు వెళ్లాలంటే ఆగస్టు నుంచి మే నెల వరకు అసలే కుదరదు. మే నుంచి ఆగస్టు మధ్యలో కొంత వెసులుబాటు ఉంటుంది, కానీ పూర్తిగా హాలిడే కాదు. మరొకరికి బాధ్యత అప్పగించి వెళ్లి, పర్యవేక్షించుకుంటూ ఉండాలి. ఇండోర్‌లో చేసే కుంకుమ పువ్వు సాగుకు ఎక్కువ మంది సహాయకుల అవసరం ఉండదు. ఎందుకంటే శీతల గదిలోకి ఎక్కువ మంది వెళ్లరాదు. చాలా పరిశుభ్రత పాటించాలి. తలకు క్యాప్, చేతులకు గ్లవ్స్ తొడుక్కుని పూలు కోయాలి. ఆ పూలను నీడలో ఆరబెట్టి, ఆరిన తర్వాత పూలలోని రేకలను ఫోర్సెప్స్‌తో వేరు చేయాలి. ఆ రేకలు(కేసరాలు) కుంకుమపువ్వు. గ్రాము కుంకుమ పువ్వులో వేల రేకలుంటాయి.

రేక తీయడం ఓ చాలెంజ్

చెట్టు నుంచి పూలు కోయడం, పువ్వు నుంచి రేకలను విరగకుండా వేరు చేయడంలో నైపుణ్యం చాలా అవసరం. ఈ సాగులో అసలైన సవాలు ఇదే. ఈ సాగు మనకు కొత్త కాబట్టి మన దగ్గర ఎవరికీ పరిచయం ఉండదు. సహాయకులకు నేనే శిక్షణ ఇచ్చాను. పూలు విచ్చుకోవడం మొదలు పెట్టిన తర్వాత 15–25 రోజుల్లో అన్ని పూలూ విచ్చుకుంటాయి, పంట పూర్తవుతుంది. విరిసిన పువ్వుని ఇరవై నాలుగ్గంటల్లోపల చెట్టు నుంచి కోసేయాలి. పూల కాలం పూర్తయిన తరవాత చెట్టు నవంబర్ నుంచి మే నెల మధ్యలో గింజలను పెంచుకుంటుంది. దీనిని సీడ్ మల్టిప్లికేషన్ అంటాం. ప్రతిసారీ కశ్మీర్‌కెళ్లి విత్తనాలు తెచ్చుకోవాల్సిన అవసరం ఉండదు. మనకు కావల్సిన సీడ్స్ మనమే తయారు చేసుకోవచ్చన్నమాట. మేము పరిశోధన దశలోనే ఉన్నాం. పంట పంటకూ విత్తనాల సంఖ్య పెంచుకుంటూ సాగు విస్తీర్ణం పెంచుకోవాలి. కచ్చితంగా చెప్పలేను, కానీ పెట్టుబడి, ఇతర ఖర్చులన్నీ పోయి ఆదాయంలోకి రావాలంటే మరో మూడేళ్లు పట్టవచ్చు.

హార్డ్ వర్కే కాదు స్మార్ట్‌గానూ చేయాలి

చల్లదనాన్ని పది డిగ్రీల నుంచి 22 డిగ్రీల మధ్యలో పంట దశను బట్టి మారుస్తుండాలి. కరెంటు పోకూడదు. హెవీ కెపాసిటీలో ఒక చిల్లర్ తీసుకోవడం కంటే మీడియం కెపాసిటీ చిల్లర్‌లు రెండింటిని అమర్చుకుంటే ఒకదానికి రిపేర్ వచ్చినా పెద్దగా ఇబ్బంది ఉండదు. ఏ రంగమైనా సరే... మనం అంకితభావంతో పని చేస్తే మంచి ఫలితాలనే ఇస్తుంది. హార్డ్‌వర్క్‌తోపాటు స్మార్ట్ వర్క్ కూడా అవసరమే. నా పంటను ఆన్‌లైన్‌లోనే అమ్మాను. ఇప్పుడు కుంకుమ పువ్వు సాగులో మెళకువలు నేర్చుకుంటున్నాను. ఆ తర్వాత సాగు విస్తీర్ణం పెంచుకుంటూ మార్కెట్‌ను విస్తరిస్తాను'' అన్నారు శ్రీనిధి.

– వాకా మంజులారెడ్డి
సాక్షి ఫీచర్స్ ప్రతినిధి

ఎర్ర బంగారం!

కుంకుమ పువ్వు అవసరం చాలా ఉంది. అవసరానికి తగినంత లభ్యత లేదు. దాంతో మార్కెట్‌ని నకిలీలు రాజ్యమేలుతున్నాయి. ఇది చాలా ఖరీదైన సుగంధద్రవ్యం. అందుకే ఎర్ర బంగారం అంటారు. మన దగ్గర పంట ఉండాలే కానీ కేజీల్లో కొనేవాళ్లు కూడా ఉన్నారు. సౌందర్యసాధనాల తయారీ పరిశ్రమలు, ఔషధాల పరిశ్రమలు, ఆహార, పానీయాల తయారీదారులు టోకుగా కొంటారు. మన దగ్గర వంటల్లో కుంకుమ పువ్వు వాడకం బాగా తక్కువ. గర్భిణులు మాత్రం పాలల్లో కలుపుకుంటూ ఉంటారు. అయితే... కుంకుమ పువ్వు కలిపిన పాలు తాగితే బిడ్డ తెల్లగా పుడతారనే విశ్వాసాన్ని మేము నిర్ధారించలేం. శాస్త్రీయంగా ఆధారం ఏదీ లేదు. కానీ ఆహారంలో కుంకుమ పువ్వు తీసుకున్న వారి చర్మం ఆరోగ్యంగా, క్లియర్‌గా, కాంతివంతంగా మారుతుంది. అలాగే ఇందులోని యాంటీ ఆక్సిడెంట్ వంటి కొన్ని ఔషధ గుణాలు గాయాలను మాన్పడం వంటి ప్రయోజనాలతో ఆరోగ్యాన్ని మెరుగుపరుస్తాయి కాబట్టి గర్భిణులే కాదు మామూలు వాళ్లు కూడా తీసుకోవచ్చు.

– పప్పు శ్రీనిధి, కుంకుమ పువ్వు రైతు

ఉపాధి



గుజరాత్‌లోని కచ్‌లో ఒక మారుమూల గ్రామవాసి పాబిబెన్ రబారి. మేకలు, గొర్రెల పెంపకమే ప్రధాన వృత్తిగా ఉన్న పాబిబెన్ ఇప్పుడు 300 మంది మహిళలకు ఉపాధి కల్పిస్తోంది. జరీ ఎంబ్రాయిడరీ, బ్యాగుల తయారీతో ప్రపంచ వ్యాప్తంగా పేరు సంపాదించింది. హస్తకళాకారిణిగా ఆమె కృషి, సాధించిన విజయం ఎంతోమందికి స్ఫూర్తిగా నిలుస్తుంది.

ఆమె పేరే ఓ బ్రాండ్

పాబిబెన్ బాల్యం తీవ్ర కష్టాలతో గడిచింది. ఐదేళ్ల వయసులో తండ్రిని కోల్పోవడం, తల్లి కొన్ని ఇళ్లలో పాచిపని చేస్తూ తనను, తన చెల్లెలిని పెంచిన విధానాన్ని, మేకలను, గొర్రెలను మేపుకుంటూ బతికిన రోజులను గుర్తు చేసుకుంటుంది ఆమె. ఉన్న కొద్దిపాటి సమయంలో తల్లి సంప్రదాయ ఎంబ్రాయిడరీ పని చేస్తుండేది. అక్కడి వారి కమ్యూనిటీ వివాహ వేడుకల సమయాల్లో తప్పనిసరిగా ధరించే సంప్రదాయ ఎంబ్రాయిడరీ బ్లౌజులు, దుప్పట్లను తయారు చేసేది. ఒక్కో సంప్రదాయ ఎంబ్రాయిడరీ తయారీకి ఏడాదికి పైగా సమయం పట్టేది. ఈ సంప్రదాయం కారణంగా వారి కమ్యూనిటీలో వివాహాలు ఆలస్యం అయ్యేవి. దీంతో కొన్నాళ్లకు ఈ ఎంబ్రాయిడరీని ఆ కమ్యూనిటీ పక్కనపెట్టేసింది. ఈ సమయంలోనే పాబిబెన్ ఈ సంప్రదాయ ఎంబ్రాయిడరీలో ప్రావీణ్యం సాధించింది. ఒక కళారూపం కనుమరుగు కాకుండా కాపాడాలని నిశ్చయించుకుంది. తమ కమ్యూనిటీలో సంప్రదాయ ఎంబ్రాయిడరీని ప్రతిబింబించే కొత్త రూపాన్ని కనిపెట్టింది. ఇది వేగంగా, తక్కువ శ్రమతో కూడుకున్న కళ కావడంతో అందరినీ తన వైపుకు తిప్పుకుంది.

* * *

పాబిబెన్ మొదట నలుగురైదుగురు మహిళలతో కలిసి వివాహ సమయంలో ధరించే ఎంబ్రాయిడరీ బ్లౌజ్‌లను తయారు చేసేది. చదువు లేకపోయినా తమకు వచ్చిన కళను కాపాడాలని, సాటి మహిళలకు ఉపాధి కల్పించాలనుకొని కొన్ని స్వచ్ఛంద సంస్థలను కలిసింది. కళలకు సంబంధించిన ఆ సంస్థల నుండి కొన్ని ప్రాజెక్ట్ వర్క్‌లను తీసుకుంది. 'కానీ, నన్ను ఒక ఆలోచన ఎప్పుడూ వేధిస్తూనే ఉండేది. ఈ కళ మా సొంతం. కానీ, మాకు సరైన గుర్తింపు వచ్చేది కాదు. మేం తయారు చేసిన వాటిని వేర్వేరు బ్రాండ్‌ల కింద అమ్మేవారు. దీనినుంచి బయటపడేందుకు, మా హస్తకళకు మేమే ప్రాచుర్యం తెచ్చుకోవాలని ఉండేది. దీంతో పెద్దస్థాయి అధికారులను కలిశాను. వారి సూచనల మేరకు మా కళకు ఒక ఇంటిని ఏర్పాటు చేశాం. చేతివృత్తుల వారికి మార్కెట్ ప్లేస్‌గా ఆ స్థలాన్ని ప్రారంభించాం. మొదట ఇది చిన్న వ్యాపారంగానే ప్రారంభమైంది కానీ, పనితో పాటు గుర్తింపు కూడా రావాలనుకున్నాను. అది ఈ ఏడేళ్ల సమయంలో సాధించగలిగాం' అని చెబుతుంది పాబిబెన్.

పాబిబెన్ మొదటి ఉత్పత్తి స్లింగ్ బ్యాగ్. ఇప్పుడు ప్రపంచవ్యాప్తంగా 'పాబీ బ్యాగ్' అని ఆమె పేరుతోనే ఆ బ్యాగ్‌ను పిలిచేటంత ఘనత సాధించింది ఈ హస్తకళాకారిణి. పాబిబెన్ బ్రాండ్‌తో ఈ కామర్స్ మార్కెట్ ప్లేస్ అయిన 'పాబిబెన్.కామ్' అక్కడి గ్రామీణ మహిళలకు మరిన్ని ఉపాధి అవకాశాలను తెచ్చిపెడుతోంది.



• తమ గ్రూప్ మహిళలతో...



• పాబిబెన్ బ్యాగ్..

వంటిల్లు



కాడలేనా..? ఆకులూ అమోఘమే!

ప్రస్తుతం కూరగాయలన్నీ అందనంత ధరల్లో కొండెక్కి కూర్చున్నాయి. అందుబాటు ధరలో ఉన్న మునగ కాడలను తినము. అయితే మునగలో పుష్కలంగా పోషకాలుంటాయి. అందుకే కాడలు కాకుండా మునగాకును ఇలా కూడా తినవచ్చని చెబుతోంది ఈ వారం వంటిల్లు...



మొరింగా దోశ

కావలసినవి : మునగ ఆకులు – రెండు కప్పులు; ఇడ్లీ పిండి – రెండు కప్పులు; నూనె – మూడు టీస్పూన్లు; జీలకర్ర – అరటీస్పూను ; మిరియాలు – అరటీస్పూను ; వెల్లుల్లి రెబ్బలు – నాలుగు; ఇంగువ – చిటికెడు; ఉప్పు – రుచికి సరిపడా.

తయారీ: ● బాణలిలో రెండు టీస్పూన్లు నూనె వేసి వేడెక్కనివ్వాలి. ● కాగిన నూనెలో జీలకర్ర, మిరియాలు, వెల్లుల్లి, ఇంగువ వేసి మంచి వాసన వచ్చేవరకు వేయించాలి. ● ఇవన్నీ వేగాక కడిగి పెట్టుకున్న మునగ ఆకులు వేయాలి. ఆకుల్లోని నీరంతా ఇగిరిపోయాక దించేయాలి. ● మునగ ఆకుల మిశ్రమం చల్లారాక ఉప్పు, కొద్దిగా నీళ్లు పోసి పేస్టులా రుబ్బుకోవాలి. ● ఇప్పుడు ఇడ్లీ పిండిలో ఈ పేస్టుని వేసి, రుచికి సరిపడా ఉప్పు వేసి దోశ పిండిలా కలుపుకోవాలి. ● దోశపెనం వేడెక్కిన తరువాత పిండిని దోశలా పోసుకుని, టీస్పూను నూనె వేసి రెండు వైపులా చక్కగా కాల్చుకుంటే మొరింగాదోశ రెడీ. సాంబార్, కొబ్బరి చట్నీలు దీనికి మంచి కాంబినేషన్.

ఎనర్జీ బాల్స్

కావలసినవి : రాగిపిండి – అరకప్పు ; మునగ ఆకు పొడి – ముప్పావు కప్పు ; ఎండిన అంజీర పండ్లు – ఆరు ; కర్జూరం – పన్నెండు ; కిస్‌మిస్ – పావు కప్పు ; జీడిపప్పు – పావు కప్పు ; బాదం – పావు కప్పు ; పిస్తా – పావు కప్పు ; ఎండు కొబ్బరి తురుము – పావు కప్పు; బెల్లం పొడి – పావు కప్పు; యాలకుల పొడి – టీస్పూను; నెయ్యి – మూడు టేబుల్ స్పూన్లు; ఎండు కొబ్బరి పొడి – రెండు టేబుల్ స్పూన్లు (గార్నిష్‌కు సరిపడా).

తయారీ: ● అంజీర పండ్లు, కర్జూరం విత్తనాలు తీసేసి వేడినీటిలో పదిహేను నిమిషాలు నానబెట్టుకోవాలి. ● బాణలిలో టేబుల్ స్పూను నెయ్యి వేసి రాగి పిండి వేసి వేయించాలి. రాగిపిండి మంచి వాసన వస్తున్నప్పుడు మునగాకు పొడి వేసి ఐదు నిమిషాలు వేయించి తీసేయాలి. ● ఇదే బాణలిలో డ్రైఫ్రూట్స్ అన్నింటిని దోరగా వేయించి పక్కన పెట్టుకోవాలి. చివరగా ఎండు కొబ్బరిని కూడా వేయించుకోవాలి. ● వేయించిన డ్రైఫ్రూట్స్‌ను మిక్సీజార్‌లో వేసి పొడిచేసుకోవాలి. ● నానబెట్టిన కర్జూరం, అంజీరను పేస్టులా గ్రైండ్ చేయాలి. ● బాణలిలో మరో టేబుల్ స్పూను నెయ్యివేసి అంజీర పేస్టుని వేసి సన్నని మంట మీద నెయ్యి పైకి తేలేంత వరకు వేయించాలి. ● వేగాక డ్రైఫ్రూట్స్ పొడి, రాగి, మునగాకు, యాలక్కాయ, బెల్లం పొడులు వేసి కలపాలి. ● బెల్లం పూర్తిగా కరిగిన తరువాత పిండి మిశ్రమాన్ని లడ్డులా చుట్టుకుని కొబ్బరి పొడిలో అద్దుకుంటే ఎనర్జీ బాల్స్ రెడీ. గాలిచొరబడని డబ్బాలో నిల్వచేస్తే పదిహేను రోజులపాటు తాజాగా ఉంటాయి.





ఫ్లవర్ ఫ్రై

కావలసినవి : మునగ పువ్వులు – రెండు కప్పులు; నూనె – రెండు టేబుల్ స్పూన్లు; జీలకర్ర – అరటీస్పూను; ఉల్లిపాయ తరుగు – అర కప్పు; పచ్చిమిర్చి – రెండు; గుడ్లు – మూడు; కరివేపాకు – రెండు రెమ్మలు; కొత్తిమీర తరుగు – రెండు టేబుల్ స్పూన్లు, ఉప్పు – రుచికి సరిపడా ; నిమ్మరసం – టీస్పూను.


తయారీ: ● మునగ పువ్వులను నీటిలో ఐదు నిమిషాలు నానబెట్టాలి. తరువాత శుభ్రంగా కడిగి, నీటిని పిండి పక్కన పెట్టుకోవాలి. ● బాణలిలో నూనె వేసి కాగనివ్వాలి. కాగిన నూనెలో జీలకర్ర, ఉల్లి తరుగు, సన్నగా తరుక్కున్న పచ్చిమిర్చిని వేసి వేయించాలి. ● ఇవన్నీ వేగాక మునగ పువ్వులు, కరివేపాకు వేసి కలపాలి ● ఐదు నిమిషాలు మూతపెట్టి మగ్గనివ్వాలి. ● పువ్వులు మగ్గాక గుడ్లసొన వేసి కలపాలి. ● చక్కగా వేగాక, రుచికి సరిపడా ఉప్పు వేసి నూనె పైకి తేలేంత వరకు వేయించాలి. ● చివరగా కొత్తిమీర తరుగు చల్లి దించేయాలి. నిమ్మరసం చల్లుకుని అన్నం, చపాతీల్లోకి సర్వ్ చేసుకోవాలి.

మసాలా మజ్జిగ

కావలసినవి : పెరుగు – ఒకటిన్నర కప్పులు, జీలకర్ర పొడి – అరటీస్పూను; పుదీనా తరుగు – టేబుల్ స్పూను; బ్లాక్ రాక్‌సాల్ట్ – అరటీస్పూను; కొత్తిమీర తరుగు – టేబుల్ స్పూను; కరివేపాకు తరుగు – అరటీస్పూను; మునగాకు పొడి – ఒకటిన్నర టేబుల్ స్పూన్లు; దాల్చిన చెక్క పొడి – పావు టీస్పూను; చల్లని నీళ్లు – రెండు గ్లాసులు.

తయారీ: ● మిక్సీజార్‌లో కరివేపాకు, కొత్తిమీర, పుదీనా, మునగాకుపొడి, జీలకర్ర పొడి, రాక్‌సాల్ట్ వేసి గ్రైండ్ చేయాలి. ● ఇవన్నీ నలిగిన తరువాత పెరుగు వేసి మరోసారి గ్రైండ్ చేయాలి. ● ఈ మిశ్రమంలో నీళ్లు పోసి కలుపుకుని, దాల్చినచెక్క పొడితో గార్నిష్ చేసి సర్వ్ చేసుకోవాలి.




'నా ప్రస్థానంలో ప్రతి మలుపూ జన జీవితంతో ముడిపడి ఉంది'

సత్యమేవ జయతే

సాక్షి

WWW.SAKSHI.COM

పేజీలు: 16 వెల: ₹ 5.50

సంపుటి: 16 సంచిక: 99

శుక్రవారం 30-6-2023

SIMULTANEOUSLY PRINTED AT HYDERABAD | BANGALORE | CHENNAI | DELHI | MUMBAI | ANANTAPUR | GUNTUR | KADAPA | KHAMMAM | KARIMNAGAR | KURNOOL | MAHABOOBNAGAR | MANGALAGIRI | NALGONDA | NELLORE | NIZAMABAD | ONGOLE | RAJAMAHENDRAVARAM | SRIKAKULAM | TADEPALLI GUDEM | TIRUPATHI | VIJAYAWADA | VISAKHAPATNAM | WARANGAL



క్లాస్ ఆఫ్ 2023

ఆస్కార్ సభ్యులుగా దేశం నుంచి 15 మందికి చోటు దక్కింది. -10లో



పదేళ్లలో రూ.20 వేల కోట్లు..

అదానీ టోటల్ గ్యాస్ భారీగా కార్యకలాపాలను విస్తరించనుంది. -13లో



సిమ్లా కాదు బెంగళూరు

వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో బీజేపీ ఓటమే లక్ష్యంగా చేతులు కలిపిన ప్రతిపక్షాలు రెండో విడతగా బెంగళూరులో భేటీ కానున్నాయి.

వివరాలు 6లో ▸



మణిపూర్‌లో రాహుల్ అడ్డగింత

మణిపూర్ అల్లర్ల బాధితుల పరామర్శకు వెళ్లిన రాహుల్ గాంధీ వాహన శ్రేణిని పోలీసులు కొన్ని గంటలపాటు అడ్డుకున్నారు.

వివరాలు 6లో ▸



బాలల సంరక్షణలో భారత్ భేష్

సాయుధ ఘర్షణల ప్రభావం పడకుండా చిన్నారుల సంరక్షణకు భారత్ తీసుకున్న చర్యల్ని ఐరాస స్వాగతించింది.

వివరాలు 6లో ▸



బైడెన్‌కు స్లీప్ అప్నియా సమస్య

అమెరికా అధ్యక్షుడు బైడెన్ నిద్రకు సంబంధించిన స్లీప్ అప్నియా అనే తీవ్ర సమస్యతో బాధపడుతున్నారు.

వివరాలు 6లో ▸

న్యూస్‌రీల్

సాయిచంద్ కన్నుమూత



'రాతి బొమ్మల్లోన కొలువైన శివుడా..' అంటూ తెలంగాణ అమరులను స్మరిస్తూ, ఆటపాటలతో ఉద్యమాన్ని ఉర్రూతలూగించిన ప్రముఖ గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ వేద సాయిచంద్ (39) కన్నుమూశారు.

- వివరాలు 3లో▶

కాంగ్రెస్‌కు ప్రజలు పట్టం కట్టబోతున్నారు..



తెలంగాణ సమాజం కాంగ్రెస్‌కు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉందని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి చెప్పారు. జూలై 2న ఖమ్మం జనగర్జన సభలో కాంగ్రెస్‌లో చేరనున్నట్టు ఆయన వెల్లడించారు.

- వివరాలు 5లో▶

తెలుగులో తొలి తీర్పు



రాష్ట్ర హైకోర్టు చరిత్రలో తొలిసారి ఓ తీర్పు తెలుగు భాషలో వెలువడింది. ఉమ్మడి హైకోర్టు చరిత్రలోనూ ప్రాంతీయ భాషలో ఉత్తర్వులు రావడం ఇదే మొదటిసారి కావడం విశేషం. 2023, జనవరి 26 నుంచి సుప్రీం వివిధ భారతీయ భాషల్లోనూ తీర్పులను అందుబాటులో ఉంచే సేవలను ప్రారంభించిన విషయం తెలిసిందే.

- వివరాలు 14లో▶

బీఆర్‌ఎస్‌పై కామ్రేడ్ల కస్సుబుస్సు



పొత్తుల విషయంలో బీఆర్‌ఎస్ తీరుపై వామ పక్షాలు పొత్తులు, ప్రజాసమస్యలపై చర్చించేందుకు సీఎం కేసీఆర్‌ను అపాయింట్‌మెంట్ లభించకపోవడంపై కామ్రేడ్లు కస్సుబుస్సు లాడుతున్నారు. ఈ నేపథ్యంలో సీపీఐ, సీపీఎం నేతలు కీలక భేటీ నిర్వహిస్తున్నారు.

- వివరాలు 14లో▶

శంకుస్థాపన: 8న వరంగల్‌కు ప్రధాని | **శంఖారావం:** బీజేపీలో జోష్‌కు ప్లాన్

పార్టీకి బూస్టర్ డోస్!

- వరంగల్ మెగా టెక్స్‌టైల్ పార్కుకు భూమిపూజ..
- భద్రకాళి ఆలయ సందర్శన.. హనుమకొండ సభలో ప్రసంగం
- బీజేపీ తరఫున అసెంబ్లీ ఎన్నికల శంఖారావం పూరించనున్న ప్రధాని
- కేడర్‌లో ఉత్సాహం నింపడమే లక్ష్యం
- అధికార బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లను టార్గెట్ చేస్తూ విమర్శలు
- ఎన్నికల వ్యూహాలపై రాష్ట్ర బీజేపీకి దిశానిర్దేశం చేసే చాన్స్
- బహిరంగ సభ కోసం భారీగా జన సమీకరణకు నేతల ఏర్పాట్లు షురూ
- 8న హైదరాబాద్‌లో జరగాల్సిన 11 రాష్ట్రాల బీజేపీ అధ్యక్షుల భేటీ వాయిదా

కాజీపేట రైల్వే వ్యాగన్ ఓవర్ హాలింగ్ వర్క్‌షాప్‌కు శంకుస్థాపన



సాక్షి, హైదరాబాద్: ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ వచ్చే నెల 8న రాష్ట్ర పర్యటనకు రానున్నారు. వరంగల్ జిల్లాలో రైల్వే వ్యాగన్ ఓవర్ హాలింగ్ వర్క్‌షాపునకు శంకుస్థాపన, మెగా టెక్స్‌టైల్ పార్క్‌కు భూమిపూజ సహా పలు కీలక అభివృద్ధి పనుల్లో పాల్గొననున్నారు. ఇటీవలి వరకు దూకుడుగా వ్యవహరించిన రాష్ట్ర బీజేపీలో ఒక్కసారిగా జోష్ తగ్గిపోయిన సమయంలో ప్రధాని మోదీ పర్యటన ప్రాధాన్యత సంతరించుకుంది. అసెంబ్లీ ఎన్నికలు దగ్గరపడుతున్న సమయంలో రాష్ట్ర బీజేపీలో స్తబ్దతను బద్దలుకొట్టడం, కేడర్‌లో ఉత్సాహం నింపడం లక్ష్యంగా ప్రధాని పర్యటన జరగనున్నట్టు ఆ పార్టీ వర్గాలు చెప్తున్నాయి. ప్రధాని మోదీ పార్టీ తరఫున అసెంబ్లీ ఎన్నికల శంఖారావాన్ని పూరిస్తారని.. ఎన్నికలకు ఏ విధంగా సిద్ధంకావాలనే దానిపై రాష్ట్ర పార్టీకి స్పష్టంగా దిశానిర్దేశం చేస్తారని అంటున్నాయి.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లను ఎదుర్కొనేలా..

రాష్ట్రంలో అధికార బీఆర్‌ఎస్ ఇప్పటికే అసెంబ్లీ ఎన్నికలు సిద్ధమవుతోంది. కర్ణాటక ఎన్నికల ఫలితాలు, హైకమాండ్ ఫోకస్‌తో రాష్ట్ర కాంగ్రెస్‌లోనూ దూకుడు కనిపిస్తోంది. ఇలాంటి సమయంలో ఆ రెండు పార్టీలను

మిగతా 2వ పేజీలో ▶

ఇదీ తెలంగాణలో సంగతి!

- రాష్ట్రంలో పరిస్థితులను ప్రధానికి వివరించిన అమిత్‌షా, జేపీ నడ్డా
- 28న అర్ధరాత్రి వరకు ప్రధాని నివాసంలో కీలక నేతల భేటీ
- తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల ఎన్నిలపై చర్చ
- కేంద్ర కేబినెట్ మార్పుల్లో ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు ప్రాధాన్యం!
- ఈటల, రాజగోపాల్‌రెడ్డి సూచనలపై సమాలోచనలు - 2లో



వనపర్తి జిల్లా ఆత్మకూర్‌లో జరిగిన బహిరంగసభలో ప్రసంగిస్తున్న బండి సంజయ్

బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ది ఫినాయిల్ బంధం 2లో

నేడే పోడు పట్టాలు

ఆసిఫాబాద్‌లో పంపిణీ చేయనున్న సీఎం • మిగతా జిల్లాల్లో మంత్రుల చేతుల మీదుగా..

సాక్షి, హైదరాబాద్/ ఆసిఫాబాద్

పోడు భూముల్లో సాగు చేసుకుంటున్న గిరిజన, ఆదివాసీ రైతుల కల సాకారం కానుంది. వీరికి పట్టా పుస్తకాలు పంపిణీ చేసేందుకు గిరిజన సంక్షేమ, అటవీ శాఖలు ఏర్పాట్లు పూర్తి చేశాయి. శుక్రవారం ఆసిఫాబాద్ జిల్లాలో రాష్ట్ర ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావు ఈ కార్యక్రమాన్ని ప్రారంభించి అర్హులకు పట్టాలు అందజేయనున్నారు. మిగతా జిల్లాల్లో జిల్లా మంత్రుల చేతుల మీదుగా అర్హులకు పట్టా పుస్తకాలు పంపిణీ చేస్తారు. పోడు భూముల్లో సాగుకు సంబంధించి రాష్ట్రవ్యాప్తంగా 26 జిల్లాల నుంచి దరఖాస్తులు వచ్చాయి. 1,50,012 మంది రైతులు 4,05,601 ఎకరాల్లో సాగు చేసుకుంటున్నట్లు అధికారులు గుర్తించారు. వీరంతా గిరిజనులు, ఆదివాసీలే. కాగా అత్యధికంగా భద్రాద్రి కొత్తగూడెం జిల్లా నుంచి 50,595 మంది రైతులు 1,51,195 ఎకరాల్లో సాగు చేస్తున్నారు. మహబూబాబాద్ జిల్లాలో 24,972 మంది రైతులు, ఆసిఫాబాద్ జిల్లాలో 15,254 మంది రైతులు పట్టాల కోసం దరఖాస్తులు సమర్పించారు.



కలెక్టరేట్‌ను ప్రారంభించనున్న సీఎం

ముఖ్యమంత్రి కేసీఆర్ శుక్రవారం ఉదయం 10.50 గంటలకు ప్రగతిభవన్ నుంచి బేగంపేట విమానాశ్రయానికి చేరుకుని, అక్కడినుంచి హెలికాప్టర్‌లో ఆసిఫాబాద్‌కు బయలుదేరతారు. పట్టణంలో

మిగతా 2వ పేజీలో ▶

త్వరలో కేంద్ర కేబినెట్ పునర్వ్యవస్థీకరణ?



3న ప్రధాని సారథ్యంలో కేబినెట్ భేటీ

లోక్‌సభ ఎన్నికలకు రోడ్ మ్యాప్‌పై దృష్టి

ప్రధాని నరేంద్ర మోదీ అధ్యక్షతన జూలై 3న కేంద్ర మంత్రిమండలి భేటీ కానుంది. కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరగనుందన్న వార్తల నేపథ్యంలో ఈ సమావేశం ప్రాధాన్యం సంతరించుకుంది. బుధవారం మోదీ తన నివాసంలో పార్టీ కీలక నేతలతో సమావేశమయ్యారు. 2024 ఎన్నికలకు ముందు ఒక రోడ్ మ్యాప్‌ను రూపొందించడం, ఎదుర్కొనే సవాళ్లపై ఒక స్పష్టత సాధించడం వంటి వాటిపై సుదీర్ఘ చర్చలు జరిపారు. హోం మంత్రి అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా తదితరులు ఇందులో పాల్గొన్నారు. జేపీ నడ్డా కూడా చర్చల్లో పాల్గొనడంతో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణతోపాటు బీజేపీ పార్టీలో రాష్ట్ర స్థాయిలోనూ మార్పులు జరిగే అవకాశం ఉందన్న ఊహాగానాలు వెలువడ్డాయి. -వివరాలు 6లో

పెద్దమ్మ గుడి వద్ద అపస్మారకస్థితిలో శేజల్



మరోసారి శేజల్ ఆత్మహత్యాయత్నం

- హైదరాబాద్ పెద్దమ్మ గుడి సమీపంలో అపస్మారక స్థితిలో గుర్తించిన స్థానికులు
- ప్రైవేటు ఆస్పత్రికి తరలించిన పోలీసులు
- పరామర్శించేందుకు ప్రతిపక్షాల రాకతో ఆస్పత్రి వద్ద బందోబస్తు ఏర్పాటు
- కొన్ని నిద్రమాత్రలు, సూసైడ్ లేఖను స్వాధీనం చేసుకున్న పోలీసులు

సాక్షి ప్రతినిధి, మంచిర్యాల/బంజారాహిల్స్: 'నేను ప్రాణాలను అరచేతిలో పెట్టుకుని రోజూ మానసిక క్షోభను అనుభవిస్తూ బతుకుతున్నా. నా జీవితానికి కొందరు వెలకట్టారు. నేను బ్లాక్ మెయిల్ చేస్తున్నానని నాపై నిందలు మోపుతున్నారు. ఇన్ని నెలల నుంచీ ఒంటరిగా పోరాడుతున్నా ఏ ఒక్కరూ నా బాధను పట్టించుకోలేదు. మంత్రి కేటీఆర్ నా మీద లైంగిక వేధింపులు జరగలేదని అంటున్నారు. ఎమ్మెల్యేను కాపాడుకోవడం కోసం నాకు నమ్మక ద్రోహం చేశారు. పైగా ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్య

మిగతా 3వ పేజీలో ▶

చూసింది ట్రైలరే.. సినిమా ముందుంది!



- తెలంగాణ అభివృద్ధిపై కేసీఆర్ మదిలో ఎన్నో ప్రణాళికలు
- పనిచేసే ప్రభుత్వాన్ని ప్రజలు మూడోసారి ఆశీర్వదిస్తారు
- రానున్న ఎన్నికల్లో 95–100 సీట్లు గెలిచి తీరుతాం
- క్రెడాయ్ నూతన కార్యాలయం ప్రారంభోత్సవంలో మంత్రి కేటీఆర్

సాక్షి, హైదరాబాద్: రానున్న అసెంబ్లీ ఎన్నికల్లో 95–100 సీట్లను కచ్చితంగా గెలిచి తీరుతామని మంత్రి కె. తారక రామారావు స్పష్టం చేశారు. గత 9 ఏళ్లలో రాష్ట్రంలో జరిగిన అభివృద్ధి ట్రైలర్ మాత్రమేనని... అసలు సినిమా ముందుందని చెప్పారు. ఎన్నికలను దృష్టిలో పెట్టుకొని ఈ మాట చెప్పట్లేదని, తెలంగాణ అభివృద్ధిపై సీఎం కేసీఆర్ మదిలో ఎన్నో ప్రణాళికలు ఉన్నాయన్నారు. పనిచేసే ప్రభుత్వాన్ని ప్రజలు మూడోసారి ఆశీర్వదిస్తారనే నమ్మకం తనకుందని కేటీఆర్ ధీమా వ్యక్తం చేశారు. గురువారం హైదరాబాద్ నానక్‌రాంగూడలో కాన్ఫెడరేషన్ ఆఫ్ రియల్ ఎస్టేట్ డెవలపర్స్ అసోసియేషన్ ఆఫ్ ఇండియా (క్రెడాయ్) నూతన కార్యాలయాన్ని మంత్రి కేటీఆర్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. రాష్ట్రం ఏర్పడిన తర్వాత తొలి ఎన్నికల్లో 63 సీట్లు గెలుచుకున్నామని, ఆ సమయంలో 10 సీట్లు అటుఇటు చేసి ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని కొందరు కుయుక్తులు చేశారని కేటీఆర్ ఆరోపించారు. చిన్న రాష్ట్ర ఏర్పాటే విఫలమని ప్రకటించి ఏదో చేద్దామని ప్రయత్నించారని, కానీ ప్రజలకు

మిగతా 5వ పేజీలో ▶

50 ఏళ్లు ఏం చేయనోళ్లు.. ఇప్పుడేం చేస్తారు?

- కాంగ్రెస్, బీజేపీ డబ్బులిస్తే తీసుకోండి.. కానీ కేసీఆర్‌ను మూడోసారి సీఎం చేయండి
- తుంగతుర్తి ప్రగతి నివేదన సభలో కేటీఆర్

5లో



సురక్షిత తాగునీటిలో తెలంగాణ టాప్

తెలంగాణ సహా ఐదు రాష్ట్రాలకు నంబర్ వన్ స్థానం

- నీటి స్వచ్ఛతలో అగ్రస్థానంలో రాష్ట్రం
- రాష్ట్ర తాగునీటి స్వచ్ఛత 98.7 శాతం
- యూరప్‌లో 62 శాతం ఇళ్లకే స్వచ్ఛమైన తాగునీరు
- ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదికలో వెల్లడి

సాక్షి, హైదరాబాద్: తెలంగాణ రాష్ట్రం మరో ఘనతను సొంతం చేసుకుంది. దేశంలో నూటికి నూరు శాతం సురక్షితమైన తాగునీటిని అందించే ఐదు రాష్ట్రాల్లో తెలంగాణ ఒకటిగా నిలిచింది. జల జీవన్ మిషన్ ద్వారా ఇది సాకారమైందని ప్రపంచ ఆరోగ్య సంస్థ (డబ్ల్యూహెచ్‌వో) పేర్కొంది. ఈ మేరకు ప్రపంచ ఆరోగ్య సంస్థ తాజాగా ఒక నివేదిక విడుదల చేసింది. జలజీవన్ మిషన్ అమలులో భారతదేశం పురోగతి సాధించిందని తెలిపింది. ఇంటింటికీ వంద శాతం సురక్షితమైన తాగునీరు అందిస్తున్న రాష్ట్రాల్లో తెలంగాణ, గోవా, హరియాణా, గుజరాత్, పంజాబ్ ఉన్నాయి. తెలంగాణలో 53.98 లక్షల ఇళ్లుంటే.. అందులో ప్రతీ ఇంటికి సురక్షితమైన తాగునీరు అందుబాటులో ఉందని నివేదిక వివరించింది. కాగా, ఈ రాష్ట్రాల కంటే నీటి స్వచ్ఛతలో మాత్రం తెలంగాణే నంబర్‌వన్ స్థానంలో ఉంది. మన రాష్ట్ర తాగునీటి స్వచ్ఛత 98.7 శాతంగా ఉంది. యూరప్‌లో కేవలం 62 శాతం ఇళ్లకే స్వచ్ఛమైన తాగునీరు అందుబాటులో ఉందని ప్రపంచ ఆరోగ్య సంస్థ

మిగతా 3వ పేజీలో ▶

ఇదండీ సంగతి



వాడిని పవన్ కల్యాణ్ మీటింగ్ వైపు వెళ్లనివ్వద్దని చెప్పారా!

ఐసెట్‌లో ఉత్తీర్ణత 86.17%

సూర్యాపేట జిల్లా విద్యార్థి శరణ్‌కు మొదటి ర్యాంకు

ఫలితాలు విడుదల చేసిన ఉన్నత విద్యామండలి చైర్మన్ లింబాద్రి




శరణ్ కుమార్ (ఫస్ట్ ర్యాంక్)

కేయూ క్యాంపస్: రాష్ట్రంలో ఎంబీఏ, ఎంసీఏ కోర్సుల్లో 2023–24 విద్యాసంవత్సరంలో ప్రవేశాలకు నిర్వహించిన టీఎస్ ఐసెట్ ఫలితాలను ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొఫెసర్ ఆర్.లింబాద్రి విడుదల చేశారు. గురువారం హనుమకొండలోని కాకతీయ యూనివర్సిటీలో ఐసెట్ చైర్మన్, వీసీ తాటికొండ రమేష్, కన్వీనర్ పి.వరలక్ష్మి, రిజిస్ట్రార్ టి.శ్రీనివాస్‌రావుతో కలిసి ఆయన ఫైనల్‌కీ, ఫలితాలను విడుదల చేశారు. టీఎస్ ఐసెట్‌కు తెలంగాణ, ఏపీ నుంచి మొత్తం 75,925 మంది అభ్యర్థులు రిజిస్ట్రేషన్ చేసుకోగా, 70,900 మంది పరీక్ష రాసినట్లు లింబాద్రి తెలిపారు. వీరిలో 61,092 మంది (86.17శాతం) ఉత్తీర్ణత సాధించారు. వీరిలో బాలురు 29,618, బాలికలు 31,473 మంది, ట్రాన్స్‌జెండర్ ఒకరు ఉన్నట్లు పేర్కొన్నారు. ఫలితాలు సంబంధిత వెబ్‌సైట్‌లో అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. తమ వర్సిటీ ఐసెట్‌ను

మిగతా 12వ పేజీలో ▶

ఆ సీట్లు ఏమైనట్టు?



కౌన్సెలింగ్‌లో తగ్గిన సివిల్, మెకానికల్ సీట్లు

- వంద కాలేజీల్లో తగ్గనున్న కొన్ని బ్రాంచీల సీట్లు
- అవి కంప్యూటర్ కోర్సుల్లోకి మారనున్నట్లు అంచనా
- 3 వేల లోపు ర్యాంకులు వచ్చిన వారితో దరఖాస్తు చేయిస్తున్న కాలేజీలు
- భారీగా దండుకునేందుకు వ్యూహాత్మక అడుగులు

సాక్షి, హైదరాబాద్: ఈ ఏడాది సివిల్, మెకానికల్ సీట్లు భారీగా తగ్గే అవకాశం కన్పిస్తోంది. తొలి విడత కౌన్సెలింగ్‌లో చేర్చిన సీట్ల వివరాలే దీనికి నిదర్శనం. ఇప్పటివరకూ కౌన్సెలింగ్ జాబితాలో చేర్చిన సీట్లలో ఎక్కువగా కంప్యూటర్ సైన్స్, సైబర్ సెక్యూరిటీ, డేటా సైన్స్ ఏఐఎంఎల్, ఇతర కంప్యూటర్ కోర్సులవే ఉన్నాయి. సివిల్, మెకానికల్, ఎలక్ట్రికల్ బ్రాంచీల్లో సీట్లు తక్కువగా కన్పిస్తున్నాయి. దీన్నిబట్టి చూస్తే ఈ విభాగాల్లో సీట్లు కంప్యూటర్ కోర్సుల్లోకి మారబోతున్నాయా? లేదా కాలేజీలు రద్దు చేసుకుంటాయా? అనే సందేహాలు కలుగుతున్నాయి. ఇప్పటికే వంద కాలేజీల వరకూ సంప్రదాయ కోర్సుల్లో సీట్లు తగ్గించాలని, కంప్యూటర్ సైన్స్, ఇతర కోర్సుల్లో సీట్లు పెంచాలని దరఖాస్తు చేసుకున్నాయి. ఈ కారణంగానే దాదాపు 40 వేల సీట్లను కౌన్సెలింగ్‌లో పెట్టలేదని అధికార వర్గాలు చెబుతున్నాయి.

ఆప్షన్లన్నీ సీఎస్‌ఈ వైపే...

ఎంసెట్ కౌన్సెలింగ్‌కు ఇప్పటివరకు 60 వేల మంది దరఖాస్తు చేసుకున్నారు. తొలి విడత సీట్లు కేటాయించే నాటికి ఈ సంఖ్య 80 వేలు దాటొచ్చని అంచనా వేస్తున్నారు. ఈ ఏడాది ఇంజనీరింగ్ విభాగంలో 1,56,879 మంది అర్హత సాధించారు. రిజిస్ట్రేషన్ చేసుకున్న వారిలో ఎక్కువ మంది కంప్యూటర్ కోర్సులకే

మిగతా 2వ పేజీలో ▶

ఆ సీట్లపై ప్రైవేటు కాలేజీల గురి

కంప్యూటర్ సైన్స్ కోర్సుల్లో ఈ ఏడాది భారీగా సీట్లున్నాయి. అయినప్పటికీ విద్యార్థుల డిమాండ్ ఎక్కువగా ఉండటంతో ప్రైవేటు కాలేజీలు వ్యూహాత్మకంగా వ్యవహరిస్తున్నాయి. జేఈఈ, ఎంసెట్‌లో 3 వేల లోపు ర్యాంకులు వచ్చిన విద్యార్థుల చేత మొదటి కౌన్సెలింగ్‌లోనూ దరఖాస్తు చేయిస్తున్నాయి. వీళ్లకు కంప్యూటర్ కోర్సుల్లో తొలి దశలోనే సీట్లు వచ్చే అవకాశం ఉంది. ముందు సెల్ఫ్ రిపోర్టింగ్ చేసినప్పటికీ, ఆఖరి కౌన్సెలింగ్ వరకూ వీళ్లు కాలేజీల్లో చేరరు. జేఈఈ ర్యాంకు ఉండటంతో జాతీయ ఇంజనీరింగ్ కాలేజీల్లో చేరతారు. రాష్ట్రంలో అన్ని కౌన్సెలింగ్‌లు పూర్తయిన తర్వాత రాష్ట్రంలో తొలి విడతలో వచ్చిన సీటును వదులుకుంటున్నారు. అప్పుడు ప్రైవేటు కాలేజీలు స్పాట్ అడ్మిషన్‌లో ఇష్టమొచ్చిన వాళ్లకు భారీ మొత్తంలో డబ్బులు తీసుకుని సీట్లు ఇస్తున్నట్టు ఆరోపణలున్నాయి. అయితే, దీన్ని కట్టడి చేయడం ఎవరి వల్లా కావడం లేదని సాక్షాత్తు అధికార వర్గాలు చెబుతుండటం కొసమెరుపు.

క్లుప్తంగా...

11.5 లక్షల పోడు భూముల హామీని నిలబెట్టుకోండి

మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి

సాక్షి, హైదరాబాద్: గిరిజనులు, ఇతర పేదలకు 11.50 లక్షల ఎకరాల పోడు భూములపై హక్కులు కల్పిస్తామని అసెంబ్లీ సాక్షిగా ఇచ్చిన హామీని నిలబెట్టుకోవాలని సీపీఎం మాజీ ఎమ్మెల్యే జూలకంటి రంగారెడ్డి కోరారు. ఈ మేరకు ఆయన గురువారం ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు లేఖ రాశారు. హక్కు పత్రాల కార్యక్రమంలో రాజకీయ జోక్యాన్ని నివారించి పారదర్శకంగా జరిగేలా చూడాలని పేర్కొన్నారు. పోడు భూముల హక్కు పత్రాలను గ్రామ సభల్లోనే పంపిణీ చేయాలని విజ్ఞప్తి చేశారు.

బేషరతుగా గవర్నర్‌కు క్షమాపణ చెప్పండి: షర్మిల



సాక్షి, హైదరాబాద్: పేదల కోసం ఒక ఆసుపత్రి కట్టించమని గవర్నర్ ఆవేదనతో కోరితే... కోడిగుడ్డు మీద ఈకలు పీకినట్టా అని వైఎస్సార్ తెలంగాణ పార్టీ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల మంత్రి హరీశ్‌రావుని నిలదీశారు. స్వయంగా వైద్యురాలైన గవర్నర్.. పేదల ఆరోగ్యం కోసం ఆందోళన చెంది మాట్లాడితే..ఆమెను గౌరవించాల్సింది పోయి వీధి రౌడీకంటే హీనంగా మాట్లాడతారా అంటూ ఆగ్రహం వ్యక్తం చేశారు. మీకు గవర్నర్ అంటే లెక్కలేదు..అందులో మహిళలంటే అసలు గౌరవమే లేదని గురువారం ట్విట్టర్ వేదికగా ఆమె మండిపడ్డారు. గవర్నర్, వైద్యులకు హరీశ్‌రావు బేషరతుగా క్షమాపణ చెప్పి, ఉస్మానియా ఆసుపత్రి నిర్మాణం చేపట్టాలని షర్మిల డిమాండ్ చేశారు. కాగా, ప్రజా కళాకారుడు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ ఆకస్మిక మరణం తీవ్రంగా కలిచివేసిందని వైఎస్ షర్మిల ఆవేదన వ్యక్తం చేశారు.

నేడు ఖమ్మంలో జన గర్జన సభ సన్నాహక సమావేశం

సాక్షి, హైదరాబాద్: కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో జూలై 2న ఖమ్మంలో తెలంగాణ 'జన గర్జన' సభను నిర్వహించనున్నారు. ఈ సభకు రాహుల్‌గాంధీ హాజరుకానున్నారు. ఈ సందర్భంగా 'జన గర్జన'సభను విజయవంతం చేసేందుకు శుక్రవారం ఖమ్మం డీసీసీ కార్యాలయంలో సన్నాహక సమావేశం ఏర్పాటు చేస్తున్నట్లు టీపీసీసీ వర్కింగ్ ప్రెసిడెంట్ మహేష్ కుమార్ గౌడ్ తెలిపారు. టీపీసీసీ అధ్యక్షుడు ఎ.రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉదయం 11 గంటలకు ప్రారంభమయ్యే ఈ సమావేశంలో డీసీసీ అధ్యక్షులు, పార్టీ సీనియర్ ఉపాధ్యక్షులు, ప్రధాన కార్యదర్శులు, అధికార ప్రతినిధులు, అనుబంధ సంఘాల చైర్మన్లు పాల్గొంటారని వెల్లడించారు.

ఏజెన్సీపై ప్రభుత్వ నిర్లక్ష్యం

ఎమ్మెల్యే సీతక్క



గుంతల్లో మొరం పోస్తున్న ఎమ్మెల్యే సీతక్క

కొత్తగూడ: ఏజెన్సీ గ్రామాల అభివృద్ధిని ప్రభుత్వం పట్టించుకోవడం లేదని ములుగు ఎమ్మెల్యే సీతక్క ఆరోపించారు. మహబూబాబాద్ జిల్లా కొత్తగూడ-నర్సంపేట మధ్య రహదారిపై పడ్డ గుంతలను గురువారం కాంగ్రెస్ నాయకులతో కలిసి ఆమె పూడ్చారు. ఈ సందర్భంగా సీతక్క మాట్లాడుతూ.. ఒక ప్రభుత్వశాఖ పనులను మంజూరు చేస్తే.. మరో శాఖ అడ్డుకుంటుందని విమర్శించారు. దీని వెనక ఆంతర్యమేమిటని ఆమె ప్రశ్నించారు.

రైల్వే శాఖలో 3.2లక్షల ఖాళీల భర్తీకి ప్రకటనలివ్వాలి

ప్రధాని మోదీకి ఆర్.కృష్ణయ్య లేఖ

సాక్షి, హైదరాబాద్: రైల్వే శాఖ పరిధిలో ఖాళీగా ఉన్న 3.22 లక్షల ఉద్యోగాలను తక్షణమే భర్తీ చేయాలని, ఇందుకు కేంద్ర ప్రభుత్వం నిర్ణయం తీసుకుని ప్రకటన జారీ చేయాలని రాజ్యసభ సభ్యుడు ఆర్.కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన గురువారం ప్రధానమంత్రి నరేంద్రమోదీకి లేఖ రాశారు. రైల్వేలో తరచుగా ప్రమాదాలు జరగడానికి కారణం సిబ్బంది కొరత, సాంకేతిక సమస్యలే అన్నారు. వీటిని నివారించాలంటే మానవవనరుల సంఖ్య పెంచాల్సి ఉందని తెలిపారు.

ఆ సీట్లు ఏమైనట్టు?

▶ మొదటి పేజీ తరువాయి

ఆప్షన్లు ఇస్తున్నారు. ఇందులో ఎంసెట్, జేఈఈ ర్యాంకర్లు కూడా ఉన్నారు. తొలిరోజు దాదాపు 6 వేల మంది ఆప్షన్లు ఇచ్చారు. ఇందులో 5 వేలు సీఎస్సీ, ఇతర కంప్యూటర్ కోర్సులవే ఉన్నాయి. తొలి విడత కౌన్సెలింగ్‌లో కూడా 62,079 సీట్లు చేర్చారు. రాష్ట్రవ్యాప్తంగా దాదాపు 1.05 లక్షల ఇంజనీరింగ్ సీట్లుండగా, ఇందులో సివిల్ 3087, మెకానికల్ 2667, ఎలక్ట్రికల్ 3854 సీట్లు ఉన్నాయి. గత ఏడాదితో పోలిస్తే దాదాపు 30 శాతం తగ్గాయి. ప్రైవేటు కాలేజీలు కోరినట్టు బ్రాంచీల్లో సీట్ల మార్పు జరిగితే కంప్యూటర్ సైన్స్ కోర్సుల్లో సీట్లు పెరుగుతాయి. ఎందుకంటే గత ఏడాది సివిల్‌లో 36.38, మెకానికల్‌లో 31.92, ఈఈఈలో 56.49 శాతం సీట్లు మాత్రమే భర్తీ అయ్యాయి.

ఇదీ తెలంగాణలో సంగతి!

రాష్ట్రంలో పరిస్థితులను ప్రధానికి వివరించిన అమిత్‌షా, జేపీ నడ్డా

ప్రధాని నివాసంలో కీలక నేతల భేటీ

- తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల ఎన్నికలపై చర్చ
- కేంద్ర కేబినెట్ మార్పుల్లో ఎన్నికలు జరిగే రాష్ట్రాలకు ప్రాధాన్యం!
- బీజేపీలో ముఖ్యమైన కమిటీల నియామకంపై దృష్టి
- ఈటల, రాజగోపాల్‌రెడ్డి సూచనలపై సమాలోచనలు



సాక్షి, న్యూఢిల్లీ: వచ్చే లోక్‌సభ ఎన్నికలతో పాటు ఈ ఏడాది చివర్లో తెలంగాణ సహా ఐదు రాష్ట్రాల అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న నేపథ్యంలో జాతీయ, రాష్ట్రస్థాయిలో కీలక రాజకీయ పరిణామాలు చోటుచేసుకోవచ్చని తెలుస్తోంది. కేంద్ర కేబినెట్ పునర్వ్యవస్థీకరణలో భాగంగా జరిపే మార్పుల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న రాష్ట్రాలకు తగిన ప్రాధాన్యం దక్కవచ్చని విశ్వసనీయవర్గాల సమాచారం. వివిధ రాష్ట్రాల్లో పార్టీకి సంబంధించి అవసరమైన మేర సంస్థాగతంగా మార్పులు, ఎన్నికల ప్రచార కమిటీలు, మరింత మెరుగైన సమన్వయానికి ముఖ్యమైన కమిటీలను నియమించే అవకాశాలున్నట్టు ఊహాగానాలు సాగుతున్నాయి.

రాష్ట్ర పార్టీపై ప్రత్యేక దృష్టి...

తెలంగాణలో నెలకొన్న రాజకీయ పరిస్థితులు, పార్టీలో చోటుచేసుకుంటున్న పరిణామాల గురించి ప్రధాని నరేంద్ర మోదీకి బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా వివరించినట్లు తెలిసింది. పార్టీ బలోపేతం దిశగా తీసుకోవాల్సిన చర్యలు, ఎన్నికల సన్నద్ధత, వ్యూహాలపై వీరు సుదీర్ఘంగా చర్చించినట్లు పార్టీ జాతీయ వర్గాలు వెల్లడించాయి. తెలంగాణ సహా ఈ ఏడాది ఎన్నికలు జరగనున్న మధ్యప్రదేశ్, రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, మిజోరంతో పాటు వచ్చే ఏడాది జరిగే సార్వత్రిక ఎన్నికలపై బుధవారం అర్ధరాత్రి వరకు ప్రధాని మోదీ నివాసంలో కీలక సమావేశం జరిగింది. దీనికి అమిత్‌షా, నడ్డాలతో పాటు పార్టీ సంస్థాగత జాతీయ ప్రధాన కార్యదర్శి బీఎల్ సంతోష్ హాజరయ్యారు. ఈ సందర్భంగా తెలంగాణలో నేతల సమన్వయలేమి, సీనియర్‌నేతలు అసంతృప్తి వ్యక్తంచేయడం, ముఖ్యనాయకుల ఏకపక్ష ధోరణి వంటి ఇటీవలి రాజకీయ పరిణామాలను షా, నడ్డాలు మోదీకి వివరించినట్టు సమాచారం. పార్టీలో కొత్త, పాత నేతల మధ్య సమన్వయం లోపించడం, కర్ణాటక ఎన్నికల అనంతరం కాంగ్రెస్‌లో మొదలైన చేరికలు, పార్టీ నాయకత్వ మార్పుపై జరుగుతున్న చర్చలు వంటి అంశాలపై నివేదించారు. అలాగే ఎన్నికల్లో పార్టీ గట్టెక్కాలంటే తక్షణమే తీసుకోవాల్సిన చర్యలపై ఇటీవల సీనియర్ నేతలు ఈటల రాజేందర్, కోమటిరెడ్డి రాజగోపాల్‌రెడ్డిలు చేసిన సూచనలపైనా ఇందులో చర్చించినట్లు చెబుతున్నారు. ఇటీవల రాష్ట్ర పర్యటన సందర్భంగా నడ్డాకు పలువురు సీనియర్‌నేతలు తమ అసంతృప్తిని, అందుకు గల కారణాలను వివరించిన సంగతి కూడా చర్చకు వచ్చినట్టు తెలిసింది. రాష్ట్ర బీజేపీలో నెలకొన్న అయోమయం, గందరగోళ పరిస్థితులను దూరం చేసేందుకు చేపట్టాల్సిన చర్యలపై ఈ భేటీలో చర్చించినట్టు పార్టీవర్గాల ద్వారా తెలుస్తోంది.

ముఖ్యమైన కమిటీలకు నియామకాలు..

అగ్రనేతల సమావేశంలో కొన్ని కీలక కమిటీల నియామకాలపై చర్చ జరిగిందని సమాచారం. జూలై మొదటి వారానికి ముఖ్యమైన కమిటీల నియామకాలను పూర్తి చేయాలని, నేతల మధ్య సమన్వయం చెడకుండా ఎప్పటికప్పుడు వారితో చర్చించాలని మోదీ సూచనలు చేసినట్లు తెలిసింది. దీంతో పాటే బడుగు, బలహీన వర్గాల ప్రజలతో మమేకం అయ్యేలా నియోజకవర్గస్థాయి కార్యక్రమాలు, సెమినార్లు నిర్వహించాలని నిర్దేశించినట్లు సమాచారం. కొన్ని రాష్ట్రాల్లో అధ్యక్ష మార్పులతో పాటు, ఆయా రాష్ట్రాల నుంచి కొత్తవారికి కేంద్ర మంత్రివర్గంలో చోటు కల్పించాలనే అంశంపై కూడా చర్చలు జరిగినట్లు జాతీయ మీడియాలో వార్తలు వచ్చాయి. అయితే ఏయే రాష్ట్రాల్లో మార్పుచేర్పులు ఉంటాయన్న దానిపై స్పష్టత లేదు. తెలంగాణలో నాయకత్వ మార్పుతో పాటు, కేంద్రమంత్రివర్గంలో ఒకరికి చోటు లభిస్తుందని ఊహాగానాలు వస్తున్నా, వాటిపై జాతీయ నాయకత్వమే స్పష్టత ఇవ్వాలని అంటున్నారు. ఇదే భేటీలో తెలంగాణలో ఈ నెల 8న ప్రధాని పర్యటన షెడ్యూల్‌ను ఖరారు చేసినట్లు చెబుతున్నారు. వరంగల్‌లో ప్రధాని పర్యటనను పురస్కరించుకొని ఈ నెల 8న హైదరాబాద్‌లో నిర్వహించతలపెట్టిన దక్షిణాది రాష్ట్రాల బీజేపీ నాయకుల సమావేశాన్ని సైతం రద్దు చేసినట్లు పార్టీ వర్గాల సమాచారం.

పార్టీకి బూస్టర్ డోస్!

▶ మొదటి పేజీ తరువాయి

ఎదుర్కొనేలా రాష్ట్ర బీజేపీలో ఉత్సాహం నింపేందుకు మోదీ పర్యటన ఉపయోగపడుతుందని ఆ పార్టీ నేతలు భావిస్తున్నారు. ఇటీవలే భోపాల్‌లో జరిగిన ఓ కార్యక్రమంలో ప్రధాని మోదీ.. తెలంగాణసహా దేశవ్యాప్తంగా కుటుంబ రాజకీయాలు సాగుతున్న తీరును తీవ్రస్థాయిలో ఎండగట్టారు. రాష్ట్ర పర్యటనలోనూ ఆయన ఇదే అంశాన్ని మరోసారి బలంగా ఎత్తిచూపుతూ.. బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌లపై విమర్శలు గుప్పిస్తారని కాషాయ వర్గాలు చెప్తున్నాయి. ప్రధానంగా కేసీఆర్ సర్కార్‌ను టార్గెట్ చేస్తూ.. అవినీతి, అక్రమాలు, ప్రభుత్వ వైఫల్యాలు, ముఖ్యమైన ఎన్నికల హామీలను నిలబెట్టుకోకపోవడం వంటి అంశాలపై ధ్వజమెత్తుతారని అంటున్నాయి. మొత్తంగా రాష్ట్ర బీజేపీలో నవోత్సాహాన్ని నింపేందుకు మోదీ పర్యటన దోహదపడుతుందని స్పష్టం చేస్తున్నాయి.

ఇప్పటికే రాష్ట్రానికి రావాల్సి ఉన్నా..

మోదీ ప్రభుత్వం తొమ్మిదేళ్ల పాలనలో సాధించిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల ప్రచారం కోసం దేశవ్యాప్తంగా చేపట్టిన 'మహా జన సంపర్క్ అభియాన్'లో భాగంగా ప్రధాని మోదీ, కేంద్ర హోంమంత్రి అమిత్‌షా ఈ నెలలోనే రాష్ట్రంలో పర్యటించాల్సి ఉంది. కానీ అనివార్య కారణాల వల్ల అమిత్‌షా ఖమ్మం సభ రద్దుకాగా.. విదేశ పర్యటన, ఇతర కార్యక్రమాల కారణంగా మోదీ కూడా రాలేదు. ఈ క్రమంలోనే వచ్చే నెల 8న ఉమ్మడి వరంగల్ జిల్లా పర్యటన ఖరారైనట్టు బీజేపీ వర్గాలు తెలిపాయి. ఇప్పటిదాకా రాష్ట్రంలోని వివిధ ప్రాంతాల్లో బీజేపీ అగ్రనేతలు, కేంద్ర మంత్రుల పర్యటనలు సాగినందున.. ఉమ్మడి వరంగల్ పరిధిలోనూ ఓ భారీ సభ, ఇతర కార్యక్రమాల నిర్వహణకు బీజేపీ మొగ్గుచూపినట్టు సమాచారం.



కాజీపేట మండలం అయోధ్యపురం గ్రామ సరిహద్దులో రైల్వే వ్యాగన్ రిపేర్ వర్క్‌షాప్ నిర్మించతలపెట్టిన స్థలం ఇదే..

సన్నాహాలు మొదలుపెట్టిన నేతలు

మరో నాలుగైదు నెలల్లోనే తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు ఉన్న నేపథ్యంలో మోదీ పర్యటనకు మరింత ప్రాధాన్యత కనిపిస్తోంది. ఈ పర్యటనను రాజకీయంగా ఉపయోగించుకునేందుకు.. పార్టీకి అనుకూలంగా మలుచుకునేందుకు బీజేపీ రాష్ట్ర నాయకత్వం కార్యాచరణ ప్రారంభించింది. మోదీ పర్యటన ఏర్పాట్లు, సభకు జన సమీకరణ, ఇతర అంశాలపై కేంద్రమంత్రి జి.కిషన్‌రెడ్డి, పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు బండి సంజయ్, ఇతర రాష్ట్ర నాయకులతో సమన్వయ చర్యలు మొదలుపెట్టారు. మోదీ హనుమకొండ సభను విజయవంతం చేయడం ద్వారా.. పార్టీలో కొన్నిరోజులుగా కొనసాగుతున్న గందరగోళ పరిస్థితిని దూరం చేయాలనే ఉద్దేశంతో సన్నాహాల్లో నిమగ్నమయ్యారు. ఇక మోదీ పర్యటన నేపథ్యంలో వచ్చే నెల 8న హైదరాబాద్‌లో జరగాల్సిన బీజేపీ 11 రాష్ట్రాల పార్టీ అధ్యక్షులు, సంస్థాగత ప్రధాన కార్యదర్శుల సమావేశాన్ని వాయిదా వేశారు.

మోదీ పర్యటన ఇలా..

వచ్చే నెల 8న (శనివారం) మోదీ రాష్ట్ర పర్యటన వస్తారు. ప్రత్యేక హెలికాప్టర్‌లో వరంగల్ జిల్లా కాజీపేట మండలం మడికొండ-అయోధ్యపురం గ్రామాల మధ్య రైల్వే వ్యాగన్ ఓవర్ హాలింగ్ వర్క్‌షాప్ నిర్మాణ స్థలానికి చేరుకుని శంకుస్థాపన చేస్తారు. తర్వాత వరంగల్ భద్రకాళి ఆలయానికి వెళ్లి అమ్మవారిని దర్శించుకుంటారు. అక్కడి నుంచి వరంగల్ జిల్లా సంగెంకు వెళ్లి మెగా టెక్స్‌టైల్ పార్క్‌కు భూమిపూజ చేస్తారు. సాయంత్రం హనుమకొండ ఆర్ట్స్ కాలేజీ గ్రౌండ్స్‌లో నిర్వహించే భారీ బహిరంగ సభలో మోదీ ప్రసంగిస్తారు. ఈ పర్యటన సందర్భంగా కాజీపేట-కరీంనగర్ కొత్త రైల్వే మార్గానికి కూడా మోదీ శంకుస్థాపన చేయవచ్చని తెలిసింది.

బీఆర్‌ఎస్, కాంగ్రెస్‌ది ఫినాయిల్ బంధం

- హస్తం పార్టీలో గెలిచినోళ్లంతా పోయేది బీఆర్‌ఎస్‌లోకే... ● కేసీఆర్‌కు వేల కోట్లు ఆస్తులు ఎలా వచ్చాయి?
- ఒవైసీకి దమ్ముంటే తెలంగాణ అంతటా పోటీ చేయాలి ● మహాజన్ సంపర్క్ అభియాన్ సభలో బండి సంజయ్



గురువారం ఆత్మకూరు బహిరంగ సభలో మాట్లాడుతున్న బండి సంజయ్

సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్: 'బీఆర్‌ఎస్, బీజేపీది ఫెవికాల్ బంధమని అంటున్నారు.. కానీ, మాది ఏ బంధమూ కాదు.. బీఆర్‌ఎస్, కాంగ్రెస్ పార్టీలది మాత్రం ఫినాయిల్ బంధం. కాంగ్రెస్ పార్టీ కిరాణా దుకాణం వంటిది. కాంగ్రెస్ నుంచి ఎవరు గెలిచినా.. పోయేది బీఆర్‌ఎస్‌లోకే..'అని బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, ఎంపీ బండి సంజయ్ ధ్వజమెత్తారు. మహాజన్ సంపర్క్ అభియాన్‌లో భాగంగా వనపర్తి జిల్లా ఆత్మకూరులో గురువారం నిర్వహించిన మక్తల్ నియోజకవర్గ బహిరంగసభలో ఆయన మాట్లాడారు. కేసీఆర్ ప్రజల కోసం చేస్తున్నదేమీ లేదని, ఎంతసేపూ ప్రజలను ఎలా మోసం చేయాలి.. పక్క పార్టీలను ఎలా దెబ్బతీయాలనే ఆలోచన తప్ప మరొకటి లేదని మండిపడ్డారు. ఇంటికో ఉద్యోగం, నిరుద్యోగ భృతి, అందరికీ డబుల్ బెడ్రూం ఇళ్లు, రుణమాఫీ, దళితులకు మూడు ఎకరాలు, దళితబంధు ఇస్తామని చెప్పి మోసం చేసిన ద్రోహి కేసీఆర్ అంటూ వ్యంగ్యాస్త్రాలు సంధించారు. కేంద్ర ప్రభుత్వమే యూరియా సబ్సిడీ, కిసాన్ సమ్మాన్ నిధి పేరుతో ఒక్కో ఎకరానికి రూ.30 వేలు సాయం చేస్తోందని, 9090902024 నంబర్‌కు డయల్ చేసి ప్రజలు బీజేపీకి మద్దతు పలకాలని బండి కోరారు.

కేసీఆర్‌ది డ్రంక్ అండ్ డ్రైవ్ సర్కార్

ఏ ఒక్క హామీ అమలు చేయని కేసీఆర్ రూ.5 లక్షల కోట్లు అప్పు చేసి రాష్ట్రాన్ని దివాళా తీయించి.. మహారాష్ట్రకు పారిపోతున్నారని బండి ధ్వజమెత్తారు. కేసీఆర్‌ది డ్రంక్ అండ్ డ్రైవ్ సర్కార్ అని.. మందు తాగి బండి నడిపితే కేసు పెడుతున్న పోలీసులు మందు తాగి రాష్ట్రాన్ని పాలిస్తే ఎందుకు కేసు పెట్టడం లేదని ఎద్దేవా చేశారు. ఏ సర్వే చూసినా బీజేపీ గెలుస్తుందని నివేదికలు వస్తున్నందునే బీజేపీని దెబ్బతీసి కాంగ్రెస్, ఎంఐఎంను లేపేందుకు కేసీఆర్ కుట్ర చేస్తున్నారన్నారు. హైదరాబాద్‌లో ఇస్లామిక్ సెంటర్ పెట్టాలని చూస్తే ఊరుకోమని.. మజ్లిస్ పార్టీకి, ఒవైసీకి దమ్ముంటే తెలంగాణ అంతటా పోటీ చేయాలని సవాల్ విసిరారు. సభలో బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు జితేందర్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

హాట్ టాపిక్‌గా డీకే అరుణ గైర్హాజరు

ఈ సభకు బీజేపీ జాతీయ ఉపాధ్యక్షురాలు డీకే అరుణ గైర్హాజరవడం చర్చనీయాంశంగా మారింది. రాష్ట్రంలో చోటుచేసుకుంటున్న తాజా రాజకీయ పరిణామాల నేపథ్యంలో ఈ సభకు ఆమె హాజరుకాకపోవడంపై రాజకీయ వర్గాల్లో భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఒక వైపు రాష్ట్ర బీజేపీలో మార్పులు ఉంటాయనే ప్రచారం ఇటీవల జోరుగా సాగుతోంది. మరో వైపు జూపల్లి, పొంగులేటి శ్రీనివాస్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరుతుండగా.. మరికొందరు ముఖ్య నేతలు సైతం హస్తం గూటికి చేరనున్నట్లు రాజకీయ వర్గాలు అంచనా వేస్తున్నాయి.

బీజేపీలో చేరిన మాజీ డీజీపీ

సాక్షి, హైదరాబాద్: విశ్రాంత డీజీపీ ర్యాంక్ అధికారి (ఉమ్మడి ఏపీ) ఎస్‌కే జయచంద్ర, ఆయన కుమార్తె, ఫ్యాషన్ డిజైనర్ పాయల్ నేహా పాణిగ్రాహి గురువారం బీజేపీలో చేరారు. గురువారం పార్టీ కార్యాలయంలో బండి సంజయ్ వారిని పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా బండి మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి కార్యాలయంలో కొందరు అధికారులు సీఎం కేసీఆర్ కుటుంబానికి డబ్బు సంపాదనే లక్ష్యంగా పనిచేస్తున్నారని ఆరోపించారు. నిరుద్యోగ యువత ఉపాధి కోసం పరితపిస్తుంటే... రిటైర్డ్ అధికారులకు కేసీఆర్ పెద్దపీట వేసి పబ్బం గడుపుతున్నారని మండిపడ్డారు. సీఎంకు కుడి, ఎడమ చేతులుగా రిటైరైన 500 మంది అధికారులను నియమించుకున్నారని, వీరికి ఏటా వెయ్యి కోట్లు జీతభత్యాల కింద ఖర్చుచేయడం దారుణమన్నారు. కాగా, గవర్నర్ తమిళిసైపై మంత్రి హరీశ్‌రావు చేసిన వ్యాఖ్యలను బండి ఖండించారు. సీఎం అందుబాటులో లేరనే ప్రజలు రాజ్‌భవన్ వైపు చూస్తున్నారన్నారు. బీఆర్‌ఎస్ అవినీతికి పాల్పడితే గవర్నర్ చూస్తూ ఊరుకోవాలా అని ప్రశ్నించారు.

రాజకీయం కోసం కాదు.. ప్రజల కోసమే యాత్ర

- దమ్ముంటే రాజీవ్ సాగర్, ఇందిరా సాగర్‌పై చర్చకు రండి
- కొందరి అవసరాల కోసమే కాళేశ్వరం
- పాదయాత్రలో సీఎల్పీ నేత భట్టి విక్రమార్క



కూసుమంచి సభలో మాట్లాడుతున్న భట్టి

కూసుమంచి: తాను చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర రాజకీయాల కోసం కాదని.. అనేక ఆశలతో సాధించుకున్న తెలంగాణలో వాటిని నెరవేర్చుకునేలా తెలంగాణ సమాజాన్ని మేల్కొలిపేందుకేనని సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క వెల్లడించారు. భట్టి పాదయాత్ర గురువారం ఖమ్మం జిల్లా కూసుమంచి మండలంలో కొనసాగింది. ఈ సందర్భంగా కూసుమంచిలో ఏర్పాటుచేసిన కార్నర్ మీటింగ్‌లో ఆయన మాట్లాడుతూ, కాంగ్రెస్ హయాంలో నిర్మించిన ప్రాజెక్టుల నుంచి తప్ప.. ఈ తొమ్మిదేళ్లలో బీఆర్‌ఎస్ సర్కార్ ఒక్క ఎకరాకు కూడా కొత్తగా సాగునీరు ఇవ్వలేదని విమర్శించారు. కొన్ని సాగునీటి ప్రాజెక్టులు రాష్ట్ర విభజనకు ముందే పూర్తయినా ప్రస్తుత ప్రభుత్వ నిర్లక్ష్యంతో వాటి ఫలాలు రైతులకు అందడంలేదన్నారు. ఖమ్మం జిల్లాలో దివంగత ముఖ్యమంత్రి వైఎస్ హయాంలో నాలుగు లక్షల ఎకరాలకు సాగునీరు అందించేలా ఇందిరా సాగర్, రాజీవ్ సాగర్ ప్రాజెక్టుల పనులు చేపట్టగా రాష్ట్ర విభజన నాటికే 80 శాతం పనులు పూర్తయ్యాయని గుర్తు చేశారు. కానీ బీఆర్‌ఎస్ ప్రభుత్వం వాటిని ఎందుకు పక్కన పెట్టిందో చెప్పాలని ప్రశ్నించారు. ఆయా ప్రాజెక్టులకు రూ.1,500 కోట్లు కేటాయిస్తే పూర్తయ్యే అవకాశం ఉన్నా.. రూ.25 వేల కోట్లతో రీడిజైన్ చేసి సీతారామగా మారిస్తే నేటికీ చుక్కనీరు అందలేదన్నారు. ఇందిరా, రాజీవ్ సాగర్ ప్రాజెక్టులపై సీఎల్పీ నేతగా చర్చకు తాను సిద్ధమేనని.. ధైర్యం ఉంటే ప్రభుత్వం చర్చకు రావాలని సవాలు చేశారు. ఇక లక్షన్నర కోట్లతో కాళేశ్వరం ప్రాజెక్టును నిర్మించినా కొందరికి ఆదాయ వనరుగా మారిందే తప్ప రైతులకు లాభం జరగలేదని భట్టి విమర్శించారు. కాంగ్రెస్ ప్రభుత్వంలో గిరిజనులకు అటవీ భూములపై హక్కులు కల్పిస్తే ఈ ప్రభుత్వం వారిని భూముల నుంచి గెంటేస్తోందని, అలాగే సింగరేణి గనులను నిర్వీర్యం చేస్తోందని ఆరోపించారు. ఈ సభలో మాజీ జెడ్పీ చైర్మన్ చందా లింగయ్య, మాజీ ఎమ్మెల్సీ పోట్ల నాగేశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

నేడే పోడు రైతులకు పట్టాలు

▶ మొదటి పేజీ తరువాయి

తొలుత కుమురంభీం విగ్రహాన్ని ఆవిష్కరిస్తారు. అనంతరం బీఆర్‌ఎస్ పార్టీ కార్యాలయాన్ని ప్రారంభిస్తారు. సమీపంలోని పిల్లల పార్కులో ఏర్పాటు చేసిన మాజీ మంత్రి కోట్నాక భీంరావు విగ్రహాన్ని ఆవిష్కరించిన తర్వాత జిల్లా ఎస్పీ కార్యాలయాన్ని, చివరగా కలెక్టరేట్ భవనాన్ని ప్రారంభిస్తారు. అనంతరం బహిరంగ సభలో పాల్గొంటారు. ఈ కార్యక్రమంలో భాగంగా పోడు రైతులకు పట్టా పుస్తకాలు ముఖ్యమంత్రి అందజేస్తారు. తిరిగి ఆయన సాయంత్రం 6.25 గంటలకు ప్రగతిభవన్ చేరుకోనున్నారు.

జిల్లా	క్లెయిమ్స్	విస్తీర్ణం(ఎకరాల్లో)
భద్రాద్రి కొత్తగూడెం	50,595	1,51,195
మహబూబాబాద్	24,972	70,434
ఆసిఫాబాద్	15,254	44,750
ఆదిలాబాద్	12,222	31,683
ములుగు	7,413	18,869
నిర్మల్	7,257	20,051
ఖమ్మం	5,857	9,779
కామారెడ్డి	4,480	12,969
నిజామాబాద్	3,788	7,697
వరంగల్	3,654	8,366
భూపాలపల్లి	3,428	8,537
మంచిర్యాల	2,403	5,024
నల్లగొండ	2,256	4,426
నాగర్‌కర్నూల్	1,956	4,968
రాజన్న సిరిసిల్ల	1,614	2,857
సంగారెడ్డి	1,128	1,807
మెదక్	610	524
వికారాబాద్	434	554
వనపర్తి	311	379
యాదాద్రి భువనగిరి	186	427
సూర్యాపేట	84	189
హనుమకొండ	70	65
మహబూబ్ నగర్	19	22
జగిత్యాల	15	19
నారాయణపేట	3	8
పెద్దపల్లి	3	1
మొత్తం	1,50,012	4,05,601

పోడు పట్టాల తర్వాత రైతుబంధు, రైతు బీమా

- మంత్రి సత్యవతి రాథోడ్ వెల్లడి
- పట్టాల పంపిణీ ముగిసిన తర్వాత రైతుబంధు నగదు జమ
- పోడు రైతులకే అటవీ భూముల పరిరక్షణ బాధ్యత



సాక్షి, హైదరాబాద్: రాష్ట్రంలోని గిరిజనులు, ఆదివాసీలు ఏళ్లుగా ఎదురు చూస్తున్న పోడు భూముల సమస్యకు శాశ్వత పరిష్కారం దొరికిందని రాష్ట్ర గిరిజన, మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ చెప్పారు. ఇచ్చిన మాటకు కట్టుబడి గిరి బిడ్డలపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుని పట్టా పుస్తకాల పంపిణీ చేస్తున్న ముఖ్యమంత్రి కె.చంద్రశేఖర్‌రావుకు పాదాభివందనం చేస్తున్నానన్నారు. శుక్రవారం ఆసిఫాబాద్ జిల్లాలో సీఎం కేసీఆర్ పోడు రైతులకు పట్టా పుస్తకాలు పంపిణీ చేస్తారని, అనంతరం వారికి రైతుబంధు, రైతు బీమా పథకాలను సైతం వర్తింపజేస్తామని తెలిపారు. ఇందుకోసం రైతుల నుంచి బ్యాంకు ఖాతాల వివరాలను స్వీకరిస్తామని చెప్పారు. ఇప్పటికే చాలాచోట్ల ఈ వివరాలను క్షేత్రస్థాయి అధికారులు స్వీకరించారని గురువారం ఒక ప్రకటనలో మంత్రి తెలిపారు. పోడు పుస్తకాల పంపిణీ ముగిసిన తర్వాత ఆయా రైతుల ఖాతాల్లో రైతుబంధు నగదు జమ అవుతుందన్నారు. అదే విధంగా రైతుబీమా పథకం దరఖాస్తులు సైతం స్వీకరించి పథకం అమలయ్యేలా చర్యలు తీసుకుంటామన్నారు.

పోడు భూముల పట్టాలు పొందే ప్రతి లబ్ధిదారుడి పేరుతో ప్రభుత్వమే బ్యాంకు ఖాతాను తెరిపిస్తుందని మంత్రి తెలిపారు. రైతుల బ్యాంకు ఖాతాల నంబర్లు, బ్యాంకు ఐఎఫ్‌ఎస్‌సీ కోడ్, లబ్ధిదారుల మొబైల్ నంబర్లు తదితర వివరాలను అప్‌లోడ్ చేసి సిద్ధం చేయడం జరిగిందన్నారు. పోడు పట్టాల పంపిణీతో అటవీ భూముల అన్యాక్రాంతానికి చెక్ పెట్టాలని ప్రభుత్వం నిర్ణయించిందని తెలిపారు. రైతుల కమతాల చుట్టూ ఉన్న అటవీ భూముల రక్షణను ప్రభుత్వం వారికే అప్పగిస్తుందని పేర్కొన్నారు. దీంతో ఆక్రమణలకు అవకాశం ఉండదని వివరించారు.

'కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీపై ప్రధాని స్పష్టతనివ్వాలి'



సాక్షి, హైదరాబాద్: రాష్ట్ర విభజన చట్టంలో ఇచ్చిన హామీ మేరకు కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీపై స్పష్టమైన ప్రకటన చేసిన తర్వాతే ప్రధాని మోదీ జూలై 8న తెలంగాణకు రావాలని రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్ డిమాండ్ చేశారు. గురువారం మంత్రుల నివాసంలో ఆయన మీడియాతో మాట్లాడుతూ, ఉమ్మడి వరంగల్ జిల్లా ప్రజలు నాలుగు దశాబ్దాలుగా కాజీపేట రైల్వే కోచ్ ఫ్యాక్టరీ కోసం ఎదురు చూస్తున్నారని అన్నారు. కాజీపేటలో రైల్వే కోచ్ ఫ్యాక్టరీ కాకుండా కేవలం వ్యాగన్ల మరమ్మతులు చేసే సెంటర్‌ను మాత్రమే ప్రారంభించేందుకు ప్రధాని హోదాలో మోదీ కాజీపేటకు వస్తుండటం ఆశ్చర్యాన్ని కలిగిస్తోందని వినోద్‌కుమార్ పేర్కొన్నారు. కేంద్రంలో రైల్వేశాఖ మంత్రిగా ఎవరున్నా వారు రైల్వే కోచ్ ఫ్యాక్టరీలను వారివారి రాష్ట్రాల్లో ఏర్పాటు చేసుకుంటున్నారని, జాతీయ సమైక్యతా స్ఫూర్తి అంటే ఇదేనా అని ఆయన ప్రశ్నించారు.

జితేందర్‌రెడ్డి ట్వీట్ల కలకలం

బీజేపీ నేతలపై వీడియో.. తప్పుబట్టిన పార్టీ నేతలు, కార్యకర్తలు



సాక్షి, హైదరాబాద్: తెలంగాణ బీజేపీ నాయకులను ఉద్దేశించి.. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యుడు ఏపీ జితేందర్‌రెడ్డి వ్యంగ్యంగా ట్విట్టర్‌లో పోస్టు చేసిన వీడియో కలకలం సృష్టించింది. మొండికేసిన ఓ దున్నపోతును వెనకనుంచి తన్నుతూ వ్యాన్‌లోకి ఎక్కిస్తున్న వీడియో షేర్ చేసి.. తెలంగాణ బీజేపీ నాయకత్వానికి ఇదే చికిత్స అవసరమంటూ ఆయన ట్వీట్ చేశారు. ఈ వీడియోలోనే మరిన్ని దున్నపోతులు వెనక వరుసగా నిల్చుని ఉండటం కూడా గమనార్హం. ఈ ట్వీట్‌ను పార్టీ అగ్రనేతలు అమిత్‌షా, బీఎల్ సంతోష్, సునీల్ బన్సల్‌లకు ట్యాగ్ చేశారు. మరోవైపు టీపీసీసీ అధ్యక్షుడు రేవంత్‌రెడ్డితో సహా బీఆర్‌ఎస్ సోషల్ మీడియా బృందాలు సైతం ఈ ట్వీట్‌ను తమకు అనుకూలంగా మలుచుకునే ప్రయత్నం చేశాయి. ఐతే ఇది సంజయ్‌కు వ్యతిరేకంగా ఉందంటూ జితేందర్ రెడ్డికి పలువురు ఫోన్లు చేయడంతో.. వెంటనే దాన్ని తొలగించారు. కానీ కాసేపటికి ఆయన అదే వీడియోను మళ్లీ ట్విట్టర్‌లో పోస్ట్ చేస్తూ.. ఇది సంజయ్‌కు వ్యతిరేకంగా కాదని స్పష్టం చేశారు. 'కేసీఆర్ సోషల్ మీడియా ఊరకుక్కలకు తెలియాల్సిన ముచ్చట ఏంటంటే.. బండి సంజయ్ నాయకత్వాన్ని ప్రశ్నించేటోళ్లకు ఎలాంటి ట్రీట్మెంట్ ఇవ్వాలో చెప్పే ప్రయత్నాన్ని తప్పుగా అర్థం చేసుకునే ఊరకుక్కలారా.. బిస్కెట్ల కోసం బరితెగించకండి'.. అంటూ తీవ్రమైన వ్యాఖ్యలతో ట్వీట్ చేశారు. సొంత పార్టీలో సంజయ్‌ను వ్యతిరేకించే నాయకులను ఉద్దేశించే జితేందర్‌రెడ్డి ఈ ట్వీట్ చేసి ఉంటారనే అభిప్రాయం పార్టీలో వ్యక్తమైంది. ఇలాంటి వీడియోలు ట్విట్టర్‌లో షేర్ చేయడం, పార్టీకి ఇదే ట్రీట్‌మెంట్ అవసరమంటూ పేర్కొనడం వంటివి బీజేపీ నేతలు తప్పుబడుతున్నారు. అసెంబ్లీ ఎన్నికలు సమీపిస్తున్న నేపథ్యంలో పార్టీ నియమ, నిబంధనలకు లోబడి నాయకులు, కార్యకర్తలు పనిచేసేలా జాతీయ, రాష్ట్ర నాయకత్వాలు చర్యలు తీసుకోవాలని సూచిస్తున్నారు.

విదేశీ పర్యటనకు రాష్ట్ర మంత్రులు

సాక్షి, హైదరాబాద్: రాష్ట్రాన్ని పర్యాటకంగా అభివృద్ధి చేయడానికి విదేశాల్లో అత్యాధునిక పరిజ్ఞానంతో ఏర్పాటు చేసిన పలు పర్యాటక ప్రాంతాల సందర్శనకు మంత్రులు శ్రీనివాస్‌గౌడ్, గంగుల కమలాకర్, రాష్ట్ర ప్రణాళికాసంఘం ఉపాధ్యక్షుడు బోయినపల్లి వినోద్‌కుమార్ తదితరులు గురువారం రాత్రి విదేశీ పర్యటనకు బయల్దేరి వెళ్లారు. దక్షిణ కొరియా రాజధాని సియోల్, సింగపూర్ పర్యాటక కేంద్రాలను వారు అధ్యయనం చేయనున్నారు. మహబూబ్‌నగర్‌లో ఏర్పాటు చేస్తున్న కేబుల్ బ్రిడ్జ్, రోప్‌వే, ట్యాంక్‌బండ్‌లతోపాటు మ్యూజికల్ ఫౌంటెయిన్, లేజర్ షో, జెయింట్ వీల్, వేవ్ పూల్, వాటర్ రైడ్స్, వాటర్ గేమ్స్ అంతర్జాతీయ స్థాయిలో అభివృద్ధి చేయడంతోపాటు కరీంనగర్‌లోని మానేరు రివర్ ఫ్రంట్ అభివృద్ధితోపాటు రాష్ట్రంలోని ఇతర పర్యాటక ప్రాంతాల అభివృద్ధి కోసం వెళ్తున్నట్లు మంత్రి శ్రీనివాస్‌గౌడ్ వెల్లడించారు. ముఖ్యమంత్రి కేసీఆర్ రాష్ట్రాన్ని పర్యాటకంగా ఎంతో అభివృద్ధి చేస్తున్నారని వివరించారు.

మరోసారి శేజల్ ఆత్మహత్యాయత్నం

▶ మొదటి పేజీ తరువాయి

మంచోడని బీఆర్‌ఎస్ పెద్ద నేతలే ప్రకటించారు. ఇక నాకు న్యాయం జరగదని భావిస్తున్నాను. నాకు అన్యాయం చేసిన ప్రతి ఒక్కరికీ నా ఉసురు తగులుతుంది. పెద్దమ్మ తల్లీ.. నా కుటుంబానికి అండగా ఉండి.. ఈ ద్రోహులను నువ్వే శిక్షించాలి. ఈ ప్రభుత్వం చేసిన నమ్మకద్రోహానికి శేజల్ అనే నేను బలవుతున్నాను. నీ దగ్గరే నాకు మనఃశాంతి దొరుకుతుందని భావిస్తున్నాను' అని సూసైడ్ లెటర్ రాసి ఆరిజన్ డెయిరీ డైరెక్టర్ శేజల్ గురువారం మధ్యాహ్నం జూబ్లీహిల్స్‌లోని పెద్దమ్మ గుడి సమీపంలో నిద్ర మాత్రలు మింగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. రోడ్డు పక్కన అపస్మారక స్థితిలో పడి ఉన్న ఆమెను స్థానికులు గుర్తించి పోలీసులకు సమాచారం అందించారు. ఘటనా స్థలికి చేరుకున్న జూబ్లీహిల్స్ పోలీసులు ఆమెను చికిత్స నిమిత్తం మాదాపూర్‌లోని ఓ ఆస్పత్రిలో చేర్చారు. శేజల్ బ్యాగ్‌లో కొన్ని నిద్రమాత్రలు, లేఖను పోలీసులు గుర్తించి స్వాధీనం చేసుకున్నారు. శేజల్ మొదట ఈ నెల 1న ఢిల్లీలో ఆత్మహత్యాయత్నం చేయగా, ఇది రెండోసారి. ఆమె గత కొంత కాలంగా మంచిర్యాల జిల్లా బెల్లంపల్లి ఎమ్మెల్యే దుర్గం చిన్నయ్యపై ఆరోపణలు చేస్తున్నారు. తనను లైంగికంగా వేధించిన ఎమ్మెల్యేపై చర్యలు తీసుకోవాలని ఇటీవల ఆమె ఢిల్లీలో జాతీయ మహిళా కమిషన్, హెచ్‌ఆర్‌సీలకు ఫిర్యాదు చేశారు. ఆ తర్వాత తెలంగాణ భవన్ వద్ద ఆత్మహత్య యత్నానికి ప్రయత్నించారు. కాగా, ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆమెను పలు ప్రతిపక్ష పార్టీ నాయకులు పరామర్శించడానికి రావడంతో ఉద్రిక్తత చోటు చేసుకుంది. పోలీసులు ఆస్పత్రి వద్ద బందోబస్తు ఏర్పాటు చేశారు. శేజల్‌ను ప్రజాశాంతి పార్టీ అధ్యక్షుడు కేఏ పాల్ పరామర్శించారు. కాగా, ఆత్మహత్యాయత్నం చేసిన శేజల్ ప్రస్తుతం ఐసీయూలో ఉన్నారని, ఆమె ఆరోగ్యం నిలకడగా ఉందని ఆస్పత్రి వైద్యులు తెలిపారు.



సాయిచంద్ మృతదేహానికి నివాళులర్పిస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో హరీశ్‌రావు, సబిత, బాల్క సుమన్, రసమయి, శంభీపూర్‌రాజు తదితరులు



సాయిచంద్ కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న సీఎం కేసీఆర్. చిత్రంలో సబిత

ఉద్యమ గాయకుడు | సాయిచంద్ కన్నుమూత

నాగర్‌కర్నూల్ జిల్లా కారుకొండలో బుధవారం అర్ధరాత్రి గుండెపోటుతో మృతి

- ఉద్యమ సమయంలో ధూంధాం కార్యక్రమాల్లో అలరించిన సాయిచంద్
- భౌతికకాయానికి పెద్ద సంఖ్యలో ప్రముఖుల నివాళి
- కంటతడి పెట్టిన సీఎం కేసీఆర్..



సాయిచంద్ కుటుంబ సభ్యులను ఓదారుస్తున్న మంత్రి కేటీఆర్

సాక్షి, రంగారెడ్డిజిల్లా/ సాక్షి ప్రతినిధి, మహబూబ్‌నగర్/ సాక్షి, నాగర్‌కర్నూల్/ సాక్షి, హైదరాబాద్: ''రాతి బొమ్మల్లోన కొలువైన శివుడా.. రక్తబంధం విలువ నీకు తెలియదురా.. నుదిటి రాతలు రాసే ఓ బ్రహ్మదేవుడా.. తల్లి ప్రేమ విలువ నీకు తెలియదురా..'' అంటూ తెలంగాణ అమరులను స్మరిస్తూ, ఆటపాటలతో ఉద్యమాన్ని ఉర్రూతలూగించిన ప్రముఖ గాయకుడు, రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ వేద సాయిచంద్ (39) కన్నుమూశారు. సాయిచంద్ మృతి తెలంగాణ వాదులను, కళాభిమానులను తీవ్రంగా కలచివేసింది.

మల్లన్నను దర్శించుకునేందుకు వెళ్లి..

వనపర్తి జిల్లా అమరచింతకు చెందిన సాయిచంద్ బుధవారం రాత్రి కుటుంబంతో కలసి నాగర్‌కర్నూల్ జిల్లా బిజినేపల్లి మండలం కారుకొండలోని తమ వ్యవసాయ క్షేత్రానికి వెళ్లారు. గురువారం సమీపంలోని కుమ్మెర మల్లన్నను దర్శించుకోవాలని అనుకున్నారు. అయితే రాత్రి పదిన్నర గంటలకు ఆయనకు ఛాతీలో నొప్పిరావడంతో సీపీఆర్ చేశామని.. ఉపశమనం కలిగిందని చెప్పారని గన్‌మన్, కుటుంబ సభ్యులు తెలిపారు. కానీ మరో గంటన్నర తర్వాత తీవ్రంగా గుండెపోటు రావడంతో కుప్పకూలిపోయారని వివరించారు. వెంటనే నాగర్‌కర్నూల్‌లోని ప్రైవేటు ఆస్పత్రికి, అక్కడి నుంచి హైదరాబాద్ గచ్చిబౌలి కేర్ ఆస్పత్రికి తరలించగా అప్పటికే మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారని తెలిపారు.

తరలివచ్చిన ప్రముఖులు

గురువారం తెల్లవారుజామునే మంత్రి హరీశ్‌రావు, ఎంపీ సంతోష్, ఎమ్మెల్యే బాల్క సుమన్ సహా పలువురు నేతలు కేర్ ఆస్పత్రికి చేరుకున్నారు. 'లే సాయి.. మీటింగ్ ఉంది' అంటూ మంత్రి హరీశ్‌రావు సాయిచంద్‌ను తట్టి లేపుతూ కన్నీటిపర్యంతమయ్యారు. ఉదయం 8.30 గంటలకు సాయిచంద్ మృతదేహాన్ని గుర్రంగూడ ప్రాంతంలోని నివాసానికి తరలించారు. మంత్రులు కేటీఆర్, తలసాని, ఎర్రబెల్లి, శ్రీనివాస్‌గౌడ్, నిరంజన్‌రెడ్డి, సబితా ఇంద్రారెడ్డి, వేముల ప్రశాంత్‌రెడ్డి, జగదీశ్‌రెడ్డి, కొప్పుల ఈశ్వర్, మహమూద్ అలీ, మాజీ మంత్రి ఈటల రాజేందర్, నాగం జనార్దనరెడ్డి, ఎంపీలు రంజిత్‌రెడ్డి, రాములు, ఎమ్మెల్సీలు పల్లా రాజేశ్వర్‌రెడ్డి, గోరటి వెంకన్న, కసిరెడ్డి నారాయణరెడ్డి, ఎమ్మెల్యేలు సుధీర్‌రెడ్డి, నోముల భగత్, ముత్తిరెడ్డి యాదగిరిరెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, ప్రజా గాయకులు విమలక్క, గద్దర్, ప్రొఫెసర్ కోదండరాంతోపాటు పెద్ద సంఖ్యలో నేతలు, ప్రజాసంఘాల నాయకులు సాయిచంద్ భౌతిక కాయాన్ని సందర్శించి నివాళులు అర్పించారు.

కంటతడి పెట్టిన సీఎం కేసీఆర్

మధ్యాహ్నం సీఎం కేసీఆర్ సాయిచంద్ నివాసానికి చేరుకున్నారు. ఈ సమయంలో సాయిచంద్ సతీమణి రజని.. ''సాయిని పిలవండి సార్.. మీరు పిలిస్తే లేచి వస్తాడు సార్'' అంటూ విలపించింది. ఈ సమయంలో ఆమెను ఓదార్చుతూ సీఎం కేసీఆర్ కూడా కంట తడిపెట్టారు. ఆ కుటుంబానికి అన్ని విధాలా అండగా ఉంటామని హామీ ఇచ్చారు.

అశ్రునయనాల మధ్య అంతిమ యాత్ర

సాయిచంద్ భౌతికకాయానికి మధ్యాహ్నం రెండున్నర నుంచి అంతిమయాత్ర నిర్వహించారు. గుర్రంగూడ నుంచి సాహెబ్‌నగర్ శ్మశానవాటిక వరకు పెద్ద సంఖ్యలో కళాకారులు, అభిమానులతో యాత్ర సాగింది. అక్కడ సాయిచంద్ తండ్రి వెంకట్రామయ్య తన మనవడిని ఎత్తుకుని కుమారుడి చితికి నిప్పంటించారు.

ప్రముఖుల సంతాపం

సాయిచంద్ మృతిపట్ల స్పీకర్ పోచారం, మండలి చైర్మన్ గుత్తా, మంత్రులు కేటీఆర్, హరీశ్‌రావు సంతాపం తెలిపారు. తన పాటల రూపంలో సాయిచంద్ చిరకాలం అందరి గుండెల్లో ఉంటారని పేర్కొన్నారు. ఎమ్మెల్సీలు కవిత, మధుసూదనాచారి, దేశపతి శ్రీనివాస్, ఎంపీ వద్దిరాజు రవిచంద్ర, రాష్ట్ర ప్రణాళికా సంఘం వైస్ చైర్మన్ బోయినపల్లి వినోద్‌కుమార్, టీపీసీసీ చీఫ్ రేవంత్‌రెడ్డి, ఎంపీ కోమటిరెడ్డి వెంకటరెడ్డి, తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ తదితరులు సంతాపం వ్యక్తం చేశారు.

గొప్ప కళాకారుడిని కోల్పోయాం

సాయిచంద్ మృతి దిగ్భ్రాంతి కలిగించింది. ఉద్యమ కాలంలో ఆయన పాటలు లేకుండా సభలు సాగేవి కాదు. ఓ గొప్ప కళాకారున్ని కోల్పోయాం. వారి కుటుంబానికి అండగా ఉంటాం. – సీఎం కేసీఆర్

ధూంధాంలతో ఆకట్టుకుని..

ఎస్సీ సామాజిక వర్గానికి చెందిన సాయిచంద్ చిన్నతనంలోనే తల్లి మరణించింది. దీనితో మేనత్త సంరక్షణలో పెరిగారు. తండ్రి అరుణోదయ సంస్థలో పనిచేస్తుండటంతో.. తానూ ఆ బాటపట్టి గాయకుడిగా మారారు. హైదరాబాద్‌లో చదువుకునే సమయంలో పీడీఎస్‌యూ, అరుణోదయ కార్యక్రమాల్లో పాల్గొన్నారు. ఈ క్రమంలో సహ విద్యార్థిని రజనీరెడ్డిని ప్రేమించి పెళ్లి చేసుకున్నారు. అనంతర కాలంలో తెలంగాణ ఉద్యమ పాటలతో ఎదిగారు. ఆ సమయంలో జరిగిన సభలు, ధూంధాం కార్యక్రమాల్లో సాయిచంద్ పాటలు ఆకట్టుకున్నాయి. రాష్ట్ర అవతరణ తర్వాత కేసీఆర్ సభల్లో ఆయన పాట ప్రత్యేక ఆకర్షణగా నిలిచేది. సాయిచంద్ గత లోక్‌సభ ఎన్నికల్లో నాగర్‌కర్నూల్ నుంచి ఎంపీ టికెట్ ఆశించినా అవకాశం రాలేదు. తర్వాత ఎమ్మెల్సీ పదవి ఇస్తారన్న ప్రచారం జరిగినా.. 2021 డిసెంబర్‌లో రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ పదవి ఇచ్చారు. ఇంతకుముందు 2010లోనే ధూంధాం సభా వేదికపై సాయిచంద్ గుండెపోటుకు గురైనా తర్వాత కోలుకున్నారు. కానీ ఇప్పుడు బయటపడలేకపోయారు.

సురక్షిత తాగునీటిలో తెలంగాణ టాప్

▶ మొదటి పేజీ తరువాయి

నివేదిక చెబుతోంది. దేశంలో ఇప్పటివరకు సగటున 62.84 శాతం మందికి ఇంటింటికీ తాగునీటి వసతి ఉందని తెలిపింది.

దేశంలో డయేరియా మరణాలు 6 లక్షలు..

దేశంలో డయేరియా, ఇన్ఫెక్షన్లు, మలేరియా, డెంగీ, శ్వాసకోశ సంబంధిత రోగాల వల్ల ప్రతీ ఏడాది లక్షకు 40–70 మంది వరకు మరణిస్తున్నారని డబ్ల్యూహెచ్‌వో వేదిక వివరించింది. ఈ మరణాల్లో ఐదేళ్లలోపువారే 60 శాతం ఉంటారని పేర్కొంది. తాగునీరు సరిగా లేకపోవడం, పారిశుధ్యం సక్రమంగా నిర్వహించకపోవడం, చేతి శుభ్రత పాటించకపోవడం వల్ల డయేరియా మరణాలు ఎక్కువగా ఉంటున్నాయి. 2019 లెక్కల ప్రకారం డయేరియాతో దేశవ్యాప్తంగా 6.07 లక్షల మంది చనిపోతున్నారు. అందులో తాగునీరు సరిగా లేకపోవడం వల్ల సంభవించే డయేరియా మరణాలు 2,03,863 ఉన్నాయి. ఇందులో మహిళలే 1,23,964 మంది ఉన్నారు. ఐదేళ్లలోపు వారు 20,045 మంది ఉన్నారు. ఇక పారిశుధ్యం సరిగా లేకపోవడం వల్ల సంభవించే డయేరియాతో 2,44,287 మంది చనిపోతున్నారు. అందులో మహిళలు 1.48 లక్షల మంది ఉన్నారు. ఐదేళ్లలోపు వారు 24,020 మంది ఉన్నారు. ఇక చేతి శుభ్రత సరిగా లేకపోవడం వల్ల సంభవించే డయేరియా మరణాలు ఏడాదికి 1,59,015 ఉంటున్నాయని ప్రపంచ ఆరోగ్య సంస్థ నివేదిక వివరించింది. అందులో 96,694 మంది మహిళలుండగా, ఐదేళ్లలోపు వారు 15,635 మంది ఉన్నారు. ఇదిలావుంటే 51,740 మంది చేతి శుభ్రత సరిగా లేకపోవడం వల్ల శ్వాసకోశ వ్యాధులతో చనిపోతున్నారని ఆ వేదిక పేర్కొంది.

నివేదికలోని ముఖ్యాంశాలు..

- పరిశుభ్రమైన నీరు, పరిసరాలు శుభ్రంగా ఉంచకపోవడం, చేతి శుభ్రత పాటించకపోతే సాంక్రమిక వ్యాధులు వస్తాయి. దీర్ఘకాలిక వ్యాధులు, మలేరియా, డెంగీ వంటివి వస్తాయి. ఆసుపత్రుల్లోనూ ఇన్ఫెక్షన్లు వస్తాయి.
- తాగునీటిలో ఫ్లోరైడ్ ఎక్కువగా ఉంటే జబ్బులు వస్తాయి.
- డయేరియా కారణంగా పిల్లలు బడికి వెళ్లే అవకాశాలు తగ్గుతాయి. ప్రజల పని తీరులోనూ మార్పులు వస్తాయి. ఆసుపత్రులకు వెళ్లే పరిస్థితి పెరుగుతుంది.
- చేతి శుభ్రత లేకపోతే కరోనా వంటి వైరస్‌లు వస్తాయి. తాగునీరు సరిగా లేకపోవడం వల్ల రక్తహీనత కూడా సంభవిస్తుంది.
- ప్రపంచంలో 56 శాతం జనాభాకు మాత్రమే ఇంటి వద్ద సురక్షితమైన తాగునీరు అందుబాటులో ఉంది. ఆఫ్రికాలో 9 శాతం, యూరప్‌లో 62 శాతం మాత్రమే సురక్షిత తాగునీరు అందుబాటులో ఉంది. ఇది దక్షిణాసియా దేశాల్లో 27 శాతమే ఉంది. ● వాగులు వంకల్లో నీటిని తాగే వారితో పోలిస్తే శుద్ధి చేసిన ఇంటి వద్దే అందుబాటులో ఉన్న నీటిని తాగడం వల్ల డయేరియా కేసుల సంఖ్య 52 శాతం తగ్గుతుంది.

మీరు మీ ప్రార్థనలలో అల్లాహ్‌పై ఎక్కువ దృష్టి పెట్టాలనుకుంటే,
మీ ప్రార్థనల వెలుపల ఆయనపై ఎక్కువ ధ్యాసగా ఉండండి.
– ఇస్లాం ధర్మం

సాక్షి

శుక్రవారం, 30 జూన్ 2023

ఉన్నతశ్రేణి విద్య మిథ్యేనా?!

ఒకప్పుడు ప్రపంచానికి నలందా, తక్షశిలవంటి అత్యుత్తమ శ్రేణి విద్యాకేంద్రాలను అందించి, విశ్వమంతటా విజ్ఞాన కాంతులు వెదజల్లిన భారత్ చాన్నాళ్లుగా విద్యారంగంలో వెలవెలబోతోందన్న అసంతృప్తి ఉంది. ప్రతిష్ఠాత్మక క్యూఎస్ ప్రపంచ యూనివర్సిటీ ర్యాంకింగ్స్ తాజా జాబితాలో మొదటి 150లో మన దేశానికి చోటుదక్కింది. అంతర్జాతీయంగా చూస్తే ఇదేమంత గొప్ప ర్యాంకు కాకపోవచ్చు. వినడానికి కాస్త ఇబ్బందిగా కూడా ఉండొచ్చు. ఎందుకంటే ప్రపంచ శ్రేణి విద్యాసంస్థలనదగ్గ 1,500 విశ్వవిద్యాలయాల జాబితాను ఆ సంస్థ ప్రకటిస్తే మొదటి పదిలో, కనీసం మొదటి యాభైలో, పోనీ... మొదటి వందలో మన విద్యాసంస్థలేవీ లేవు. బొంబాయి ఐఐటీ ఈ జాబితాలో 149వ స్థానాన్ని పొందగలిగింది. ఆ సంస్థకు ఈ స్థాయి గౌరవం దక్కటం ఎనిమిదేళ్ల తర్వాత ఇదే ప్రథమం. బెంగళూరు ఐఐఎస్‌సీ తొలి 200 ర్యాంకుల్లో స్థానం దక్కించుకోలేకపోగా, మద్రాస్ ఐఐటీ నిరుడున్న 174వ స్థానాన్ని చేజార్చుకుని 197కి పోయింది. దాన్ని బట్టి మన ఉన్నత విద్యాకేంద్రాల తీరుతెన్నులెలా ఉన్నాయో సులభంగానే గ్రహించవచ్చు. ఏటా రివాజుగా క్యూఎస్ ర్యాంకులు ప్రకటించటం, అందులో మన యూనివర్సిటీలు ఎక్కడో అట్టడుగున ఉండటం అనేకులను బాధిస్తోంది.

ప్రపంచం మొత్తంలో 30,000 వరకూ విశ్వవిద్యాలయాలున్నాయి. క్యూఎస్ సంస్థ ఏటా అందులో అత్యుత్తమంగా భావించిన 5 శాతాన్ని... అంటే 1,500 యూనివర్సిటీలను ఎంపిక చేసుకుని వాటి వాటి అర్హతల ఆధారంగా ర్యాంకులు ఇస్తుంది. జీవితంలో ఎదగాలన్న తపన, తాపత్రయం ఉన్నవారు...తమ జ్ఞాన తృష్ణ తీర్చుకోవటానికి అనువైన విద్యాకేంద్రం కోసం అన్వేషిస్తున్నవారు మెరుగైన విశ్వవిద్యాలయం కోసం వెదుకులాడతారు. ప్రపంచం ఇంతగా ఎదిగినా, బహుళ రంగాల్లో అభివృద్ధి సాధించినా అత్యుత్తమ శ్రేణి సంస్థను ఎంపిక చేసుకోవటం ఏ విద్యార్థికైనా అంత సులభం కాదు. ఎందుకంటే ప్రతి విశ్వవిద్యాలయమూ తమ దగ్గరున్న అధ్యాపక బృందం గురించి, తమ బోధనాంశాల తీరుతెన్నుల గురించి, పరిశోధనలకు అందే ప్రాధాన్యత గురించి స్వోత్కర్షలకు పోతుంది. కానీ తటస్థ సంస్థలు నిర్దిష్టమైన గీటురాళ్లు రూపొందించుకుని వాటి మంచిచెడ్డలను చెప్పగలిగితే విద్యార్జన కోసం తాపత్రయపడే యువతకు ఎంపిక సులభమవుతుంది. అంతేకాదు...ఈ తులనాత్మక విశ్లేషణ పరిశోధన కోసం తపించే విద్యార్థులకూ, విధాన నిర్ణేతలకూ కూడా సాయపడుతుంది. విధానపరమైన నిర్ణయాల కోసం చేసే అధ్యయనంలో ఏ విశ్వవిద్యాలయం తోడ్పాటు తీసుకోవచ్చునో, నిధుల విడుదలలో ఏ సంస్థకు ప్రాధాన్యం ఇవ్వాలో విధాన నిర్ణేతలు నిర్ణయించుకుంటారు. ప్రైవేటు రంగ పరిశ్రమలకు కూడా ఈ ర్యాంకింగ్‌లే ఆధారం. క్యూఎస్ సంస్థ ఆ పని చేస్తోంది. ఈనెల మొదటివారంలో కేంద్ర విద్యా మంత్రిత్వ శాఖకు అనుబంధంగా ఉండే ఎన్ఐఆర్ఎఫ్ అత్యుత్తమ శ్రేణి విద్యాసంస్థల జాబితాను విడుదల చేసింది. అందులో విశ్వవిద్యాలయాల్లో బెంగళూరులోని ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ సైన్స్ ప్రథమ స్థానం పొందగా, ఢిల్లీ జవహర్‌లాల్ నెహ్రూ యూనివర్సిటీ రెండో స్థానంలో, అక్కడి జమియా మిలియా ఇస్లామియా మూడో స్థానంలో నిలిచాయి. హైదరాబాద్ కేంద్రీయ విశ్వవిద్యాలయం పదో ర్యాంకులో ఉంది. అలాగే ఐఐటీల్లో మద్రాస్ ఐఐటీ ప్రథమ స్థానంలో, బొంబాయి ఐఐటీ ద్వితీయ స్థానంలో ఉన్నాయి.

అయితే అంతర్జాతీయ ర్యాంకింగ్‌ల విషయంలో విమర్శలు కూడా ఉన్నాయి. విశ్వవిద్యాలయాల్లో సాగే పరిశోధనలు, ఆ సంస్థల పేరుప్రఖ్యాతులు, అక్కడుండే విద్యార్థి–అధ్యాపక నిష్పత్తి, అంతర్జాతీయ వైవిధ్యత తదితరాలను క్యూఎస్ వంటి సంస్థలు గీటురాళ్లుగా తీసుకుంటున్నాయి. సహజంగానే ఈ అంశాలన్నిటా సంపన్న దేశాల్లోని విశ్వవిద్యాలయాలే ముందంజలో ఉంటాయి. వాటికి అటు ప్రభుత్వాలనుంచీ, ఇటు ప్రైవేటు సంస్థలనుంచీ నిధులు దండిగా వస్తాయి. వెనకబడిన దేశాల్లోని విశ్వవిద్యాలయాల్లో అత్యుత్తమ శ్రేణి అధ్యాపకులున్నా, అక్కడ మెరికల్లాంటి విద్యార్థులు రూపొందుతున్నా క్యూఎస్ సంస్థకు పట్టవు. అందువల్లే ఇలాంటి జాబితాల విశ్వసనీయతపైనా, వాటి కచ్చితత్వంపైనా విద్యారంగ నిపుణులు పెదవి విరుస్తుంటారు. ఈ విమర్శలను పరిగణనలోకి తీసుకుని కాబోలు... విద్యాసంస్థల నిర్వహణ, పరిశోధనలకుండే అంతర్జాతీయ నెట్‌వర్క్, అక్కడి విద్యార్థులకు లభించే ఉద్యోగావకాశాలు అనే అంశాలను ఈసారి చేర్చింది. ఏ మాటకు ఆ మాటే చెప్పుకోవాలి. మన దేశంలో ఉన్నత విద్యారంగాన్ని గత మూడు దశాబ్దాలుగా ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేశాయి. పూర్తికాలం పనిచేసే అత్యుత్తమ అధ్యాపకులను ఎంపిక చేయటానికి, అవసరమైన నిధులు కేటాయించి విశ్వవిద్యాలయాలను తీర్చిదిద్దటానికి పాలకులు ముందుకు రావటం లేదు. ఖాళీ అవుతున్న స్థానాల్లో కాంట్రాక్టు లెక్చరర్లను నియమించి చేతులు దులుపుకుంటున్నారు. మన విశ్వవిద్యాలయాలకు ప్రపంచశ్రేణి గుర్తింపు తీసుకురావాలంటే ఎలాంటి చర్యలు తీసుకోవాలో సూచించడానికి మాజీ ఎన్నికల ప్రధాన కమిషనర్ ఆధ్వర్యంలో 13 మందితో నిపుణుల కమిటీని ఏర్పాటుచేశారు. ఆ తర్వాత ప్రభుత్వ రంగంలో పది, ప్రైవేటు రంగంలో పది ఉన్నత విద్యాసంస్థలను ఆ కమిటీ ఎంపిక చేసింది. వాటికి తలో వందకోట్లు నిధులిస్తున్నామని కూడా ప్రకటించారు. అయితే క్యూఎస్ ఎంపిక చేసిన జాబితాలో ఒక్క బొంబాయి ఐఐటీ మాత్రమే ఆ మాత్రమైనా స్థానం సంపాదించుకోగలిగింది. ర్యాంకింగ్‌ల సంగతలావుంచి మన ఉన్నత విద్యారంగాన్ని ప్రక్షాళన చేయాల్సిన అవసరమైతే ఉంది. ఆ దిశగా చర్యలకు ఉపక్రమిస్తే భావి తరాలు ఉన్నత స్థాయికి ఎదుగుతాయి. మన దేశానికి మళ్లీ గత వైభవం సాధ్యమవుతుంది.

చైనాను నమ్మలేం... అప్రమత్తతే రక్ష!

విశ్లేషణ



అవినాష్ కోల్హే

2020 జూన్ 15, 16 తేదీలలో జరిగిన గాల్వాన్ ఘర్షణ 21వ శతాబ్దంలో భారత్–చైనా సంబంధాలలో మూలమలుపు లాంటిది. ఈ ఘటనతో భారత్ చేదు పాఠం నేర్చుకుంది. ఈ సున్నితమైన సరిహద్దు పోస్ట్‌లలో పెట్రోలింగ్‌కు ఎక్కువ మంది సిబ్బందిని నియమించింది. ఇప్పుడు సరిహద్దులో ఐదు పాయింట్ల వద్ద ఇరు సైనికుల ఉనికి లేదు. ఈ ప్రదేశాలలో సైనికరహిత బఫర్ జోన్‌లను ఏర్పాటు చేశారు. కానీ ఈ బఫర్ జోన్‌లు సరికొత్త వివాదానికి తెర తీశాయి. ఇలా బఫర్ జోన్‌లకు అంగీకరించడమంటే భారత్ తన భూభాగాన్ని కోల్పోవడమే తప్ప మరొకటి కాదని భారత వ్యూహాత్మక సంస్థ పేర్కొనడం గమనార్హం. ఈ పరిస్థితుల్లో రెండు దేశాలూ సరిహద్దుల సమీపంలో మౌలిక సదుపాయాలు మెరుగుపర్చుకోవటం ఆందోళనకరం.

భారతదేశం, అమెరికా, చైనా అంతర్జాతీయ యవనికపై మూడు ముఖ్యమైన పాత్రధారులు. వీటి ఆసక్తులు పరస్పరం లోతుగా పొందుపర్చుకుని ఉన్నాయి. ఈ వాస్తవం క్రమానుగత వ్యవధిలో ఇతరులతో పోలిస్తే వారి ఎంపికలను తూకం వేసి చూసుకునేలా వారిని బలవంతం చేస్తోంది. ఇండో–పసిఫిక్ ప్రాంతంలో చైనా ఎదుగుదలకు చెక్ పెట్టేందుకు అమెరికా ఆసక్తితో ఉంది. కాగా, భారతదేశం చైనాతో 4000 కిలోమీటర్ల పొడవైన సరిహద్దును, దాంతోపాటు 61 ఏళ్ల సరిహద్దు వివాదాన్ని పంచుకుంటోంది. ఇక చైనా విషయానికి వస్తే 2049 నాటికి నంబర్ వన్ అగ్రరాజ్యం కావాలని కోరుకుంటోంది. అది జననేత మావో సేటుంగ్ నేతృత్వంలో చైనాలో కమ్యూనిస్టు విప్లవం విజయం పొందిన శతాబ్ది సంవత్సరం మరి.

ఆసియాలో చైనాకు ప్రత్యక్ష పొరుగు దేశమైన భారతదేశం, చైనా ప్రాదేశిక ఆకాంక్షల గురించి ఎల్లప్పుడూ ఆందోళన చెందుతూ ఉంది. ఇన్ని దశల చర్చలు జరిగినా నేటికీ భారత్–చైనా సరిహద్దు వివాదం పరిష్కారమయ్యే సూచనలు కనిపించడం లేదు. మూడేళ్ల క్రితం గాల్వాన్ ప్రాంతంలో చైనాతో భారత్‌కు తీవ్ర వైరం ఏర్పడింది. ఇటీవల 2023 జూన్‌లో గాల్వాన్ ప్రతిష్టంభన మూడవ వార్షికోత్సవం సందర్భంగా, చాలామంది పండితులు, మాజీ దౌత్యవేత్తలు... దురాశాపూరిత చైనా పట్ల ఎప్పటికీ అప్రమత్తంగా ఉండాలని భారత ప్రభుత్వాన్ని హెచ్చరించారు.

1950ల నాటి నుండి భారత్ – చైనా సరిహద్దు వివాదం ప్రజ్వరిల్లుతోంది. 'హిందీ–చినీ భాయ్ భాయ్' అని భారత ప్రజలు నినదిస్తున్న వేళ, భారత భూభాగాల్లోకి చైనా సైనికులు కవాతు చేస్తున్నప్పుడు మనదేశం ఆకస్మాత్తుగా మేల్కొంది. భారత సైన్యం చవిచూసిన ఘోర పరాభవం ఇది. అప్పటి నుండి సరిహద్దు వివాదాన్ని పరిష్కరించడానికి లెక్కలేనన్ని ప్రయత్నాలు, చర్చలు జరిగాయి. కానీ ఫలించలేదు.

ఇక 2020 జూన్ దగ్గరకు వద్దాం. వాస్తవ నియంత్రణ రేఖ వద్ద ఉన్న గాల్వాన్ లోయలో చైనా సైన్యం చేతిలో 20 మంది భారతీయ సైనికులు మరణించారు. చైనా సేనలను తమ ట్రాక్‌లో నిలిపివేసినప్పటికీ, వారు యథాతథ స్థితితో సంతోషంగా లేరనీ, తమకు అనుకూలమైన మార్పు కోసం ఆసక్తిగా ఉన్నారనీ చైనా వైపు నుండి సందేశం స్పష్టంగా కనబడుతోంది. 2020లో అవకాశాన్ని కోల్పోయినప్పటికీ, వారు తమ ప్రణాళికను కచ్చితంగా వదులుకున్నారని దీని అర్థం కాదు. సరిహద్దు సమస్యను చైనా ఎప్పటికప్పుడు లేవనెత్తుతోంది. 2022 డిసెంబర్ లో, చైనా తవాంగ్‌లో ఒక ఫార్వర్డ్ పోస్ట్‌ను ప్రారంభించింది. కానీ ఈ ప్రయత్నాన్ని కూడా భారతీయ సైనికులు అడ్డుకున్నారు.



2020 జూన్ 15, 16 తేదీలలో జరిగిన గాల్వాన్ ఘర్షణ 21వ శతాబ్దంలో భారత్–చైనా సంబంధాలను మూలమలుపు తిప్పిన ఘటన. నిజానికి ఇరు దేశాల సైనికులు పరస్పరం ఘర్షణ పడడం ఇదే తొలిసారి. 1975 అక్టోబరులో చివరగా వాస్తవిక ఘర్షణ జరిగింది. ఆయుధాల వినియోగ నిషేధ ఒప్పందం ఒకటి భారత్, చైనాల మధ్య ఉంది. గాల్వాన్‌లో చైనా సైనికులు మేకులున్న కర్రలను ఉపయోగించారు. భారతీయులు ఫైబర్‌గ్లాస్ లాఠీలతో ప్రతిస్పందించారు. కొన్ని సందర్భాల్లో రాళ్లను కూడా ఉపయోగించారు. భారతీయుల కంటే చైనీయులు ఎక్కువ మంది సైనికులను కోల్పోయారని కొన్ని స్వతంత్ర నివేదికలు నొక్కి చెప్పాయి. ఈ ఘటనతో భారత్ చేదు పాఠం నేర్చుకుంది. ఈ సున్నితమైన పోస్ట్‌లలో పెట్రోలింగ్‌కు ఎక్కువ మంది సిబ్బందిని నియమించింది కూడా! ఇప్పుడు ఐదు పాయింట్ల వద్ద ఇరు సైనికుల ఉనికి లేదు. ఈ ప్రదేశాలలో సైనికరహిత బఫర్ జోన్‌లు ఏర్పాటయ్యాయి. కానీ ఈ బఫర్ జోన్‌లు కొత్త వివాదాస్పద అంశంగా మారాయి. వీటి ఏర్పాటుకు ఒప్పుకోవడం అంటే భారత్ తన భూభాగాన్ని కోల్పోవడమే తప్ప మరొకటి కాదని భారత వ్యూహాత్మక సంస్థ పేర్కొనడం ఇక్కడ గమనార్హం.

ఇది చాలదన్నట్లు సైనికులనూ, సైనిక సామగ్రినీ సులభంగా తరలించడానికి చైనా తన వైపు రెండు వంతెనలను కలిగి ఉన్న ప్రాంతంలో మౌలిక సదుపాయాలను నిర్మించడంలో బిజీగా ఉంది. భారతదేశం కూడా రోడ్లు, వంతెనలు, సొరంగాలు, హెలిప్యాడ్‌లు వంటివి ఉన్న తన భూభాగం వైపున మౌలిక సదుపాయాలను మెరుగుపరుస్తోంది. ఏదేమైనప్పటికీ, ఇది ఈ ప్రాంతంలో శాంతికి శుభసూచన కాదు.

ఇంత ఘర్షణపూరిత వాతావరణం ఉన్నప్పటికీ, చైనా–భారత్‌ల మధ్య వాణిజ్యం వృద్ధి చెందుతోంది. భారతదేశం హిమాలయ పొరుగు దేశం నుండి ఎక్కువగా దిగుమతి చేసుకుంటోంది. భారత – చైనా బంధం విషయంలో ఎల్లప్పుడూ నిరంతర పరిశీలన అవసరమని భారత నాయకులు గమనించాలి. చైనా తన వ్యూహాత్మక ప్రయోజనాలకు, దీర్ఘకాలిక ఆకాంక్షలకు సరిపోయే దానికంటే తక్కువగా దేనితోనూ సమాధానపడదని గుర్తుంచుకోవాలి.

21వ శతాబ్దంలో, అమెరికా కూడా చైనా ఎదుగుదల, దాని ఆకాంక్షల గురించి ఆందోళన చెందుతోంది. పైగా చైనాను సవాలు చేయడానికి భారతదేశాన్ని తన విలువైన భాగస్వామిగా చూస్తోంది. అందుకే ఇటీవలే అమెరికా పర్యటనకు వెళ్లిన మోదీకి అమెరికా ఎర్ర తివాచీ పరిచింది. జపాన్ లాగా, ఇప్పుడు భారతదేశం... అమెరికా వ్యూహాత్మక చింతనలో ముఖ్యమైన స్థానాన్ని పొందింది. ఒబామా వైట్‌హౌస్‌లో ఉన్న రోజుల నుండి, యూఎస్–ఇండియా సంబంధాల సంగతి '21వ శతాబ్దాన్ని నిర్వచించే సంబంధాల'లో ఒకటిగా అమెరికా మాట్లాడుతోంది. 2023 జూన్ మొదటి వారంలో, అమెరికా రక్షణ కార్యదర్శి లాయిడ్ ఆస్టిన్ ఢిల్లీలో ఉన్నారు. ఆయన 2016 నుండి అమెరికా 'ప్రధాన రక్షణ భాగస్వామి'గా ఉంటున్న భారతదేశం గురించి మాట్లాడారు. 'క్వాడ్' సభ్యులందరిలో, చైనాతో భారీ భూ–సరిహద్దు కలిగి ఉన్న ఏకైక దేశం భారతదేశం మాత్రమే అని అమెరికా ప్రభుత్వ యంత్రాంగానికి బాగా తెలుసు. 2023 జూన్ మొదటి వారంలో దాని 20వ ఎడిషన్‌ను ముగించిన వార్షిక 'షాంగ్రి–లా డైలాగ్'... ఆసియాలో మారుతున్న ఈ ధోరణులను గుర్తించింది. అయితే భారతదేశం ఈ ప్రాంతంలో యూఎస్ క్లయింట్ స్టేట్‌గా ఉండలేదు. లేదా దిగ్గజ చైనాపై ఒక స్థాయికి మించి భారత్ ఆగ్రహం ప్రదర్శించలేదు. దూకుడుకు, అతివాగుడుకు చోటు లేని ఉన్నత స్థాయి దౌత్య నైపుణ్యం దీనికి అవసరం.

చైనాతో సంబంధాలు భారతదేశంలో అంతర్–పార్టీ స్పర్థ కోణాన్ని జోడించాయి. 1962 అక్టోబరులో చైనా భారతదేశంపై దాడి చేసినప్పుడు, బీజేపీని అసహ్యించుకునే పండిట్ నెహ్రూ నేతృత్వంలోని కాంగ్రెస్ అధికారంలో ఉండేది. కాబట్టి నెహ్రూను ఢీకొట్టే ఒక్క అవకాశాన్ని కూడా కాషాయ పార్టీ వదులుకోదు. ఇప్పుడు కాంగ్రెస్ ప్రతిపక్షంలో ఉంటూండగా, బీజేపీ అధికారంలో ఉంది. ఈ 2023 జూన్ 20వ తేదీ సోమవారం, వాస్తవ నియంత్రణ రేఖ వెంబడి చైనాతో సరిహద్దు పరిస్థితిపై కాంగ్రెస్ శ్వేతపత్రాన్ని డిమాండ్ చేయడంలో ఆశ్చర్యం లేదు. 2020 జూన్ 19 నాటి అఖిలపక్ష సమావేశంలో 'ఎవరూ మన సరిహద్దులోకి ప్రవేశించలేదు లేదా ఏ సరిహద్దు ప్రాంతం కూడా ఇతరుల అధీనంలో లేదు' అని మోదీ చేసిన వ్యాఖ్య లను తరచుగా ప్రస్తావించడం ద్వారా ప్రధానిని మరింత ఇబ్బంది పెట్టాలని కాంగ్రెస్ కోరుకుంటోంది. అవన్నీ పక్కన పెడితే, చైనాను నిరంతరం పరిశీలిస్తూండటం మనకు ఎంతో అవసరం. భారత్ అప్రమత్తంగా మెలుగుతూ ఉండాలి.

వ్యాసకర్త రిటైర్డ్ ప్రొఫెసర్, ముంబయ్

సోషల్ మీడియా

సోషల్ నెట్ వర్కింగ్ వెబ్‌సైట్లు ఫేస్‌బుక్, ట్విట్టర్‌లలో సెలబ్రిటీల 'మనసులోని మాట'లు తాజాగా ఇలా...!

వెళ్లడు.. వెళ్లనివ్వడు!!



మణిపూర్‌లో అల్లర్లు జరిగిన చురాచాంద్‌పూర్‌ను సందర్శించకుండా రాహుల్‌ను అడ్డుకోవడం మోదీ నిరంకుశత్వానికి నిదర్శనం. శాంతిని నెలకొల్పడం రాహుల్ ఉద్దేశం. రాష్ట్రాన్ని సందర్శించే తీరిక మోదీకి లేకపోవడం దురదృష్టకరం. – వి. నారాయణసామి, పుదుచ్చేరి మాజీ సీఎం

ఫోన్‌పే పోస్టర్‌లు




మధ్యప్రదేశ్ సీఎం శివరాజ్‌సింగ్‌ను లక్ష్యంగా చేసుకుని తమ లోగోను వాడడంపై ఫోన్‌పే సంస్థ కాంగ్రెస్ పార్టీ పట్ల అభ్యంతరం వ్యక్తం చేసింది. అయితే.. కొద్దిరోజుల క్రితం రాష్ట్ర కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు కమల్‌నాథ్‌పై వచ్చిన ఇదే తరహా పోస్టర్‌కు తాజా పోస్టర్ ప్రతిస్పందన అని ఫోన్‌పే దృష్టికి నిజంగా రాలేదా?! – అమిత్ బిష్ణోయ్, టెక్నోఫైల్

వద్దు.. కదిలించొద్దు



ప్రతిపక్షాలు ముస్లింలను రెచ్చగొడుతున్నాయని మోదీ ఆరోపిస్తున్నారు! ఉమ్మడి పౌర స్మృతిని అమలులోకి తెచ్చేందుకు ఆయన మళ్లీ ప్రయత్నాలు మొదలు పెట్టడం మాత్రం రెచ్చగొట్టడం కాదా? తిరిగి ఎందుకు ఆయన ఈ తేనె తుట్టెను కదిలిస్తున్నారు? 2024 ఎన్నికల కోసమేనా?! – కపిల్ సిబల్, ఎంపీ

అంతులేని కథ



నీటి అడుగున గోవా స్మార్ట్ సిటీ పణజి! నిరంతరంగా రోడ్లు తవ్వడం, వెర్రెత్తినట్లుగా భవన నిర్మాణం... దేశంలోనే అత్యంత సమ్మోహన నగరాలలో ఒకటైన పణజిని నాశనం చేస్తున్నాయి. ఆ మాటకొస్తే.. వర్షాకాలంలో ఇది దేశమంతటా కనిపించే దృశ్యమే. – రాజ్‌దీప్ సర్దేశాయ్, జర్నలిస్ట్

కీలకమైన పాత్ర



మా గణాంకాలు పైకి సంఖ్యల్లా కనిపించవచ్చు, కానీ అవి విధాన నిర్ణయాల రూపకల్పనకు తోడ్పడతాయి. జాతీయ గణాంకాల దినోత్సవం సందర్భంగా.. మెరుగైన భవిష్యత్తును అందించడంలో గణాంకాలు పోషిస్తున్న పాత్రను గుర్తు చేసుకుందాం. – ప్రీతేశ్ పటేల్, ఎ.పి.ఎం.సి. ఛైర్మన్

ఇన్‌బాక్స్

అతడు నిరంతర కృషీవలుడు!

వలేటి గోపీచంద్ వ్యక్తిగా, ఉద్యోగిగా ఈ సమాజానికి ఎంతో సేవ చేశారు. తాను చదువుకున్న బాపట్ల వ్యవసాయ కళాశాల పట్ల అవ్యాజమైన అభిమానం ఉన్న గోపీచంద్ దాని చరిత్రపై పరిశోధన చేసి విలువైన సమాచారం వెలికి తీశారు.

1945లో కళాశాల ప్రారంభం నుంచి ఇటీవలి కాలం వరకు అన్ని బ్యాచ్‌ల గురించి వివరాలతో కాఫీ టేబుల్ బుక్ 'ఒక నేల, అనేక ఆకాశాలు' అత్యంత ఆకర్షణీయంగా వెలువరించారు. చరిత్రను తవ్వి కళాశాలను జులై 16న ఉమ్మడి మద్రాస్ గవర్నర్ సలహాదారు ఎస్‌వీ రామ్మూర్తి ప్రారంభించారనీ, అప్పటి వ్యవసాయ సంచాలకులు బీవీ నాథ్, గుంటూరు జిల్లా బోర్డు అధ్యక్షులు పీవీ కృష్ణయ్య చౌదరి సహకారం అందించారనీ ఈనాటి తరానికి ఈ పుస్తకం తెలియచేసింది. బాపట్లలోనే ఎందుకు పెట్టారు అని కారణం వెతికి ఆ రోజుల్లో 'బాపట్ల సిటిజెన్స్ కమిటీ' కృషిని వెలుగులోకి తెచ్చారు. అంతటితో ఆగకుండా, ఆంధ్ర ప్రదేశ్ హరిత విప్లవానికి స్థానికంగా, అంతర్జాతీయంగా కృషి చేసిన బాపట్ల వ్యవసాయ కళాశాల పూర్వ విద్యార్థుల విజయగాథలను 'వెలుతురు తోవలు', 'వెలుతురు పూలు', 'వెలుగు దివ్వెలు' అనే మూడు సంపుటాలుగా ప్రచురించి ఆవిష్కరణ సభలు జరిపారు. ఈ మహత్కార్యంలో వారితోపాటు 'రైతు నేస్తం' వెంకటేశ్వరరావు, ప్రిన్సిపల్ కమిషనర్ దివి పోలు నాయుడు, జీఎస్టీ చీఫ్ కమిషనర్ డాక్టర్ డి. పురుషోత్తం వంటివారు పాలుపంచుకున్నారు.

గోపీచంద్ చేసిన మరో చెప్పుకోదగిన పని – 'డా॥ ఐవీ సుబ్బారావు స్మారక కమిటీ' ద్వారా రైతాంగానికి సేవ చేసిన శాస్త్రవేత్తలు, పాత్రికేయులు, అధికారులు, నిపుణులు, ఆదర్శ రైతులను గుర్తించి ప్రతీ ఏటా అవార్డులు ఇవ్వటం. గోపీచంద్ మొదలుపెట్టిన ఈ పనిని తర్వాతికాలంలో 'రైతునేస్తం' ఫౌండేషన్ ద్వారా దశాబ్ద కాలంగా కొనసాగిస్తున్నారు.

తెలుగు రాష్ట్రాల్లో ఆరోగ్య స్పృహను పెంపొందించడంలోనూ, చిరుధాన్యాలను ఆహారంలో భాగంగా చేసుకోవడాన్ని ప్రోత్సహించడం లోనూ వీరి కృషి ప్రశంసనీయం. అట్లాగే, 'మిద్దెతోటల' పెంపకం గురించి అనేక అవగాహన సదస్సులు, వర్కుషాపులు నిర్వహించారు. గత మూడు దశాబ్దాలుగా వ్యవసాయానికి అవసరమైన సాంకేతిక పరిజ్ఞానం మాత్రమే కాకుండా విధాన పరమైన అంశాల్లో సైతం అనేక పత్రికల్లో వందలకొద్దీ వ్యాసాలు రాశారు. సమాజ వికాసానికి వ్యక్తిగత స్థాయిలో తన వంతు కృషి చేసిన గోపీచంద్ పేరు వ్యవసాయ సమాచార ప్రసారకుల్లో గుర్తుండిపోతుంది.

– చంద్రశేఖర రావు నూతలపాటి
విజిటింగ్ ప్రొఫెసర్, కార్నెల్ యూనివర్సిటీ

(ఆకాశవాణి నుంచి వలేటి గోపీచంద్ నేడు పదవీ విరమణ చేస్తున్నారు)

తెలంగాణ పేగుబంధం అతడి పాట

నివాళి



జూలూరు గౌరీశంకర్

అతని గానం ఒక విడదీయలేని బంధం
అతని కంఠం ఒక యుద్ధ గీతిక
అతని రాగం నిత్యజీవన గీతికలకు పుట్టుక
అతని మాటలు భగభగమండే భాస్వరాలు
అరుణోదయ, నవోదయ పొద్దు పొడుపుల నుంచి పొడుచుకొచ్చిన పాటల సూరీడు సాయిచంద్!

మనలందరినీ ఏకం చేసినది పాట. మనలందరినీ అడుగులో అడుగువేసి నడిపించింది పాట. నలుపు, తెలుపు, ఎరుపు, పసుపు సప్తవర్ణాల, సబ్బండ వర్ణాల సామాజిక చిత్రాలను కలిపేసుకుంటూ అల్లేసుకుంటూ పోయింది పాట. ఆ పాటకు నలుదిక్కులా నిలిచి తనకంఠాన్ని పగులగొట్టుకుని, దానికి ప్రతిరూపంగా మారినవాడు సాయిచంద్.

సామూహికంగా ఆలపించుకునే గీతానికి పొద్దుపొడుపుగా మారినవాడు సాయిచంద్. డప్పును మోగించి, డమరుక నాదాన్ని వినిపించి, జమిడిక వాద్యం నుంచి నిలువెత్తు రాగంతో జన సుప్రభాతాలను పాడుకుంటూ, జనసమూహాల వెంట పాటల కాపలాదారునిగా నిలిచిన వాడు సాయిచంద్. తన కంఠంతో వేదికలను లాలించుకుంటూ, పాలించుకుంటూ, గర్జిస్తూ లక్షలాది మందితో గాన కరచాలనాలు చేసినవాడు.

పాలమూరు మట్టిని ఒంటికి పూసుకుని గొంతు విప్పి ఎన్నెన్నో ఉద్యమాల పొద్దుపొడుపుల రాగాలను ఆలపిస్తూ వేదికలను వెలిగించిన వాడు. లోకమందున ఎగిసిపడిన ధూంధాంలలో ఒక ప్రళయంలా మెరిసినవాడు. ఒక తల్లి ఆత్మఘోషను తన కంఠంతో, రాగంతో కన్నీటి నదిని తలపిస్తూ అతడు పాడినట్లు ఎవరు పాడగలరు? శివుడే అతడి రాగానికి ఘొల్లున ఏడ్చి పాటల ఉద్యమ డమరుకాన్నిచ్చాడు. తెలంగాణ స్వరాష్ట్ర ఉద్యమ జెండా చేతపట్టుకుని అతడు ఊరూరా పాటల పావురాలను ఎగరేస్తూ పోతుంటే సబ్బండవర్ణాలు పిడికిళ్లు బిగించాయి.

'తెలంగాణ రాష్ట్రం నా స్వప్నం – నా ధ్యేయం' అన్న నినాదాన్ని జైలు చేసి నిర్బంధించినప్పుడు, ఆవేదనలన్నీ ఆగ్రహాలై కట్టలు తెంచుకుని ఆత్మబలిదానాలై మండినప్పుడు... అతడెత్తుకున్న రాగానికి తెలంగాణ హృదయం ఒక కన్నీటి సంద్రమైంది. అతడు రాగమెత్తుకుని పాడుతుంటే ధూంధాం సభలన్నీ గుక్కపెట్టి ఏడ్చేవి. గర్జించి పాటను నినాదంగా చేసి జెండా ఎత్తుకున్నప్పుడు ప్రాంగణాలన్నీ 'జై తెలంగాణ' అని మార్మోగేవి. సాయిచంద్ అస్తిత్వ ఉద్యమాల నేతగాడు. అమరత్వాన్ని రాగం చేసి కౌగిలించుకున్నవాడు.



సాయిచంద్

పాలమూరు గంజికేంద్రాల నుంచి గజ్జెకట్టి వచ్చినోడు. అతడికి తీపి, వగరు, పులుపు, అన్నీ తెలుసు. ముంబయ్, బొగ్గుబాయ్, దుబాయ్‌ల వలస బతుకు చిత్రాలన్నీ చూసి వలపోతల, తలపోతల కన్నీటి గోశాల నుంచి భవిష్యత్ చిత్రపటాలను పాడుకుంటూ, అరుచుకుంటూ అట్లా ఊరునూ, వాడనూ ఏకం చేసుకుంటూ మహాగీతమై మారుమోగినవాడు సాయిచంద్.

'కవి, గాయకుడు ఎప్పటికీ అనధికార శాసనకర్తే'. షెల్లీ... నువ్వు చెప్పిందే నిజం. మా సాయిచంద్ ఉద్యమరాగంతో పాటల పాలకుడిగా వేదికలనేలి జనపక్షంగా పల్లవించిన అనధికార శాసనకర్త. సాయి తనను తాను అస్తిత్వ ఉద్యమ ఆకాంక్షలకు అంకితం చేసుకుని కష్టకాలానికి ఊరట కలిగించినోడు. సాయి ఆడిన ఆటలు, పాడిన పాటలన్నీ జనహృదయాల కెరటాలై ఎగసిపడుతూనే ఉంటాయి. ఎన్నెన్నో ఆశలతో, ఆకాంక్షలతో, ఊసులతో, గోసలతో, గుండెల నిండా నిండుకున్న బాధలతో వేదికల ముందు కొచ్చిన లక్షలాది మందికి భరోసానిచ్చేలా చప్పట్లు కొట్టించినోడు. జై కొట్టించినోడు. నినదించి నినాదమైనోడు. పిడికిళ్లు బిగించమని పిడికిలైనోడు. పాటలతో ప్రళయాలను సృష్టించి, మాటలతో గాయాలకు కట్టుకట్టి ఒక సాంస్కృతిక వైద్యునిగా సాగినోడు. తెలంగాణ పునర్నిర్మాణానికి తన పాటను పునర్నిర్మించుకుని పాడినోడు. దేశానికే తెలంగాణ రోల్ మోడల్ అని గొంతెత్తి అరిచాడు. అతడిక లేడని చెప్పే ధైర్యం నాకు లేదు గానీ, ఎప్పటికీ పాటల పాన్పుపై శయనిస్తూ... మనందరి హృదయవీణలను మీటుతుంటాడని మాత్రం చెప్పగలను. తెలంగాణ ఉద్యమవీణను మీటి, అస్తిత్వ జెండా పట్టుకుని నిలిచిన సాంస్కృతిక యోధుడిగా సాయిచంద్ ఎప్పటికీ చిరంజీవే.

'రాతిగుండెల్లోన కొలువైన శివుడా... రక్తబంధము విలువ నీకు తెలవదురా' అని సాయిచంద్ గొంతెత్తి పాడితే యావత్తు తెలంగాణ కన్నీరు మున్నీరయ్యి ఉత్కంఠకు గురైంది. 'ప్రగతిశీల ప్రజాస్వామ్య విద్యార్థి సంఘం' ఉద్యమ పిడికిళ్ళ నుంచి వచ్చిన సాయిచంద్ అరుణోదయ గొంతుకగా పాట పొత్తిళ్ళల్లోంచి ఎదిగివచ్చి పాలమూరు బతుకుల గోసను తన కంఠంతో ప్రపంచానికి చాటి చెప్పాడు. సాయిచంద్ పాట వినని తెలంగాణీయుడు ఉండడు. తెలంగాణ పాటల పూదోటలో నిత్యం విహరిస్తూ మనందరి మనసుల్లో సాంస్కృతిక చైతన్యజ్యోతులను వెలిగించిన సాయిచంద్ ఇప్పుడు తెలంగాణను దుఃఖంలో ముంచి వెళ్ళిపోయాడు. తెలంగాణ సాంస్కృతిక గొంతుకగా సాయిచంద్ తెలంగాణ మదిలో చిరస్థాయిగా నిలిచిపోతాడు. సాయిచంద్... నీకు జోహార్లు!

వ్యాసకర్త తెలంగాణ సాహిత్య అకాడమీ చైర్మన్

(జూన్ 29న సాయిచంద్ హఠాన్మరణం చెందారు)

ధర్మో రక్షతి రక్షితః

ధర్మం వైపు ఉన్నవారికి ఎప్పుడూ మంచే జరుగుతుందని మన ఇతిహాసాల్లో అనేక ఉదాహరణలున్నాయి. రామాయణంలో రావణుని తమ్ముడు విభీషణుడు రాముని పక్షం వహించినట్లే... మహాభారతంలో కౌరవుల నుంచి ఒకడు పాండవ పక్షం వహించాడు. మహాభారత యుద్ధం ముగిసేనాటికి బతికిబట్టగట్టిన 11 మందిలో అతడూ ఒకడు. అతడే యుయుత్సుడు. కౌరవులలో మిగిలిన ఏకైక వ్యక్తి.

ధృతరాష్ట్రుడు, పాండురాజుల పుట్టుకకు కారకుడైన వేద వ్యాసుడు మహాభారతాన్ని రచించాడు. అతడు ఒకరోజు హస్తినాపురాన్ని సందర్శించాడు. ధృతరాష్ట్రుని భార్య గాంధారి ఆయనకు భక్తిశ్రద్ధలతో అతిథి మర్యాదలు చేసింది. ఆమె సేవలకు మెచ్చి వ్యాసుడు వరం కోరుకోమన్నాడు. 'నాకు వందమంది సంతానం కావాల'ని గాంధారి అంది. వ్యాసుడు ఆ వరమిచ్చి వెళ్ళిపోయాడు.

జ్యోతిర్మయం

వరాన్ని పొందిన రెండేళ్ల తర్వాత గాంధారి కౌరవులతోపాటు 'దుస్సల' అనే పుత్రికనూ కన్నది. కౌరవులు అనగానే దుర్మార్గత్వం, దుష్టత్వం గుర్తుకొస్తుంది కదా! కానీ కురు వంశంలోనే ధర్మాన్ని ఆచరించే యుయుత్సుడు అనేవాడు కూడా జన్మించాడు. ఇతడు గాంధారికి పుట్టిన వాడు కాదు. 'సుగధ' అనే వైశ్య దాసి ద్వారా ధృతరాష్ట్రుడు కన్న పుత్రుడు. గాంధారికి సంతానం కలగడంలో ఎదురవుతున్న ఇబ్బందులను దృష్టిలో పెట్టుకొని ఆందోళన చెందిన ధృతరాష్ట్రుడు సుగధను చేరదీశాడు. దుర్యోధనుడు, ఇతర కౌరవులు పుట్టిన రోజే యుయుత్సుడు కూడా జన్మించాడు. అయితే చిన్నప్పటి నుంచి దాసి పుత్రునిగా అతడికి అవమానాలు ఎదురయ్యాయి. అయినా వాటిని పట్టించుకోకుండా సకల విద్యలూ అభ్యసించాడు. 60 వేల మందిని ఒక్కసారిగా ఎదుర్కొనగలిగిన 'అతిరథు'ని హోదా అతడిది. కౌరవుల వైపు ఉన్న అతిరథుల్లో అతడు ఒకడు. అటువంటి యుయుత్సుడు మొదటి నుంచీ వారి చేతుల్లో అవమానాలు పడుతున్నందువల్లా, వారి దుష్టత్వం తెలిసినందు వల్లా కురుక్షేత్ర మహా సంగ్రామంలో పాండవుల పక్షం వహించాడు. కౌరవులకు సంబంధించిన రహస్యాలు పాండవులకు చెప్పి వారి విజయానికి తోడ్పడ్డాడు.

కలియుగం ప్రారంభం అవ్వడంతో పాండవులు అర్జునుని కుమారుడైన పరీక్షిత్తుకు సింహాసనం అప్పగించి యుయుత్సుని అతడికి సంరక్షకునిగా నియమించి హిమాలయాలకు వెళ్లిపోయారు. ఆ విధంగా ధర్మం వైపు నిలిచిన యుయుత్సునికి మేలు చేకూరింది.

– యామిజాల జగదీశ్

గ్రహం అనుగ్రహం

శ్రీ శోభకృత్ నామ సంవత్సరం, ఉత్తరాయణం, గ్రీష్మ ఋతువు, ఆషాఢ మాసం, తిథి: శు.ద్వాదశి రా.9.55 వరకు, తదుపరి త్రయోదశి, నక్షత్రం: విశాఖ ప.1.24 వరకు, తదుపరి అనూరాధ, వర్జ్యం: సా.5.24 నుండి 6.57 వరకు, దుర్ముహూర్తం: ఉ.8.09 నుండి 9.01 వరకు తదుపరి ప.12.28 నుండి 1.22 వరకు, అమృతఘడియలు: రా.2.53 నుండి 4.26 వరకు; రాహుకాలం: ఉ.10.30 నుండి 12.00 వరకు, యమగండం: ప.3.00 నుండి 4.30 వరకు, సూర్యోదయం: 5.32, సూర్యాస్తమయం: 6.34.

క్లుప్తంగా...

గన్ మిస్‌ఫైర్.. హెడ్‌కానిస్టేబుల్ మృతి


మృతిచెందిన రామయ్య

ఖైరతాబాద్ (హైదరాబాద్): మింట్ కాంపౌండ్ సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్‌లో గన్ మిస్‌ఫైర్ అయి డ్యూటీలో ఉన్న హెడ్ కానిస్టేబుల్ మృతి చెందారు. ఈ ఘటన సైఫాబాద్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. మంచిర్యాల జిల్లా లక్సెట్టిపేట్‌కు చెందిన రామయ్య (45), భార్యాపిల్లలతో కలిసి అంబర్‌పేట్‌లో నివాసముంటున్నాడు. రామయ్య రెండేళ్లుగా మింట్ కాంపౌండ్‌లోని సెక్యూరిటీ ప్రింటింగ్ ప్రెస్‌లో గార్డుగా విధులు నిర్వహిస్తున్నారు. గురువారం ఉద యం డ్యూటీ మారుతున్న సమయంలో అతని వద్ద ఉన్న ఎస్ఎల్ఆర్ హ్యాండ్‌ఓవర్ చేస్తున్న క్రమంలో మిస్‌ఫైర్ అయింది. బుల్లెట్ ఛాతీని చీల్చుకుంటూ బయటకు రావడంతో రామయ్య అక్కడికక్కడే మృతిచెందినట్లు పోలీసులు తెలిపారు.

అంతర్జాతీయ సంస్మరణ మాసంగా జూలై

- మావోయిస్టు పార్టీ పిలుపు

చర్ల: భారత్, ఫిలిప్పీన్స్ విప్లవోద్యమాల్లో అమరుల స్మారకార్థం జూలై నెలను అంతర్జాతీయ సంస్మరణ మాసంగా పాటించాలని మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ అధికార ప్రతినిధి అభయ్ గురువారం ఒక ప్రకటనలో కోరారు. భారత్, ఫిలిప్పీన్స్‌లో రాజకీయ ఖైదీలను భేషరతుగా విడుదల చేయాలని డిమాండ్ చేశారు. భారత ప్రజాయుద్ధ అంతర్జాతీయ సంఘీభావ కమిటీ పిలుపును మావోయిస్టు పార్టీ సమర్థిస్తోందని తెలిపారు. మావోయిస్టు పార్టీ కేంద్ర కమిటీ పొలిట్‌బ్యూరో సభ్యుడు కటకం సుదర్శన్ సంస్మరణ సభలు జూలై 5 నుంచి నిర్వహిస్తున్నట్లు వెల్లడించారు.

13 మందిని విడుదల చేసిన మావోయిస్టులు


మడవి గంగ, కవ్వాసి సుక్కా (ఫైల్)

దుమ్ముగూడెం: ఛత్తీస్‌గఢ్‌లోని సుకుమా జిల్లా బుర్కాపాల్ పంచాయతీ ఉప సర్పంచ్ మడవి గంగతో పాటు 14 మంది గ్రామస్తులను కిడ్నాప్ చేసిన మావోయిస్టులు.. 13 మందిని విడుదల చేశారు. పోలీస్ ఇన్‌ఫార్మర్ల నెపంతో గంగతో పాటు కవ్వాసి సుక్కా అనే ఉపాధ్యాయుడిని బుధవారం రాత్రి హతమార్చడం తెలిసిందే. కాగా, మిగిలిన 13 మందిని విడుదల చేయగా, గురువారం ఇళ్లకు చేరుకున్నారు.

కాళ్ల నొప్పులకు ఇంజక్షన్ ఇస్తే.. కంటిచూపు పోయింది

మొయినాబాద్: కాళ్ల నొప్పులని ఆర్ఎంపీ వైద్యుడి వద్దకు వెళ్తే.. అతను ఇచ్చిన ఇంజక్షన్‌తో కంటిచూపు పోవడంతోపాటు కాళ్లు, చేతులు పడిపోయాయి. ఈ సంఘటన రంగారెడ్డి జిల్లా మొయినాబాద్ మండలం ఎనికేపల్లి గ్రామంలో చోటుచేసుకుంది. ఎనికేపల్లికి చెందిన కొత్వాల్‌గూడెం బాలమ్మ కాళ్ల నొప్పులతో బాధపడుతూ ఈ నెల 24న అదే గ్రామంలోని ఆర్ఎంపీ డాక్టర్ రాంచందర్ వద్దకు వెళ్లింది. డాక్టర్ ఆమెను పరిశీలించి కాళ్ల నొప్పులు తగ్గడానికంటూ ఓ ఇంజక్షన్ ఇచ్చా డు. ఇంటికి వెళ్లాక బాలమ్మకు కంటిచూపు పోయింది. ఆ తరువాత నోటిమాటలు బంద య్యాయి. అంతలోనే కాళ్లు చేతులు కూడా పడిపోయాయి. బాధితురాలి కుటుంబ సభ్యులు డాక్టర్ వద్దకు వెళ్లి ప్రశ్నించగా.. బలానికి మాత్రమే ఇంజక్షన్ ఇచ్చానని.. కంటిచూపు పోవడానికి, కాళ్లు చేతులు పడిపోవడానికి తనకు ఎలాంటి సంబంధం లేదని చెప్పి పంపించేశాడు. ఆర్ఎంపీ ఇచ్చిన ఇంజక్షన్ వికటించడంతోనే ఇలా జరిగిందని కుటుంబ సభ్యులు ఆరోపించారు. గురువారం బాధితురాలి కుమారుడి ఫిర్యాదుతో పోలీసులు కేసు నమోదు చేశారు.

ఊపిరి తీసిన కొబ్బరి ముక్క

- గొంతులో ఇరుక్కుని మూడేళ్ల బాలుడి మృతి


రోదిస్తున్న బాలుని తల్లిదండ్రులు, బంధువులు. (ఇన్‌సెట్‌లో) జశ్వంత్

కుషాయిగూడ (హైదరాబాద్): కొబ్బరి ముక్క గొంతులో ఇరుక్కుపోయి మూడేళ్ల బాలుడు మృతి చెందాడు. కుషాయిగూడ సోనియాగాంధీనగర్ ఫేస్–2లో జరిగిన ఈ విషాద సంఘటన వివరాలివి. శ్రీకాకుళం జిల్లాకు చెందిన ఆరుపల్లి శ్రీనివాస్ నగరానికి వచ్చి ఆటో నడుపుకొంటూ ఇక్కడే స్థిరపడ్డాడు. శ్రీనివాస్‌కు భార్య త్రివేణి, యశ్వంత్ (5), జశ్వంత్ (3) ఇద్దరు సంతానం. గురు వారం తొలి ఏకాదశి కావడంతో కుటుంబ సభ్యులంతా కలిసి కాలనీలోని సాయిబాబా ఆలయానికి వెళ్లి వచ్చారు. గుడి నుంచి తెచ్చిన కొబ్బరిముక్క ప్రసాదం ఇద్దరు పిల్లలకు ఇచ్చిన తల్లి పనిలో నిమగ్నమైంది. కాగా మూడేళ్ల జశ్వంత్ కొబ్బరి ముక్కను తింటుండగా గొంతులో ఇరుక్కుపోయి ఊపిరాడక చనిపోయాడు. ఆస్పత్రికి తీసుకెళ్లగా బాలుడిని పరీక్షించిన వైద్యులు చనిపోయినట్లు తెలపడంతో తల్లిదండ్రుల రోదనలు మిన్నంటాయి.


తుంగతుర్తి ప్రగతి నివేదన సభలో మాట్లాడుతున్న మంత్రి కేటీఆర్


సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో జరిగిన తుంగతుర్తి ప్రగతి నివేదన సభకు హాజరైన ప్రజలు

50 ఏళ్లు ఏం చేయనోళ్లు.. ఇప్పుడేం చేస్తారు?

- వారి మాయ మాటలు నమ్మి మోసపోవద్దు
- కాంగ్రెస్, బీజేపీ నేతలొచ్చి డబ్బులిస్తారు.. తీసుకోండి
- కానీ సీఎం కేసీఆర్‌ను మూడోసారి ముఖ్యమంత్రిని చేయండి
- తుంగతుర్తి ప్రగతి నివేదన సభలో మంత్రి కేటీఆర్

సాక్షి ప్రతినిధి, నల్లగొండ: 'యాభై ఏళ్ల అధికారం ఇస్తే ఏమీ చేయనోళ్లు ఇప్పుడొచ్చి ఏం చేస్తారు? వారి మాయమాటలు నమ్మి మోసపోవద్దు' అని ఐటీ, పురపాలక శాఖ మంత్రి కె.తారక రామారావు అన్నారు. కేసీఆర్ చేస్తున్న అభివృద్ధికి ఓటేసి ఆయన్ని మూడోసారి ముఖ్యమంత్రిని చేయాలని పిలుపునిచ్చారు. సూర్యాపేట జిల్లా తిరుమలగిరిలో గురువారం పలు అభివృద్ధి పనులకు కేటీఆర్ శంకుస్థాపన చేశారు. అనంతరం ఎమ్మెల్యే గ్యాదరి కిషోర్‌కుమార్ అధ్యక్షతన జరిగిన తుంగతుర్తి నియోజకవర్గ ప్రగతి నివేదన సభలో ప్రసంగించారు.

కేసీఆర్‌ను దించాలనే వాళ్ల దగ్గర జవాబేదీ?

'కేసీఆర్‌ను దించడమే లక్ష్యమని ఒకరు.. కేసీఆర్‌ను జైల్లో పెట్టాలని మరొకరు మాట్లాడుతున్నారు. ఎందుకు దించాలో, ఎందుకు జైల్లో పెట్టాలో అడిగితే ఒక్కరి దగ్గరా సమాధానం లేదు. అభివృద్ధి పథకాలను అమలు చేస్తున్నందుకు, 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తున్నందుకు, లక్షల ఎకరాలకు సాగునీరు అందిస్తున్నందుకు, నేడు పోడు భూములకు పట్టాలు ఇస్తున్నందుకు కేసీఆర్‌ను జైల్లో పెట్టాలా?' అని కేటీఆర్ ప్రశ్నించారు. గత 9 ఏళ్ల కాలంలో తెలంగాణ దేశానికే దిక్సూచిగా మారిందన్నారు. తెలంగాణ యావత్ దేశానికే ధాన్య భాండాగారం అయితే తెలంగాణలో నల్లగొండ ఉమ్మడి జిల్లా ధాన్య భాండాగారంగా మారిందన్నారు.

పదిసార్లు అవకాశం ఇస్తే ఏం చేశారు?

'2014కు ముందు కరెంటు ఉంటే వార్త. నేడు కరెంటు పోతే వార్తలా మారింది. దేశంలో ఎక్కడా లేనట్లుగా రైతుబంధు, రైతుబీమాతోపాటు 24 గంటల ఉచిత విద్యుత్ ఇస్తూ అదనంగా రూ. 12 వేల కోట్ల భారం ప్రభుత్వం భరిస్తోంది. 50 ఏళ్ల అధికారంలో ఉండి ఫ్లోరైడ్‌ను రూపుమాపలేని కాంగ్రెస్ దద్దమ్మలు నేడు కేసీఆర్ దిగిపోవాలని మాట్లాడుతున్నారు.. చూస్తూ ఊరుకుందామా?' అని కేటీఆర్ ప్రశ్నించారు. 67 ఏళ్ల పాలనలో 50 ఏళ్లు అధికారంలో ఉన్న కాంగ్రెస్ ప్రజలను పట్టించుకోలేదని, అలాంటి వారు వచ్చి నేడు మాట్లాడటం విడ్డూరంగా ఉందని విమర్శించారు. పదిసార్లు అవకాశం ఇస్తే కాంగ్రెస్ నేతలు ఏం చేశారని... గుడ్డి గుర్రానికి పళ్లు తోమారా అంటూ కేటీఆర్ ఘాటుగా విమర్శించారు. సంక్షేమ పథకాలు పొందుతున్న ప్రజలంతా ఆలోచించాలన్నారు. 'కర్ణాటక, గుజరాత్‌ల నుంచి కాంగ్రెసోళ్లు, బీజేపోళ్లు డబ్బులు తెచ్చి ఇస్తారు. తీసుకొని జేబులో పెట్టుకోండి. కానీ ఓటు మాత్రం కిషోర్ కారు గుర్తుకే వేయాలని, సీఎం కేసీఆర్‌ను మూడోసారి అధికారంలోకి తీసుకురావాలని కేటీఆర్ కోరారు.

కాంగ్రెస్ తీరుపై కేటీఆర్ పిట్టకథ..

'ఒక ఊర్లో ఓ 15 ఏళ్ల పిల్లాడు చెడు అలవాట్లకు బానిసై తాగుబోతు, తిరుగుబోతు అయ్యాడు. ఓ రోజు మత్తులో తండ్రి జేబులోంచి డబ్బు కొట్టేస్తుండగా తల్లి చూసి ఇంట్లోనే దొంగతనం చేస్తావా అంటూ కొడుతుంది. మత్తులో ఉన్న పిల్లాడు రోకలిబండతో తల్లిని కొట్టి చంపుతాడు. అది చూసిన తండ్రి పిల్లాడిని కొడితే తండ్రిని కూడా రోకలిబండతో కొట్టి చంపేస్తాడు. పోలీసులు ఆ బాలుడిని జడ్జి ముందుకు తీసుకెళ్లగా జడ్జి స్పందిస్తూ నేను ఎందరో లుచ్చాలను, లంగాలను, చివరకు రేవంత్‌రెడ్డిని కూడా చూశాను. కానీ నీ అంత గలీజ్‌గాడిని చూడలేదు. తల్లిదండ్రులను చంపిన నీకు ఏం శిక్ష వేయాలో అర్థం కావట్లేదు... నువ్వే చెప్పు అని అడగ్గా ఆ పిల్లాడు నేను తల్లిదండ్రులు లేని అనాథను.. నన్ను విడిచిపెట్టండి సార్ అన్నాడంట.. కాంగ్రెసోళ్ల పరిస్థితి కూడా అలాగే ఉంది' అంటూ కేటీఆర్ దుయ్యబట్టారు.

నిరూపిస్తే క్షమాపణలకు సిద్ధం: మంత్రి జగదీశ్‌రెడ్డి

నల్లగొండ జిల్లాలో అభివృద్ధి జరగలేదని నిరూపించగలిగితే క్షమాపణలు చెప్పేందుకు సిద్ధంగా ఉన్నామని విద్యుత్ శాఖ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి స్పష్టం చేశారు. జరిగిన ప్రగతిని నిరూపిస్తే కాంగ్రెస్ నాయకులు తుంగతుర్తి నుంచి ఢిల్లీ వరకు ముక్కులు నేలకు రాస్తారా? అని సవాల్ విసిరారు.

'గౌరవెల్లి'కి రెండో ట్రయల్ రన్


పంప్‌హౌస్‌లో నీటిని విడుదల చేస్తున్న దృశ్యం

హుస్నాబాద్: గౌరవెల్లి ప్రాజెక్టుకు సంబంధించి రెండో ట్రయల్ రన్ నిర్వహించారు. రేగొండ పంప్‌హౌస్‌లో 32 మెగావాట్ల సామర్థ్యం గల విద్యుత్ మోటార్‌ను గురువారం హుస్నాబాద్ ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ ప్రారంభించారు. ఒక మోటార్ ద్వారా నీరు రిజర్వాయర్‌లోకి చేరే ప్రక్రియ మొదలైంది. ఐదురోజుల వ్యవధిలో 1 టీఎంసీ నీటిని జలాశయంలోకి వదలనున్నారు. ఈ ప్రాజెక్టు ద్వారా హుస్నాబాద్ నియోజకవర్గంతో పాటు జనగామ, స్టేషన్‌ఘనపూర్ పరిధిలో 1.06 లక్షల ఎకరాలకు సాగునీరు అందనుంది. పది రోజుల్లో సీఎం కేసీఆర్ ప్రాజెక్టును ప్రజలకు అంకితం చేస్తారని ఎమ్మెల్యే సతీశ్‌కుమార్ తెలిపారు.

సర్వే, ల్యాండ్స్ ఏడీ ఇంట్లో ఏసీబీ సోదాలు

- రూ.78 లక్షలు, 20 తులాల బంగారం, వెండి స్వాధీనం
- భూములు, బ్యాంక్ డిపాజిట్ల పత్రాలు కూడా..


ఏడీ శ్యాంసుందర్‌రెడ్డి ఇంట్లో దొరికిన నగదు, బంగారం, పత్రాలు

ఖలీల్‌వాడి: ఏసీబీకి పట్టుబడిన నిజామాబాద్ జిల్లా సర్వే అండ్ ల్యాండ్స్ ఏడీ శ్యాంసుందర్‌రెడ్డికి హైదరాబాద్‌లో ఉన్న ఇంట్లో గురువారం ఏసీబీ అధికారులు సోదాలు నిర్వహించారు. ఈ సందర్భంగా రూ.78,02, 780 నగదుతో పాటు సుమారు 20 తులాల బంగారం, వెండి సామగ్రి, ఇళ్ల స్థలాలతో పాటు భూముల పత్రాలు, వివిధ బ్యాంకుల్లోని ఫిక్స్‌డ్ డిపాజిట్ బాండ్లు, వివిధ బ్యాంక్‌లు, పోస్టాఫీసు ఖాతాలను ఏసీబీ అధికారులు సీజ్ చేశారు. ఇందులో కొన్ని రూ.2వేల నోట్లు దొరకడం విశేషం. తనిఖీలు శుక్రవారం కూడా కొనసాగే అవకాశాలున్నట్లు తెలిసింది. ఏడీ శ్యాంసుందర్‌తో పాటు సూపరింటెండెంట్ వెంకటేశ్, జూనియర్ అసిస్టెంట్ రహీమాను కరీంనగర్‌లోని ఏసీబీ కోర్టులో హాజరుపరిచినట్టు సమాచారం. డీఎస్పీ ఆనంద్‌తో పాటు ఎస్ఐలు నగేశ్, శ్రీనివాస్ ఆధ్వర్యంలో తనిఖీలు జరుగుతున్నాయి.

బ్యాంకులో చోరీ యత్నం.. నిందితుడు 7వ తరగతి విద్యార్థి!

- రాత్రి 8.20కే గడ్డపారతో తాళం పగులకొట్టి బ్యాంకులోకి..
- పోలీసుల అదుపులో బాలుడు
- పాత నేరస్తుడి ప్రోద్బలంతోనే చోరీ యత్నం?


సీసీ ఫుటేజీలో కనిపిస్తున్న బాలుడు

బయ్యారం: మహబూబాబాద్ జిల్లా బయ్యారం మండల కేంద్రంలోని ఎస్‌బీఐ బ్రాంచ్‌లో బుధవారం రాత్రి జరిగిన చోరీ యత్నం ఘటనలో ఏడో తరగతి విద్యార్థి సీసీ కెమెరాకు చిక్క డం ఆసక్తిగా మారింది. నిత్యం జన సంచారం.. రహదారికి ప క్కన ఉండే బ్యాంకు ఆవరణలోకి రాత్రి 8.20 గంటలకే బా లుడు రావడం చూస్తుంటే ఎవరైనా డైరెక్షన్ ఇస్తే యాక్షన్‌లోకి దిగాడా లేక స్వతహాగానే వచ్చాడా అనే ప్రశ్నలు ఉత్పన్నమవుతున్నాయి. బయ్యారం–పందిపంపుల రహదారి పక్కన ఉన్న ఎస్‌బీఐ బ్రాంచ్ ఆవరణలోకి బయ్యారంలో నివాసం ఉంటున్న ఇర్సులాపురానికి చెందిన 13 సంవత్సరాల బాలు డు గడ్డపారతో వెళ్లాడు. వెనుకవైపు గ్రిల్స్‌తో ఉన్న తలుపు తాళం పగులకొట్టి లోపలికి ప్రవేశించాడు. బ్యాంకులో పల ఉన్న డెస్క్‌ల్లో డబ్బులు, నగలు ఉంటాయేమోనని గంటపా టు వెతికి ఆ తరువాత బయటకు వెళ్లినట్టు సీసీ కెమెరాల పు టేజీని బట్టి తెలుస్తోంది. గురువారం ఉదయం బ్యాంకు వద్ద కు స్వీపర్ పద్మ వచ్చింది. తాళం పగులకొట్టిన విషయాన్ని అధికారులకు తెలిపింది. వారి ద్వారా సమాచారం తెలుసుకున్న పోలీసులు సంఘటనా స్థలానికి చేరుకుని పరిశీలించారు.

బాలుడితో సాధ్యమేనా?: కట్టుదిట్టమైన భద్రతమధ్య ఉండే బ్యాంకులోకి 13 సంవత్సరాల బాలుడు ఇతరుల ప్రమేయం లేకుండా చోరీకి యత్నించడం సాధ్యం కాదని పలువురు అంటున్నారు. గడ్డపారతో తాళం పగులకొట్టడం కష్టమని, బాలుడు సునాయాసంగా ఎలాంటి చప్పుడు లేకుండా ఎలా పగులకొట్టాడని, ఎవరైనా డైరెక్షన్ ఇచ్చి చేయించారన్న అభిప్రాయం వ్యక్తమవుతోంది.

బెదిరింపులతోనే చేశా..: దొంగతనాల్లో అనుభవం ఉన్న ఓ పాత నేరస్తుడు చోరీకి యత్నించిన బాలుడికి ఇటీవల పరిచయం అయినట్టు తెలుస్తుంది. ఆ పరిచయం ఆధారంగా బాలుడిని మచ్చిక చేసుకున్న పాత నేరస్తుడు బ్యాంకు దొంగతనం చేయాలని బెదిరించినట్టు బాలుడు పోలీసుల విచారణలో తెలిపినట్టు సమాచారం. వెనుక నుంచి బ్యాంకు గోడపైకి ఎక్కించి, తను బయటకు వచ్చే వరకు ఆ పాతనేరస్తుడు అక్కడే ఉన్నాడని, ఆ తరువాత ఇద్దరం ఎవరి ఇళ్లకు వారు వెళ్లినట్టు బాలుడు చెప్పినట్లు తెలిసింది. కాగా, ఈ ఘటనను సీరియస్‌గా తీసుకున్న గార్ల–బయ్యారం సీఐ బాలాజీ, ఎస్ఐ రమాదేవి బ్యాంకు పరిసరాలతోపాటు బ్యాంకులో రికార్డయిన సీసీ ఫుటేజీని పరిశీలించారు. చోరీకి యత్నించిన బాలుడి ఆనవాళ్లను గుర్తించిన అధికారులు ఇర్సులాపురంలో అదుపులోకి తీసుకొని స్టేషన్‌కు తీసుకొచ్చినట్టు తెలుస్తోంది.


వెనుకవైపున విరగ్గొట్టి ఉన్న తలుపు గొళ్లెం

చూసింది ట్రైలరే.. సినిమా ముందుంది!

▶ మొదటి పేజీ తరువాయి

స్పష్టత ఉండటంతో 2018 ఎన్నికల్లో తమకు 88 సీట్లిచ్చి గెలిపించారని చెప్పారు. అభివృద్ధి కేవలం డైలాగ్‌లు కొడితేనే, ఊకదంపుడు ఉపన్యాసాలు ఇస్తేనో జరగదని, నాయకుడికి స్థిరచిత్తం, దృడసంకల్పం, ప్రజలకు మంచి చేయాలనే ఆరా టం ఉంటేనే సాక్షాత్కారం అవుతుందన్నారు. సమగ్ర, సమీకృత, సమతౌల్య అభివృద్ధికి తార్కాణం తెలంగాణ అని వ్యాఖ్యానించారు.

ఐపీఎస్, ఐఏఎస్‌లకు టెంపర్..

'రాజకీయ నాయకులు అధికారంలోకి వస్తే తొలి ఏడాది విధానాలను అర్థం చేసుకోవడానికి, కుర్చీ సర్దుకోవడానికే సరిపోతుంది. చివరి ఏడాది మళ్లీ ఎన్నికల హడావుడి ఉంటుంది. మధ్యలో ఉండేది మూడేళ్లే. ఈ సమయంలో ఐఏఎస్, ఐపీఎస్ ఆఫీసర్లు నాయకులకేం తెలుసు.. మేము కదా పర్మనెంట్ ఆర్టిస్టులం.. వాళ్లు గెస్ట్ ఆర్టిస్టులు. ఐదేళ్లకొకసారి మారిపోతారని అనకుంటారు. వాళ్ల టెంపర్ వాళ్లది' అని కేటీఆర్ వ్యాఖ్యానించారు.

250 కి.మీ. వరకూ మెట్రో విస్తరణ..: హైదరాబాద్‌లో మెట్రో రైలును 250 కి.మీ. వరకూ విస్తరిస్తామని మంత్రి కేటీఆర్ తెలిపారు. 31 కి.మీ. శంషాబాద్ ఎయిర్‌పోర్ట్ మెట్రోను రెండున్నర ఏళ్లలో పూర్తి చేస్తామని చెప్పారు. బీహెచ్ఈఎల్ నుంచి హయత్ నగర్ వరకు, ఈసీ ఐఎల్ నుంచి నానక్‌రాంగూడ వరకూ మెట్రోను విస్తరిస్తామని తెలిపారు. జేబీఎస్ నుంచి తుర్కపల్లి వరకు, ప్యాట్నీ నుంచి కొంపల్లి వరకు ఒక్కోటి 18.5 కి.మీ. మేర స్కైవాక్‌ను నిర్మించనున్నామని... భవిష్యత్తు అవసరాల రీత్యా ఈ స్కైవాక్‌ల మధ్యలో మెట్రో పిల్లర్లను సైతం నిర్మిస్తామని కేటీఆర్ తెలిపారు. రూ. 4 వేల కోట్లతో చేపట్టిన 16 సీవరేజ్ ట్రీట్‌మెంట్ ప్లాంట్ (ఎస్‌టీపీ)ల నిర్మాణం సెప్టెంబర్‌కు పూర్తవుతుందన్న కేటీఆర్... ఎస్‌టీపీల నుంచి వచ్చే నీటిని నిర్మాణరంగ అవసరాలకు వినియోగించుకోవాలని డెవలపర్లకు సూచించారు. ఈ కార్యక్రమంలో చేవెళ్ల ఎంపీ జి.రంజిత్‌రెడ్డి, రాజేంద్రనగర్ ఎమ్మెల్యే టి. ప్రకాశ్‌గౌడ్, సీఐఐ తెలంగాణ చైర్మన్ సి. శేఖర్‌రెడ్డి, క్రెడాయ్ నేషనల్ వైస్ ప్రెసిడెంట్ జి.రాంరెడ్డి, తెలంగాణ చైర్మన్ సీహెచ్ రాంచంద్రారెడ్డి, అధ్యక్షుడు డి.మురళీకృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

కాంగ్రెస్‌కు ప్రజలు పట్టం కట్టబోతున్నారు..

వచ్చే నెల 2న ఖమ్మంలో జనగర్జన సభ

- బీఆర్ఎస్ ఆవిర్భావ సభకు మించి నిర్వహిస్తున్నాం
- ముఖ్యఅతిథిగా హాజరుకానున్న రాహుల్ గాంధీ
- ముఖ్యమంత్రి కేసీఆర్ ఏ వాగ్దానాన్నీ పరిపూర్ణంగా అమలు చేయలేదు
- ప్రజాతీర్పుతో రాజకీయ సమాధి తప్పదు
- 'సాక్షి' ఇంటర్వ్యూలో మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి



సాక్షి ప్రతినిధి, ఖమ్మం: 'తెలంగాణ సమాజం కాంగ్రెస్‌కు పట్టం కట్టేందుకు సిద్ధంగా ఉంది. ఏ ఉద్దేశంతోనైతే సోనియాగాంధీ తెలంగాణ ఇచ్చారో.. ఆ ఉద్దేశం నెరవేరే సమయం ఆసన్నమైంది. వచ్చే నెల 2న ఖమ్మంలో నిర్వహించే జనగర్జన సభ ద్వారా మేము కాంగ్రెస్‌లో చేరనున్నాం. బీఆర్ఎస్ ఆవిర్భావ సభకు మించి ఈ సభ ఉంటుంది. తెలంగాణ బిడ్డలు కోరకుంటున్న వాటిలో కొన్నింటిని ఏఐసీసీ అగ్రనేత రాహుల్‌గాంధీ తెలియజేస్తారు' అని మాజీ ఎంపీ పొంగులేటి శ్రీనివాసరెడ్డి వెల్లడించారు. అలాగే ప్రజాసమస్యలు తెలుసుకొనేందుకు సీఎల్పీ నేత మల్లు భట్టి విక్రమార్క చేపట్టిన పీపుల్స్ మార్చ్ పాదయాత్ర 2వ తేదీనే ముగియనున్నందున సభలో భట్టిని రాహుల్ గాంధీ సన్మానిస్తారని తెలిపారు. కాంగ్రెస్‌లో చేరడానికి కారణాలు, సభ ఏర్పాట్లను ఆయన గురువారం 'సాక్షి'కి ఇచ్చిన ఇంటర్వ్యూలో వెల్లడించారు. ఆ వివరాలు ఆయన మాటల్లోనే..

ప్రజాభీష్టం మేరకే..

ఖమ్మంలో నిర్వహించే సభలో అనేక మంది ముఖ్యనేతలు, లక్షలాది కుటుంబాల సమక్షాన రాహుల్ గాంధీ చేతుల మీదుగా కాంగ్రెస్‌లో చేరతాం. ఆరు నెలలుగా అన్ని వర్గాల ప్రజలతోపాటు కవులు, ఉద్యమకారులు, కళాకారులను కలసి, రెండు ప్రముఖ సంస్థలతో సర్వే చేయించి ఏ పార్టీలో చేరితే తెలంగాణను, ప్రజలను మోసం చేసిన కల్వకుంట్ల కుటుంబాన్ని ఇంటికి పంపొచ్చో తెలుసుకున్నాం. అత్యధికంగా కాంగ్రెస్‌తోనే సాధ్యమవుతుందని, కాంగ్రెస్‌కు మా బలం తోడైతే ఉమ్మడి ఖమ్మం, మహబూబ్‌నగర్ జిల్లాల్లోనే కాక తెలంగాణ అంతటా ప్రభావం వస్తుందని తేలింది. అధికారంలో ఉన్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు నన్ను, నా కుటుంబాన్ని ఇబ్బంది పెడతాయని తెలిసినా ప్రజాభిప్రాయానికి అనుగుణంగా ఇటు మొగ్గు చూపాం.

సరైన వేదిక..

ఢిల్లీలోని ఏఐసీసీ కార్యాలయం వద్దకు వెళ్లే వరకు సందిగ్ధత ఉంది. ఏఐసీసీ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే, అగ్రనేతలు రాహుల్ గాంధీ, ప్రియాంకా గాంధీతో మాట్లాడాక మాకు కాంగ్రెస్సే సరైన వేదికగా భావించాం. ఈ సభలో నాతోపాటు వరంగల్, హైదరాబాద్ సిటీకి చెందిన పలువురు నేతలు కాంగ్రెస్‌లో చేరుతారు.

ఆర్టీసీ బస్సులను నిరాకరించారు..

సభకు జనం వచ్చేందుకు ఖమ్మం ఆర్టీసీ రీజియన్‌లోని డిపోల నుంచి వెయ్యి బస్సులు కావాలని కోరాం. అందుకు రూ.1.08 కోట్లు అవుతుందని చెప్పి రెండ్రోజుల క్రితం వరకు ఇస్తామన్నారు. నష్టాల్లో ఉన్న ఆర్టీసీకి కాంగ్రెస్ తరఫున సహకరించినట్లు అవుతుందనేది మా ఆలోచన. అయితే అధికారంలో ఉన్న నాయకులు మాత్రం సభకు జనం రావొద్దనే దురుద్దేశంతో బస్సులు ఇవ్వకుండా అడ్డుకున్నారు. ఇప్పుడు పెళ్లిళ్ల సీజన్ కాకున్నా బస్సులు నిరాకరించడం ద్వారా రాష్ట్ర ప్రభుత్వం ఆర్టీసీ నష్టపోయేలా చేసింది. మమ్మల్ని ఇబ్బంది పెట్టడమేకాక సభను ఫెయిల్ చేయాలని కలలు కంటున్న రాష్ట్ర ప్రభుత్వం, ప్రజాప్రతినిధులు, అధికారులను ఒకటే హెచ్చరిస్తున్నాం. ఈరోజు మీరు అధికారంలో ఉన్నా ప్రతిపక్షంలోకి రాక తప్పదు. నన్ను, కాంగ్రెస్‌ను అభిమానించే వారంతా స్వచ్ఛందంగా తరలిరావాలి. సభా స్థలికి వెళ్లాలంటే నాగార్జునసాగర్ కెనాల్ మీదుగా వెళ్లాలి. నా కుమార్తె రిసెప్షన్ సందర్భంగా కెనాల్‌పై ఐరన్ బ్రిడ్జి నిర్మించాం. రిసెప్షన్ ముగిశాక అది నిరుపయోగం కావడంతో బ్రిడ్జి తొలగించాలని అధికారులపై ప్రజాప్రతినిధులు ఒత్తిడి తీసుకొస్తున్నారు. దీనిపై న్యాయస్థానానికి వెళ్లి స్టే తీసుకొచ్చినా సభకు వాడుకోకుండా చూస్తున్నారు.

కాంగ్రెస్‌కు పట్టం కట్టాలి..

తెలంగాణ బిడ్డల కలలు నిజం కావాలంటే వచ్చే అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకురావాలి. ఏ ఉద్దేశంతోనైతే సోనియా తెలంగాణను ఇచ్చారో ఆ ఉద్దేశం నెరవేరే సమయం ఆసన్నమైంది. ప్రజలంతా తెలంగాణ ఇచ్చిన సోనియాకు రుణపడి ఉన్నందున కాంగ్రెస్‌ను అధికారంలోకి తీసుకొచ్చి ఆ రుణం తీర్చుకుందాం.

హామీలతోనే మభ్య పెడుతున్నారు..

కేసీఆర్ సీఎంగా ఏ వాగ్దానాన్నీ పరిపూర్ణంగా అమలు చేయలేదు. అరకొరగా అమలు చేసి వారికి ఇచ్చినట్లుగానే మీకు ఇస్తామని మరొకరికి చెబుతూ మాయమాటలతో కాలం గడుపుతున్నారు. అవే మాయమాటలతో మూడోసారి అ ధికారంలోకి రావాలని చూస్తున్నారు. ఇప్పటికైనా అడ్డుకోకపోతే సోనియా తెలంగాణను ఇచ్చిన ఉద్దేశం నెరవేరదు. తెలంగాణ ఏర్పాటు సమయాన సోనియాపై విభజన చే యొద్దనే ఒత్తిడి కూడా ఉంది. భవిష్యత్తులో ఏపీలో కాంగ్రెస్ రాదని తెలిసినా ఆత్మబలిదానాలు చేసుకున్న వేలాది మంది యువకుల కోసం తెలంగాణ రాష్ట్రాన్ని ఇచ్చారు.

క్లుప్తంగా...

సిమ్లా కాదు బెంగళూరు

న్యూఢిల్లీ: వచ్చే లోక్‌సభ ఎన్నికల్లో అధికార బీజేపీని గద్దె దింపడమే లక్ష్యంగా చేతులు కలిపిన ప్రతిపక్ష పార్టీలు రెండో విడతగా బెంగళూరులో సమావేశం కానున్నాయి. తొలుత సిమ్లాలో భేటీ నిర్వహించాలని భావించినప్పటికీ వేదికను బెంగళూరుకి మార్చారు. జులై 13, 14 తేదీలలో విపక్షాల భేటీ ఉంటుందని ఎన్సీపీ చీఫ్ శరద్ పవార్ వెల్లడించారు. పట్నాలో జరిగిన తొలి సమావేశంలో 17 పార్టీలు కలసి కట్టుగా వచ్చే ఎన్నికల్లో పోటీ చేయాలని నిర్ణయించిన విషయం తెలిసిందే. ఈ సారి సమావేశంలో ప్రతిపక్ష పార్టీ నాయకులు ప్రజా సమస్యలపై పోరుబాట, లోక్‌సభ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలు, ఉమ్మడి ఎజెండా, సీట్ల సర్దుబాటు వంటి అంశాలపై చర్చించనున్నారు. గురువారం విలేకరుల సమావేశంలో మాట్లాడిన శరద్ పవార్ పట్నా సమావేశం తర్వాత ప్రధానమంత్రి నరేంద్ర మోదీలో అసహనం పెరిగిపోయిందని ఆరోపించారు. ఉమ్మడి పౌరస్మృతి మన దేశానికి అవసరమని ప్రధాని వ్యాఖ్యలపై చర్చ జరుగుతున్న సమయంలో యూసీసీపై తమ పార్టీ ఏ నిర్ణయం తీసుకోలేదన్నారు. వివిధ వర్గాలు, మత సంస్థలతో చర్చించాక తుది నిర్ణయం వెల్లడిస్తామన్నారు. యూసీసీ కంటే ముందు దీర్ఘకాలంగా పెండింగ్‌లో ఉన్న మహిళా రిజర్వేషన్ బిల్లును ఆమోదించాలని పవార్ డిమాండ్ చేశారు.

సుప్రీంకోర్టులో నూతన రోస్టర్ విధానం!

సాక్షి, న్యూఢిల్లీ: వేసవి సెలవుల అనంతరం జూలై 3వ తేదీ నుంచి దాఖలైన పిటిషన్ల కేటగిరీల ఆధారంగా సుప్రీంకోర్టులో నూతన రోస్టర్ విధానం అమలులోకి రానున్నట్లు సమాచారం. ప్రజా ప్రయోజన వ్యాజ్యా(పిల్)లు ప్రధాన న్యాయమూర్తి (సీజేఐ) లేదా సీనియర్ జడ్జీలతో కూడిన ద్విసభ్య ధర్మాసనం విచారిస్తుంది. తాజా కేసుల జాబితా, ప్రస్తావనలకు సంబంధించిన నూతన ప్రక్రియ కూడా జూలై 3 నుంచి అమలులోకి రానుంది. మంగళవారం నాటికి ధ్రువీకరించిన తాజా కేసులు ఆటోమేటిక్‌గా సోమవారానికి, మిగిలినవి శుక్రవారం జాబితా చేయనున్నారు. తాజా కేసులను సీజేఐ ఎదుట లాయర్లు ప్రస్తావించాల్సిన అవసరం లేదని సుప్రీంకోర్టు సర్క్యులర్‌లో పేర్కొంది. ప్రస్తావన ప్రొఫార్మాలు మధ్యాహ్నం 3 గంటలలోపు సమర్పిస్తే తదుపరి రోజు ధర్మాసనాలు వాటిపై నిర్ణయం తీసుకుంటాయి. అదే రోజున జాబితా చేర్చాలని కోరుకొనే పక్షంలో ఉదయం 10.30 గంటల లోపు అత్యవసర లేఖతో ప్రొఫార్మాను సంబంధిత అధికారికి అందజేయాలి. వీటిపై భోజన విరామ సమయంలో సీజేఐ నిర్ణయం తీసుకొనే అవకాశం ఉంది.

ఒక తిరుగుబాటు.. కొన్ని ప్రశ్నలు!

రష్యాపై పుతిన్ పట్టు సడలుతోందా?


తిరుగుబాటును ఎందుకు పసిగట్టలేదు?

ప్రిగోజిన్‌కు ఎందుకు కోపం వచ్చింది?

జనరల్ సుకోవిన్‌కు ముందే తెలుసా?

ప్రత్యర్థులపై పుతిన్ వేట మొదలుపెట్టారా?

ఎస్. రాజమహేంద్రారెడ్డి



రష్యా అధ్యక్షుడు వ్లాదిమిర్ పుతిన్ ఇప్పుడు దెబ్బ తిన్న పులా? అలసిపోయిన పులా? దాదాపు రెండు దశాబ్దాలకుపైగా ఎదురులేని, తిరుగులేని నేతగా రష్యాను పరిపాలిస్తున్న పుతిన్‌ను ఉవ్వెత్తున ఎగసి అంతేవేగంగా నేలకరిచిన ఓ సాయుధ తిరుగుబాటు ఉక్కిరిబిక్కిరి చేసింది. నమ్మక ద్రోహాన్ని కూకటివేళ్లతో పెకిలించివేసే రికార్డు ఉన్న పుతిన్ ఈసారి ఎందుకో క్షమాభిక్షతో పేజీ తిప్పేశారు. రష్యాపై పుతిన్ పట్టు సడలుతోంది అనడానికి ఇంతకంటే నిదర్శనం ఏం కావాలి? ఎన్నో రహస్య యుద్ధాల్లో తన కనుసన్నల్లో కాలుదువ్విన వాగ్నర్ గ్రూప్‌సేనలు మడమతిప్పి తన మీదే తుపాకీ ఎక్కుపెట్టడం పుతిన్‌కు మింగుడు పడడం లేదు. వండివార్చే చెఫ్ నుంచి కిరాయి సేన చీఫ్‌గా అంచెలంచెలుగా ఎదిగిన యెవ్గెనీ ప్రిగోజిన్ తిరుగుబాటుకు తెగిస్తాడని పుతిన్ కలలో కూడా ఊహించలేదు. ఆయన తేరుకునేలోపే ప్రిగోజిన్ సేనలు రష్యాలో ఓ పట్టణాన్ని తమ అధీనంలోకి తీసుకోవడమే కాకుండా రాజధాని మాస్కో ముట్టడికి కదం తొక్కాయి. అపారమైన సైనిక శక్తి, సాయుధ సంపత్తి కలిగి ఉన్న రష్యా ఈ కిరాయి సేనలను ఎందుకు నిలువరించలేకపోయిందో ఎవరికీ అర్థం కాని మిలియన్ డాలర్ల ప్రశ్న! తిరుగుబాటును ముందస్తుగా పసిగట్టలేనంత దుస్థితిలో రష్యా ఇంటెలిజెన్స్ వర్గాలు ఉన్నాయా? అన్న అనుమానం రాక మానదు. పుతిన్‌లో మునుపటి దూకుడు లేదనడానికి ఇది నిదర్శనం కాదా? అనవసరమైన రాజ్యకాంక్షకు దాసోహమని అందుబాటులో ఉన్న బలగాలన్నింటినీ ఉక్రెయిన్‌పై మోహరించడం తిరుగుబాటుకు కారణం కాదా? ఇంతకీ పుతిన్‌కు ఏమైంది? రాజకీయ విశ్లేషకులకు కూడా అర్థం కాని ప్రశ్న ఇదే.

ఈ క్షమాభిక్ష తాత్కాలికమే!

తిరుగుబాటును వెన్నుపోటుగా, దేశ ద్రోహంగా అభివర్ణించిన పుతిన్ అందుకు కారణమైన వాళ్ల అంతు చూస్తానంటూ బాహాటంగా ప్రకటించకపోవడం సామాన్య పౌరులకు సైతం విడ్డూరంగా అనిపించింది. బెలారస్ అధ్యక్షుడు లుకషెంకో మధ్యవర్తిత్వంతో తిరుగుబాటు తిరుగుబాట పట్టినప్పటికీ, ప్రిగోజిన్‌కు, అతడి కిరాయి సేనలకు పుతిన్ క్షమాభిక్ష ప్రసాదించడం ఈ మొత్తం ఉదంతానికి యాంటీ క్లయిమాక్స్‌గానే చెప్పుకోవాలి. ఈ క్షమాభిక్ష తాత్కాలికమేనని, తిరుగుబాటుదారుల్లో ఏ ఒక్కరినీ పుతిన్ వదిలిపెట్టరనేది మరికొందరి వాదన. ఏది ఏమైనప్పటికీ పుతిన్ అధికార ప్రస్థానంలో ఇది మాయని మచ్చగానే మిగిలిపోతుంది. తిరుగుబాటు చల్లారిన తర్వాత పుతిన్ రెండుసార్లు జాతినుద్దేశించి ప్రసంగించారు. ఆ రెండూ రికార్డు చేసి, ప్రసారం చేసినవే కావడం గమనార్హం. రష్యా ప్రజలను అవి పెద్దగా ఆకట్టుకోలేదు. ఇంత జరిగినా రష్యా ప్రజల్లో అధిక శాతం ఆయనకు మద్దతుగానే నిలవడం విశేషం. ఈ నేపథ్యంలో పుతిన్ ఉన్నట్టుండి బుధవారం జనం మధ్యలో ప్రత్యక్షమయ్యారు. వారితో కరచాలనాలు చేసి తానేమీ బెదిరిపోలేదనే సంకేతాలు పంపించారు.

ఆయుధాలు ఇవ్వనందుకేనా?

వంటవాడు గరిటె విసిరేసి తుపాకీ పడితే.. అతడే యెవ్గెనీ ప్రిగోజిన్ అవుతాడు. రష్యా అధ్యక్షుడు పుతిన్‌కు ఇష్టమైన వంటకాలను రుచికరంగా వండి వడ్డించి ఆయనకు కుడిభుజంగా రూపాంతరం చెందిన ప్రిగోజిన్ హఠాత్తుగా పక్కల్లో బల్లెంలా తయారై 24 గంటలపాటు తన బాస్‌ను భయపెట్టేశాడు. పుతిన్‌కు ఇంతకాలం విధేయుడిగా మసలిన ప్రిగోజిన్‌కు ఎందుకు అంత కోపమొచ్చింది? ఉక్రెయిన్‌లో తన సారథ్యంలోని వాగ్నర్ గ్రూప్ సేనలు సాధించిన విజయాలను రష్యా సైన్యం వారి ఖాతాలో వేసుకోవడం ప్రధాన కారణంగా కనిపిస్తోంది. యుద్ధం గడుస్తున్న కొద్దీ కరిగిపోతున్న ఆయుధ నిల్వలు, మందుగుండు సామగ్రిని భర్తీ చేయకపోవడం ప్రిగోజిన్‌ను అసహనానికి గురిచేసింది. నిజానికి అతడి కోపమంతా రష్యా రక్షణ మంత్రి సెర్గీ షోయిగూ, చీఫ్ జనరల్ వాలెరీ గెరాసిమో పైనే. బఖ్‌ముత్ ప్రాంతంలో ఉక్రెయిన్ సేనలతో జరిగిన యుద్ధంతో తమకు కావాల్సిన ఆయుధాలను సరఫరా చేసేందుకు రష్యా ససేమిరా అనడమే తిరుగుబాటు అసలు కారణమని విశ్లేషకుల అంచనా. రష్యాకు ఆయువు పట్టయిన కీలక మిలటరీ స్థావరం రోస్తోవ్‌ను చేజిక్కించుకొని, అదే ఊపులో ప్రిగోజిన్ సేనలు మాస్కో వైపు కదలడంతో తిరుగుబాటు బహిర్గతమైంది. అయితే రష్యా వైమానిక దళం కమాండర్ జనరల్ సెర్గెయ్ సురోవికిన్‌కు ఈ తిరుగుబాటు వ్యూహం గురించి ముందే తెలుసని, అంతర్లీనంగా ఆయన మద్దతు ప్రిగోజిన్‌కు ఉందని భోగట్టా. అందుకే ఆయన మౌనంగా ఉండిపోయారని రష్యా నిఘా వర్గాల సమాచారం. రష్యా సైన్యంలో కీలక స్థానాల్లో ఉన్న మరికొందరు జనరల్స్ సైతం పుతిన్ వ్యవహార శైలి రుచించక ప్రిగోజిన్‌కు పరోక్షంగా మద్దతు ఇచ్చారన్న వార్తలు కూడా చక్కర్లు కొడుతున్నాయి.

వాగ్నర్ గ్రూప్ కిరాయి సేనల పరిస్థితేమిటి?


సిరియా అంతర్యుద్ధంలో, 2014లో ఉక్రెయిన్ నుంచి క్రిమియాను హస్తగతం చేసుకొనే క్రమంలో జరిగిన పోరాటంలో క్రెమ్లిన్ తరఫున ప్రిగోజిన్ పనిచేశాడు. అంతటి వీరవిధేయుడు తిరుగుబాటు నేపథ్యంలో పుతిన్‌కు బద్ధశత్రువుగా మారిపోయాడు. అయినప్పటికీ బెలారస్ అధ్యక్షుడి మధ్యవర్తిత్వంతో ప్రిగోజిన్ క్షేమంగా రష్యా పొలిమేరలు దాటి వెళ్లిపోయాడు. ఏ షరతులకు లోబడి క్రెమ్లిన్‌కు, ప్రిగోజిన్‌కు మధ్య సంధి కుదిరిందో ఇంకా బయటపడలేదు. సంధి కుదిర్చిన బెలారస్ అధ్యక్షుడు లుకషెంకో కూడా దీనిపై ఏ ప్రకటనా చేయలేదు. పుతిన్ కూడా ఈ అంశంపై పెదవి విప్పలేదు. క్షమాభిక్ష పెడుతున్నానని మాత్రమే ప్రకటించాడు. పుతిన్ మునుపటి బలవంతుడు కాదు, బలహీనుడు అని అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ వ్యాఖ్యానించడం ఇక్కడ గమనార్హం. ప్రిగోజిన్ క్షమాభిక్షతో బయటపడినప్పటికీ అతడి సారథ్యంలోని వాగ్నర్ గ్రూప్ కిరాయి సైనికుల భవిష్యత్తు ఏమిటన్నది ఇంకా తేలలేదు. చెల్లాచెదురైపోతారా? లేక రష్యా సైన్యంలో విలీనమై ఉక్రెయిన్‌పై యుద్ధం కొనసాగిస్తారా? అనేది వేచి చూడాల్సిందే.

కొసమెరుపు..

తిరుగుబాటు జరిగి(జూన్ 23) వారం రోజులవుతోంది. 24 గంటల్లోనే ఈ తిరుగుబాటు చల్లారడం, బాధ్యుడైన ప్రిగోజిన్ స్వేచ్ఛగా రష్యా విడిచి వెళ్లడం జరిగిపోయింది. అయితే ప్రిగోజిన్ ఎక్కడ తలదాచుకున్నాడో ఎవరికీ అంతుబట్టడం లేదు. మరోవైపు తిరుగుబాటు సమాచారం ముందే తెలిసినా మౌనంగా ఉండిపోయిన రష్యా వైమానిక దళం కమాండర్ సెర్గెయ్ సురోవికిన్ కూడా మాయమైపోయాడు. ఆయన ఎక్కడున్నాడో ఇటు రష్యా నిఘా సంస్థకు గానీ, అటు ఆయన కుటుంబ సభ్యులకు గానీ సమాచారం లేదు. అవిధేయతను అణచివేయడంలో సిద్ధహస్తుడైన పుతిన్ వేట మొదలుపెట్టారా? ఏమో! ఏమైనా కావొచ్చు!!

త్వరలో కేంద్ర కేబినెట్ పునర్వ్యవస్థీకరణ?

3న ప్రధాని సారథ్యంలో కేబినెట్ భేటీ



న్యూఢిల్లీ: ప్రధానమంత్రి నరేంద్ర మోదీ అధ్యక్షతన వచ్చే నెల 3వ తేదీన కేంద్ర మంత్రి మండలి సమావేశం కానుంది. కేంద్ర మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణ జరగనుందన్న వార్తల నేపథ్యంలో ఈ భేటీ ప్రాధాన్యం సంతరించుకుంది. ప్రగతి మైదాన్‌లో కొత్తగా నిర్మించిన కన్వెన్షన్ సెంటర్‌లో జూలై 3న మంత్రివర్గ భేటీ జరిగే అవకాశం ఉందని అధికారులు గురువారం తెలిపారు. బుధవారం ప్రధాని మోదీ తన నివాసంలో పార్టీ కీలక నేతలతో సుదీర్ఘ చర్చలు జరిపారు. 2024 ఎన్నికల్లో పార్టీ వ్యూహంపై చర్చలు జరిపారు. 2024 ఎన్నికలకు ముందు ఒక రోడ్‌మ్యాప్‌ను రూపొందించడం, ఎదుర్కొనే సవాళ్లపై ఒక స్పష్టత సాధించడం వంటి వాటిపై సమావేశం దృష్టి సారించింది. హోం మంత్రి అమిత్ షా, బీజేపీ అధ్యక్షుడు జేపీ నడ్డా తదితరులు ఇందులో పాల్గొన్నారు. జేపీ నడ్డా కూడా చర్చల్లో పాల్గొనడంతో మంత్రివర్గ పునర్వ్యవస్థీకరణతో పాటు బీజేపీ పార్టీలో రాష్ట్ర స్థాయిలోనూ మార్పులు జరిగే అవకాశం ఉందన్న ఊహాగానాలు వెలువడ్డాయి. మరికొద్ది నెలల్లో కీలక రాష్ట్రాల్లో అసెంబ్లీ ఎన్నికలు, 2024లో లోక్‌సభ ఎన్నికలు ఉండటంతో ఆ మేరకు సన్నద్ధత చర్యలను ప్రారంభించే అవకాశాలున్నాయన్న అంచనాలున్నాయి. ఈ విషయమై అధికారికంగా బీజేపీ ఎలాంటి వ్యాఖ్యలు చేయలేదు. అయినప్పటికీ, ఉమ్మడి పౌరస్మృతి(యూసీసీ)అంశాన్ని ఇటీవల భోపాల్ జరిగిన ర్యాలీలో ప్రధానమంత్రి మోదీ ప్రస్తావించడాన్ని బట్టి చూస్తే 2024 ఎన్నికలకు ముందు బీజేపీ తన ప్రధాన సైద్ధాంతిక ఎజెండాను తెరపైకి తెచ్చే అవకాశాలున్నాయంటున్నారు. గత కొన్ని రోజులుగా అమిత్ షా, నడ్డా, బీజేపీ ప్రధాన కార్యదర్శి (సంస్థాగత) బీఎల్ సంతోష్ కూడా పలురౌండ్ల చర్చలు జరిపి సంస్థాపరమైన, రాజకీయ అంశాలను చర్చించారని తెలుస్తోంది. ఈ ఏడాదిలోనే రాజస్తాన్, ఛత్తీస్‌గఢ్, మధ్యప్రదేశ్, తెలంగాణ, మిజోరం అసెంబ్లీలకు ఎన్నికలు జరగనున్నాయి. సాధారణంగా పార్లమెంట్ సమావేశాలకు ముందుగా కేబినెట్ భేటీ జరుగుతుంటుంది. జూలై మూడో వారం నుంచి వర్షాకాల సమావేశాలు మొదలుకానున్నాయి. కేబినెట్ చివరి సమావేశం ఈ ఏడాది జనవరిలో, బడ్జెట్ సమావేశాలకు ముందుగా జరిగింది. అయితే, రానున్న సమావేశానికి మరో ప్రాధాన్యం ఉంది. మోదీ పాలనకు తొమ్మిదేళ్లు పూర్తయిన సందర్భంగా జరగనున్న సమావేశంగా కూడా నిలువనుంది.

సీఎం చౌహాన్‌పై కాంగ్రెస్ పోస్టర్‌వార్..

ఫోన్ పే వార్నింగ్!

భోపాల్: మధ్యప్రదేశ్‌లో బీజేపీకి చెందిన శివరాజ్ సింగ్ చౌహాన్ ప్రభుత్వంపై కాంగ్రెస్ చేపట్టిన పోస్టర్ ప్రచారం బెడిసికొట్టింది. ఆ పార్టీకి డిజిటల్ పేమెంట్స్ సంస్థ ఫోన్ పే గట్టి వార్నింగ్ ఇచ్చింది. కొద్ది నెలల్లో అసెంబ్లీ ఎన్నికలు జరగనున్న వేళ బీజేపీ, ప్రతిపక్ష కాంగ్రెస్ పోస్టర్ యుద్ధం మొదలుపెట్టాయి. సీఎం చౌహాన్ చిత్రంతో కాంగ్రెస్ పార్టీ రాష్ట్రవ్యాప్తంగా పోస్టర్లు వేసింది. దుకాణాల్లో ఉండే క్యూఆర్ కోడ్ మాదిరిగానే ఈ పోస్టర్లున్నాయి. ఆ పార్టీ ట్విట్టర్ ఖాతాలోనూ వీటిని షేర్ చేసింది. చేసిన ప్రతి పనికీ సీఎం చౌహాన్ 50% కమీషన్ తీసుకుంటున్నారంటూ ఆరోపించింది. ఆ పోస్టర్లలో ఫోన్‌పే బ్రాండ్ పేరు, లోగో కూడా ఉండటం విశేషం. దీనిపై ఫోన్‌పే స్పందించింది. లోగో వాడటంపై అభ్యంతరం వ్యక్తం చేసింది. బ్యానర్లు, పోస్టర్లపై తమ బ్రాండ్ పేరు, లోగోను తీసేయాలని, లేకుంటే చట్టపరంగా వెళ్తామని హెచ్చరించింది. ఇటీవల కర్ణాటకలో అధికారంలోకి వచ్చేందుకు కాంగ్రెస్‌కు పోస్టర్ ప్రచారం బాగా కలిసొచ్చింది. ఇదే ప్రచార తంత్రాన్ని ఇక్కడా అమలు చేయాలని భావించిన కాంగ్రెస్‌కు ఇలా అనూహ్యంగా షాక్ తగిలింది.



అయితే..పోస్టర్ వార్‌ను బీజేపీయే మొదలుపెట్టిందని కాంగ్రెస్ ఆరోపిస్తోంది. మధ్యప్రదేశ్ పీసీసీ చీఫ్ కమల్‌నాథ్‌ను అవినీతి పరుడంటూ వాంటెడ్ కమీషన్ నాథ్ పేరుతో పోస్టర్లు వేసిందని విమర్శించింది. ఈ ఆరోపణను బీజేపీ ఖండించింది. కాంగ్రెస్ పార్టీలోని కమల్‌నాథ్ అంటే గిట్టనివారే ఈ పని చేసి ఉంటారని, అవి తాము వేసిన పోస్టర్లు కాదంటూ ఖండించింది.



ఆస్ట్రియా కళాకారుడు గుస్తావ్ క్లిమ్ట్ గీసిన 'లేడీ విత్ ఏ ఫ్యాన్' చిత్రం. లండన్‌లోని సోత్‌బీలో ఇటీవల జరిగిన వేలంలో రూ.8,854 కోట్లు పలికింది. యూరప్‌లో ఇప్పటి వరకు అమ్ముడైన అత్యంత ఖరీదైన చిత్రంగా రికార్డుకెక్కింది.

మణిపూర్‌లో రాహుల్ గాంధీ అడ్డగింత

- ఘర్షణల భయంతో కాన్వాయ్‌ని అడ్డుకున్న పోలీసులు
- హెలికాప్టర్‌లో చురాచాంద్‌పూర్ చేరుకున్న రాహుల్
- సహాయక శిబిరాల్లోని అల్లర్ల బాధితులకు పరామర్శ

ఇంఫాల్: మణిపూర్‌లో సొంత గ్రామాలు వదిలేసి, సహాయక శిబిరాల్లో తలదాచుకుంటున్న అల్లర్ల బాధితులను పరామర్శించేందుకు వెళ్లిన కాంగ్రెస్ సీనియర్ నేత రాహుల్ గాంధీ వాహన శ్రేణిని పోలీసులు కొన్ని గంటలపాటు అడ్డుకున్నారు. చివరకు ఆయన హెలికాప్టర్‌లో సహాయక శిబిరాల వద్దకు చేరుకొని, బాధితులను పరామర్శించారు. రాహుల్ గురువారం ఉదయం విమానంలో ఢిల్లీ నుంచి ఇంఫాల్‌కు చేరుకున్నారు. అక్కడి నుంచి తన కాన్వాయ్‌లో చురాచాంద్‌పూర్‌కు బయలుదేరారు. ఇంఫాల్‌కు 20 కిలోమీటర్ల దూరంలోని బిష్ణుపూర్‌లో రాహుల్ కాన్వాయ్‌ని పోలీసులు అడ్డుకున్నారు. రాహుల్ చాలాసేపు అక్కడే ఉండిపోయారు. రాహుల్ కాన్వాయ్‌ని ముందుకు వెళ్లనివ్వాలని డిమాండ్ చేస్తూ కాంగ్రెస్ కార్యకర్తలు, ఆయన రాకను వ్యతిరేకిస్తూ మరోవర్గం ప్రజలు ఆందోళనకు దిగారు. దీంతో తీవ్ర ఉద్రిక్త పరిస్థితులు నెలకొన్నాయి. బాష్పవాయువు ప్రయోగించి నిరసనకారులను చెదరగొట్టారు. చురాచాంద్‌పూర్ మార్గంలో ఘర్షణలు జరిగే అవకాశం ఉందని, రాళ్ల దాడులు జరగొచ్చన్న అధికారుల సూచనల మేరకు రాష్ట్ర ప్రభుత్వ హెలికాప్టర్‌లోనే పోలీసు ఉన్నతాధికారులతో కలిసి వెళ్లి సహాయక శిబిరాల్లో ఉంటున్న బాధితులను పరామర్శించారు. ధైర్యంగా ఉండాలని సూచించారు.



బాధితుల పిల్లలతో మాట్లాడుతున్న రాహుల్

దుండగుల కాల్పుల్లో ఒకరి మృతి

మణిపూర్‌లో దుండుగుల కాల్పుల్లో ఒకరు మరణించారు. మరికొందరు గాయపడ్డారు. రాజధాని ఇంఫాల్‌కు దాదాపు 20 కిలోమీటర్ల దూరంలో కాంగ్‌పోక్పీ జిల్లా హరావోథెల్ గ్రామంలో గురువారం ఈ సంఘటన జరిగింది. ఘటనా స్థలంలో ఒక మృతదేహం లభ్యమైందని ప్రభుత్వ అధికారులు చెప్పగా, మరికొంత మంది మరణించి ఉంటారని సైనికులు వెల్లడించారు. దుండగులు ఉదయం 5.30 గంటలకు స్థానికులపై కాల్పులు ప్రారంభించారు. భద్రతా సిబ్బంది రాకను గమనించి పారిపోయారు.

భగ్గుమన్న ఫ్రాన్సు


- పోలీసు కాల్పుల్లో యువకుడి మృతితో మొదలైన దాడులు
- 40 వేల మంది పోలీసుల్ని రంగంలోకి దించిన ప్రభుత్వం

పారిస్: పోలీసు కాల్పుల్లో 17 ఏళ్ల యువకుడు మృతి ఘటనతో ఫ్రాన్సు భగ్గుమంది. పారిస్ శివారులోని నాంటెర్రెలోని ట్రాఫిక్ స్టాప్ వద్ద మంగళవారం నహెల్ అనే యువకుడిని పోలీసులు కాల్చి చంపారు. ఈ ఘటనతో రెండు రోజులుగా హింసాత్మక ఘటనలు కొనసాగుతున్నాయి. ఆందోళనకారులు దేశవ్యాప్తంగా నిరసనలకు దిగారు. ముఖ్యంగా పారిస్ నగరంలోని స్కూళ్లు, టౌన్‌హాళ్లు, పోలీస్ స్టేషన్లు వంటి పలు ప్రభుత్వ భవంతులు, వాహనాలు, ఇతర ఆస్తులకు నిప్పంటించారు. రాళ్లు రువ్వారు. వీటిని నిలువరించేందుకు పోలీసులు పలుమార్లు బాష్పగోళాలు ప్రయోగించారు. దాడుల్లో 100కు పైగా ప్రభుత్వ భవనాలు దెబ్బతిన్నట్లు అంచనా వేసింది. ఆందోళనకారుల దాడుల్లో 170 మంది పోలీసులకు గాయాలయ్యాయి. వీటన్నిటికీ చెక్ పెట్టేందుకు ఫ్రాన్సు ప్రభుత్వం నిర్ణయించింది. సిబ్బంది, ప్రయాణికుల భద్రతను దృష్టిలో ఉంచుకుని బస్సు, రైలు సర్వీసులను నిలిపివేసింది. దీని ఫలితంగా రాజధాని, శివారు ప్రాంతాలకు చెందిన వేలాది మంది ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. దాడులు ఎక్కువగా జరిగిన ప్రాంతాల్లో పెద్ద సంఖ్యలో పోలీసులను మోహరించింది. ప్రస్తుతమున్న పోలీసుల సంఖ్యను 9 వేల నుంచి 40 వేలకు పెంచింది. నిరసనకారులపై కఠినచర్యలు తప్పవని హెచ్చరించింది. యువకుడిపై కాల్పుల ఘటనకు కారకులపై దర్యాప్తు జరిపి చర్యలు తీసుకుంటామని తెలిపింది.



పారిస్ శివారులో తగలబడుతున్న కార్లు

తమిళనాడు మంత్రివర్గం నుంచి సెంథిల్ బాలాజీ బర్తరఫ్



చెన్నై: తమిళనాడు గవర్నర్ ఆర్.ఎన్.రవి సంచలన నిర్ణయం తీసుకున్నారు. తీవ్ర అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ఎక్సైజ్ మంత్రి సెంథిల్ బాలాజీని కేబినెట్ నుంచి బర్తరఫ్ చేశారు. ఈ మేరకు తమిళనాడు రాజ్‌భవన్ గురువారం ప్రకటన విడుదల చేసింది. లంచాలు తీసుకొని ఉద్యోగాలు ఇప్పించడంతోపాటు మనీ లాండరింగ్ వ్యవహారాల్లో సెంథిల్ బాలాజీపై కేసులు నమోదయ్యాయని, దర్యాప్తు సైతం ప్రారంభమైందని వెల్లడించింది. ప్రస్తుతం ఈడీ దర్యాప్తు చేస్తోందని, ఆయన జ్యుడీషియల్ కస్టడీలో ఉన్నాడని గుర్తు చేసింది.

బాలల సంరక్షణకు భారత్ చర్యలు భేష్



ఐక్యరాజ్య సమితి: అంతర్జాతీయంగా భారత్‌కు మరో శుభపరిణామమిది. చిన్న పిల్లలు సాయుధ పోరాటాల వైపు వెళ్లకుండా కట్టడి చేసినందుకు గాను ఐక్యరాజ్యసమితి సెక్రటరీ జనరల్ (యూఎన్‌ఎస్‌జీ) వార్షిక నివేదిక నుంచి భారత్ పేరును తొలగించినట్టుగా యూఎన్ సెక్రటరీ జనరల్ ఆంటోనియా గుటెరెస్ తెలిపారు. సాయుధ ఘర్షణల ప్రభావం పడకుండా చిన్నారుల మెరుగైన సంరక్షణ కోసం భారత్ తీసుకున్న చర్యల్ని గుటెరెస్ స్వాగతించారు. 2010 నుంచి భారత్ పేరు ఈ నివేదికలో ఉంటూ వస్తోంది. కశ్మీర్‌లో ఉగ్రసంస్థలు బాలలను నియమించడం, భద్రత పేరుతో సైనికులు తిరిగి అదుపులోకి తీసుకోవడం వంటివాటితో భారత్ పేరు ఆ నివేదికలో ఉంటూ వస్తోంది. భారత్‌తో పాటు బుర్కినా ఫాసో, కేమరూన్, నైజీరియా, పాకిస్తాన్, ఫిలిప్పీన్స్‌లోనూ చిన్నారులు ఉగ్రమూకల్లో చేరుతున్నట్టు యూఎన్ నివేదికలు చెబుతున్నాయి. బాలల హక్కుల పరిరక్షణకు కశ్మీర్‌లో ఒక కమిషన్‌ను ఏర్పాటు చేయడంపై గుటెరెస్ హర్షం వ్యక్తం చేశారు. బాలల సంక్షేమం కోసం చేపట్టిన చర్యలతో ఛత్తీస్‌గఢ్, అసోం, జార్ఖండ్, ఒడిశా, జమ్మూకశ్మీర్‌లలో బాలల సంరక్షణ మెరుగైందని ఆ నివేదిక వెల్లడించింది.

కృత్రిమ తీపితో క్యాన్సర్!

వాషింగ్టన్: కూల్ డ్రింకులు తదితర బేవరేజెస్‌ల్లో నాన్ షుగర్ స్వీటెనర్(ఎన్‌ఎస్‌ఎస్)ల వాడకంపై అనుమానాలు తలెత్తుతున్నాయి. వీటిని వాడటం మానేయాలంటూ ప్రపంచ ఆరోగ్య సంస్థ(డబ్ల్యూహెచ్‌వో) మే నెలలో కొత్తగా మార్గదర్శకాలను విడుదల చేసింది. ప్రపంచంలో అత్యంత సాధారణంగా వాడే కృత్రిమ స్వీటెనర్‌లలో ఒకటైన అస్పర్టెమ్‌తో క్యాన్సర్ ప్రమాదం ఉన్నదంటూ తాజాగా పరిశోధనలో తేలడంతో దీని వినియోగంపై అమెరికాలో సమీక్ష మళ్లీ మొదలైందని వాషింగ్టన్ పోస్ట్ కథనం పేర్కొంది. అత్యంత విరివిగా వాడే కృత్రిమ షుగర్ పదార్థం ఒకటి క్యాన్సర్‌కు కారకంగా మారే అవకాశం ఉందని వచ్చే నెలలో డబ్ల్యూహెచ్‌వో క్యాన్సర్ రీసెర్చ్ ఏజెన్సీ ప్రకటించనుందంటూ రాయిటర్స్ తెలిపింది. అస్పర్టెమ్‌ను వాడొచ్చంటూ అమెరికా ఫుడ్ అండ్ డ్రగ్ అడ్మినిస్ట్రేషన్(ఎఫ్‌డీఏ) 1981లోనే అనుమతులిచ్చింది. అయిదేళ్లకోసారి ఈ అనుమతిని సమీక్షిస్తూ వస్తోంది. భారత్ సహా 90కి పైగా దేశాల్లో అస్పర్టెమ్ వినియోగంలో ఉంది. అస్పర్టెమ్‌లో ఎలాంటి కేలరీలు ఉండవు. చక్కెర కంటే సుమారు 200 రెట్లు తీపిని ఇది కలిగిస్తుంది. అస్పర్టెమ్‌ను వినియోగించేందుకు 2009లో భారత ఫుడ్ సేఫ్టీ అండ్ రెగ్యులేషన్ సంస్థ(ఎఫ్‌ఎస్‌ఎస్‌ఏఐ) అనుమతినిచ్చింది. అస్పర్టెమ్‌ను 95% కార్బొనేటెడ్ సాఫ్ట్ డ్రింకుల్లో స్వీటెనర్‌గా వాడుతున్నారు. బేవరేజెస్ మార్కెట్ షేర్‌లో అతిపెద్దదైన రెడీ టూ డ్రింక్ టీల్లో 90% వరకు వినియోగిస్తున్నారు. మిగతా స్వీటెనర్లతో పోలిస్తే అస్పర్టెమ్, అసెసల్ఫేమ్–కె అనే వాటి వాడకంతో క్యాన్సర్ ప్రమాదం కాస్త ఎక్కువేనంటూ గతేడాది ఫ్రాన్సులో చేపట్టిన ఓ అధ్యయనంలో తేలింది.



అంతరిక్షంలో నేపథ్య గానం!

పల్సర్స్ నక్షత్రాల నుంచి గురుత్వాకర్షణ తరంగాలు



పారిస్: అంతరిక్షంలో ప్రతిధ్వనిస్తున్న శబ్దాలకు సంబంధించిన విశేషాలను ఖగోళ శాస్త్రవేత్తలు తెలుసుకున్నారు. గురుత్వాకర్షణ తరంగాల నుంచి ఉద్భవిస్తున్న ధ్వనులపై ఒక ప్రకటన చేశారు. అంతరిక్షంలో వినిపిస్తున్న శబ్దాలకు సంబంధించిన నేపథ్య(బ్యాక్‌గ్రౌండ్) స్వరాలను గుర్తుపట్టినట్లు తెలియజేశారు. ఈ ప్రయోగంలో భారతీయ ఖగోళ శాస్త్రవేత్తలు సైతం కీలక పాత్ర పోషించడం విశేషం. పుణెలో ఉన్న రేడియో టెలిస్కోప్‌కు ఆ ధ్వని తరంగాలు చిక్కాయి. దాదాపు 15 ఏళ్ల నుంచి ఆ డేటాను సేకరిస్తున్నారు. అంతరిక్షంలోని సుదూర ప్రాంతాల నుంచి ఆ లయబద్ధమైన శబ్దాలు(హమ్మింగ్) వస్తున్నట్లు తేల్చారు. నార్త్ అమెరికన్ నానోహెర్ట్జ్ అబ్జర్వేటరీ ఫర్ గ్రావిటేషన్ వేవ్స్ బృందం ఆధ్వర్యంలో ఈ అధ్యయనం నిర్వహించారు. ఇండియా, కెనడా, యూరప్, చైనా, ఆస్ట్రేలియా ఖగోళ శాస్త్రవేత్తలు ఈ అధ్యయనంలో పాల్గొన్నారు. పల్సర్స్ అనే మండిన నక్షత్రాల నుంచి గురుత్వాకర్షణ తరంగాలు వస్తున్నట్లు గుర్తించారు. ఇవి శక్తివంతమైన గురుత్వాకర్షణ శబ్దాలను సృష్టిస్తున్నట్లు తేల్చారు. అంతరిక్షంలో గురుత్వాకర్షణ తరంగాల నుంచి శబ్దాలు వెలువడుతున్నట్లు శతాబ్దం క్రితమే ప్రఖ్యాత శాస్త్రవేత్త ఆల్బర్ట్ ఐన్‌స్టీన్ వెల్లడించారు.

బైడెన్‌కు తీవ్ర నిద్ర సమస్య

ఆయన సీపాప్ ఉపకరణం వాడుతున్నారన్న శ్వేతసౌధం

వాషింగ్టన్: అమెరికా అధ్యక్షుడు జో బైడెన్ నిద్రకు సంబంధించిన స్లీప్ అప్నియా అనే తీవ్రమైన సమస్యతో బాధపడుతున్నారు. దీంతో, ఆయన కొన్ని రోజులుగా నిద్ర కోసం సీపాప్(కంటిన్యువస్ పాజిటివ్ ఎయిర్ వే ప్రెజర్) అనే యంత్రాన్ని వాడుతున్నారని వైట్‌హౌస్ అధికారులు తెలిపారు. స్లీప్ అప్నియా సమస్య ఆయనకు దశాబ్దకాలంగా ఉందని తెలిపారు. 2008 నుంచి ఈ సమస్యతో బాధపడుతున్నట్లు ఆయన తన మెడికల్ రిపోర్టుల్లో వెల్లడిస్తున్నారని కూడా పేర్కొన్నారు. స్లీప్ అప్నియా అనేది సాధారణంగా కనిపించే సమస్య. నిద్రలో ఉన్న సమయంలో గాలి పీల్చుకోవడం తరచూ ఆగిపోతుంటుంది. ఈ సమస్య ఉన్న వారు రాత్రి మొత్తం నిద్రపోయినా పగటి వేళ అలసిపోయినట్లు ఉంటారు. సీపాప్ యంత్రాన్ని అధ్యక్షుడు మంగళవారం రాత్రి కూడా వాడాల్సి వచ్చిందని వైట్‌హౌస్ అధికారులు వివరించారు. షికాగోలో ఓ కార్యక్రమంలో ప్రసంగించేందుకు బయలుదేరిన సమయంలో ఆయన ముఖంపై గీతలు కనిపించాయి. సీపాప్ పరికరాన్ని వాడటం వల్లే ఇలా గీతలు పడ్డాయని తెలిపారు.

రాక్షస బల్లులతో మానవులకు స్వల్పకాలిక పరిచయం

లండన్: భూమిపై మనుషులతో సహా పలు రకాల క్షీరదాలు ఒకప్పుడు రాక్షస బల్లులతో(డైనోసార్లు) కలిసి జీవించినట్లు ఇంగ్లాండ్‌లోని యూనివర్సిటీ ఆఫ్ బ్రిస్టల్ సైంటిస్టుల అధ్యయనంలో వెల్లడయ్యింది. క్షీరదాల శిలాజాల పరీక్ష ఆధారంగా ఈ నిర్ధారణకు వచ్చారు. దాదాపు 6.60 కోట్ల ఏళ్ల క్రితం బలమైన గ్రహ శకలం భూమిని ఢీకొట్టడంతో రాక్షస బల్లులు అంతమైనట్లు పరిశోధకులు ఇప్పటికే నిర్ధారించారు. అంతకంటే కొంత కాలం ముందే మనుషులతోపాటు కుందేళ్లు, శునకాలు, పిల్లులు, గబ్బిలాల వంటి క్షీరదాలు పరిణామ క్రమంలో భూమిపై ఆవిర్భవించాయి. అవి రాక్షస బల్లులతోపాటే మనుగడ సాగించాయని బ్రిస్టల్ సైంటిస్టులు తేల్చారు. ఈ అధ్యయనం వివరాలను కరెంట్ బయాలజీ జర్నల్‌లో ప్రచురించారు. డైనోసార్లతో ప్రాచీన మానవుల పరిచయం ఎక్కువ కాలం కొనసాగలేదని వెల్లడయ్యింది. మానవులు ఆవిర్భవించిన కొంతకాలానికే డైనోసార్లు అంతం కావడమే ఇందుకు కారణం. భూమిపై జీవనం సాగించే విషయంలో డైనోసార్ల నుంచి ఎలాంటి పోటీ లేకపోవడంతో క్షీరదాలు విస్తృతంగా ఆవిర్భవించాయని, కాలానుగుణంగా వాటిలో వైవిధ్యం సైతం చోటుచేసుకుందని పరిశోధకులు అంచనా వేస్తున్నారు.

సాక్షి
హైదరాబాద్
శుక్రవారం : 30 : జూన్ : 2023



గ్యాస్ లీకై 15 మందికి అస్వస్థత

గ్యాస్ లీకై 15 మంది అస్వస్థతకు గురైన ఘటన గురువారం సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధి ఫతేనగర్‌లో జరిగింది. -8లో



స్టేషన్‌లో ఉండని ఎస్‌హెచ్‌ఓలపై కఠిన చర్యలు

ఠాణాల్లో ప్రజలకు అందుబాటులో ఉండని ఎస్‌హెచ్‌ఓలపై కఠిన చర్యలు తీసుకుంటామని రాచకొండ సీపీ డీఎస్ చౌహాన్ అన్నారు. -8లో

ఆగస్టు 26 నుంచి నృత్య, సంగీత పోటీలు



48వ జాతీయ స్థాయి శాస్త్రీయ నృత్య, సంగీత పోటీలను ఆగస్టు 26 నుంచి వారం రోజుల పాటు నగరంలో నిర్వహించనున్నారు. -8లో





మీరాలం ఈద్గాలో ముస్లింల ప్రత్యేక ప్రార్థనలు



సీబీఎస్ సమీపంలోని విఠోబా ఆలయం వద్ద భక్తుల కోలాహలం

ఆధ్యాత్మిక నగరి

ఒకే రోజు రెండు పర్వదినాలు నగరవాసుల్ని భక్తి పారవశ్యంలో ముంచెత్తాయి. అటు తొలి ఏకాదశి.. ఇటు బక్రీద్ పండగలు హిందూ, ముస్లిం మత సామరస్యానికి అద్దం పట్టాయి. భక్తులు దేవాలయాలకు వెళ్లి తొలి ఏకాదశి పూజలు నిర్వహించారు. బక్రీద్ సందర్భంగా ముస్లింలు ఈద్గాలు, మసీదుల్లో సామూహిక ప్రార్థనలు చేశారు. గురువారం నగరమంతా ఆధ్యాత్మికత, భక్తిభావాలు వెల్లివిరిశాయి.




కేపీహెచ్‌బీలో..

ట్రిపుల్... ట్రబుల్!

పరిమితికి మించి ద్విచక్ర వాహనాలపై ప్రయాణం

- ఇదే ప్రధాన ప్రమాదహేతువుగా మారుతున్న వైనం
- సిటీలో చోటు చేసుకుంటున్న ప్రమాద ఘటనలు
- మృత్యువాత పడుతున్న వారిలో యువకులే అధికం
- దృష్టి సారించిన హైదరాబాద్ ట్రాఫిక్ పోలీసులు
- ఈ ఏడాది ఇప్పటికే 73 వేల కేసులు నమోదు



సాక్షి, సిటీబ్యూరో:

పంజగుట్టలో ఉంటున్న వాసుదేవ్ సాహు, చిత్తరంజన్, రిలీఫ్ సాహు ప్రయాణిస్తున్న బైక్ సికింద్రాబాద్‌లోని క్లాక్ టవర్ చౌరస్తా నుంచి సంగీత్ చౌరస్తా వైపు వస్తూ అదుపుతప్పింది. విద్యుత్ స్తంభాన్ని ఢీ కొట్టడంతో రిలీఫ్ చనిపోగా... మిగిలిన ఇద్దరికీ తీవ్ర గాయాలయ్యాయి.

సంతోష్‌నగర్‌కు చెందిన గండికోట శివ తన స్నేహితులూన జగదీష్, శివలతో కలిసి ద్విచక్ర వాహనంపై బైరామల్‌గూడ బయలుదేరారు. కర్మన్‌ఘాట్ చౌరస్తా సమీపంలో వీళ్లు ప్రయాణిస్తున్న బైక్ అదుపుతప్పి స్కిడ్ అయింది. ఈ ప్రమాదంలో ముగ్గురూ కిందపడిపోగా ఆర్టీసీ బస్సు తలపై నుంచి వెళ్ళడంతో గండికోట శివ అక్కడికక్కడే చనిపోయాడు. మిగిలిన ఇద్దరికీ స్వల్ప గాయాలయ్యాయి.

కేవలం ఈ రెండు ఉదంతాల్లోనే కాదు రాజధానిలో నిత్యం పదుల సంఖ్యలో యువత ట్రిపుల్ రైడింగ్ చేస్తూ ప్రమాదాలను కొనితెచ్చుకుంటున్నారు. 'టు వీలర్ ఫర్ టు ఓన్లీ'... అని మోటారు వాహన చట్టం స్పష్టం చేస్తున్న ఈ విషయం అందరికీ తెలిసిందే. అయినప్పటికీ ద్విచక్ర వాహనంపై ఇద్దరి కంటే ఎక్కువ మంది ప్రయాణించడం పరిపాటిగా మారింది.

వాహనం అదుపు చేయడం అసాధ్యం...

ప్రతి వాహనానికీ దాన్ని తయారు చేసే కంపెనీ కొన్ని ప్రమాణాలు నిర్దేశిస్తుంది. ఇందులో భాగంగానే టూ వీలర్‌ను కేవలం ఇద్దరు వినియోగించడానికి వీలుగానే రూపొందిస్తుంది. ముందు డ్రైవర్, వెనుక పిలియన్ రైడర్ మాత్రమే ప్రయాణించాలంటూ తమ నిబంధనల్లో స్పష్టం చేస్తోంది. దీనికి సాంకేతికంగానూ ప్రత్యేక కారణాలు ఉన్నాయి.

ఇంజిన్ కెపాసిటీ

మోటారు వాహనాలకు ఉండే ప్రతి ఇంజిన్‌కు ప్రత్యేక సామర్థ్యం ఉంటుంది. దీన్నే సాంకేతికంగా ఇంజిన్ కెపాసిటీ అంటారు. ఆ వాహనం ఎందరు ప్రయాణించడానికి అనువుగా రూపొందిస్తారో... అదే సామర్థ్యంలో ఇంజిన్ అభివృద్ధి చేస్తారు. నిర్దేశించిన ప్రయాణికుల కంటే ఎక్కువ మంది ఆ వాహనంపై ప్రయాణిస్తే దాని ప్రభావం ఇంజిన్‌పై పడుతుంది.

యాక్సిలరేటింగ్ కెపాసిటీ

ఓ వాహనం ఎంత వేగంతో దూసుకుపోవాలనేది స్పష్టం చేసేదే యాక్సిలరేటింగ్ కెపాసిటీ. సదరు వాహనంపై పరిమితికి మించి ప్రయాణికులు ఎక్కినప్పుడు ఈ కెపాసిటీ తగ్గుతుంది. సాధారణంగా గంటకు 60 కిమీ వేగంతో దూసుకుపోయే వాహనం ఇలాంటప్పుడు 40 కిమీ మించదు. ఈ ప్రభావం ఓవర్‌టేకింగ్ తదితర సమయాల్లో ప్రమాదాలకు కారణమవుతుంది.

బ్రేకింగ్/బ్యాలెన్సింగ్ కెపాసిటీ

ఏదైనా వాహనం ప్రమాదానికి లోనుకాకుండా ఉండాలంటే ఈ రెండూ అత్యంత కీలకం. సరైన సమయానికి బ్రేక్ వేయగలగటం, అవసరమైన స్థాయిలో బ్యాలెన్స్ చేసుకోవడం తప్పనిసరి. అయితే ట్రిపుల్ రైడింగ్ వంటివి చేసినప్పుడు ఈ ప్రభావం ఈ రెండు కెపాసిటీల పైనా పడి... ఎదురుగా ముప్పును గుర్తించినా తక్షణం స్పందించి వాహనాన్ని ఆపలేరు.

సిటీలో ట్రిపుల్ రైడింగ్ కేసులిలా..

ఏడాది	కేసులు
2014	38,221
2016	33,450
2022	95,225
2023 (ఇప్పటికి)	73,525

త్వరలో చార్జ్‌షీట్స్ దాఖలు చేస్తాం

డ్రంకన్ డ్రైవింగ్, డ్రైవింగ్ లైసెన్స్ లేకుండా వాహనం నడపటం, మైనర్ డ్రైవింగ్ మాదిరిగా ట్రిపుల్ రైడింగ్‌ను తీవ్రంగా పరిగణిస్తున్నాం. ఇప్పటి వరకు రూ.1000 జరిమానా మాత్రమే విధిస్తున్నాం. త్వరలో కోర్టుల్లోనూ అభియోగపత్రాలు దాఖలు చేయనున్నాం. ఎందరో తల్లిదండ్రులకు కడుపుకోత మిగులుస్తున్న ట్రిపుల్ రైడింగ్‌ను అదుపు చేయడానికి యువకుల తల్లిదండ్రులు, కుటుంబీకుల సహకారం కూడా ఎంతో అవసరం.

– ట్రాఫిక్ పోలీసులు

న్యూస్‌రీల్

నేడు జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లికి బంగారు బోనం



చార్మినార్: సప్త మాతృకల సప్త బంగారు బోనం పూజా కార్యక్రమాల్లో భాగంగా భాగ్యనగర్ శ్రీ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి దేవాలయాల ఊరేగింపు కమిటీ అధ్యక్షుడు ఆలే భాస్కర్ రాజ్ ఆధ్వర్యంలో మూడో బంగారు బోనాన్ని శుక్రవారం జూబ్లీహిల్స్ పెద్దమ్మ తల్లికి సమర్పించనున్నారు. నగరంలోని ఏడు అమ్మవారి దేవాలయాలకు ఏడు బంగారు బోనాలతో పాటు పట్టు వస్త్రాలను సమర్పిస్తున్న నిర్వాహకులు ఇప్పటికే మొదటి బోనాన్ని గోల్కొండ జగదాంబ అమ్మవారికి, రెండో బంగారు బోనాన్ని బల్కంపేట ఎల్లమ్మ తల్లికి సమర్పించారు. మూడో బంగారు బోనాన్ని శుక్రవారం మధ్యాహ్నం గౌలిపురా కోట మైసమ్మ దేవాలయం నుంచి బాజా భజంత్రీలతో బయలుదేరి పెద్దమ్మ తల్లి అమ్మవారి దేవాలయానికి వెళ్లి మొక్కులు చెల్లించుకోనున్నారు.

నగర కొత్వాల్ ఆకస్మిక తనిఖీలు



సాక్షి, సిటీబ్యూరో: బక్రీద్ నేపథ్యంలో పశువుల అక్రమ రవాణాను అడ్డుకోవడానికి పోలీసు విభాగం నగర వ్యాప్తంగా ప్రత్యేక చెక్‌పోస్టులు ఏర్పాటు చేసింది. వీటి పనితీరును గమనించడానికి కొత్వాల్ సీవీ ఆనంద్ బుధవారం అర్ధరాత్రి అనేక ప్రాంతాల్లో ఆకస్మికంగా పర్యటించారు. అమీర్‌పేట్, దోమలగూడ, మూసారాంబాగ్, మలక్‌పేట్‌ల్లో పర్యటించిన ఆయన క్షేత్ర స్థాయి విధుల్లో ఉన్న పోలీసుతో పాటు గొర్రెల వ్యాపారులతోనూ మాట్లాడారు.

ఆ రూట్‌లో అరగంట ఆలస్యంగా మెట్రో

సాక్షి, సిటీబ్యూరో: ఆర్టీసీ క్రాస్ రోడ్ వద్ద స్టీల్ బ్రిడ్జి నిర్మాణ పనుల కారణంగా జేబీఎస్ నుంచి ఎంజీబీఎస్‌కు వెళ్లే మార్గంలో మెట్రో రాకపోకల్లో మార్పులు చేసినట్లు ఎల్ అండ్ టీ అధికారులు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ మేరకు జులై 1 నుంచి 16వరకు ఉదయం 6 గంటలకు బయలుదేరాల్సిన మెట్రో అరగంట ఆలస్యంగా.. అంటే 6.30 గంటలకు బయలుదేరనుంది. మారిన వేళల ప్రకారం ఉదయం 6.30 నుంచి రాత్రి 11 గంటల వరకు మెట్రో రైళ్లు నడుస్తాయి.

రేపు ఓయూలో సదస్సు


లాలాపేట: ఓయూ కెమిస్ట్రీ డిపార్ట్‌మెంట్ ఆధ్వర్యంలో శనివారం ఆర్గానో కెటాలసిస్ ప్రాస్పెక్టస్ అండ్ అపార్చునిటీస్ అనే అంశంపై ఒక్క రోజు జాతీయ సదస్సును నిర్వహించనున్నారు. ఉదయం 9 గంటలకు జరిగే సెమినార్ ప్రారంభోత్సవంలో సెంట్రల్ యూనివర్సిటీ ఆఫ్ కర్ణాటక వీసీ ప్రొ భట్టు సత్యనారాయణ, టీఎస్‌టీ-ఇండియా సెక్రటరీ డా.ఎస్.చంద్రశేఖర్ తదితరులు ముఖ్య అతిథులుగా హాజరుకానున్నారు.

నాలా.. ఎన్నాళ్లిలా?

కొనసా.. గుతున్న పనులు

- వర్షం వస్తే తప్పని తిప్పలు
- ముంచుకొస్తున్న ముంపు
- వణుకుతున్న కాలనీవాసులు
- పనులు 36.. పూర్తయినవి 24

సాక్షి, సిటీబ్యూరో/గోల్కొండ, సైదాబాద్, అల్విన్ కాలనీ:



శంకేశ్వర బజార్‌లో మందకొడిగా సాగుతున్న పనులు

ఐఎస్ సదన్ డివిజన్‌లో సరూర్‌నగర్ చెరువు నుంచి బాక్స్ డ్రెయిన్ పనులు ఆర్నెల్లలో పూర్తి చేస్తామని ప్రకటించినా 18 నెలలైనా ఇంకా పరిష్కారం కాలేదు. సింగరేణి ఆఫీసర్స్ కాలనీ రోడ్ నెంబర్ 6 నుంచి ప్రారంభమై బతుకమ్మ కుంట మీదుగా శంకేశ్వరబజార్ మజీద్ చౌరస్తా వరకు 1210 మీటర్ల పొడవుతో బాక్స్‌డ్రైన్ నిర్మించాల్సి ఉండగా ఇప్పటికి 1000 మీటర్ల మేర నిర్మాణం పూర్తయింది. తుదిదశకు చేరుకున్నాక సైతం పనుల్ని సాగదీస్తుండటంతో ఎప్పటికి పూర్తవుతాయో తెలియక స్థానికులు ఆందోళన చెందుతున్నారు. గత కొన్ని సంవత్సరాలుగా భారీవర్షాలకు సరూర్‌నగర్ చెరువు పరిసర కాలనీలైన శంకేశ్వరబజార్, సింగరేణి కాలనీ పూర్తిగా నీట మునుగుతున్నాయి. ఇప్పటికైనా బాక్స్ డ్రెయిన్ పూర్తి కాకపోతే ఆ రెండు కాలనీలతో పాటు ఐఎస్‌సదన్ డివిజన్ పరిధిలోని 10కి పైగా కాలనీలు ముంపు బారిన పడే ప్రమాదం ఉంది.



మధ్యలోనే ఆగిపోయిన అల్విన్ కాలనీ నాలా పనులు

వర్షాలొస్తే కూకట్‌పల్లి సర్కిల్‌లోని పరికి చెరువు నాలా పొంగిపొర్లుతూ పరిసర కాలనీలు నీట మునుగుతున్నాయి. 2020లో వచ్చిన వచ్చిన భారీ వర్షాలకు ధరణినగర్ మునిగిపోయి వారం రోజుల పాటు ప్రజలు ఇళ్లనుంచి బయటకు రాలేదు. ఈ సమస్య పరిష్కారానికి ఎస్ఎన్‌డీపీ పనుల్లో భాగంగా రూ.50 కోట్లతో నాలాకు ఇరువైపులా రక్షణ గోడలు కట్టాలని నిర్ణయించారు. ఇప్పటికీ పనులు పూర్తికాలేదు. మరోవైపు ఆలివ్‌కాలనీ, ఆదిత్యనగర్, షిర్డీ నగర్, సప్తగిరి కాలనీ, పాపారాయుడు నగర్, ఆస్‌బెస్టాస్ కాలనీ వరకు కూడా వరదముంపు లేకుండా రక్షణ గోడలు కట్టాల్సిందిగా స్థానికులు గత కొన్ని సంవత్సరాలుగా కోరుతున్నా అధికారులు కానీ, ప్రజాప్రతినిధులు కానీ పట్టించుకోవడం లేదు.

టోలిచౌకి, రియాసత్‌నగర్, నదీంకాలనీ, నయాఖిలా, ఎండీ లైన్స్, దర్గా కాలనీ తదితర ప్రాంతాల్లో వర్షం వస్తే నీళ్లలోనే మునగాల్సిన దుస్థితిని తప్పించేందుకు చేపట్టిన నాలా పనులు ఇంకా పూర్తి కాలేదు. దీంతో ఎప్పుడు వర్షం వస్తే ఏమవుతుందోనని స్థానికులు బిక్కుబిక్కుమంటున్నారు.



నదీంకాలనీ, టోలిచౌకిల్లో పూర్తికాని నాలా పనులు

- ఇవి జీహెచ్‌ఎంసీ పరిధిలో జరుగుతున్న ఎస్ఎన్‌డీపీ పనులకు ఉదాహరణలు. ఇతర ప్రాంతాల్లోనూ దాదాపుగా ఇలాంటి పరిస్థితులే నెలకొన్నాయి.

కాలనీలు బిక్కుబిక్కు..

గ్రేటర్ నగరంలో వానొస్తే వేల కాలనీలు, బస్తీలు కంటిమీద కునుకులేకుండా బిక్కుబిక్కుమంటున్నాయి. ప్రతియేటా మునుగుతున్న పరిస్థితుల్ని మార్చేందుకు, సమస్యల్ని పరిష్కరించేందుకు సిద్ధమైన ప్రభుత్వం ప్రత్యేకంగా వ్యూహాత్మక నాలా అభివృద్ధి పథకం (ఎస్ఎన్‌డీపీ) ప్రాజెక్టును చేపట్టింది. ఈ పనుల కోసం రూ.985. 45 కోట్లు మంజూరు చేసింది. వీటిల్లో జీహెచ్‌ఎంసీ పరిధిలోని పనులకు రూ.747.45 కోట్లు, శివార్లలోని పురపాలికల్లోని పనులకు రూ.238 కోట్లు మంజూరుచేసింది. ఎస్ఎన్‌డీపీ ఏర్పాటు చేసి మూడేళ్లు కావస్తున్నా ఇప్పటి వరకు పనులు పూర్తికాలేదు. ప్రతియేటా వర్షాకాలంలోపే పనులు పూర్తి చేస్తామని చెబుతున్నప్పటికీ, ఇప్పటికీ పూర్తి కాలేదు.

జీహెచ్‌ఎంసీ పరిధిలో జోన్ల వారీగా మంజూరైన, పూర్తయిన పనులు (కి.మీ.లలో)

జోన్	మొత్తం పనులు	పూర్తి
సికింద్రాబాద్	9.17	4.05
కూకట్‌పల్లి	7.71	5.77
ఎల్బీనగర్	11.30	6.18
చార్మినార్	5.71	2.76
ఖైరతాబాద్	10.99	3.96
శేరిలింగంపల్లి	3.11	3.11
మొత్తం	47.99	25.83

చిన్నపాటి వర్షాలకే..

జీహెచ్‌ఎంసీ పరిధిలోని 36 పనుల్లో 24 పనులు పూర్తయినట్లు అధికారులు పేర్కొన్నారు. 47.99 కి.మీ మేర పనులు జరగాల్సి ఉండగా 25.83 కి.మీ. మేర పనులయ్యాయంటున్నారు. కానీ.. క్షేత్ర స్థాయిలో మాత్రం పనులు పూర్తి కాలేదని స్థానికులు చెబుతున్నారు. సాధారణ వర్షం వచ్చినా సమస్యలు తప్పలేదని ఇటీవల కురిసిన వర్షాలతో ఎదురైన సమస్యల్ని ఏకరువు పెడుతున్నారు.

నాలాల్లో పూడికా తీయలేదు..

ఎస్ఎన్‌డీపీ పనులలా ఉండగా, పాత నాలాల్లోనూ పూడికతీత పనులు పూర్తి కాలేదు. వర్షాకాలం లోపునే పూడిక తీత పూర్తి కావాల్సి ఉండగా పూర్తికాలేదు. దీంతో వర్షం వస్తే నీరుపారే దారిలేక రోడ్లపైకి, బస్తీల్లోకి చేరుతోంది. ఖైరతాబాద్‌లోని చింతలబస్తీ, ప్రేమ్‌నగర్, ఆనంద్‌నగర్ తదితర ప్రాంతాలతో సహా అనేక ప్రాంతాల్లో పూడిక పనులింకా పూర్తి కాలేదు. గతంలో చిన్న పనులుగా విభజించి పనులు చేసేవారు. ఈ సంవత్సరం ఆ విధానానికి స్వస్తి పలికారు.

మదర్ డెయిరీ అభివృద్ధికి సహకరిస్తాం

మంత్రి జగదీశ్వర్‌రెడ్డి



నూతన బాయిలర్, కోల్డ్ స్టోరేజ్, పెరుగు ప్లాంట్‌ను ప్రారంభిస్తున్న మంత్రి జగదీశ్వర్‌రెడ్డి

మన్సూరాబాద్: నార్ముల్ మదర్ డెయిరీ అభివృద్ధికి సంపూర్ణ సహకారం అందిస్తామని రాష్ట్ర విద్యుత్ శాఖ మంత్రి జగదీశ్వర్‌రెడ్డి అన్నారు. గురువారం హయత్‌నగర్‌లోని నార్ముల్ మదర్ డెయిరీ సంస్థ కార్యాలయంలో రూ. 3 కోట్ల వ్యయంతో ఏర్పాటు చేసిన నూతన బాయిలర్, కోల్డ్ స్టోరేజ్, విస్తరించిన పెరుగు ప్లాంట్‌ను, నూతన బ్రాండ్ పాల ప్యాకెట్‌ను సంస్థ చైర్మన్ లింగాల శ్రీకర్‌రెడ్డితో కలిసి ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... పాడి రైతుల సంక్షేమానికి తెలంగాణ ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. వినియోగదారులకు నాణ్యమైన పాలను సరఫరా చేసి వారి నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని సూచించారు. సంస్థ మనుగడలో ఉద్యోగుల పాత్ర కీలకమని, ఉద్యోగులు నిబద్ధతతో పనిచేయాలని ఆయన సూచించారు. కార్యక్రమంలో సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ బి.కృష్ణ, డైరెక్టర్లు అరుగాల గాల్‌రెడ్డి, దొంతిరి సోమిరెడ్డి, కర్నాటి జయశ్రీ, చింతలపురి వెంకటరామిరెడ్డి, చల్లా సురేందర్‌రెడ్డి, లక్ష్మీనర్సింహారెడ్డి, జలేందర్‌రెడ్డి, అలివేలు, శ్రీధర్‌రెడ్డి, గొల్లపల్లి రాంరెడ్డి, మందడి ప్రభాకర్‌రెడ్డి పాల్గొన్నారు.

'క్రైమ్' ఎస్సై కృష్ణ సస్పెన్షన్

మాజీ ఐఆర్‌ఎస్ ఇంట్లో చోరీ కేసులో..

- ప్రాథమిక విచారణ అనంతరం వేటు
- అదుపులోకి తీసుకున్న నగర పోలీసులు



సాక్షి, సిటీబ్యూరో: ముషీరాబాద్ పోలీస్ స్టేషన్ పరిధిలోని గాంధీనగర్‌లో నివసించే మాజీ ఐఆర్‌ఎస్ అధికారి శామ్యూల్ ప్రసాద్ సరెళ్ల ఇంట్లో జరిగిన భారీ చోరీ వ్యవహారం సూత్రధారి, దుండిగల్ ఠాణా క్రైమ్ ఎస్సై ఎస్.కృష్ణపై సస్పెన్షన్ వేటు పడింది. ఇతడి వ్యవహారంపై మేడ్చల్ డీసీపీ, ఏసీపీ ఇచ్చిన నివేదిక ఆధారంగా సైబరాబాద్ పోలీసు కమిషనర్ ఎం.స్టీఫెన్ రవీంద్ర గురువారం ఉత్తర్వులు జారీ చేశారు. మరోపక్క కృష్ణను అదుపులోకి తీసుకున్న ముషీరాబాద్ పోలీసులు మధ్య మండల డీసీపీ కార్యాలయంలో రహస్యంగా విచారిస్తున్నట్లు తెలిసింది. నేడో రేపో ఇతడిని అరెస్టు ప్రకటించే అవకాశం ఉంది. 'మాజీ ఐఆర్‌ఎస్ ఇంట్లో చోరీ కేసులో 'ఖాకీ'.. 'ఖాకీ వెనుక ఖాకీలెవరో?' శీర్షికన 'సాక్షి'లో వరుస కథనాల ప్రచురితమయ్యాయి. ఎస్సై కృష్ణను తప్పించాలని కొందరు అధికారులు ప్రయత్నించినా ఈ కథనాల ఎఫెక్ట్‌తో ఉన్నతాధికారులు చర్యలు తీసుకోవాల్సి వచ్చింది. ఒంటరిగా ఉంటున్న శామ్యూల్ వద్ద మెదక్ జిల్లాకు చెందిన ఓ మహిళను పని మనిషిగా పెట్టింది కూడా కృష్ణ అనే అనుమానాలు కలుగుతున్నాయి. తొలుత ఈమె ద్వారా ట్రాప్ చేయాలని ప్రయత్నించాడని, సాధ్యం కాకపోవడంతో రియల్టర్ సురేందర్‌ను రంగంలోకి దింపి తన పని పూర్తి చేసుకున్నట్లు అధికారులు అనుమానిస్తున్నారు. దర్యాప్తు అధికారులు సదరు పని మనిషినీ గురువారం ఠాణాకు పిలిపించారు. ఆమె నుంచి వాంగ్మూలం నమోదు చేసి పంపించారు. ఈ కేసులో కీలక సాక్షిగా పరిగణిస్తున్నారు. శామ్యూల్ ఇంటి నుంచి చోరీ చేసిన బంగారం తాకట్టు పెట్టిన మేడ్చల్‌లోని దుకాణం యజమానినీ పోలీసులు విచారిస్తున్నారు.

సాక్షి ఎఫెక్ట్..

'గాంధీ'లో డైట్ వివాదానికి ఫుల్‌స్టాప్

శ్రీవేంకటేశ్వర అసోసియేట్స్‌కు బాధ్యతలు

- పెంచిన ధరలు నేటి నుంచి అమలు
- హర్షం వ్యక్తం చేస్తున్న వైద్యులు, రోగులు



డైట్ నిర్వహణ నియామక పత్రాన్ని అందిస్తున్న రాజారావు

గాంధీఆస్పత్రి: సికింద్రాబాద్ గాంధీఆస్పత్రి డైట్ వివాదానికి ఫుల్‌స్టాప్ పడింది. వైద్య ఆరోగ్యశాఖ కమిషనర్, రాష్ట్ర డైట్ కమిటీ చైర్ పర్సన్ శ్వేతా మహంతి ఆధ్వర్యంలో డైట్ టెండర్లను తెరిచి అర్హత సాధించిన శ్రీ వేంకటేశ్వర అసోసియేట్స్ సంస్థకు గాంధీఆస్పత్రి డైట్ నిర్వహణ బాధ్యతలు అప్పగించారు. సుమారు ఏడాదిన్నర తర్వాత డైట్ వివాదానికి తెరపడడం, పెంచిన నూతన డైట్ ధరలు అమలు కావడంతో వైద్యులు, రోగులు హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఇటీవల జరిగిన వైద్య ఉన్నతాధికారుల సమీక్ష సమావేశంలో గాంధీ డైట్ సమస్యపై 'సాక్షి' ప్రచురించిన పలు కథనాలను వైద్య శాఖ మంత్రి హరీష్‌రావు ప్రస్తావించి తక్షణమే పరిష్కరించాలని సూచించిన సంగతి విదితమే. ఈ క్రమంలో బుధవారం రాత్రి వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో శ్వేతా మహంతి సమక్షంలో టెండర్లను తెరిచి వివాదానికి తెరదించారు.

డైట్ ధరలు ఇలా..

రోగులు, వారి సహాయకులు, ట్రైబల్ పేషెంట్లకు డైట్ చార్జీని రూ.40 నుంచి రూ.80, టీబీ, మెంటల్, థెరపిటిక్ పేషెంట్లకు రూ.56 నుంచి రూ.112, డ్యూటీ డాక్టర్లకు రూ.80 నుంచి రూ.160కు పెంచుతూ ప్రభుత్వం నిర్ణయించింది. డైట్ సమస్యను పరిష్కరించిన మంత్రి హరీష్‌రావు, వైద్య ఆరోగ్యశాఖ ముఖ్య కార్యదర్శి రిజ్వీ, కమిషనర్ శ్వేతా మహంతి, డీఎంఈ రమేష్‌రెడ్డిలకు గాంధీ సూపరింటెండెంట్ రాజారావు, ఆర్‌ఎంఓ-1 జయకృష్ణ, చీఫ్ డైటీషియన్ రమేష్‌లు కృతజ్ఞతలు తెలిపారు. నూతన డైట్ కాంట్రాక్టర్‌కు నియామక పత్రాలను గురువారం అందించారు. కార్యక్రమంలో ఏడీ ఫ్లోరెన్స్ మెర్లిన్, ప్రసన్నకుమార్, ఆర్‌ఎంఓలు రాము, వెంకటరమణలు పాల్గొన్నారు.

రూ. 20 కోట్లతో ఓయూలో గిరిజన హాస్టళ్లు

లాలాపేట: ఉస్మానియా యూనివర్సిటీలో గిరిజన విద్యార్థుల వసతి గృహాల నిర్మాణానికి గిరిజన సంక్షేమ శాఖ రూ. 20 కోట్లు కేటాయించినట్లు అధికారులు తెలిపారు. ఈ మేరకు ఇటీవల ఓయూతో రాష్ట్ర గిరిజన సంక్షేమ శాఖ పరస్పర అవగాహన ఒప్పందం కుదుర్చుకుంది. ఓయూ రిజిస్ట్రార్ ప్రొ లక్ష్మీనారాయణ, గిరిజన సంక్షేమ శాఖ కార్యదర్శి డా. క్రిష్టినా జెడ్ చోంగ్తు ఒప్పంద పత్రాలపై సంతకాలు చేశారు. ఇందుకు సంబంధించిన ఉత్తర్వులు గురువారం ఓయూ అధికారులకు అందాయి. గిరిజన విద్యార్థులకు అవసరమైన మౌలిక వసతుల కల్పన, నాణ్యమైన ఉన్నత విద్యను అందించాలనే ఉద్దేశంతో ఈ ఒప్పందం చేసుకున్నట్లు ఓయూ అధికారులు పేర్కొన్నారు. ఈ నిధుల్లో రూ. 10 కోట్లతో 300 మంది విద్యార్థులకు, రూ 10 కోట్లతో మరో 300 మంది విద్యార్థినులకు వేర్వేరుగా రెండు వసతి గృహాలు నిర్మించనున్నారు. ఇందుకోసం క్యాంపస్‌లో ఎకరం చొప్పున స్థలాన్ని కేటాయించారు. గిరిజన సంక్షేమ శాఖ ఆధ్వర్యంలోనే హాస్టళ్లను నిర్మించి ఓయూకు అప్పగిస్తారు.

విద్యాపరమైన ఆలోచనలే విధాన నిర్ణయాలు కావాలి

రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ. లింబాద్రి

లాలాపేట: విద్యాపరమైన ఆలోచనలను విధాన నిర్ణయాలకు దిశానిర్దేశం కావాలని రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ప్రొ. లింబాద్రి అన్నారు. రెండు రోజులుగా ఓయూ విద్యా విభాగం ఆధ్వర్యంలో కొనసాగుతున్న 'ఎమర్జింగ్ పర్స్పెక్టివ్స్ ఇన్ ఎడ్యుకేషన్' జాతీయ సెమినార్ ముగింపు సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రధానంగా బీఈడీ కోర్సుకు ఆదరణ తగ్గడంపై ఆందోళన వ్యక్తం చేశారు. విద్యా వ్యవస్థ పటిష్టంగా ఉండాలంటే నాణ్యమైన ఉపాధ్యాయులను సిద్ధం చేసే బాధ్యత విశ్వవిద్యాలయ విద్యా విభాగానికి ఉందన్నారు. ఈ నేపథ్యంలో సమావేశంలో నూతన విద్యా విధానంపై విపులంగా చర్చించినట్లు తెలిపారు. రానున్న రోజుల్లో మంచి ఫలితాలు వస్తాయన్నారు. కార్యక్రమంలో ఓయూ వీసీ రవీందర్, ప్రొఫెసర్లు రామకృష్ణ, మృణాళిని, రవీంద్రనాథ్, రాజేష్‌కుమార్, లలిత పాల్గొన్నారు.

స్టేషన్‌లో ఉండని ఎస్‌హెచ్‌ఓలపై కఠిన చర్యలు!

- సమగ్ర నివేదికల తర్వాతే ఇన్‌స్పెక్టర్ల బదిలీలు
- మహిళల వేధింపుల కట్టడికి ప్రత్యేక వ్యూహం
- టోల్ ఫ్రీ నంబర్, కౌన్సిలింగ్ సెంటర్ల ఏర్పాటు
- ఒకట్రెండు రోజుల్లో నాగోల్ పీఎస్ ప్రారంభం
- కొత్త ఠాణాలపై ప్రజలకు అవగాహన కార్యక్రమాలు
- 'సాక్షి'తో రాచకొండ కమిషనర్ డీఎస్ చౌహాన్ వెల్లడి



సాక్షి, సిటీబ్యూరో: కొన్ని ఠాణాలలో స్టేషన్ హౌస్ ఆఫీసర్ (ఎస్‌హెచ్‌ఓ) ప్రజలకు అందుబాటులో ఉండటం లేదనే ఫిర్యాదులు వస్తున్నాయని రాచకొండ పోలీసు కమిషనర్ దేవేంద్రసింగ్ చౌహాన్ అన్నారు. ఎవరైనా బాధితులు స్టేషన్‌కు వస్తే ఫలానా సెక్టార్ సబ్ ఇన్‌స్పెక్టర్ (ఎస్ఐ)ను కలవమనో, రిసెప్షన్‌లో సంప్రదించాలనో సూచిస్తున్నట్లు తమ దృష్టికి వచ్చిందని, ఇలాంటి ఘటనలు పునరావృతమైతే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వంద శాతం ప్రజలకు ఎల్లవేళలా అందుబాటులో ఉండాలని ఎస్‌హెచ్‌ఓలకు సూచించారు. రాచకొండ పునర్ వ్యవస్థీకరణలో భాగంగా కొత్తగా ఐదు పీఎస్‌లను ఏర్పాటు చేశామని, వీటిలో ఇప్పటికే చర్లపల్లి, గ్రీన్ ఫార్మాసిటీ, పోచారం ఐటీ కారిడార్, ఉప్పల్ మహిళా పోలీసు స్టేషన్లు ఏర్పాటయ్యాయని, ఒకట్రెండు రోజుల్లో నాగోల్ ఠాణాను ప్రారంభించనున్నట్లు సీపీ చౌహాన్ 'సాక్షి'కి తెలిపారు. పూర్తి వివరాలు ఆయన మాటల్లోనే..

◆ కొత్త ఎస్ఐ, కానిస్టేబుళ్ల నియామకాలు జరగకపోవటంతో అందుబాటులో ఉన్న సిబ్బందితోనే కొత్త ఠాణాలను నిర్వహిస్తున్నాం. శాశ్వత భవనాలు లేకపోవటంతో స్టేషన్లను అద్దె భవనాలలోనే కొనసాగుతున్నాయి. కొత్త స్టేషన్ల గురించి ప్రజలకు తెలిసేలా సెక్టార్ ఎస్ఐలు, కానిస్టేబుళ్లు బ్లూకోల్ట్స్, పెట్రోలింగ్ వాహనాలతో గల్లీ గల్లీ తిరుగుతూ ప్రజలకు అవగాహన కల్పిస్తున్నాం. ఠాణా పరిధి, ఎస్‌హెచ్‌ఓ, సెక్టార్ ఎస్ఐల ఫోన్ నంబర్లు ప్రజలకు తెలిసేలా సూచికలు ఏర్పాటు చేశాం. ఇన్‌స్పెక్టర్ల బదిలీలలో ఎవరి ప్రమేయం, ఒత్తిడి లేదని, సంబంధిత అధికారులపై సమగ్ర నివేదికల అధ్యయనం తర్వాతే బదిలీలు చేస్తున్నాం.

◆ రోడ్లు మీదే కాదు ఆన్‌లైన్‌లోనూ విద్యార్థినులు, మహిళలను వేధించడం ఆగడం లేదు. ఆఫ్‌లైన్‌లో కంటే ఆన్‌లైన్‌లో మహిళలను వేధించడం బాగా పెరిగిపోయింది. ఎక్కువగా టీనేజ్ అమ్మాయిలు ఈ తరహా వేధింపుల బారిన పడుతున్నారు. ఆకతాయిలకు ఇదొక వ్యాధిలాగా ముదిరిపోయింది. మహిళల ఫొటోలు తీసి వాటిని అసభ్యకరంగా చిత్రీకరించి సోషల్ మీడియాలో పెడతామంటూ బ్లాక్ మెయిల్ చేస్తున్నారు. గత రెండు నెలల్లో ఈ తరహా కేసులు 30 వరకు నమోదు కాగా.. వీటిల్లో 20 కేసులలో నిందితులను అరెస్టు చేసి, రిమాండ్‌కు తరలించాం. ఆన్‌లైన్ వేధింపులను అరికట్టేందుకు ప్రత్యేక క్యాంపెయిన్ నిర్వహిస్తున్నాం. లఘు చిత్రాలతో సామాజిక మాధ్యమాలలో పోస్టులతో ప్రచారం కల్పిస్తున్నాం. 87126 62662 కాల్ సెంటర్‌తో పాటు కౌన్సిలింగ్ సెంటర్‌ను ఏర్పాటు చేశాం.

◆ లోన్ యాప్ కేసులు, చైన్ స్నాచింగ్‌లు పెరుగుతున్న నేపథ్యంలో ప్రత్యేక కార్యాచరణ రూపొందించాం. కేసుల నమోదు, నిందితులతో అరెస్టులతో పాటు ప్రజలకు అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నాం. ఇప్పటివరకు సుమారు 50కి పైగా విద్యా సంస్థలలో సైబర్ నేరాలపై అవగాహన కార్యక్రమాలు చేపట్టాం. ప్రతి వారం రెండు కాలేజీలలో సైబర్ నేరాలపై ప్రోగ్రామ్‌లను చేస్తున్నాం.

ఆగస్టు 26 నుంచి జాతీయ నృత్య, సంగీత పోటీలు

కేవీ రమణా చారి చేతుల మీదుగా పోస్టర్ ఆవిష్కరణ



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న డాక్టర్ కేవీ రమణాచారి తదితరులు

నాంపల్లి: ప్రముఖ సాంస్కృతిక సంస్థ నవ్య నాటక సమితి ఆధ్వర్యంలో 48వ జాతీయ స్థాయి శాస్త్రీయ నృత్య, సంగీత పోటీలను ఆగస్టు 26 నుంచి వారం రోజుల పాటు హైదరాబాద్‌లో ఘనంగా నిర్వహించనున్నట్లు సమితి అధ్యక్షుడు వేమరాజు విజయకుమార్, సమన్వయకర్త నిష్టల సుధామాల తెలిపారు. ఉత్తర, దక్షిణ సంగీత నృత్యరీతులు–హిందూస్తానీ సంగీతం (గాత్రం, సితార్, తబలా) కర్ణాటక సంగీతం (గాత్రం, వీణ, వయోలిన్, మృదంగం)తో పాటుగా కూచిపూడి, కథక్, భరతనాట్యం తదితర విభాగాల్లో ఈ పోటీలు నిర్వహిస్తామన్నారు. ఈ మేరకు గురువారం మాసబ్‌ట్యాంక్‌లోని నఫీజ్ రెసిడెన్సీలోని డాక్టర్ కేవీ రమణాచారి క్యాంప్ కార్యాలయంలో పోటీలకు సంబంధించిన పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా డాక్టర్ కేవీ రమణాచారి మాట్లాడుతూ భారతీయ సంస్కృతిని ప్రతిభింబించే శాస్త్రీయ సంగీత నృత్య రీతుల్లో జాతీయ స్థాయి పోటీలను నిర్వహించడం అభినందనీయమన్నారు. ఔత్సాహిక యువ కళాకారులను ప్రోత్సహిస్తున్న నవ్యనాటక సమితి ఆధ్వర్యంలో జరిగే ఈ కార్యక్రమం విజయవంతం కావాలని ఆయన ఆకాంక్షించారు. గౌరవ అతిథిగా హాజరైన రాష్ట్ర ఖజానా, గణాంకాల శాఖ ఉప సంచాలకులు జి.వ సుందర మాట్లాడుతూ... ఈ పోటీలు జాతీయ సమైక్యతకు దోహదపడుతాయన్నారు. కార్యక్రమంలో సమితి కార్యనిర్వాహక సంఘం సభ్యులు ఎ.రజిత్, రాజ్‌కుమార్, నృత్య గురువులు వై.చలపతి శాస్త్రి, గీతా గణేశన్, డాక్టర్ ఇందిరాహేమ, వాణీ రమణ,శ్రీలత నాపరాజు, సంగీత కళాకారులు వాసా గోపీనాథరావు, డాక్టర్ అస్మితా మిశ్రా, వి.దుర్గారావు, హరనాథ బాబు, కె.చక్రపాణి పాల్గొన్నారు.

వెబ్‌సైట్‌లో దరఖాస్తులు...

ఈ పోటీలను వయస్సు ఆధారంగా నిర్వహిస్తున్నారు. సీనియర్లు (17 నుంచి 23 సంవత్సరాలు), జూనియర్లు (13 నుంచి 16 సంవత్సరాలు), సబ్ జూనియర్లు (8 నుంచి 12 సంవత్సరాలు) గా విభజించారు. నృత్య పోటీలు తెలంగాణ సారస్వత పరిషత్‌లో, శ్రీ కృష్ణదేవరాయ భాషా నిలయంలో సంగీతం పోటీలు జరుగుతాయని విజయకుమార్ తెలిపారు. ఔత్సాహిక కళాకారులు నారాయణగూడలోని వైఎంసీఏ కార్యాలయం నుంచి సిలబస్, దరఖాస్తు ఫారాలను పొందవచ్చును. దరఖాస్తు ఫారాలను ఆన్‌లైన్ లేదా ఆఫ్‌లైన్ ద్వారా అందజేయవచ్చునన్నారు. ఇతర వివరాలకు 9908625949 లేదా డబ్ల్యూడబ్ల్యూడబ్ల్యూ.నవ్యనాటకసమితి.ఓఆర్‌జి వెబ్‌సైట్‌లో చూడాలన్నారు.

ఏకాదశి పూజల్లో పాల్గొన్న మంత్రి తలసాని



పూజల్లో పాల్గొన్న రాష్ట్ర మంత్రి తలసాని, ఆలయ కమిటీ చైర్మన్ శంకర్‌యాదవ్ తదితరులు

అఫ్జల్‌గంజ్: తొలి ఏకాదశిని పురస్కరించుకుని గురువారం తెల్లవారుజాము నుంచే బేగంబజార్ పరిసర ప్రాంతాల్లోని ఆలయాల్లో భక్తుల రద్దీ నెలకొంది. అఫ్జల్‌గంజ్‌లోని శ్రీ విఠలేశ్వర, రుక్మాబాయి దేవాలయంలో పంచామృత సహిత అభిషేకం, పుష్పార్చన, మంగళహారతి, తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించారు. సాయంత్రం స్వామివారి గరుడ వాహన సేవ నిర్వహించారు. రాష్ట్ర మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్, ఆలయ కమిటీ చైర్మన్ బీజేపీ జీహెచ్ఎంసీ పక్షనేత గౌంటి శంకర్‌యాదవ్, అధ్యక్షులు వి.కిషన్ యాదవ్‌లతో కలిసి స్వామివారికి పట్టువస్త్రాలు సమర్పించారు. పూజల్లో బీఆర్ఎస్ నేత నందకిశోర్ వ్యాస్ బిలాల్, ఆల పురుషోత్తమ్‌రావు, ఆనంద్‌కుమార్ గౌడ్, గడ్డం శ్రీనివాస్ యాదవ్, ఆర్‌వి.మహేందర్‌కుమార్ ఆలయ కమిటీ ప్రతినిధులు, పాండుయాదవ్, రాజు మహారాజ్, మాజీ కార్పొరేటర్ వై.కృష్ణ తదితరులు పాల్గొన్నారు. అనంతరం విఠలేశ్వర, రుక్మాబాయిలకు రథోత్సవం నిర్వహించారు.

వస్త్రధారణ చూసి హేళన చేస్తున్నారు

- హిమాయత్‌నగర్‌లోని ఓ ఫొటో ఇనిస్టిట్యూట్‌లో వైద్యురాలికి అవమానం
- బాధితురాలి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన నారాయణగూడ పోలీసులు

హిమాయత్‌నగర్: ఫొటోగ్రఫీ నేర్చుకునేందుకు ఓ ప్రముఖ శిక్షణ సంస్థకు వెళ్లిన వైద్యురాలికి చేదు అనుభవం ఎదురైంది. ఇనిస్టిట్యూట్ నిర్వాహకుడు ఆమె ధరిస్తున్న వస్త్రాలు నచ్చలేదంటూ, తాము చెప్పినట్లే ఉండాలంటూ ఆదేశించాడు. విద్యార్థుల ఎదుటే ఆమె ఒంటిపై దుప్పట(చున్నీ)ని ఆమె చేతులతోనే తొలగించేలా చేసి హేళన చేశారంటూ బాధితురాలు నారాయణగూడ పోలీసులను ఆశ్రయించింది. కొద్దిరోజులుగా శారీరకంగా, మానసికంగా వేధిస్తున్న సదరు ఇనిస్టిట్యూట్ యజమానిపై చర్యలు తీసుకోవాలని ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. ఈ సంఘటనకు సంబంధించిన వివరాలు ఇలా ఉన్నాయి... రంగారెడ్డి జిల్లాకు చెందిన ఓ వైద్యురాలు హిమాయత్‌నగర్‌లోని 'ఐఎస్ఐపీ' అనే ఫొటోగ్రఫీ ఇనిస్టిట్యూట్‌లో 6 నెలల పాటు కోచింగ్ నిమిత్తం చేరింది. ఇనిస్టిట్యూట్‌లో జాయిన్ అయినప్పటి నుంచి వైద్యురాలి వస్త్రధారణ యజమాని సత్యంకు నచ్చడం లేదు. ఇటీవల ఆమె ధరించిన వస్త్రాలపై ఉన్న దుపట్టా(చున్నీ)ని తొలగించాలంటూ స్టూడెంట్స్ ఎదుట అతను బలవంతం చేశాడు. ఇనిస్టిట్యూట్ విద్యార్థులు చాలా స్టైలిష్‌గా ఉండాలని సూచించాడు. ఇనిస్టిట్యూట్‌లో స్టూడెంట్స్ అందరూ మగవారు కావడంతో ఆమె నిరాకరించింది. ఈ క్రమంలో దుపట్టా తొలగించకపోతే ఇనిస్టిట్యూట్ నుంచి పంపించేస్తా అంటూ భయపెట్టడంతో ఆమె దుప్పట్టాను తొలగించింది. ఆ తర్వాత ఆమె పర్సనల్ ఫోన్ నెంబర్‌ను యజమాని సత్యం ఇనిస్టిట్యూట్ విద్యార్థులకు ఇచ్చాడు. వారు ఆమెకు తెలియకుండా ఫొటోలు, వీడియోలను షూట్ చేసి ఇన్‌స్టాగ్రామ్ పేజీల్లో పోస్ట్ చేశారు. దీనిపై సత్యంను నిలదీయగా వారే డిలీట్ చేస్తారంటూ నిర్లక్ష్యంగా సమాధానం ఇచ్చాడు. దీంతో వారం క్రితం వైద్యురాలు తన సోదరితో కలిసి ఇనిస్టిట్యూట్‌కు వెళ్లి వీడియోలు, ఫొటోలు తొలగించాలని కోరింది. ఈ క్రమంలో సత్యంతో పాటు మణికంఠ, సాయికిరణ్ అనే వ్యక్తులు వైద్యురాలి సోదరి పట్ల దురుసుగా ప్రవర్తించారు. స్టూడెంట్స్ అందరూ చూస్తుండగా వైద్యురాలి సోదరిని కొట్టి బయటికి గెంటివేశారు. తనను వేధిస్తున్న సత్యం, అందుకు సహకరిస్తున్న మణికంఠ, సాయికిరణ్‌లపై చట్టరిత్యా చర్యలు తీసుకోవాలని కోరుతూ పోలీసులకు ఫిర్యాదు చేసింది. కేసు నమోదు చేసిన నారాయణగూడ పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

వినూత్నం..ఆసక్తికరం

ఆకట్టుకుంటున్న ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఎక్స్‌పో



టెంపుల్ వైబ్స్



బయోనిక్ చేయి



ఫుట్‌స్టెప్ పవర్ విధానం

మాదాపూర్: మాదాపూర్‌లోని హైటెక్స్‌లో తెలంగాణ చాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ, తెలంగాణ ప్రభుత్వం సంయుక్తంగా నిర్వహిస్తున్న ఇండస్ట్రియల్ ఇన్నోవేషన్ అండ్ టెక్నాలజీ ఎక్స్‌పో నగరవాసులను ఆకట్టుకుంటోంది. ప్రదర్శనలో ఉంచిన వినూత్న ఆవిష్కరణలు ప్రత్యేక ఆకర్షనగా నిలిచాయి. నగరానికి చెందిన స్టార్టప్ టెంపుల్‌వైబ్స్ మానసిక ఆరోగ్యానికి పరిష్కారంగా సౌండ్ బాత్(ధ్వని స్నానం), సౌండ్ మసాజ్, సౌండ్ మెడిటేషన్ తదితర ఉపయోగకరమైన సేవలను అందిస్తుంది. బయోనిక్ చేయి నిజమైన చేతిలాగానే సంజ్ఞలను ప్రదర్శిస్తుంది. చిన్న పనులను చేయడానికి విద్యుత్ సంకేతాల ద్వారా నియంత్రించబడుతుంది. మనిషి నడక (అడుగుల ఒత్తిడితో) విద్యుత్‌ను ఉత్పత్తి చేయడం తదితర ఆవిష్కరణలు ఇక్కడ కొలువుదీరాయి. ఈ ప్రదర్శన రేపటితో ముగియనుంది.

కేర్‌లో విజయవంతంగా క్వాడ్రాపుల్ కరోనరి బైపాస్ సర్జరీ



రోగితో వైద్య బృందం

బంజారాహిల్స్: బంజారాహిల్స్‌లోని కేర్ ఆస్పత్రిలో క్వాడ్రపుల్ కరోనరి సర్జరీని విజయవంతంగా నిర్వహించినట్లు ఆస్పత్రి వైద్యులు తెలిపారు. కేర్ ఆస్పత్రి కార్డియాక్ విభాగం డైరెక్టర్ డాక్టర్ ప్రతీక్ భట్నాగర్ నేతృత్వంలోని వైద్య బృందం 50 ఏళ్ల రోగి హేమంత్‌కు కేవలం ధమని అంటుకట్టులు ఉపయోగించి నాలుగు రెట్ల కరోనరి బైపాస్ సర్జరీని నిర్వహించారు. హేమంత్ గతంలో తన ఎడమ ప్రధాన కరోనరికి స్టంట్లు వేయించుకున్నారు. అయితే మూడు నెలల్లోనే అడ్డంకి ఏర్పడటంతో ఛాతీ నొప్పితో బాధపడుతున్న అతను గతంలోనే ఢిల్లీలో కరోనరి యాంజియోగ్రఫీ చేయించుకోగా ధమనుల్లో అడ్డంకులు ఉన్నట్లు గుర్తించిన వైద్యులు స్టంట్ వేశారు. అయితే మూడు నెలల్లోనే మళ్లీ ఛాతీ నొప్పి రావడంతో కేర్ వైద్యులను సంప్రదించగా స్టంట్లలో అడ్డంకులను గమనించిన వైద్య బృందం ఎలాంటి కోతలు, ఓపెన్ హార్ట్ సర్జరీ లేకుండానే శస్త్ర చికిత్స నిర్వహించారు. సర్జరీ అనంతరం 36 గంటల్లోనే రోగి నడవడమే కాకుండా మెట్లను సైతం ఎక్కే శక్తిని పొందారు. ఈ సందర్భంగా ప్రతీక్ భట్నాగర్ మాట్లాడుతూ కరోనరి ఆర్టరీ అడ్డంకులు ఉన్న రోగులకు దీర్ఘకాలిక ప్రయోజనాలు అందిస్తుందన్నారు. ఈ విధానం ఉత్తమమైనదని రోగులు భయపడకుండా ఓపెన్ హార్ట్ సర్జరీ చేయించుకోవాలని అన్నారు.

పేకాటరాయుళ్ల అరెస్ట్

హస్తినాపురం: గుట్టు చప్పుడు కాకుండా పేకాట ఆడుతున్న తొమ్మిది మందిని అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించిన సంఘటన వనస్థలిపురం పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. వనస్థలిపురం పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. కొందరు వ్యక్తులు పనామా చౌరస్తా సమీపంలోని పిస్తాహౌస్ హోటల్‌లో గదిని అద్దెకు తీసుకుని మూడు పత్తాల ఆట ఆడుతున్నట్లు సమాచారం అందడంతో ఎల్‌బీనగర్ ఎస్ఓటీ, వనస్థలిపురం పోలీసులు సంయుక్తంగా దాడి చేశారు. ఈ సందర్భంగా పగిళ్ల రమేశ్, వీరమల్ల శేఖర్‌గౌడ్,అల్వాల నవీన్, సాయికుమార్, అంబటి శేఖర్‌బాబు, మధుసూదన్‌రావు, మల్లికార్జునరావు, పబ్బ ప్రసాద్‌గౌడ్, విజయ్ కుమార్‌లను అరెస్టు చేశారు. వారి నుంచి రూ. 2.16 లక్షల నగదు, 10 మొబైల్ ఫోన్లు, రెండు కార్లను స్వాధీనం చేసుకుని రిమాండ్‌కు తరలించినట్లు పోలీసులు తెలిపారు.

చెక్కుతో నొక్కేశాడు..

- హైకోర్టు లాయర్ అకౌంట్ నుంచి రూ.1.95 లక్షలు డ్రా
- ఆఫీస్ స్టెనోగ్రాఫర్ నిర్వాకం
- ఖాళీ చెక్కుపై సంతకం ఉండటంతో హెచ్‌డీఎఫ్‌లో విత్‌డ్రా
- నారాయణగూడ పోలీసులకు బాధితుడి ఫిర్యాదు

హిమాయత్‌నగర్: తన అనుమతి లేకుండా అకౌంట్ నుంచి డబ్బు డ్రా అయ్యిందంటూ ఓ న్యాయవాది నారాయణగూడ పోలీసులను ఆశ్రయించాడు. తన వద్ద పనిచేసే వ్యక్తే ఈ ఉదంతానికి పాల్పడినట్లుగా గుర్తించిన లాయర్ పూర్తి ఆధారాలను పోలీసులకు అందజేశాడు. బాధితుడి ఫిర్యాదుతో కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు. హిమాయత్‌నగర్‌కు చెందిన విష్ణువర్ధన్ రెడ్డి హైకోర్టులో సీనియర్ లాయర్‌గా పని చేస్తున్నాడు. రెండ్రోజుల క్రితం హిమాయత్‌నగర్‌లోని హెచ్‌డీఎఫ్‌లో హోం బ్రాంచ్ నుంచి రూ.1.95 లక్షలు విత్‌డ్రా అయినట్లు అతడి ఫోన్‌కు మెసేజ్ వచ్చింది. దీంతో అప్రమత్తమైన విష్ణువర్ధన్ రెడ్డి సదరు బ్యాంకు మేనేజర్‌ను సంప్రదించాడు. వివరా లు పరిశీలించిన మేనేజర్ చెక్కు ఆధారంగా డబ్బులు విత్ డ్రా చేసినట్లు తెలిపాడు. దీంతో అతతను డబ్బు డ్రా చేసిన వ్యక్తి వివరాలను తెలుసుకున్నాడు. దీంతో పాటు సీసీ కెమెరాల ఫుటేజీని సైతం తీసుకుని పోలీసులకు అప్పగించాడు. మద్దూరి పాండు రెడ్డి అనే వ్యక్తి తన వద్ద ఆఫీస్ స్టెనోగ్రాఫర్‌గా 5 నెలల క్రితం వరకు పనిచేసినట్లు తెలిపాడు. అతడే చెక్కు వెనక సంతకం చేసి, ఫోన్ నెంబర్ వేసి డబ్బు డ్రా చేశాడని, అందుకు సంబంధించిన సీసీ ఫుటేజీలను సైతం పోలీసులకు అప్పగించాడు. కేసు నమోదు చేసిన పోలీసులు దర్యాప్తు చేపట్టారు.

ముక్కు పోగులు.. కాళ్ల కడియాల కోసం

మహిళ దారుణ హత్య


- వరుసకు తమ్ముడయ్యే వ్యక్తి ఘాతుకం
- సిద్దిపేట్‌లో ఘటన
- నిందితుడి అరెస్ట్



రాజమ్మ (ఫైల్)

మేడ్చల్‌రూరల్: కాళ్ల కడియాలు, ముక్కు పోగుల కోసం వరుసకు తమ్ముడయ్యే వ్యక్తి ఓ మహిళను దారుణంగా హత్య చేసిన సంఘటన ఆలస్యంగా వెలుగులోకి వచ్చింది. పోలీసుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. మేడ్చల్ మండలం, పూడూర్ గ్రామానికి చెందిన రాజమ్మ(40) మద్యానికి బానిసగా మారింది. ఈ క్రమంలో మద్యం తాగేందుకు ఈ నెల 15న ఓ జ్యువెలరీ షాప్‌లో తన వెండి ఆభరణాలు తాకట్టు పెట్టి రూ.వెయ్యి అప్పుగా తీసుకుంది. మళ్లీ 21న అదే షాప్‌లో మరో రూ.1500 తీసుకుని మేడ్చల్‌కు వెళ్లింది. తిరుగు ప్రయాణంలో మేడ్చల్ బస్‌డిపో సమీపంలో పూడూర్‌కు వెళ్లే ఆటో కోసం వేచి ఉండగా కండ్లకోయలో ఉంటున్న ఆమెకు వరుసకు సోదరుడు సంపత్ తాను ఇంటి దగ్గర దింపుతానని మాయమాటలు చెప్పి తన ఆటోలో ఎక్కించుకున్నాడు. అనంతరం రాజమ్మను తుర్కపల్లి వద్దకు తీసుకెళ్లి మద్యం తాగించాడు. అదే సమయంలో వారిని గుర్తించిన రాజమ్మ ఆడబిడ్డ మా వదినను ఇక్కడికి ఎందుకు తీసుకువచ్చావని ప్రశ్నించగా ఇంటికి వెళ్తున్నామని సంపత్ సమాధానం ఇచ్చాడు. అనంతరం రాజమ్మను సిద్దిపేట్–3 టౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని ఈత వనంలోకి తీసుకెళ్లిన సంపత్ ఆమెపై దాడి చేసి కాళ్ల కడియాలు, బంగారు ముక్కు పోగులు ఇవ్వాలని బెదిరించాడు. అందుకు ఆమె నిరాకరించడంతో ఛాతిపై బలంగా కొట్టడంతో రాజమ్మ అక్కడికక్కడే మృతి చెందింది. దీంతో అతను ఆమె ఒంటిపై ఉన్న వెండి, బంగారు ఆభరణాలు తీసుకుని అక్కడి నుంచి పరారయ్యాడు. తాను చేసిన నేరాన్ని తప్పించుకునేందుకు ఆటోను సైతం విక్రయించాడు. అనంతరం చేర్యాలలో చోరీ సొత్తు తాకట్టు పెట్టి రూ.20 వేలు తీసుకున్నాడు. భార్య కనిపించడం లేదని రాజమ్మ భర్త రాజయ్య మేడ్చల్ పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఈ నెల 27న మిస్సింగ్ కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేపట్టారు. విచారణలో భాగంగా సంపత్‌పై అనుమానంతో అతడిని అదుపులోకి తీసుకుని విచారించగా రాజమ్మను హత్య చేసినట్లు అంగీకరించాడు. సిద్దిపేట్–3 టౌన్ పోలీస్ స్టేషన్ పరిధిలోని ఈతవనంలో హత్యకు పాల్పడినట్లు చెప్పడంతో మేడ్చల్ పోలీసులు అక్కడి పోలీసులు సమాచారం అందించారు. సంఘటనా స్థలానికి చేరుకున్న పోలీసులు రాజమ్మ మృతదేహాన్ని స్వాధీనం చేసుకుని మార్చురీకి తరలించారు. గురువారం పోస్టుమార్టం అనంతరం మృతదేహాన్ని కుటుంబసభ్యులకు అప్పగించారు.

గ్యాస్ లీకై 15 మందికి అస్వస్థత



లీకేజీకి కారణమైన గ్యాస్ సిలిండర్లు ఇవే..

సనత్‌నగర్: భూమిలో కూరుకుపోయి శిథిలమైన అమోనియా గ్యాస్ సిలిండర్లకు ఉన్న వాల్వ్‌లు తొలగించే ప్రయత్నంలో గ్యాస్ లీకై 15 మంది అస్వస్థతకు గురయ్యారు. ఓ వ్యక్తి గ్యాస్ సిలిండర్ల వాల్వ్‌ల చోరీకి యత్నించిన క్రమంలో ఈ ఘటన చోటుచేసుకుంది. సనత్‌నగర్ పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగిన ఈ సంఘటన వివరాలు ఇలా ఉన్నాయి. ఫతేనగర్‌లోని పైప్‌లైన్ రోడ్డు చివరన ఉన్న నాలాను ఆనుకుని చెత్త కుప్పల్లో గ్యాస్ కటింగ్‌కు ఉపయోగించే రెండు గ్యాస్ సిలిండర్లు భూమిలో కూరుకుపోయి ఉన్నాయి. గురువారం సాయంత్రం అటుగా వెళుతున్న వడ్డెర బస్తీకి చెందిన వ్యక్తి వాటిని గుర్తించాడు. గ్యాస్ సిలిండర్లకు ఉన్న ఇత్తడి వాల్వ్‌లు తీసుకునేందుకు ఓ సిలిండర్ వాల్వ్‌ను రాడ్‌తో కొట్టడంతో ఒక్కసారిగా నుంచి గ్యాస్ లీకైంది. దీంతో పక్కనే ఉన్న మెకస్ టెక్నాలజీ కంపెనీలో పనిచేస్తున్న బీహార్‌కు చెందిన 10 మంది కార్మికులు ఊపిరాడక అస్వస్థతకు గురయ్యారు. అదే ప్రాంతానికి చెందిన మరో ఐదుగురు అస్వస్థతకు గురయ్యారు. స్థానికులు వారిని సమీపంలోని బీబీఆర్ ఆస్పత్రికి తరలించారు. వారి పరిస్థితి మెరుగ్గానే ఉందని, కోలుకుంటున్నట్లు ఇన్‌స్పెక్టర్ ముత్తుయాదవ్ తెలిపారు.

క్లుప్తంగా...

సాయిచంద్ మృతి కళారంగానికి తీరని లోటు



సాయిచంద్ భౌతికకాయానికి నివాళులు అర్పిస్తున్న శ్రీకృష్ణ

లిబర్టీ: కళాకారుడు, కవి సాయిచంద్ మృతి తెలంగాణకు కళారంగానికి తీరని లోటు అని మాల మహానాడు జాతీయ అధ్యక్షుడు పబ్బతి శ్రీకృష్ణ అన్నారు. తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల సంస్థ చైర్మన్‌గా బాధ్యతలు చేపట్టిన అనేక ప్రాంతాల్లో పర్యటించి గిడ్డంగుల నిర్మాణానికి నిరంతరం కృషి చేశారన్నారు. గురువారం సాయిచంద్ భౌతికకాయం వద్ద పుష్పగుచ్ఛాలు సమర్పించి అంజలి ఘటించారు.

సహజ గాయకుడు సాయిచంద్

లక్డీకాపూల్: ఆట పాటలతో తనదైన ముద్ర వేసుకున్న సహజ గాయకుడు, గొప్ప నాయకత్వ లక్షణాలున్న సాయి చంద్ అకాల మరణం తనను ఎంతగానో కలిచివేసిందని తెలంగాణ ఉద్యోగుల సంఘం రాష్ట్ర అధ్యక్షుడు, నిమ్స్, ప్రభుత్వ అనుసంధానాధికారి డాక్టర్ మార్త రమేష్ అన్నారు. తెలంగాణ ప్రజలను చైతన్య పరుస్తూ.. రాష్ట్ర అభివృద్ధిలో వారిని మమేకం చేయడం తనదైన పాత్ర పోషించారన్నారు. నిమ్స్‌లో నిర్వహించిన ఎన్నో కార్యక్రమాలలో పాల్గొని తన పాటలతో కార్యక్రమం విజయవంతానికి సహకరించిన మిత్రుడు ఇక లేడు అనే విషయం తన్ను ఎంతో బాధిస్తుందన్నారు. సాయిచంద్ ఆత్మకు శాంతి చేకూరాలని, ఆయన కుటుంబ సభ్యులకు ప్రజా కళాకారుడు లేని లోటును తట్టుకునే ఆత్మస్థైర్యాన్ని ఇవ్వాలని రమేష్ కోరారు.

ప్రజాపంథా నివాళి...

ముషీరాబాద్: ప్రముఖ గాయకుడు, తెలంగాణ రాష్ట్ర గిడ్డంగుల కార్పొరేషన్ చైర్మన్ సాయిచంద్ మరణం పట్ల సీపీఐ(ఎంఎల్) ప్రజాపంథా తీవ్ర సంతాపాన్ని ప్రకటించింది. ఆయన మరణం కుటుంబానికి, సంస్కృతిక రంగానికి తీరని లోటని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శి పోటు రంగారావు తెలిపారు. సాయిచంద్ కుటుంబం ప్రజా పంథాలో పని చేసేదని తండ్రి వెంకటరాములు మహబూబ్‌నగర్ జిల్లా అమరచింతలో పార్టీ కార్యకర్తగా, అరుణోదయ రాష్ట్ర నాయకులుగా పని చేశారని సాయిచంద్ చిన్న వయస్సు నుంచే ఉద్యమంతో సంబంధం ఉందని పీడీఎస్‌యూ, అరుణోదయలో పని చేశారని తెలిపారు. ఆయన మరణం పట్ల న్యూ డెమొక్రసీ రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యులు గోవర్ధన్ సంతాపాన్ని ప్రకటిస్తూ ఆయన భౌతికకాయానికి నివాళులర్పించారు.

డాక్టర్ జగన్‌మోహన్‌కు వైద్య శిరోమణి అవార్డు



కాచిగూడ: వైద్య రంగంలో 30 ఏళ్లుగా పేద ప్రజలకు, రోగులకు అపారమైన వైద్య సేవలు అందిస్తున్న ప్రముఖ వైద్య నిపుణుడు ప్రొఫెసర్ డాక్టర్ బి.జగన్‌మోహన్‌కు వైద్య శిరోమణి అవార్డును అందించనున్నట్లు తెలంగాణ సిటిజన్స్ కౌన్సిల్ రాష్ట్ర అధ్యక్షుడు డాక్టర్ ఎం.రాజ్ నారాయణ్ ముదిరాజ్ తెలిపారు. గురువారం బర్కత్‌పురలో ఆయన మాట్లాడుతూ.. జాతీయ వైద్యుల దినోత్సవం సందర్భంగా భారతరత్న డాక్టర్ బీసీ రాయ్ జన్మదినోత్సవాన్ని పురస్కరించుకొని ప్రతి ఏడాది తెలంగాణ రాష్ట్రం నుంచి ఒకే ఒక్కరికి ఇచ్చే ఈ అవార్డును 2023కుగాను జగన్‌మోహన్‌కు అందించనున్నామని ఆయన పేర్కొన్నారు. బర్కత్‌పురలో జూలై 1న ఉదయం 10:30 గంటలకు వైద్యుల దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు చేస్తున్నామని, ఈ కార్యక్రమంలో ఆయనకు అవార్డును ప్రదానం చేయనున్నట్లు తెలిపారు. జస్టిస్ వామన్‌రావు ముఖ్యఅతిథిగా పాల్గొంటారని ఆయన పేర్కొన్నారు.

నాణేల దివ్య దర్శనం



షిరిడీ సాయిబాబా ప్రసాదించిన 9 నాణేలను ప్రదర్శిస్తున్న దృశ్యం

నల్లకుంట: షిరిడీ సాయిబాబా తన భక్తురాలైన లక్ష్మీబాయి షిండేకు ప్రసాదించిన 9 నాణేలు గురువారం సాయంత్రం షిరిడీ నుంచి నల్లకుంటలోని శివం మందిరానికి తీసుకువచ్చారు. ఈ సందర్భంగా షిరిడీ నుంచి నాణేలను తీసుకొచ్చిన లక్ష్మీబాయి షిండే ముని మనవడు అరుస్ గైక్వాడ్ షిండేకు మంగళ వాయిద్యాలతో స్వాగతం పలికారు. అక్కడ ఏర్పాటు చేసిన వేదికపై సాయిబాబా ప్రసాదించిన నాణేలకు పూజలు నిర్వహించారు. అనంతరం సాయి భక్తులు పెద్ద ఎత్తున నాణేలను సందర్శించుకున్నారు. ఈ కార్యక్రమంలో శ్రీ సత్య సాయి సేవా సంస్థలు హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు మల్లేశ్వరరావు డిటైర్డ్ డీజీపీ హెచ్‌జే దొర, శేష సాయి, రాజేందర్, ఎంఎల్ఎస్ స్వామి, లక్ష్మీ నరసింహ పాల్గొన్నారు.

భక్తి శ్రద్ధలతో బక్రీద్

- మసీదులు, ఈద్గాల్లో ప్రత్యేక ప్రార్థనలు
- ముస్లింలకు శుభాకాంక్షలు తెలిపిన ప్రజాప్రతినిధులు

బంజారాహిల్స్: ఖైరతాబాద్, జూబ్లీహిల్స్ నియోజకవర్గాన్ని బక్రీద్ పర్వదినాన్ని ముస్లింలు గురువారం ఘనంగా నిర్వహించుకున్నారు. తెల్లవారుజామున సమీప మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు నిర్వహించారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని జహీరానగర్ చౌరస్తా మైదానంలో ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన ఈద్గా వద్ద ముస్లింలు చేరుకొని సామూహిక ప్రార్థనలు నిర్వహించారు. బంజారాహిల్స్, జూబ్లీహిల్స్, సోమాజిగూడ, ఖైరతాబాద్‌తోపాటు జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలోని రహమత్‌నగర్, వెంగళరావునగర్, శ్రీనగర్ కాలనీ తదితర ప్రాంతాల్లో బక్రీద్ వేడుకలు ఘనంగా నిర్వహించుకున్నారు. ఒకరికొకరు ఆలింగనం చేసుకుంటూ శుభాకాంక్షలు తెలుపుకొన్నారు.



బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని జహీరానగర్ గ్రౌండ్ వద్ద బక్రీద్ ప్రార్థనల్లో పాల్గొన్న ముస్లింలు





శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే దానం



ఫిలింనగర్ ఈద్గా వద్ద...









బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని శ్రీ వెంకటేశ్వరస్వామి ఆలయంలో స్వామివారి అలంకారం



బంజారాహిల్స్‌రోడ్ నెం. 12 విశ్వసాయి మందిరంలో సాయిబాబా దివ్య దర్శనం

వైభవంగా తొలి ఏకాదశి

- ఆలయాలకు పోటెత్తిన భక్తులు
- పెద్ద ఎత్తున ప్రత్యేక పూజలు

బంజారాహిల్స్: తొలి ఏకాదశి పర్వదినం సందర్భంగా గురువారం ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. బంజారాహిల్స్ రోడ్ నెం. 14లోని శ్రీ వెంకటేశ్వరస్వామి దేవస్థానానికి భక్తులు పోటెత్తారు. స్వామివారి ప్రత్యేక అలంకరణను తిలకించిన భక్తులు పులకించిపోయారు. బంజారాహిల్స్ రోడ్ నెం. 12లోని శ్రీ విశ్వసాయి మందిరంలో కొలువుదీరిన సాయిబాబాకు భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. జూబ్లీహిల్స్ టీటీడీ శ్రీవారి ఆలయానికి తెల్లవారుజాము నుంచే భక్తులు పోటెత్తారు. స్వామివారి దర్శనానికి భక్తులు బారులు తీరారు. స్వామివారిని తొలి ఏకాదశి సందర్భంగా ప్రత్యేకంగా అలంకరించారు.

జూబ్లీహిల్స్ నియోజకవర్గం పరిధిలో...

వెంగళరావునగర్: తొలి ఏకాదశి వేడుకలు జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో గురువారం ఘనంగా నిర్వహించారు. వెంగళరావునగర్, యూసుఫ్‌గూడ డివిజన్ల పరిధిల్లో ఉన్న సాయిబాబా ఆలయాల్లో విశేష పూజలు జరిగాయి. వెంగళరావునగర్ జీటీఎస్ కాలనీల్లోని జీటీఎస్ దేవాలయం, మధురానగర్ కాలనీలోని శ్రీ అభయాంజనేయ స్వామి దేవాలయం, వెంగళరావునగర్‌కాలనీలోని శ్రీషిరిడీ సాయి సంస్థానం, శ్రీ సీతారామాంజనేయ స్వామి ఆలయం తదితర ప్రాంతాల్లో ఉన్న ఆలయాల్లో పూజలు చేశారు. వెంగళరావునగర్, యూసుఫ్‌గూడ డివిజన్ల కార్పొరేటర్లు దేదీప్య విజయ్, రాజ్‌కుమార్ పటేల్ ఆయా దేవాలయాల్లో ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం భక్తులకు అన్నదానం జరిగింది. పూజా కార్యక్రమాల్లో టీఆర్ఎస్ సీనియర్ నాయకులు విజయ్‌కుమార్, జీటీఎస్ ఆలయ కమిటీ చైర్మన్ చిన్న రమేష్ తదితరులు పాల్గొన్నారు.



జీటీఎస్ ఆలయంలో పూజలు చేస్తున్న కార్పొరేటర్ దేదీప్య



జూబ్లీహిల్స్ టీటీడీ ఆలయంలో శ్రీవారి దర్శనానికి పోటెత్తిన భక్తులు

కేంద్ర పథకాలను ప్రజలకు వివరించాలి

కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి

రహమత్‌నగర్: ప్రధాని నరేంద్రమోదీ నేతృత్వంలోని కేంద్ర ప్రభుత్వ దేశ ప్రజల అభ్యున్నతి కోసం ప్రవేశ పెట్టిన సంక్షేమ పథకాలను ప్రజలకు వివరించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి బీజేపీ శ్రేణులకు సూచించారు. రహమత్‌నగర్‌లో గురువారం పార్టీ డివిజన్ అధ్యక్షుడు కనకరాజు అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమావేశానికి ముఖ్య అతిథిగా పాల్గొన్న కిషన్‌రెడ్డి మాట్లాతుతూ... ప్రధాని మోదీ ప్రవేశపెడుతున్న ప్రజా సంక్షేమ పథకాలు ప్రపంచ వ్యాప్తంగా మన్ననలు పొందుతున్నాయన్నారు. బీజేపీ జాతీయ కార్యవర్గ సభ్యురాలు డాక్టర్ వీర పనేని పద్మ, సెంట్రల్ జిల్లా అధ్యక్షులు డాక్టర్ గౌతంరావు, కీర్తిరెడ్డి, జూబ్లీహిల్స్ కన్వీనర్ కుంభాల గంగారాజు, బీజేవైఎం జిల్లా కార్యదర్శి భరత్‌గౌడ్, సెంట్రల్ జిల్లా అధికార ప్రతినిధి కొలన్ సత్యనారాయణ, నేతలు ప్రేమ్, సముద్రాల మల్లేశ్‌గుప్తా, కళావతి తదితరులు పాల్గొన్నారు.

శ్రీకృష్ణానగర్‌లో...

వెంగళరావునగర్: కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెడుతున్న సంక్షేమ పథకాలను జూబ్లీహిల్స్ నియోజకవర్గంలోని ఇంటింటికీ వెళ్లి ప్రజలందరికీ అర్థం అయ్యేలా వివరించాలని కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి పేర్కొన్నారు. యూసుఫ్‌గూడ డివిజన్ శ్రీకృష్ణానగర్‌లో గురువారం రాత్రి మహాజన సంపర్క్ అభియాన్ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా కిషన్‌రెడ్డి మాట్లాడుతూ... పేద, మధ్య తరగతి ప్రజలందరికీ కేంద్ర పథకాల ఫలాలు అందేలా కృషి చేయాలన్నారు. అర్హులందరూ ఆయా పథకాలను సద్వినియోగం చేసుకోవాలన్నారు. రానున్న ఎన్నికల్లో రాష్ట్రంలో బీజేపీ జెండా ఎగురవేయనుందని, జూబ్లీహిల్స్‌లోనూ బీజేపీ సత్తా చాటనుందని అన్నారు.



రహమత్‌నగర్‌లో మాట్లాడుతున్న కిషన్‌రెడ్డి

బీసీల పట్ల కేంద్ర ప్రభుత్వం వివక్ష

కాచిగూడ: బీసీల పట్ల కేంద్ర ప్రభుత్వం పూర్తి వివక్షతతో వ్యవహరిస్తోందని జాతీయ బీసీ మహాసభ అధ్యక్షుడు రాజేందర్ పటేల్‌గౌడ్ అన్నారు. గురువారం కాచిగూడలోని బీసీ మహాసభ కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ.. పార్లమెంట్, అసెంబ్లీలో బీసీల రాజకీయ ప్రాతినిధ్యం ఇప్పటి వరకు 14 శాతం దాట లేదని తెలిపారు. దేశ జనాభాలో 70 కోట్ల మంది ఉన్న బీసీల రాజకీయ ప్రాతినిధ్యం 50 శాతానికి పైగా పెరగాలని అన్నారు. పార్లమెంట్‌లో బీసీ బిల్లును చట్ట సభలలో 50శాతం రిజర్వేషన్లు కల్పించాలని, బీసీ క్రిమిలేయర్‌ను తొలగించాలని డిమాండ్ చేశారు. బీసీ మహాసభ నేతలు డాక్టర్ ప్రశాంత్ నిమ్‌కర్, ధరణీధర్‌యాదవ్, మెట్టు ముత్యాల్‌రావు, భూషణ్ భాస్కర్, పులిజాల కృష్ణ పాల్గొన్నారు.

రేపటి నుంచి కొలకలూరి ఇనాక్ సాహితీ సప్తాహం



బ్రోచర్‌ను ఆవిష్కరిస్తున్న జనార్దనమూర్తి

చిక్కడపల్లి: ప్రముఖ సాహితీవేత్త, శ్రీ వేంకటేశ్వర యూనివర్సిటీ విశ్రాంత ఉపాధ్యక్షుడు ఆచార్య కొలకలూరి ఇనాక్ 85వ జన్మదినం సందర్భంగా త్యాగరాయగానసభ ఆధ్వర్యంలో ఆయన సాహితీ సప్తాహం జూలై 1 నుంచి 7 వరకు ఏడు రోజుల పాటు కళాసుబ్బారావు కళావేదికపై జరుగుతుంది. ఇందుకు సంబంధించిన వివరాలను గురువారం విలేకర్ల సమావేశంలో గానసభ అధ్యక్షుడు కళా జనార్దనమూర్తి తెలియజేస్తూ ఇనాక్‌ను గానసభతో ఎంతో అనుబంధం ఉందని ఆయన వ్యక్తిత్వం, సాహిత్య విశిష్టతను దృష్టిలో ఉంచుకుని సాహిత్య సప్తాహం పేరిట ఆయన వివిధ ప్రక్రియల్లోని రచనలు ఆవిష్కరిస్తామని తెలిపారు. వరుసగా వ్యాస పరిణామం, వలస, దిక్కులేనోడు, విశాలశూన్యం, విమర్శిని, పాలి, ఆల్ ఆఫ్ పార్డన్ సంపుటిలను ప్రభుత్వ సలహాదారు డాక్టర్ కేవీ రమణాచారి, మాజీ మంత్రి బుద్ధప్రసాద్, గ్రంథాలలయ పరిషత్ చైర్మన్ అయాచితం శ్రీధర్, సాహిత్య అకాడమీ చైర్మన్ జూలూరు గౌరీశంకర్ ముఖ్యఅతిథులుగా హాజరై ఆవిష్కరిస్తారని తెలిపారు. ఈ సమావేశంలో గుండవరపు గీతాదేవి, బండి శ్రీనివాస్ పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికులకు 'డబుల్' ఇళ్లను కేటాయించాలి



ఆందోళన నిర్వహిస్తున్న సీఐటీయూ నేతలు

రహమత్‌నగర్(బోరబండ): జీహెచ్ఎంసీలో పని చేసే పారిశుద్ధ్య కార్మికులకు డబుల్ బెడ్ రూం ఇళ్లను కేటాయించాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఈ మేరకు బోరబండ సైట్-2 కమ్యూనిటీ హాల్ వద్ద గురువారం ఆందోళన నిర్వహించారు. ఈ సందర్భంగా సీఐటీయూ నాయకురాలు తులిసి బాయ్ మాట్లాడుతూ... జీహెచ్ఎంసీ యూసుఫ్‌గూడ సర్కిల్‌లో దాదాపు 600 మంది పారిశుద్ధ్య కార్మికులు ఉన్నారన్నారు. అందులో 90 శాతానికి పైగా ఇళ్లు లేని పేదలే అని ఆమె తెలిపారు. పారిశుద్ధ్య కార్మి కులకు ఇళ్లను కేటాయించే వరకూ తమ పోరాటం ఆగదని హెచ్చరించారు. ప్రజా సంఘాల నేత శేషగిరిరావు, రాధ, శ్రీలక్ష్మి, శాంతమ్మ, వినోద్, బాలయ్య తదితరులు పాల్గొన్నారు.

ప్రశాంత వాతావరణంలో పండగలు జరుపుకోవాలి

ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్

రహమత్‌నగర్: శాంతియుత, ప్రశాంత వాతావరణంలో అన్ని మతాల ప్రజలు పండగలను జరుపుకోవాలని జూబ్లీహిల్స్ ఎమ్మెల్యే మాగంటి గోపీనాథ్ అన్నారు. ఎస్పీఆర్‌హిల్స్ ప్లేగ్రౌండ్‌లో గురువారం నిర్వహించిన బక్రీద్ (ఈద్ ఉల్ ఆజా) ప్రార్థనల్లో ఆయన పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... బీఆర్ఎస్ ప్రభుత్వంలోనే అన్ని మతాలకు సముచిత గౌరవం లభిస్తున్నదన్నారు. కార్పొరేటర్ సి.ఎన్.రెడ్డి, రాజ్‌కుమార్‌పటేల్,బీఆర్ఎస్ నాయకులు దుబాయ్ నజీర్,అప్పుఖాన్, తన్నూఖాన్, డివిజన్ మాజీ అధ్యక్షుడు సయ్యద్ బషీర్, జాఫర్‌హుస్సేన్, బోరబండ, యూసుఫ్‌గూడ డివిజన్ల పార్టీ అధ్యక్షులు కృష్ణమోహన్, సంతోష్, ఫయాజ్, అబ్దుల్ గని, గఫూర్ తదితరులు పాల్గొన్నారు.



ముస్లింలకు శుభాకాంక్షలు చెబుతున్న ఎమ్మెల్యే మాగంటి

పుస్తకావిష్కరణ



చిక్కడపల్లి: సినిమాలకు ముళ్లపూడి వెంకటరమణ అద్భుతమైన రచనలు అందించిన గొప్పవ్యక్తి అని అలాంటి గొప్ప వ్యక్తి మరో దశాబ్ది కాలం వరకూ లభించకపోవచ్చని సాహితీవేత్త డాక్టర్ ఓలేటి పార్వతీశం అన్నారు. రచయిత ముళ్లపూడి వెంకటరమణ 92వ పుట్టినరోజు వేడుకలు గురువారం త్యాగరాయగానసభలో అక్షజ్ఞ పబ్లికేషన్ ఆధ్వర్యంలో జరిగాయి. ముళ్లపూడి హాస్య కథల పోటీ విజేతలకు బహుమతి ప్రదానం చేశారు. ఈ సందర్భంగా పార్వతీశం మాట్లాడుతూ.. ప్రపంచ అస్తిత్వాన్ని ప్రజలకు అందించిన గొప్ప మహనీయుడు అన్నారు. ఈ సందర్భంగా ఆవిష్కృతగ్రంథం తొలి రాజీని స్వీకరించి విజేతలకు ముళ్లపూడి శ్రీదేవి బహుమతులు ప్రదానం చేశారు. రాము, సినీ దర్శకులు శివనాగేశ్వర్‌రావు, కార్టూనిస్టు శంకు, గోపాల్‌యాదవ్, భాగిశాస్త్రి, భావరాజు పద్మిని, వెంకట్, బిఎస్ శర్మ, శరత్‌కుమార్ పాల్గొన్నారు.

బసవతారకం నగర్‌బస్తీలో ఇంటింటి సర్వే



బసవతారకం నగర్ బస్తీలో ఇంటింటి సర్వే చేస్తున్న బీఎల్‌వోలు

ఫిలింనగర్: ఓటరు జాబితాను మరింత పారదర్శకంగా రూపొందించేందుకు అధికారులు సన్నద్ధమయ్యారు. ఇందులో భాగంగా ఇంటింటి సర్వే చేపట్టారు. 2023 అక్టోబర్ 1వ తేదీ నాటికి 18 ఏళ్లు పూర్తి చేసుకున్న యువత ఈ నెల 30లోగా ఫారం-6 భర్తీ చేసి బూత్ స్థాయి అధికారులకు అందజేయాలని అధికారులు ఆదేశించారు. ఈ మేరకు బీఎల్‌వోలు ఇంటింటి సర్వేను చేస్తూ ఓటరు జాబితాలో తప్పుప్పుల సవరణకు అవకాశం కల్పిస్తున్నారు. ఒకేరమైన ఫొటోలతో ఓటర్లుగా నమోదైన వారు, మృతుల వివరాలు, రెండు చోట్లా ఓటరుగా ఉన్న వారి వివరాలు తొలగించేందుకు సహకరించాలని విజ్ఞప్తి చేస్తున్నారు. ఆ వివరాలను ప్రత్యేకంగా రికార్డులలో నమోదుచేస్తున్నారు. తప్పిదాలకు ఆస్కారం లేకుండా పూర్తి పారదర్శకంగా తుది ఓటరు జాబితా తీసుకొచ్చేందుకు ప్రణాళికలురూపొందించి అమలు చేస్తున్నామని జీహెచ్ఎంసీ సర్కిల్-18 డీఎంసీ రజినీకాంత్‌రెడ్డి తెలిపారు.

వేడుకగా ఆలయ వార్షిక బ్రహ్మోత్సవాలు



బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని సీతారామాంజనేయ స్వామి ఆలయంలో పూజలు

వెంకటేశ్వరకాలనీ: బంజారాహిల్స్ రోడ్ నెం. 10లోని గౌరీశంకర్ కాలనీ శ్రీ సీతారామాంజనేయ స్వామి, శ్రీ భవానీ రామలింగేశ్వరస్వామి దేవాలయ 22వ వార్షిక బ్రహ్మోత్సవ వేడుకలు కనుల పండువగా జరుగుతున్నాయి. వేడుకల్లో భాగంగా గురువారం ఉదయం స్వామి వారికి సుప్రభాత సేవ, అనంతరం భగవదారాధన నిర్వహించారు. అష్టోత్తర శత ఘటాభిషేకం, అలంకరణ అనంతరం శ్రీ సీతారామచంద్ర స్వామి కల్యాణాన్ని అత్యంత వైభవంగా నిర్వహించారు. సాయంత్రం విష్ణుసహస్ర పారాయణం ఆధ్యాత్మిక వాతావరణంలో నిర్వహించారు. రాత్రి జరిగిన తిరువీధి సేవలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని స్వామివారిని దర్శించుకున్నారు. ఈ నెల 28వ తేదీన ప్రారంభమైన బ్రహ్మోత్సవాలు జూలై 2వ తేదీ వరకు జరుగతాయని ఆలయ వర్గాలు వెల్లడించారు.

విద్యా హక్కు చట్టానికి ప్రభుత్వం తూట్లు

- మాదిగ దండోరా రాష్ట్ర అధ్యక్షుడు దోమల మల్లేష్ మాదిగ

పంజగుట్ట: తెలంగాణ ప్రభుత్వం విద్యా హక్కు చట్టం అమలు పరచకుండా కార్పొరేట్ విద్యా సంస్థల అడుగులకు మడుగులు ఒత్తుతోందని మాదిగ దండోరా రాష్ట్ర అధ్యక్షుడు దోమల మల్లేష్ మాదిగ ఆరోపించారు. గురువారం సోమాజిగూడ ప్రెస్‌క్లబ్‌లో ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ... విద్యాహక్కు చట్టం ప్రకారం కార్పొరేట్ విద్యా సంస్థల్లో 25 శాతం రిజర్వేషన్లు ఇవ్వాలని ఉన్నా ఏ విద్యా సంస్థా దాన్ని పట్టించుకోవడం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. పలు నిబంధనలు పెట్టి విద్యార్థుల తల్లిదండ్రులను నిలువునా దోచుకుంటున్న కార్పొరేట్ శక్తుల ఆగడాలను అరికట్టడమే లక్ష్యంగా మాదిగ దండోరా పనిచేస్తుందన్నారు. ఎస్సీ జనాభా దామాషా ప్రకారం అన్ని పార్టీలు సీట్లు కేటాయించాలని ఇదే విషయమై అన్ని పార్టీల అధ్యక్షులతో త్వరలోనే కలుస్తామన్నారు. ఉద్యమ సమయంలో వామపక్ష విద్యార్థి నాయకులు, కుల సంఘాలలో పనిచేసిన వారు తెలంగాణ మాదిగ శక్తి పేరుతో ఉద్యమాలు నడిపిన వారి అనుభవాల నుంచి మాదిగ దండోరా ఏర్పడిందన్నారు. కో ఆర్డినేటర్ బొజ్జ శ్రీధర్ మాదిగ, ఈదుల పరుశురామ్ మాదిగ, బోయ ప్రవీణ్ మాదిగ, పోతరాజు కిరణ్, భవాని, అరుణ్ పాల్గొన్నారు.



మాదిగ దండోరా పోస్టర్ ఆవిష్కరిస్తున్న నేతలు

మాజీ ప్రధాని పీవీకి భారతరత్న ఇవ్వాలి

లిబర్టీ: మాజీ ప్రధాన మంత్రి, బహుభాషా కోవిదుడు, దేశంలో ఆర్థిక సంస్కరణలకు ఆద్యుడు, రాజకీయ దురంధరుడు దివంగత పి.వి.నర్సింహారావుకు దేశ అత్యున్నత పురస్కారం భారతరత్న ఇవ్వాలని లోక్ దళ్ పార్టీ తెలంగాణ రాష్ట్ర శాఖ అధ్యక్షుడు, జాతీయ కార్యదర్శి పుల్లూరు వెంకటరాజేశ్వరరావు కేంద్ర ప్రభుత్వానికి విజ్ఞప్తి చేశారు. స్వర్గీయ పీవీ దేశానికి ప్రజలకు అందించిన సేవలను కేంద్ర ప్రభుత్వం గుర్తించి భారతరత్న అవార్డు ఇచ్చి గౌరవించాల్సిన అవసరం ఎంతైనా ఉందన్నారు. పార్టీ కార్యాలయంలో గురువారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ... దేశంలో ఇబ్బందికర పరిస్థితుల్లో ఉన్న సమయంలో ప్రధానిగా ఉన్న పీవీ సరళీకృత ఆర్థిక విధానాలకు శ్రీకారం చుట్టి ఆర్థిక రంగంలో అనేక సంస్కరణలు తీసుకువచ్చారని గుర్తు చేశారు. 1995లో తీసుకొచ్చిన ఆర్థిక సంస్కరణలు అనేక దేశాలు పీవీని అభినందించాయని ఆయన అన్నారు. రాజకీయ విలువలతో కూడిన జీవితాన్ని గడిపారని తన రాజకీయ జీవితంలో మచ్చలేని మహోన్నత వ్యక్తిగా చిరస్థాయిగా నిలిచిపోయారన్నారు. నిజాయితీ నిలువుటద్దంగా పీవీ పని చేశారని పేర్కొన్నారు. నాయకురాళ్లు వాసంతి, సంకీర్త తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా బాలమురళీకృష్ణ జయంతి

నాంపల్లి: పద్మ విభూషణ్ డాక్టర్ మంగళంపల్లి బాల మురళీకృష్ణ 93వ జయంతిని గురువారం పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం నందమూరి తారక రామారావు కళామందిరంలో రాగవర్ధని కల్చరల్ సొసైటీ, హోప్ సంస్థల సంయుక్త నిర్వహణలో ఘనంగా జరిగాయి. డాక్టర్ మంగళంపల్లి బాల మురళీకృష్ణ ప్రియ శిష్యులు డీవీ మోహన్ కృష్ణ శిష్య బందం చేత బాలమురళి రచించిన గణపతి ప్రార్థనతో వేడుకలను ప్రారంభించారు. అనంతరం పీఎస్‌కే రమాకాంత్ గాత్రం, ఇషిత, మయూఖ్ గాత్ర యుగళంతో గానం చేశారు. ముఖ్యఅతిథులుగా శేషాచారి, రాఘవాచారి, ఆత్మీయఅతిథిగా నేమాని సోమయాజు హాజరయ్యారు. సభానంతరం మోహనకృష్ణ శిష్యురాలు మాళవిక బాలమురళి రచనలతో గాత్ర కచేరి సమర్పించగా వయొలిన్ పీఎస్‌పీ గాయత్రి శివాని, మృదంగంపై పెరవలి జయభాస్కర్, ఘటంపై నేమాని సోమయాజులు వాద్య సహకారం అందించారు. సాయి వైష్ణవి గాత్ర సహకారం అందించారు.



గాత్ర కచేరీని ప్రదర్శిస్తున్న కళాకారులు

యువర్స్

మెర్లిన్

మెరుపై మెరిసెన్

'కాల్ చాట్‌జీపీటీ వేరెవర్ యూ ఆర్' అంటూ రంగంలోకి దిగిన చాట్‌జీపీటీ యాప్ 'మెర్లిన్' మెరుపు వేగంతో విజయం సాధించింది. 'పవర్ ఆఫ్ చాట్‌జీపీటీ'ని యూజర్‌కు దగ్గర చేసి, టైమ్ సేవ్ చేసే 'మెర్లిన్' సృష్టికర్తలు ప్రత్యూష్ రాయ్, సిద్ధార్థ సక్సేనా, సిరిసేందు సర్కార్‌లు మూకుమ్మడిగా చెప్పే మాట... 'కొత్తగా ఆలోచించడం అనేది విజయానికి తొలి మెట్టు'



ప్రత్యూష్ రాయ్, సిద్ధార్థ సక్సేనా, సిరిసేందు సర్కార్

గ్లోబల్ కన్సల్టెన్సీ 'బీసీజీ'లో పనిచేస్తున్న సమయంలో ఎన్నో విలువైన అనుభవాలను మూటగట్టుకున్నాడు ప్రత్యూష్‌రాయ్. ఆ అనుభవాలను విశ్లేషించుకునే క్రమంలో తనకు కొత్తగా ఏదైనా చేయాలనిపించేది. ఐఐటీ–కాన్పూర్‌లో సివిల్ ఇంజనీరింగ్ చేసిన ప్రత్యూష్ రాయ్ తన ఇద్దరు స్నేహితులు సిద్ధార్థ సక్సేనా, సిరిసేందు సర్కార్‌లతో మాట్లాడాడు.

'కొత్తగా అనిపించే అర్థవంతమైన పని ఏదైనా చేద్దాం' అనుకున్నారు వాళ్లు.

అలా వారి మేధోమథనం నుంచి పుట్టిన అంకురమే...మెర్లిన్.

చాట్‌జీపీటీ యాప్ 'మెర్లిన్' మెరుపు వేగంతో విజయం సాధించింది. ప్రారంభమైన ఆరు నెలల్లోనే ఈ యాప్‌ను వందలాది మంది ఇన్‌స్టాల్ చేసుకున్నారు.

టెక్ కంపెనీ 'ఫోయర్'లో విలీనం అయిన తరువాత యూఎస్, తూర్పు ఆసియా, యూరప్‌లలో 'మెర్లిన్'కు మంచి మార్కెట్ ఏర్పడింది.

> 'హమ్మయ్య... సక్సెస్ అయ్యాం' అని సేద తీరడం లేదు 'ఫోయర్–మెర్లిన్' బృందం. ఇప్పుడు వారి దృష్టి సిబ్బందిని పెంచుకోవడం, మెర్లిన్‌లోకి రకరకాల సబ్ ఫీచర్స్‌ని తీసుకురావడంపై ఉంది.

'ఎలాంటి అయోమయాలకు, సంక్లిష్టతలకు తావు లేకుండా బ్రౌజర్‌లో భాగమయ్యే సింపుల్ ప్రాడక్ట్ ఇది. యూట్యూబ్, జీమెయిల్, ట్విట్టర్, లింక్డ్‌ఇన్... మొదలైన వాటికి సంబంధించి క్లిష్టమైన సమస్యల పరిష్కారం విషయంలో డైలీ యాక్టివ్ యూజర్‌లకు ఉపయోగపడుతుంది. మార్కెటర్స్, రిక్రూటర్స్‌కు ఒక వాక్యం ట్వీట్ నుంచి ఎన్నో పదాల ఇమెయిల్ వరకు ఎన్నో పనుల్లో టైమ్ వృథా కాకుండా చూస్తుంది. ఇది సింపుల్ క్రోమ్ ఎక్స్‌టెన్షన్. బటన్‌ను ఒక్కసారి క్లిక్ చేస్తే చాలు చాట్‌జీపీటీ మనల్ని వెదుక్కుంటూ వస్తుంది' అని 'మెర్లిన్' గురించి చెబుతున్నాడు ప్రత్యూష్ రాయ్.

యూట్యూబ్‌కు సంబంధించి 'మెర్లిన్'ను 'యూట్యూబ్ సమ్మరైజర్'గా ఉపయోగించుకుంటున్నారు యూజర్‌లు. ఒక యూట్యూబ్ వీడియోను పూర్తిగా చూడనవసరం లేకుండానే దానిలోని ముఖ్యమైన సెగ్మెంట్‌ల గురించి 'మెర్లిన్' చెబుతుంది.

పర్సనలైజ్‌డ్ ప్రాంప్ట్స్ విషయంలోనూ 'మెర్లిన్' ఉపయోగపడుతుంది. మన రైటింగ్ స్టైల్‌ను కాప్చర్ చేస్తుంది.

'నిజానికి మా దృష్టి డెవలపర్స్‌పై ఉండేది. అయితే మా ప్రాడక్ట్‌ను యూజర్‌లు ఆసక్తికరమైన పద్ధతుల్లో ఉపయోగించుకుంటున్నారు' అంటున్నాడు ప్రత్యూష్ రాయ్.

నేర్చుకున్న పాఠాలు ఎప్పుడూ వృథా పోవు.

'బీసీజీ'లో రాయ్ అనుభవంతో నేర్చుకున్న ఎన్నో పాఠాలు 'మెర్లిన్' ప్రయాణంలో ఉపయోగపడ్డాయి. రాయ్ మాటల్లో చెప్పాలంటే ఆ అనుభవ పాఠాలు తన ప్రపంచాన్నే మార్చేసి కొత్త ప్రపంచాన్ని పరిచయం చేశాయి.

'మెర్లిన్ సక్సెస్‌కు కారణం దానిపై యూజర్‌లకు గురి కుదరడమే' అంటున్నాడు 'ఫోయర్–మెర్లిన్' ఫస్ట్ ఇన్వెస్టర్, బెటర్ క్యాపిటల్ సీయివో వైభవ్.

'హమ్మయ్య...సక్సెస్ అయ్యాం' అని సేద తీరడం లేదు 'ఫోయర్–మెర్లిన్' బృందం.

ఇప్పుడు వారి దృష్టి సిబ్బందిని పెంచుకోవడం, మెర్లిన్‌లోకి రకరకాల సబ్ ఫీచర్స్‌ని తీసుకురావడంపై ఉంది.

'మెర్లిన్' అనేది ఒక రకమైన డేగ. దానిలోని సునిశితమైన దృష్టిని తమ 'మెర్లిన్'లోకి తీసుకురావాలనుకుంటోంది, ఫినిష్ ఎనీ టాస్క్ అని ధైర్యం ఇవ్వాలనుకుంటోంది బెంగళూరు కేంద్రంగా పనిచేస్తున్న ఫోయర్–మెర్లిన్ బృందం.

● ఆర్ట్ అండ్ కల్చర్

శ్రేయరాగ రాక్‌స్టార్



శ్రేయా లెంక

ఎక్కడి ఒడిశా? ఎక్కడి కొరియా? అయితే కలలు కనేవారికి దూరభారాలు ఉండవు. పట్టుదలతో దూరాలను కరిగించేస్తారు. కలలను నిజం చేసుకుంటారు. ఒడిశాలోని రూర్కెలాకు చెందిన శ్రేయా లెంక ఈ కోవకు చెందిన ప్రతిభాశాలి....

ఇండియా ఫస్ట్ కె–పాప్ ఐడల్‌గా శ్రేయా లెంక చరిత్ర సృష్టించింది. పన్నెండు సంవత్సరాల వయసులో డ్యాన్సర్‌గా శ్రేయ కళా ప్రస్థానం మొదలైంది. ఎప్పుడూ పెద్ద కలలే కనేది. ఒక ఫ్రెండ్ ద్వారా శ్రేయకు 'కె–పాప్' పరిచయం అయింది. వారి మ్యూజిక్ వీడియోలు తనను బాగా ఆకట్టుకున్నాయి. 'వీళ్ల ఆర్టిస్టులా? మెరుపు తీగలా?' అనిపించింది.

వారి యూనిక్ స్టైల్, సింగింగ్, డ్యాన్సింగ్ తనకు తెగ నచ్చేశాయి. ఏదో ఒకరోజు వారిలో కలిసి, వారిలో ఒకరిగా కలిసి పనిచేయాలనుకుంది. 'అది అసాధ్యం' అని ఎవరు అన్నా సరే శ్రేయ వెనక్కి తగ్గలేదు.

ఆమె కల నెరవేరడానికి ఎంతో కాలం పట్టలేదు. ప్రపంచంలోని వందలాది మందితో పోటీ పడి గెలిచింది. 'కె–పాప్' మెంబర్‌గా తన కలను నెరవేర్చుకుంది. దేశం కాని దేశం... సౌత్ కొరియాలోకి అడుగు పెట్టినప్పుడు శ్రేయా లెంకాకు అక్కడి ఆహారం, జీవనవిధానం, భాష...అన్నీ కొత్తగా అనిపించాయి. తాను ఇల్లు విడిచి అంత దూరం వెళ్లడం అదే తొలిసారి.

కొత్త విషయాలను ఉత్సాహంగా నేర్చుకుంది. కొత్త జీవనవిధానానికి ఆనందంగా అలవాటు పడింది. చుట్టు పక్కల వాళ్లు కూడా ఎంతో ప్రోత్సాహకంగా ఉండేవాళ్లు. ఇండియాలో అయితే రాత్రి పదిలోపు భోజనం చేసేది. కొరియాలో మాత్రం సాయంత్రం 6–7 మధ్య భోజనం చేస్తారు. మొదట్లో కష్టం అనిపించినా ఆ పద్ధతికి మెల్లగా అలవాటు పడింది.

తనలాగే 'కె–పాప్ ఐడల్' కావాలనుకునే ఔత్సాహికులకు శ్రేయా లెంకా ఇచ్చే సలహా...

'మీ కలలను నెరవేర్చుకోవడం విషయంలో రాజీ పడవద్దు. వందసార్లు అపజయం పాలైనా సరే, ఆవగింజంత ఆత్మవిశ్వాసం కూడా కోల్పోవద్దు. ఆత్మవిశ్వాసం ఉన్న వాళ్లు తప్పకుండా ఒక రోజు గెలుస్తారు'

● టెక్.. టాక్

నథింగ్ ఫోన్2 త్వరలో...



సైజ్: 6.7 అంగుళాలు ప్రొటెక్షన్: గొరిల్లా గ్లాస్
రిజల్యూషన్: 1080×2400 పిక్సెల్స్
వోఎస్: ఆండ్రాయిడ్ 13
ఇంటర్నల్: 128జీబి 8జీబి ర్యామ్ 256జీబి 8జీబి ర్యామ్ 256జీబి 12 జీబి ర్యామ్
కలర్: వైట్, బ్లాక్

లెనోవా ట్యాబ్ ఎం9



డిస్‌ప్లే: 9.0 అంగుళాలు వోఎస్: ఆండ్రాయిడ్ 12
రిజల్యూషన్: 800×1340 పిక్సెల్స్ బరువు: 344 గ్రా. బ్యాటరీ సామర్థ్యం: 5100 ఎంఏహెచ్
ర్యామ్: 3జీబి ఇంటర్నల్ స్టోరేజ్: 32జీబి ● టచ్ స్క్రీన్
కలర్స్: ఫాస్ట్ బ్లూ, స్ట్రోమ్ బ్లూ

వుయ్ కూల్ ఎస్4 సెల్ఫీ స్టిక్



బ్రాండ్: వుయ్ కూల్ కలర్: బ్లాక్
మెటీరియల్: అల్యూమినియం
● సెల్ఫీ స్టిక్ విత్ రీఛార్జబుల్ ఎల్ఈడీ ఫిల్ లైట్ ● ట్రైపాడ్ స్టాండ్
● 360 డిగ్రీ రోటేటబుల్ మౌంట్
● 3 కలర్ టెంపరేచర్ లైట్
● బరువు: 165 గ్రా.

టెలిగ్రామ్‌లో కొత్త ఫీచర్

వచ్చే నెలలో టెలిగ్రామ్ 'ఇన్‌స్టాగ్రామ్–స్టోరీస్'లాంటి ఫీచర్‌ని తీసుకురానుంది. ఈ స్టోరీస్ ఎక్కువ స్పేస్ తీసుకోకుండా స్క్రీన్ టాప్‌లో కనిపిస్తాయి. యాప్‌లోని వీడియో మెసేజ్ ఫీచర్స్‌లాగే ఫ్రంట్ అండ్ బ్యాక్ కెమెరాతో తీసిన ఫొటోలు, వీడియోలను పోస్ట్ చేయవచ్చు. షేరింగ్‌కు సంబంధించి యూజర్‌లకు 'ఎవ్రీవన్' 'హోల్లీ కాంటాక్ట్స్' 'సెలెక్ట్ కాంటాక్ట్' ఆప్షన్‌లు ఉంటాయి.

● ఇంగ్లిష్ ఇడియమ్స్



డాబ్ హ్యాండ్

ఒక వ్యక్తి నైపుణ్యానికి సంబంధించి చెప్పే సందర్భంలో వాడే మాట.

ఉదా: శారద ఈజ్ ఏ డాబ్ హ్యాండ్ ఎట్ కుకింగ్

పాస్ట్ ది బాటన్

ముఖ్యమైన బాధ్యతను ఇతరులకు అప్పగించడం, ఉద్యోగ బదిలీ... మొదలైన సందర్భాల్లో వాడే మాట ఇది.

ఉదా: ది గవర్నర్ ఆఫ్ ది 'బ్యాంక్ ఆఫ్ అమెరికా' రిజైన్స్ దిస్ మంత్. పాసింగ్ ఆన్ ది బాటన్ టు వన్ ఆఫ్ హిజ్ క్లోజెస్ట్ అసోసియేట్స్.

ఎక్కడ? నువ్వెక్కడ?



● గేమింగ్

సర్వైవల్ హారర్ వీడియోగేమ్ 'గిల్ట్' జూలై 6న రీరిలీజ్ అవుతోంది. 2019లో వచ్చిన 'గిల్ట్'కి విమర్శకుల నుంచి భిన్నమైన స్పందన లభించింది. 'ఎంజాయ్ చేయవచ్చు. గ్రాఫిక్స్ బాగున్నాయి. అయితే ఎగ్జయిట్‌మెంట్ లోపించింది' అనే మాట వినిపించింది. సాలీ అనే అమ్మాయి ఈ గేమ్‌లో కథానాయిక. స్కూల్ తప్ప మరో ప్రపంచం తెలియని సాలీ తప్పిపోయిన తన కజిన్ ఎమిలీ జాడ కనిపెట్టడానికి ఎన్నో ప్రమాదకరమైన ప్రదేశాలకు వెళుతుంది. ఎన్నో గందరగోళ పరిస్థితులను ఛేదిస్తూ సాహసాలు చేస్తుంది. ఈ సర్వైవల్ హారర్ గేమ్‌లో ఫ్లాష్‌లైట్ ప్రధాన ఆయుధం. 'షేప్ యువర్ ఫీయర్స్–ఫీయర్ ది షేప్స్' అంటోంది గేమ్ ట్రైలర్.

మోడ్: సింగిల్–ప్లేయర్ జానర్స్: అడ్వెంచర్ గేమ్, యాక్షన్ గేమ్, పజిల్ వీడియో గేమ్
ప్లాట్‌ఫామ్స్: ప్లేస్టేషన్ 5, ప్లేస్టేషన్ 4, గూగుల్ స్టాడియ, మైక్రోసాఫ్ట్ విండోస్, ఎక్స్ బాక్స్ సిరీస్ ఎక్స్/ఎస్

సినిమా



● ఎన్టీఆర్ ● రామ్ చరణ్



● మణిరత్నం ● కీరవాణి ● చంద్రబోస్ ● సెంథిల్ ● సాబు సిరిల్

క్లాస్ ఆఫ్ 2023

● ఆస్కార్ సభ్యులుగా 'ఆర్ఆర్ఆర్' నుంచి ఆరుగురు

ప్రతి ఏడాది ఆస్కార్ సభ్యత్వ నమోదు జరుగుతున్న సంగతి తెలిసిందే. ఆస్కార్ అవార్డు విజేతల నిర్ణయానికి ఈ సభ్యుల ఓటింగ్ కీలకంగా నిలుస్తుంది. 96వ ఆస్కార్ అవార్డుల ప్రదానోత్సవం మార్చి 14న జరగనుంది. కాగా 'క్లాస్ ఆఫ్ 2023'లో భాగంగా 398 మంది కొత్త సభ్యులకు ఆస్కార్ సభ్యత్వ ఆహ్వానాన్ని పంపినట్లు ఆస్కార్ కమిటీ సీఈవో బిల్ క్రామెర్, అధ్యక్షుడు జానెట్ యాంగ్ వెల్లడించారు. ఈ జాబితాలో మన దేశం నుంచి దాదాపు 15 మందికి ఆహ్వానం అందడం విశేషం. తెలుగు నుంచి 'ఆర్ఆర్ఆర్' టీమ్‌లో ఆరుగురు, తమిళం నుంచి మణిరత్నం, బాలీవుడ్ నుంచి దర్శక–నిర్మాత కరణ్ జోహార్ వంటివారు ఉన్నారు. వృత్తిపరమైన అర్హతలు, ప్రపంచవ్యాప్త గుర్తింపు వంటి అంశాల ఆధారంగా ఈ 'క్లాస్ ఆఫ్ 2023' జాబితాను తయారు చేసినట్లు అకాడమీ పేర్కొంది. ఈ 398 మందిలో 51 దేశాలకు చెందినవారు ఉండగా, వీరిలో 40 శాతం మంది మహిళలు, 52 శాతం మంది యూఎస్‌కు చెందినవారు ఉన్నట్లుగా ఆస్కార్ కమిటీ ప్రతినిధులు వెల్లడించారు. ఇక ఈ కొత్త సభ్యులతో కలిసి ఆస్కార్ మెంబర్‌షిప్‌లు కలిగి ఉన్న వారి సంఖ్య 10, 817కు చేరినట్లు హాలీవుడ్ అంటోంది.

ఆర్ఆర్ఆర్ నుంచి ...

'ఆర్ఆర్ఆర్'లోని 'నాటు నాటు' పాటకుగాను 'బెస్ట్ ఒరిజినల్ సాంగ్' విభాగంలో ఆస్కార్ అవార్డు అందుకున్న మ్యూజిక్ డైరెక్టర్ యంయం కీరవాణి, పాట రచయిత చంద్రబోస్‌లకు అకాడమీ ఆహ్వానాలు అందాయి. అలాగే ఈ చిత్రం హీరోలు ఎన్టీఆర్, రామ్‌చరణ్, ప్రొడక్షన్ డిజైనర్ సాబు సిరిల్, సినిమాటోగ్రాఫర్ సెంథిల్ కుమార్‌లు కూడా ఆస్కార్ అకాడమీ సభ్యులు కానున్నారు. దర్శకులు మణిరత్నం, షౌనక్ సేన్ (95వ ఆస్కార్ అవార్డ్స్‌లో డాక్యుమెంటరీ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో ఇండియా తరఫున నామినేట్ అయిన 'ఆల్ దట్ బ్రీత్స్' దర్శకుడు), నిర్మాతలు కరణ్ జోహార్, సిద్ధార్థ్ రాయ్ కపూర్ (95వ ఆస్కార్ అవార్డ్స్‌లో బెస్ట్ ఇంటర్‌నేషనల్ ఫీచర్ ఫిల్మ్ విభాగంలో ఇండియా తరఫున అఫీషియల్ ఎంట్రీగా పంపబడిన గుజరాతీ ఫిల్మ్ 'ది చెల్లో షో' నిర్మాత), చైతన్య తమ్హానే (మరాఠీ), ప్రొడక్షన్ అండ్ టెక్నాలజీకి చెందిన గిరీష్ బాలకృష్ణన్, క్రాంతి శర్మ, విజువల్ ఎఫెక్ట్స్ ఆర్టిస్టులు హరేష్ హింగో రాణి, పీసీ సనత్, ఫిల్మ్ ఎగ్జిక్యూటివ్‌లు శివానీ రావత్, శివానీ పాండ్యా మల్హోత్రా వంటి వారు ఉన్నారు.

కొత్త రూల్

ఓ సినిమాను ఆస్కార్ ఎంట్రీకి పంపాలంటే కొన్ని నియమ, నిబంధనలు ఉన్నాయి. యూఎస్‌లోని ఆరు ప్రధాన నగరాల్లో (న్యూయార్క్, లాస్ ఏంజెల్స్, చికాగో, మియామి, అట్లాంటా, శాన్ ఫ్రాన్సిస్‌కో) ఆ సినిమా కనీసం ఏడు రోజులు ప్రదర్శితం కావాలి. వీటిలో ఒక షో సాయంత్రం ప్రైమ్ టైమ్‌లో ఉండాలి, థియేటర్స్‌లో కనీస సీటింగ్ సామర్థ్యం ఉండాలి. తాజాగా బెస్ట్ పిక్చర్, ఫారిన్ బెస్ట్ ఫిల్మ్ విభాగాలకు సంబంధించి కొత్త రూల్ పెట్టనున్నారట. ఇకపై ఆస్కార్‌కు ఓ సినిమాను పంపాలంటే యూఎస్‌లోని పాతికకు పైగా మూవీ మార్కెట్స్ ఉన్నచోట సినిమాలు ప్రదర్శించబడాలట. అది కూడా రెండువారాలకు పైగా. అయితే ఇది ఖర్చుతో కూడుకున్న పని అని కొందరు పెదవి విరుస్తున్నారు. ఈ కొత్త రూల్‌ను 97వ ఆస్కార్ అవార్డ్స్ ప్రదానోత్సవం (2025) నుంచి అమలులోకి తేవాలని అవార్డ్ కమిటీ ప్లాన్ చేస్తోందన్నది హాలీవుడ్ టాక్.



● కరణ్ జోహార్

గర్వంగా ఉంది - రాజమౌళి

''ఆస్కార్ అకాడమీ సభ్యత్వ నమోదు కోసం 'ఆర్ఆర్ఆర్' టీమ్ నుంచి ఆరుగురికి ఇన్విటేషన్స్ రావడం గర్వంగా ఉంది. వీరితో పాటు భారత దేశం తరఫున ఆస్కార్ ఆహ్వానం అందుకున్నవారికి కూడా నా శుభాకాంక్షలు'' అని ట్వీట్ చేశారు రాజమౌళి.



● షౌనక్ సేన్



● ఏంజెలా ● కరోల్



● మెల్ బ్రూక్స్ ● మిచెల్ సాటర్

ఆ నలుగురికీ గౌరవం

''ఈ నలుగురూ చలన చిత్రపరిశ్రమలో మంచి మార్పుకు నాంది అయ్యారు. తర్వాతి తరం ఫిల్మ్ మేకర్స్‌కి, ఫ్యాన్స్‌కి స్ఫూర్తిగా నిలిచారు. వీరిని సత్కరించడం 'బోర్డ్ ఆఫ్ గవర్నర్స్'కి థ్రిల్‌గా ఉంది'' అని ఆస్కార్ అకాడమీ అవార్డ్ అధ్యక్షుడు జానెట్ యాంగ్ అన్నారు. సినిమా రంగానికి విశిష్ట సేవలందించిన ప్రముఖులకు 'గవర్నర్ అవార్డ్స్'లో భాగంగా హానరరీ ఆస్కార్ అవార్డ్‌ను అందజేయడం ఆనవాయితీగా వస్తోంది. ఈ ఏడాది ఈ గౌరవ ఆస్కార్‌ను అందుకోనున్న నలుగురిలో ముగ్గురు మహిళలు ఉండటం విశేషం. నటి ఏంజెలా బాసెట్, రచయిత–దర్శకుడు–నటుడు–గేయ రచయిత మెల్ బ్రూక్స్, ఫిల్మ్ ఎడిటర్ కరోల్ లిటిల్టన్‌లతో పాటు సన్‌డాన్స్ ఇన్‌స్టిట్యూట్‌కు చెందిన మిచెల్ సాటర్‌లకు అవార్డును అందజేయనున్నారు. నవంబర్ 18న లాస్ ఏంజెల్స్‌లోని ఫెయిర్‌మాంట్ సెంచరీ ప్లాజాలో జరిగే వేడుకలో ఈ నలుగురూ గౌరవ పురస్కారాలు అందుకుంటారు.

వినాయక చవితికి...



● లారెన్స్

'చంద్రముఖి' (2005) లాంటి బ్లాక్ బస్టర్ ఇచ్చిన డైరెక్టర్ పి.వాసు 18 ఏళ్ల తర్వాత ఆ సినిమాకి సీక్వెల్‌గా తెరకెక్కించిన చిత్రం 'చంద్రముఖి 2'. తొలి భాగంలో రజనీకాంత్ చేసిన పాత్రను సీక్వెల్‌లో రాఘవా లారెన్స్ చేయగా, కంగనా రనౌత్ ప్రధాన పాత్రలో నటించారు. సుభాస్కరన్ నిర్మించిన ఈ సినిమాని వినాయక చవితికి విడుదల చేయనున్నట్లు యూనిట్ ప్రకటించింది. సుభాస్కరన్ మాట్లాడుతూ– ''ఈ సీక్వెల్‌ని భారీ బడ్జెట్‌తో నిర్మించాం. ప్రేక్షకుల అంచనాలను మించేలా ఉంటుంది'' అన్నారు.

యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ షురూ



● పాయల్ గుప్తా, నరేన్, బి.గోపాల్

దివంగత నటుడు జయప్రకాష్ రెడ్డి కూమార్తె మల్లికా రెడ్డి నిర్మాతగా మారారు. శ్రీ జయప్రకాష్ రెడ్డి ప్రొడక్షన్స్‌పై ఆమె నిర్మిస్తున్న కొత్త చిత్రం షురూ అయింది. నరేన్ వనపర్తి హీరోగా, పాయల్ గుప్తా హీరోయిన్‌గా నటిస్తున్నారు. మల్లికార్జున్ రెడ్డి దర్శకత్వం వహిస్తున్న ఈ చిత్రం హైదరాబాద్‌లో ప్రారంభమైంది. తొలి సీన్‌కి నిర్మాత బెక్కం వేణుగోపాల్ కెమెరా స్విచ్చాన్ చేయగా, డైరెక్టర్ బి.గోపాల్ క్లాప్ కొట్టగా, దర్శకుడు త్రినాథరావు నక్కిన దర్శకత్వం వహించారు. ''యూత్‌ఫుల్ ఎంటర్‌టైనర్ చిత్రమిది'' అన్నారు అవినాష్ కొకటి. ''నాన్నగారి (జేపీ) ఆశయాలను ముందుకు తీసుకెళ్లాలని నిర్మాణంలోకి వచ్చాను'' అన్నారు మల్లికా రెడ్డి. ఈ చిత్రానికి కెమెరా: శివ.

ట్రైలర్ ఆసక్తిగా ఉంది - డైరెక్టర్ హరీష్ శంకర్



● హరీష్ శంకర్, చైతు, రవిశంకర్

''7:11 పీఎం' ట్రైలర్ ఆసక్తిగా ఉంది. సౌండ్, విజువల్స్, వీఎఫ్‌ఎక్స్ అద్భుతంగా ఉన్నాయి'' అని డైరెక్టర్ హరీష్ శంకర్ అన్నారు. సాహస్, దీపిక జంటగా చైతు మాదాల దర్శకత్వం వహించిన చిత్రం '7:11 పీఎం'. నరేన్ యనమదల, మాధురి రావిపాటి, వాణి కన్నెగంటి నిర్మించిన ఈ సినిమా జూలై 7న విడుదలవుతోంది. ఈ చిత్రం ట్రైలర్‌ను హరీష్ శంకర్ రిలీజ్ చేశారు. చైతు మాదాల మాట్లాడుతూ–'' ఒక టౌన్, రెండు గ్రహాలు, మూడు కాలాలు.. ఇదీ మా సినిమా లైన్. వీటిని ఎలా కనెక్ట్ చేశామనేది ఆసక్తిగా ఉంటుంది. మా సినిమాని విడుదల చేస్తున్న రవిశంకర్, నవీన్‌గార్లకు థ్యాంక్స్'' అన్నారు. ''ఈ సినిమా తప్పకుండా విజయం సాధిస్తుంది'' అన్నారు వై. రవిశంకర్.

త్వరలో శ్రీరంగనీతులు



● సుహాస్, కార్తీక్, రుహాని

సుహాస్, కార్తీక్ రత్నం, రుహానీ శర్మ ప్రధాన పాత్రల్లో విరాజ్ అశ్విన్, తనికెళ్ల భరణి కీలక పాత్రల్లో నటించిన చిత్రం 'శ్రీరంగనీతులు'. వీఎస్ఎస్ ప్రవీణ్‌కుమార్ దర్శకత్వంలో వెంకటేశ్వరరావు బల్మూరి నిర్మించిన ఈ చిత్రం షూటింగ్ పూర్తయింది. న్యూ ఏజ్ కామెడీ డ్రామాగా రూపొందిన ఈ చిత్రాన్ని త్వరలో విడుదల చేయాలనుకుంటున్నారు. ఈ సందర్భంగా గురువారం ఈ సినిమా ఫస్ట్ లుక్‌ను విడుదల చేశారు.


పల్లెటూరి వినోదం



● ఆసిఫ్ జానీ, నక్కిన త్రినాథరావు, శ్రీరామ్

తెలంగాణ నేపథ్యంలో రూపొందిన పల్లె కథా చిత్రం 'తురుమ్ ఖాన్‌లు'. శివ కల్యాణ్ దర్శకత్వంలో ఎండీ ఆసిఫ్ జానీ నిర్మించిన ఈ చిత్రం విడుదలకు సిద్ధమవుతోంది. ఈ చిత్రంలోని 'రంగు రంగుల చిలక...' అంటూ సాగే తొలి పాటను దర్శకుడు త్రినాథరావు నక్కిన విడుదల చేశారు. ''పల్లెటూరి పగ, ప్రతీకారాలతో వినోదాత్మకంగా, మహబూబ్ నగర్ స్లాంగ్‌లో రూపొందిన చిత్రం ఇది'' అని యూనిట్ తెలిపింది. నిమ్మల శ్రీరామ్, దేవరాజ్ పాలమూర్, అవినాష్ తదితరులు నటించిన ఈ చిత్రానికి సంగీతం: వినోద్ యాజమాన్య, అఖిలేష్ గోగు, రియాన్.

తెలంగాణ ఉద్యమ కెరటాలు



● చందు, హాసిని

చందు రాగం, హాసిని, ప్రీతి సుందర్ హీరో హీరోయిన్లుగా నటిస్తున్న చిత్రం 'ఉద్యమ కెరటాలు'. పిడమర్తి రవీంద్ర స్వీయ దర్శకత్వంలో నిర్మిస్తున్నారు. ''ఈ తరానికి తెలంగాణ ఉద్యమ పోరాటాన్ని తెలియజేయడానికి ఈ చిత్రాన్ని తీస్తున్నాం'' అన్నారు రవీంద్ర. ఈ చిత్రానికి బోలె షావలి స్వరకర్త.



పుడమి తల్లికి తూట్లు!

- రసాయన ఎరువులు, పురుగు మందుల అధిక వాడకంతో అనర్థం
- దిగుబడి పెంచుకునేందుకు నత్రజని, ఫాస్ఫేట్ తదితర ఎరువుల వినియోగం
- యూరియా ఇష్టారాజ్యంగా వాడేస్తున్న రైతన్నలు
- దశాబ్ద కాలంలోనే దాదాపు 50 శాతం మేరకు పెరుగుదల
- అంతర్జాతీయంగా చైనాలో.. మనదగ్గర పంజాబ్‌లో ఎక్కువగా వాడకం
- రసాయనాలు భూమిలోకి ఇంకి జలవనరుల్లో చేరుతున్న వైనం
- పెరిగిపోతున్న కేన్సర్, కిడ్నీ తదితర సమస్యలు..పర్యావరణంపైనా పెనుప్రభావం
- జాతీయ సగటు కంటే తక్కువగా తెలుగు రాష్ట్రాల్లో వినియోగం
- రసాయన, సేంద్రీయ కాంబినేషన్లో వాడకం మంచిదంటున్న నిపుణులు

సాక్షి, ప్రత్యేక ప్రతినిధి, హైదరాబాద్

పుడమి తల్లి నిస్సారంగా మారిపోతోంది. చాలాకాలంగా నత్రజని, భాస్వరం, పొటాషియం తదితర రసాయన ఎరువులకు తోడు పురుగు మందులు వాడకం విపరీతంగా పెరిగిపోయింది. పంటల దిగుబడిని పెంచుకోవడానికి, క్రిమిసంహారానికి మోతాదుకు మించి వాడుతున్న రసాయన ఎరువులు, మందుల కారణంగా సారవంతమైన నేల కాస్తా గుల్ల అవుతోంది. రసాయన ఎరువుల వాడకం పుడమి కాలుష్యంతో పాటు, వాయు, నీటి కాలుష్యానికి కూడా దోహదపడుతోంది. ఒక టన్ను రసాయన ఎరువులను వినియోగిస్తే.. అందులో కేవలం మూడున్నర క్వింటాళ్ల రసాయన ఎరువులను మాత్రమే పంటలు స్వీకరిస్తాయని, మిగిలిందంతా పుడమిలోకి ఇంకిపోవడం, వర్షాలు పడినప్పుడు చెరువులు, నదులు, వాగులు, ఇతర నీటి వనరుల్లోకి వెళ్లిపోవడం జరుగుతోందని నిపుణులు చెబుతున్నారు. కొన్ని దేశాలతో పోల్చిచూస్తే..మన దేశంలో వీటి వినియోగం తక్కువగా ఉన్నా.. ప్రస్తుతం వాడుతున్న ఈ రసాయన ఎరువుల వల్ల పర్యావరణంపైనా తీవ్ర ప్రభావం పడుతుందని హెచ్చరిస్తున్నారు.

ఆర్గానిక్‌తో మేలు..



➤ దిగుబడి పెంచుకోవడానికి వినియోగించే ఎరువుల్లో ఆర్గానిక్, ఇనార్గానిక్ అనే రెండు రకాలు ఉన్నాయి. ఆర్గానిక్ ఎరువులు ప్రకృతి సిద్ధమైనవి. పంట వ్యర్థాలు, మొక్కలు, జంతువుల వ్యర్థాలు, మునిసిపల్ వ్యర్థాల నుంచి వచ్చే ఎరువులను ఆర్గానిక్ ఎరువులుగా పరిగణిస్తారు. ఆర్గానిక్ ఎరువుల వాడకం వల్ల భూసారం పెరగడంతో పాటు, వాన పాములు, సూక్ష్మజీవుల పునరుత్పత్తికి దోహద పడుతుంది. ఇక రసాయనాలను వినియోగించి తయారు చేసేవే ఇనార్గానిక్ ఎరువులు. పంటల ఎదుగుదలకు నత్రజని ఉపయోగపడుతుంది. ఫాస్ఫేట్ మొక్కలకు ముఖ్యమైన పోషక విలువలను అందిస్తుంది. వీటితో పాటు పొటాషియం భూమిలో నీటి సామర్థ్యాన్ని, భూ సాంద్రతను పెంచుతాయనే వాదన ఉన్నా.. ప్రజల ఆరోగ్యంపై ప్రభావం చూపే అవకాశాలే ఎక్కువగా ఉన్నాయని నిపుణులు హెచ్చరిస్తున్నారు. వీటిలోని ఆమ్లాలు చర్మంపైన, శ్వాసపైనా ప్రభావం చూపుతాయని చెబుతున్నారు.

సేంద్రీయ సేద్యం పెరుగుతున్నా

➤ దేశంలో సేంద్రీయ సేద్యం పెరుగుతున్నట్లు ప్రభుత్వం వెల్లడించే గణాంకాలు చెబుతున్నా.. రసాయన ఎరువుల వాడకం కూడా విపరీతంగా పెరిగిపోవడం ఆందోళన కలిగించే అంశం. మన దేశంలోని ఉత్తరాది రాష్ట్రాలు రసాయన ఎరువుల వాడకంలో అగ్రస్థానంలో ఉన్నాయి. ఈ ఎరువులు భూమిలో ఉండే సూక్ష్మక్రిములను చంపేయడంతో భూమి తన సారాన్ని కోల్పోతోందని నిపుణులు చెబుతున్నారు. పంటల దిగుబడి కోసం శాస్త్రీయ ఎరువులు వినియోగించకుండా కేవలం రసాయన ఎరువులు, పురుగుమందులు వాడటం వల్ల భూసారం తగ్గి, తదనంతర కాలంలో పంటల దిగుబడులు గణనీయంగా తగ్గుతాయని శాస్త్రవేత్తలు హెచ్చరిస్తున్నారు. దశాబ్ద కాలంలో రసాయన ఎరువులు, పురుగు మందుల వాడకం దాదాపు 50% మేరకు పెరిగినట్లు అగ్రికల్చర్ ఇన్‌పుట్ సర్వే వెల్లడిస్తోంది.

➤ చైనా ఒక హెక్టార్‌కు 13.06 కిలోల పురుగు మందులు వాడుతుంటే, జపాన్ 11.85 కిలోలు, బ్రెజిల్ 4.57 కిలోలు వినియోగిస్తున్నాయి. లాటిన్ అమెరికా దేశాల్లోనూ ఇలాంటి మోతాదుల్లోనే వినియోగిస్తున్నారని సమాచారం. మన దేశంలో అత్యధికంగా పంజాబ్‌లో ప్రతి హెక్టార్‌కు 0.74 కిలోలు వినియోగిస్తున్నారు. పంజాబ్, హరియాణాలు పంటల దిగుబడి కోసం అత్యధికంగా రసాయన ఎరువులు వినియోగిస్తున్నట్లు కేంద్ర వ్యవసాయ, రైతు సంక్షేమ శాఖ గణాంకాలు వెల్లడిస్తున్నాయి. హరియాణాలో 0.62 కిలోలు, మహారాష్ట్రలో 0.57 కిలోలు, కేరళలో 0.41 కిలోలు, ఉత్తరప్రదేశ్‌లో 0.39 కిలోలు, తమిళనాడులో 0.33 కిలోల రసాయన ఎరువులు వాడుతున్నారు. జాతీయ సగటు 0.29 కిలోలుగా ఉంది. జాతీయ సగటు కంటే తెలుగు రాష్ట్రాల్లో వినియోగం తక్కువగా ఉన్నట్లు ఆ గణాంకాలు పేర్కొంటున్నాయి.

చైనాలో హెక్టార్‌కు 13.06 కిలోలు

యూరియానే అత్యధికం..

ఎరువుల్లో యూరియా వినియోగం ఎక్కువగా ఉన్నట్లు చెబుతున్నారు. రైతులు అవసరానికి మించి యూరియా వాడుతున్నారని, ఒక బస్తా యూరియా వేయాల్సిన చోట పంట ఎదుగుదల, దిగుబడి కోసం రెండు మూడు బస్తాలు వినియోగిస్తున్నట్లు వ్యవసాయ శాఖ అధికారులు చెబుతున్నారు. డీఏపీ, కాంప్లెక్స్ ఎరువుల కంటే దీని ధర తక్కువగా ఉండడం, కేంద్ర ప్రభుత్వం సైతం యూరియాపై ఎక్కువ సబ్సిడీ ఇవ్వడం వల్ల రైతులు ఎక్కువగా యూరియా వినియోగిస్తున్నట్లు అధికారవర్గాల సమాచారం. యూరియాపై కేంద్రం దాదాపు 75 శాతం మేరకు సబ్సిడీ అందిస్తుంటే.. డీఏపీ లాంటి ఎరువులపై 35 శాతం మాత్రమే ఇస్తోంది.

భూసార పరీక్షల ఆధారంగా వాడాల్సి ఉన్నా..

➤ భూసార పరీక్షల నిర్వహణ ద్వారా ఏయే భూములకు ఎలాంటి పోషకాలు కావాలి, అవి ఏయే రసాయన ఎరువుల్లో ఉంటాయో తెలుసుకుని, వ్యవసాయ అధికారుల సూచనల మేరకు వాడాల్సి ఉన్నా.. రైతులు ఇవేమీ పట్టించుకోవడం లేదు. తమకు తెలిసిన ఎరువులను యథేచ్ఛగా వాడుతున్నారు. తద్వారా ఒక్కోసారి ఆశించిన స్థాయిలో దిగుబడి రాక తీవ్రంగా నష్టపోతున్నారు. పత్తి, వరి, గోధుమ, చెరకు పంటలకు ఎక్కువగా పురుగుల మందులు వాడుతున్నారు.

పంజాబ్‌లో కేన్సర్, కిడ్నీ సంబంధిత సమస్యలు



➤ రసాయన ఎరువుల అధిక వినియోగంతో ప్రత్యక్ష, పరోక్ష రూపాల్లో నష్టాలు పెరుగుతున్నాయి. ప్రత్యక్షంగా చూస్తే.. నత్రజని కాలుష్యం పెరగడం వల్ల ఆహార ఉత్పత్తుల ద్వారా కేన్సర్, కిడ్నీ సంబంధిత సమస్యలు పెరుగుతున్నాయి. పంజాబ్‌లో ఈ సమస్య తీవ్రస్థాయికి చేరింది. కొంతకాలం ఎరువుల వినియోగం తర్వాత భూమి లోపల ఉండే బ్యాక్టీరియా చచ్చిపోయి, కార్బన్, మినరల్స్ వంటివి పోయి ఈ రసాయనాలే డామినేట్ చేస్తాయి. మొక్కకు సహజ సిద్ధమైన బలం చేకూరకుండా నేరుగా రసాయనాలే ప్రభావితం చేస్తాయి. పంటల వైవిధ్యం కూడా దెబ్బతింటుంది. రెండు, మూడు పంటలు వచ్చే ఉమ్మడి నల్లగొండ పరిధిలోని మిర్యాలగూడ, తదితర ప్రాంతాల్లో వరి పొలాల్లో విపరీతంగా యూరియా ఇతర రసాయనాల వినియోగం కారణంగా నేల మొత్తం రసాయనాలే నిండిపోయే పరిస్థితులు ఏర్పడ్డాయి. ఈ సమస్యను అధిగమించాలంటే రసాయనేతర ఎరువులైన ఆవు, ఇతర జంతువుల పేడ, గృహాల నుంచి వచ్చే చెత్తతో తయారుచేసిన ఎరువుల వినియోగం పెంచాలి.

– డా. దొంతి నర్సింహారెడ్డి, వ్యవసాయరంగ నిపుణులు, పాలసీ అనలిస్ట్

రసాయన, సేంద్రీయ కాంబినేషన్ మంచిది



➤ రసాయన ఎరువుల అధిక వాడకం వల్ల భూమి తన నిజ స్వరూపం, సారాన్ని కోల్పోతుంది. భూమిలో ఉండే మైక్రో ఆర్గానిజమ్స్ కూడా చనిపోతాయి. ఎరు వులు వాడితే మొక్కల్లో నీటి నిల్వశాతం కూడా తగ్గు తుంది. వాతావరణ కాలుష్యం ఏర్పడుతుంది. మొక్క కు రసాయన ఎరువు, సేంద్రీయ ఎరువులు కాంబినేషన్‌గా అందించాలి. ఉదాహరణకు మొత్తం పది బస్తాల ఎరువులు వినియోగిస్తామనుకుంటే.. అందులో ఆరు బస్తాలు రసాయన ఎరువులు, 4 బస్తాల సేంద్రీయ ఎరువులు ఉండేలా చూడాలి. దీనితో సమతుల్యత ఉంటుంది. పురుగుల మందుల వల్ల బీపీ, షుగర్, కిడ్నీ పేషంట్లు పెరుగుతున్నారు.

– కె.రాములు ఎండీ, ఆగ్రోస్ లిమిటెడ్

సబ్సిడీలు తగ్గించుకునేందుకే..



➤ కేంద్ర ప్రభుత్వం పీఎం ప్రణామ్‌లో భాగంగా ఎరువుల వినియోగం తగ్గించడం ద్వారా రైతులకిచ్చే సబ్సిడీలు కూడా తగ్గిస్తోంది. శ్రీలంక తరహాలో సేంద్రీయ వ్యవసాయం ప్రోత్సహించాలని చూస్తోంది. సేంద్రీయ, రసాయన ఎరువులు కలగలిపి ఉపయోగించడం ద్వారా సేంద్రీయ వ్యవసాయం చేయాలి. కానీ ఒక్క సేంద్రీయ లేదా రసాయన ఎరువుల వాడకంతో పంటలు పండవు. చైనా, అమెరికాతో పోల్చితే భారత్‌లో తక్కువగానే ఎరువులు వాడుతున్నారు నిజమే. అయితే చైనాలో హెక్టార్‌కు 80 క్వింటాళ్లు, అమెరికాలో 60 క్వింటాళ్లు పండిస్తున్నారు. కానీ మన దేశంలో 25 క్వింటాళ్లే దిగుబడి వస్తోంది. 1991లో మనం ఎగుమతులు చేసే దశ నుంచి, ప్రస్తుతం వ్యవసాయ ఉత్పత్తులు సహా, పాలు, పాల ఆధారిత ఉత్పత్తులు, మాంసం, నూనెలు, పప్పుధాన్యాలు, పంచదార వంటివి దిగుమతి చేసుకోవాల్సిన పరిస్థితి ఏర్పడింది. భారత్ దిగుమతులకు డంపింగ్ కేంద్రంగా మారింది. భారత్‌లో ఉత్పత్తులను దెబ్బతీసి దిగుమతులపై ఆధారపడేలా చేసే ధనిక దేశాల ప్రయత్నాలకు కేంద్రం లొంగిపోతోందనడానికి ఇదో ఉదాహరణ.

– సారంపల్లి మల్లారెడ్డి, రైతుసంఘం నేత, వ్యవసాయ నిపుణులు

ఆజాద్‌కు ముందే బెదిరింపులు

లక్నో(యూపీ): దుండగుల కాల్పుల్లో గాయపడిన ఆజాద్ సమాజ్ పార్టీ నేత, భీమ్ ఆర్మీ చీఫ్ చంద్ర శేఖర్ ఆజాద్(36) ఆస్పత్రిలో కోలుకుంటున్నారు. షహరాన్‌పూర్ జిల్లా కేంద్ర ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న ఆజాద్ ఆరోగ్యం నిలకడగా ఉందని ఎస్పీ సాగర్ జైన్ చెప్పారు. దేవ్‌బంద్ పట్టణంలో బుధవారం కారులో వెళ్తున్న ఆజాద్‌పై కాల్పులు జరిగిన విషయం తెలిసిందే. ఇలా ఉండగా, ఆజాద్ చంపుతామంటూ 5 రోజుల క్రితమే ఫేస్‌బుక్‌లో పోస్టులో బెదిరింపులు వచ్చాయని పోలీసులు తెలిపారు. నాలుగు రోడ్ల కూడలిలో పట్టపగలే ఆజాద్‌ను చంపుతామని బెదిరిస్తూ 'అమేథీ క్షత్రియ'పేరుతో పోస్ట్ చేశారు. గురువారం కూడా 'ఇప్పుడు నడుం దగ్గర బుల్లెట్ తగిలింది. మరోసారి బతకడు. ఆజాద్ చాలా తెలివైన వ్యక్తి. అతడికి భద్రత, బుల్లెట్ ప్రూఫ్ వాహనం, జాకెట్ అవసరం 'అని అందులో ఉంది. ఈ మేరకు గౌరీగంజ్ పోలీసులు గుర్తు తెలియని వ్యక్తులపై ఐపీసీ 506 కింద కేసు నమోదు చేశారు. ఆజాద్ చికిత్స పొందుతున్న ఆస్పత్రి వద్ద ఆజాద్ మద్దతుదారులు పెద్ద సంఖ్యలో గుమికూడి నిరసన తెలిపారు. తమ నేతకు జెడ్ ప్లస్ భద్రత కల్పించాలని డిమాండ్ చేశారు. దుండగులను వెంటనే అరెస్ట్ చేయాలన్నారు. ఈ మేరకు వారు అధికారులకు వినతిపత్రం సమర్పించారు. రెజ్లర్లు బజ్‌రంగ్ పునియా, సాక్షి మాలిక్‌లు ఆస్పత్రికి చేరుకుని, ఆజాద్‌ను పరామర్శించారు.

సాక్షి, హైదరాబాద్

➤ వరంగల్ జిల్లాకు చెందిన రమిత (పేరు మార్చాం) ప్రస్తుతం రెండో నెల గర్భిణి. ఇటీవల హైదరాబాద్‌లోని బంధువుల ఇంటికి వచ్చిన ఆమె తీవ్ర అస్వస్థతకు గురవడంతో దగ్గరిలోని ఆస్పత్రికి తీసుకెళ్లారు. పరీక్షలు చేసిన వైద్యులు ఆమె బలహీనతకు కారణాలపై ఆరా తీయగా విస్తుపోయే విషయం తెలి సింది. ఇద్దరు ఆడపిల్లలు ఉన్న ఆమె.. మగపిల్లాడి కోసం ఆరు నెలల గర్భం సహా ఇప్పటికే 3 సార్లు అబార్షన్ చేయించుకుంది. ఈసారీ లింగ నిర్ధారణ పరీక్ష చేయించుకునేందుకు సిద్ధమైంది. లింగ నిర్ధార ణపై నిషేధం, కఠిన ఆంక్షలు ఉన్నా.. ఇన్నిసార్లు నిర్ధారణ, అబార్షన్లు ఎలా సాధ్యమయ్యాయి? ఓవైపు డయాగ్నొస్టిక్స్ కేంద్రాల అక్రమాలు, మరోవైపు విదేశాలకు వెళ్లి మరీ ఈ దారుణానికి పాల్పడుతున్న తీరు పెరుగుతుండటం ఆందోళన రేపుతున్నాయి.

కొడుకు కావాలనే కోరికతో..

➤ మగ పిల్లలు కావాలనే కోరికతో లింగ నిర్ధారణ పరీక్షలకు వెంపర్లాడే వారిలో పేదలు, నిరక్షరాస్యులే ఎక్కువగా ఉంటారనేది సాధారణ నమ్మకం. ఈ విషయంలో సంపన్నులు, బాగా చదువుకుని, పెద్ద ఉద్యోగాల్లో ఉన్నవారు కూడా అదే తీరులో వ్యవహరిస్తున్నారని వైద్యులు చెప్తున్నారు. పెరుగుతున్న ఖర్చులతో ఒకరిద్దరు పిల్లలు మాత్రమే కావాలనుకోవడం, అందులోనూ వంశాన్ని కొనసాగించడానికి కొడుకు ఉండాలన్న ఆలోచన, ఆ దిశగా ఇళ్లలో పెద్దల ఒత్తిళ్లు వంటివి.. లింగ నిర్ధారణ పరీక్షలు చేయించడానికి, ఆడపిల్ల అని తేలితే అబార్షన్లు చేయించేందుకు తెగబడటానికి దారి తీస్తున్నాయని అంటున్నారు.



విదేశాలకు వెళ్లి మరీ చిదిమేస్తున్నారు

మగపిల్లలే కావాలని గర్భంలోనే ఆడపిల్లలను అంతం చేస్తున్న జంటలు

లింగ నిర్ధారణ, అబార్షన్ల కోసం తెగబడుతున్న తీరు

మన దేశంలో లింగ నిర్ధారణపై నిషేధం, అబార్షన్లపై ఆంక్షలు

దీనితో అమెరికా, సింగపూర్, థాయ్‌లాండ్ వంటి దేశాలకు వెళ్తున్న జంటలు

సంపన్నులతోపాటు మధ్య తరగతి వారిలోనూ ఇదే తీరు

డయాగ్నొస్టిక్స్ కేంద్రాలు, ఆస్పత్రుల మధ్య ఏజెంట్లు, దళారులు

చైతన్యం కలిగించడం తప్ప మరో మార్గం లేదంటున్న అధికారులు

విదేశాలకు వెళ్లి మరీ చిదిమేస్తూ..

➤ మన దేశంలో గర్భస్థ శిశు లింగ నిర్ధారణ పరీక్షలపై పూర్తిస్థాయిలో నిషేధం ఉంది. ఒకవేళ అక్రమంగా పరీక్షలు చేస్తున్నా.. సాధారణ డయాగ్నొస్టిక్స్ సెంటర్లలో లింగ నిర్ధారణ చేయడానికి కనీసం గర్భం దాల్చిన 16 వారాల వరకు ఆగాల్సి వస్తోంది. అదే యూకే, అమెరికా, సింగపూర్ వంటి చాలా దేశాల్లో లింగ నిర్ధారణ పరీక్షలపై నిషేధమేదీ లేదు. పైగా 8 నుంచి 10 వారాల వ్యవధిలోనే నిర్ధారణ చేస్తుండటం, దీనిని రాతపూర్వకంగా కూడా వెల్లడిస్తుంటారు. మగ పిల్లలు కావాలనుకునే జంటలు దీనిని సావకాశంగా తీసుకుంటున్నాయి. హైదరాబాద్ నుంచి 9–10 వారాల గర్భిణులు విదేశాలకు వెళ్లి పరీక్ష చేయించుకుంటున్నారు.

➤ మన దేశంలో గర్భిణులకు 12 వారాల వరకు అబార్షన్ చేయడానికి చట్టబద్ధంగా వెసులుబాటు ఉంది. విదేశాల్లో లింగ నిర్ధారణ చేయించుకున్నవారు ఆడపిల్ల అని తేలితే.. ఇక్కడికి తిరిగి వచ్చాక ఆస్పత్రులకు వెళ్లి అబార్షన్ చేయించుకుంటున్నారు. 'కండోమ్ ఫెయిల్యూర్, గర్భం రాకుండా వేసుకునే మందులు తీసుకోవడం మర్చిపోవడం' అంటూ ఏదో కారణం చెప్తున్నారు. కొందరైతే లింగ నిర్ధారణతోపాటు అబార్షన్ కూడా విదేశాల్లోనే చేయించుకుని వస్తున్నారు.

ఇక్కడ అబార్షన్లు చేయించుకుంటూ..

ఇందుకోసం థాయ్‌లాండ్, సింగపూర్ వంటి దేశాలకు వెళ్తున్నారు. ''డబ్బున్నవాళ్లు లిఖితపూర్వకంగా లింగ నిర్ధారణ పరీక్షల రిపోర్టులు ఇచ్చే దేశాలకు వెళ్తున్నారు. కొందరు మధ్యతరగతి వారు కూడా మగ పిల్లలు కావాలన్న ఆశతో ఎక్కువ డబ్బు ఖర్చుపెట్టడానికి వెనుకాడటం లేదు. అందుకే లింగ నిర్ధారణ పరీక్షల రాకెట్‌ను నడిపించే వారి సంఖ్య పెరుగుతోంది'' అని ప్రసూతి, గైనకాలజీ సొసైటీకి చెందిన డాక్టర్ శాంత కుమారి చెప్పారు.

చైతన్యం కలిగించడమే మార్గం..

''తక్కువ ఆదాయ వర్గాలకు చెందిన వారు మన దేశంలో చట్టవిరుద్ధంగా అబార్షన్ చేసుకోవడానికి రూ.25,000 నుంచి రూ. 45,000 వరకు ఖర్చు చేయాల్సి వస్తోంది. విదేశాలలోనూ చట్టబద్ధంగా కూడా దాదాపు ఇదే ఖర్చు అవుతుంది. ప్రయాణ ఖర్చులే అదనం. విదేశాల్లో పరిశుభ్రమైన పరిస్థితులలో, సరైన మెడికల్ బ్యాకప్‌తో జరుగుతుంది. దీనితో కాస్త ఆర్థిక స్తోమత ఉన్నవారు కూడా చట్టపరమైన ఇబ్బందులను నివారించడానికి దేశం దాటుతున్నారు. ప్రస్తుతం ఈ విషయంలో చట్టపరంగా ఎలాంటి చర్యలూ తీసుకోవడానికి అవకాశం లేదు. జంటలలో అవగాహన పెంచడం, చైతన్యం కలిగించడం తప్ప మరోదారి కనిపించడం లేదని అధికారులు అంటున్నారు.

ఏజెంట్లు, మధ్యవర్తులతో వ్యవహారం

లింగ నిర్ధారణ, తర్వాత అబార్షన్, నేరుగా అవాంఛనీయ గర్భాన్ని గానీ తొలగించుకోవాలనుకునే వారి కోసం.. డయాగ్నొస్టిక్స్ కేంద్రాలు, ఆస్పత్రులకు మధ్య ఏజెంట్లు, దళారులు పెద్ద సంఖ్యలో పనిచేస్తున్నారు. కమీషన్లు తీసుకుంటూ, విషయం బయటికి తెలియకుండా 'పని' కానిచ్చేస్తూ.. డయాగ్నొస్టిక్స్ కేంద్రాల వారికి, ఆస్పత్రులకు వీరే సొమ్ము ముట్టజెప్తుంటారు. ఇలాంటి ఏజెంట్లు, దళారుల వల్ల భ్రూణహత్యలు పెరిగిపోతున్నాయి.

గిరిగూడెంలో 'సౌర'భాలు



విద్యుద్దీపాలకు నోచని గిరిజన గ్రామాలు ఎట్టకేలకు వెలుగులకు నోచుకున్నాయి. ఆదిలాబాద్ జిల్లా బేల మండలం టెంబ్రీగూడ నుంచి వేరుపడిన కొందరు గిరిజనులు నిషాన్‌ఘాట్‌లో నివసిస్తున్నారు. విద్యుత్ సౌకర్యం లేకపోవడంతో ఐటీడీఏ ఆధ్వర్యంలో రూ.68 లక్షలతో ఇంటింటిపై సౌర విద్యుద్దీపాలను ఏర్పాటు చేసింది.
- సాక్షి ఫొటోగ్రాఫర్, ఆదిలాబాద్

ఎనిమిది సంఘాలతో ఆర్టీసీలో కొత్త జేఏసీ

సాక్షి, హైదరాబాద్: ఆర్టీసీ కార్మికుల సమస్యల పరిష్కారానికి కొత్తగా 8 సంఘాలతో జేఏసీ ఏర్పాటైంది. టీఎంయూ (తిరుపతి వర్గం), టీజేఎంయూ, ఎన్ఎంయూ, బీఎంఎస్, ఎస్‌డబ్ల్యూయూ, బీడబ్ల్యూయూ, కేపీ (టీఎన్‌టీయూసీ), ఎస్‌టీఎంయూ నేతలు కొత్త జేఏసీని ఏర్పాటు చేశారు. టీఎంయూ తిరుపతి వర్గం గౌరవాధ్యక్షునిగా ఉన్న బీజేపీ నేత అశ్వత్థామరెడ్డి చైర్మన్‌గా,కన్వీనర్‌గా హనుమంతు ముదిరాజ్ (టీజేఎంయూ), కో–కన్వీనర్లుగా నరేందర్ (ఎన్ఎంయూ), స్వామి (కేఎస్), అబ్రహం(ఎస్‌డబ్ల్యూయూ),సురేశ్ (బీడబ్ల్యూయూ), యాదగిరి (కేపీ), హరికిషన్ (ఎస్‌టీ ఎంయూ)లను ఎంపిక చేశారు. వేతన సవరణ సహా ఇతర అంశాలపై ఉద్యమ కార్యాచరణను జూలై 1న చర్చించి ప్రకటిస్తామని కొత్త కమిటీ పేర్కొంది.

ఐసెట్‌లో ఉత్తీర్ణత 86.17%

▶ మొదటి పేజీ తరువాయి

విజయవంతంగా నిర్వహించడం ఇది 14వ సారి అని తాటికొండ రమేశ్ చెప్పారు. ఐసెట్‌లో సూర్యాపేట జిల్లాకు చెందిన నూకల శర ణ్‌కుమార్ 161 మార్కులతో మొదటి ర్యాంకు సాధించారు. ఈ ఏడాది మే 26, 27 తేదీల్లో టీఎస్ ఐసెట్ పరీక్ష నిర్వహించిన సంగతి తెలిసిందే.

వచ్చే నెల్లో షెడ్యూల్ విడుదల

ఐసెట్ కౌన్సెలింగ్, సర్టిఫికెట్ల వెరిఫికేషన్ షెడ్యూల్‌ను వచ్చే నెలలో విడుదల చేస్తామని లింబాద్రి చెప్పారు. రాష్ట్రంలో ఎంబీఏ కళాశాలలు 265 ఉండగా, వాటిలో 32,544 సీట్లు ఉన్నాయన్నారు. ఎంసీఏ కళాశాలలు 53 ఉండగా 4,410 సీట్లు ఉన్నాయన్నారు.

కేంద్ర గెజిటెడ్ ఆఫీసర్ ఉద్యోగమే లక్ష్యం : శరణ్ కుమార్ (ఫస్ట్ ర్యాంక్)

కేంద్ర ప్రభుత్వ గెజిటెడ్ ఆఫీసర్ ఉద్యోగమే లక్ష్యంగా చదివాను. అందుకే ప్రస్తుతం చేస్తున్న సాఫ్ట్‌వేర్ ఇంజనీర్ ఉద్యోగానికి రాజీనామా చేశాను. కేంద్ర ప్రభుత్వం ఆధ్వర్యంలో స్టాఫ్ సెలక్షన్ కమిషన్ నిర్వహించిన కంబైన్డ్ గ్రాడ్యుయేట్ లెవెల్ (సీజీఎల్) పరీక్ష రాశాను. అందులో గ్రూప్–బీ పోస్టు అయిన అసిస్టెంట్ ఆడిట్ ఆఫీసర్‌గా ఉద్యోగం వచ్చింది. దాని పోస్టింగ్ కోసం ఎదురు చూస్తున్నాను.

సొంతంగా ప్రిపేరయ్యా: సాయి నవీన్ (సెకండ్ ర్యాంక్)

ఐసెట్ కోసం సొంతంగా ప్రిపేరయ్యాను. ఏ కోచింగ్ కేంద్రంలోనూ శిక్షణ తీసుకోలేదు. రాష్ట్రస్థాయిలో రెండో ర్యాంకు రావడం సంతోషంగా ఉంది. భవిష్యత్తులో సివిల్స్, గ్రూప్స్ పరీక్షలకు సిద్ధమవుతా.



నాగులపల్లి సాయి నవీన్



ఎస్.సాయి ఫణి ధనుష్



మల్లికంటి గోపి



కేయూలో టీఎస్ఐసెట్ ఫలితాలను విడుదల చేస్తున్న రాష్ట్ర ఉన్నత విద్యామండలి చైర్మన్ ఆచార్య ఆర్.లింబాద్రి, పక్కన చైర్మన్, కేయూ వీసీ ఆచార్య తాటికొండ రమేశ్, కన్వీనర్ ఆచార్య పి.వరలక్ష్మి, రిజిస్ట్రార్ టి.శ్రీనివాసరావు

టాప్–5 ర్యాంకర్లు వీరే..

ర్యాంకు	పేరు	మార్కులు	ప్రాంతం
1	నూకల శరణ్‌కుమార్	161.30	హుజూర్‌నగర్, సూర్యాపేట
2	నాగులపల్లి సాయి నవీన్	156.38	కంచన్‌బాగ్, హైదరాబాద్
3	సజ్జ రవితేజ	153.60	మియాపూర్, మేడ్చల్ మల్కాజ్‌గిరి
4	ఎస్.సాయి ఫణి ధనుష్	152.30	నేరేడ్‌మెట్, మేడ్చల్ మల్కాజ్‌గిరి
5	మల్లికంటి గోపి	149.17	నేరేడుచర్ల, సూర్యాపేట

సాక్షి బిజినెస్

శుక్రవారం
30-6-2023

స్టాక్ మార్కెట్లు

దేశీ సూచీలు (బుధవారం ముగింపు)	
సెన్సెక్స్	నిఫ్టీ
499 ▲	155 ▲
63,915	18,972

విదేశీ సూచీలు (తొలి రెండు రాత్రి 11.30 గంటలకు)			
నాస్‌డాక్	13,581	▽	11
డోజోన్స్	34,098	▲	245
ఎఫ్‌టీఎస్ఈ 100	7,472	▽	22
డాక్స్	15,947	▽	2
షాంఘై	3,182	▽	7
నికాయ్	33,234	▲	40

అమెరికా • బ్రిటన్ • జర్మనీ • చైనా • జపాన్

ఇంటర్‌గ్లోబ్ విలువ రూ. లక్ష కోట్లు

- ఈ ఫీట్ సాధించిన తొలి ఎయిర్‌లైన్స్
- ఈ ఏడాది షేరు 30 శాతంపైగా ర్యాలీ

న్యూఢిల్లీ: ఇండిగో బ్రాండ్ విమానయాన సేవల కంపెనీ ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ మార్కెట్ క్యాపిటలైజేషన్(విలువ) తొలిసారి రూ. లక్ష కోట్లను తాకింది. వెరసి దేశీయంగా ఈ మైలురాయిని చేరిన తొలి ఎయిర్‌లైన్స్ కంపెనీగా చరిత్ర సృష్టించింది. ఈ ఏడాది ఇప్పటివరకూ షేరు 30 శాతంపైగా దూసుకెళ్లడంతో కంపెనీ తాజా ఫీట్‌ను సాధించింది. ఇదే కాలంలో సెన్సెక్స్ 5 శాతమే బలపడటం గమనార్హం! బుధవారం స్టాక్ ఎక్స్చేంజీలలో ఇండిగో షేరు



3.6 శాతం జంప్‌చేసింది. బీఎస్ఈలో రూ. 2,620కు చేరగా.. ఎన్ఎస్ఈలో రూ. 2,621 వద్ద నిలిచింది. ఇంట్రాడేలో రూ. 2,634 వద్ద 52 వారాల గరిష్టాన్ని తాకింది. వెరసి కంపెనీ మార్కెట్ విలువ రూ. 1,01,007 కోట్లను అధిగమించింది. సోమవారం ఎయిర్‌బస్ నుంచి 500 విమానాల కొనుగోలుకి ఆర్డర్ జారీ చేసింది. తద్వారా ఎయిర్‌బస్ చరిత్రలోనే భారీ కాంట్రాక్టుకు తెరతీసింది. దీర్ఘకాలిక వృద్ధిలో భాగంగా భారీ విస్తరణ ప్రణాళికలు ప్రకటించడంతో ఇండిగో కౌంటర్ జోరందుకుంది. ఇందుకు సరికొత్త గరిష్టాలకు చేరిన స్టాక్ మార్కెట్లు సైతం దోహదపడినట్లు విశ్లేషకులు ఈ సందర్భంగా పేర్కొన్నారు. దేశీయంగా అతిపెద్ద విమానయాన కంపెనీగా నిలుస్తున్న ఇండిగో అంతర్జాతీయంగా విస్తరించేందుకూ ప్రణాళికలు అమలు చేస్తోంది. దేశీయంగా కంపెనీ మార్కెట్ వాటా 61 శాతానికిపైగా నమోదుకావడం విశేషం!

కోడిగుడ్లు (హోల్‌సేల్-నెక్ / 100కు రూ.లలో)

30-6-2023	
విశాఖ	550-00
చిత్తూరు	603-00
ఈస్ట్, వెస్ట్ గోదావరి	535-00
విజయవాడ	535-00
రిటైల్ ధర (డజను)	72.00
29-6-2023 ఫామ్ ధర...	
హైదరాబాద్	540-00
వరంగల్	542-00
రిటైల్ ధర	6.00

పదేళ్లలో రూ. 20 వేల కోట్ల పెట్టుబడులు

అదానీ టోటల్ గ్యాస్ భారీ ప్రణాళికలు • సీఎన్‌జీ రిటైలింగ్ విస్తరణపై మరింత దృష్టి



న్యూఢిల్లీ: అదానీ టోటల్ గ్యాస్ (ఏజీటీఎల్) భారీ స్థాయిలో కార్యకలాపాలను విస్తరించనుంది. ఇందుకోసం వచ్చే 8-10 ఏళ్లలో రూ. 18,000 - రూ. 20,000 కోట్లు వెచ్చించనుంది. తద్వారా వాహనాలకు సీఎన్‌జీ, గృహాలు .. పరిశ్రమలకు పైపింగ్ గ్యాస్ సరఫరాకు అవసరమైన మౌలిక సదుపాయాలను పెంచుకోనుంది. కంపెనీ సీఎఫ్‌వో పరాగ్ పారిఖ్ ఈ విషయాలు తెలిపారు. సంస్థ వార్షిక నివేదికలో 2022-23 ఆర్థిక సంవత్సరంలో అదనంగా మౌలిక సదుపాయాల కల్పన కోసం రూ. 1,150 కోట్లు ఇన్వెస్ట్ చేసినట్లు ఆయన వివరించారు. దీర్ఘకాలిక దృష్టి కోణం నుంచి చూస్తే పర్యావరణ అనుకూల ఇంధనంగా గ్యాస్‌కు డిమాండ్ సానుకూలంగా ఉన్న నేపథ్యంలో మరింతగా పెట్టుబడులు పెట్టనున్నట్లు పారిఖ్ పేర్కొన్నారు. అదానీ గ్రూప్, ఫ్రెంచ్ సంస్థ టోటల్‌ఎనర్జీస్ కలిసి జాయింట్ వెంచర్‌గా అదానీ-టోటల్‌ను ఏర్పాటు చేశాయి. ప్రస్తుతం దేశవ్యాప్తంగా 124 జిల్లాల్లో కంపెనీ కార్యకలాపాలు సాగిస్తోంది. 460 పైచిలుకు సీఎన్‌జీ స్టేషన్లు, 7 లక్షలకు పైగా పైప్డ్ కుకింగ్ గ్యాస్ కస్టమర్లు ఉన్నారు.

1,800 సీఎన్‌జీ స్టేషన్ల ఏర్పాటు..

వచ్చే 7-10 సంవత్సరాల్లో 1,800 పైచిలుకు సీఎన్‌జీ స్టేషన్లను ఏర్పాటు చేయనున్నట్లు ఏజీటీఎల్ సీఈవో సురేష్ పి.మంగ్లానీ తెలిపారు. మరిన్ని గృహాలకు పైప్డ్‌గ్యాస్‌ను అందించడంపై దృష్టి పెడుతున్నట్లు పేర్కొన్నారు. ప్రధానమైన గ్యాస్ సరఫరా వ్యాపారాన్ని పెంచుకోవడంతో పాటు .. బయోగ్యాస్, ఈవీ చార్జింగ్ తదితర విభాగాలను కూడా మరింతగా విస్తరించనున్నట్లు వివరించారు. ఈ-మొబిలిటీ కోసం అదానీ టోటల్‌ఎనర్జీస్ ఈ-మొబిలిటీ పేరిట అనుబంధ సంస్థను నెలకొల్పినట్లు, ఇది ద్విచక్ర, త్రిచక్ర వాహనాలతో పాటు కార్లు, బస్సులు మొదలైన వాటి కోసం ఎలక్ట్రిక్ చార్జింగ్ స్టేషన్లను ఏర్పాటు చేస్తున్నట్లు మంగ్లానీ చెప్పారు. ఇప్పటికే తమకు 26 ప్రాంతాల్లో 104 చార్జింగ్ పాయింట్లు ఉండగా, వీటిని 3,000కు పెంచుకోనున్నట్లు తెలిపారు. అటు మరో అనుబంధ సంస్థ అదానీ టోటల్‌ఎనర్జీస్ బయోమాస్ (ఏటీబీఎల్) దేశంలోనే అతి పెద్ద కంప్రెస్డ్ బయోగ్యాస్ (సీబీజీ) ప్లాంటును ఉత్తర్‌ప్రదేశ్ మథుర దగ్గర్లోని బర్సానాలో నెలకొల్పుతున్నట్లు మంగ్లానీ చెప్పారు.

దక్షలో కోరమాండల్‌కు మెజారిటీ వాటా

హైదరాబాద్, బిజినెస్ బ్యూరో: డ్రోన్ సేవల్లో ఉన్న దక్ష అన్‌మ్యాన్డ్ సిస్టమ్స్‌లో కోరమాండల్ ఇంటర్నేషనల్‌కు చెందిన కోరమాండల్ టెక్నాలజీ మరో 32.68 శాతం వాటాను చేజిక్కించుకుంది. దీంతో దక్షలో కోరమాండల్ వాటా 51.02 శాతానికి ఎగబాకింది. డీల్ విలువ రూ.204 కోట్లు.



'ఇండస్‌ఇండ్' ప్రణాళికకు ఆర్‌క్యాప్ రుణదాతల ఆమోదం

న్యూఢిల్లీ: హిందుజా గ్రూప్ సంస్థ ఇండస్‌ఇండ్ ఇంటర్నేషనల్ హోల్డింగ్స్ సమర్పించిన పరిష్కార ప్రణాళికకు రిలయన్స్ క్యాపిటల్ (ఆర్‌క్యాప్) రుణదాతలు ఆమోదముద్ర వేశారు. రెండో రౌండ్ బిడ్డింగ్‌లో ఐఐహెచ్‌ఎల్ అత్యధికంగా రూ. 9,661 కోట్లు ఆఫర్ చేసింది. దీంతో ముందస్తుగా అత్యధిక మొత్తంలో నగదును రికవర్ చేసుకునే అవకాశం ఉండటంతో 99% బ్యాంకర్లు.. ఐఐహెచ్ హోల్డింగ్స్ ప్రణాళికకే ఓటు వేసినట్లు సమాచారం.



ఐసీఐసీఐ సెక్యూరిటీస్ డీలిస్టింగ్

ఐసీఐసీఐ బ్యాంకుకు పూర్తి అనుబంధ సంస్థగా ఏర్పాటు

న్యూఢిల్లీ: అనుబంధ సంస్థ ఐసీఐసీఐ సెక్యూరిటీస్‌ను స్టాక్ ఎక్స్చేంజీల నుంచి డీలిస్ట్ చేసే ప్రతిపాదనను బోర్డు ఆమోదించినట్లు ప్రైవేట్ రంగ ఐసీఐసీఐ బ్యాంకు వెల్లడించింది. తద్వారా పూర్తి అనుబంధ సంస్థగా ఆవిర్భవించనున్నట్లు తెలియజేసింది. పథకంలో భాగంగా ఐసీఐసీఐ సెక్యూరిటీస్ వాటాదారులకు తమవద్దగల ప్రతీ 100 షేర్లకుగాను 67 ఐసీఐసీఐ బ్యాంకు షేర్లను జారీ చేయనున్నట్లు తెలియజేసింది.



ఆరుగురు ఉద్యోగులపై టీసీఎస్ చర్యలు

ముంబై: కొన్ని రిక్రూట్‌మెంట్ సంస్థలతో కుమ్మక్కై, వాటికి ప్రయోజనాలు చేకూర్చేలా వ్యవహరించినందుకు గాను ఆరుగురు ఉద్యోగులపై ఐటీ దిగ్గజం టీసీఎస్ చర్యలు తీసుకుంది. నైతిక నియమావళిని పాటించలేదని విచారణలో తేలడంతో ఆరుగురు ఉద్యోగులను, అలాగే ఆరు సంస్థలను నిషేధించినట్లు సంస్థ చైర్మన్ ఎన్ చంద్రశేఖరన్ తెలిపారు. మరో ముగ్గురు ఉద్యోగుల పాత్రపైనా సంస్థ విచారణ జరుపుతోందని ఆయన షేర్‌హోల్డర్లకు వెల్లడించారు. కొందరు ఉద్యోగుల తప్పుడు ప్రవర్తన గురించి ఇద్దరు ప్రజావేగుల నుంచి కంపెనీకి ఫిర్యాదులు రావడం, టీసీఎస్‌లో ఉద్యోగాలకు లంచాలు తీసుకుంటున్నారని.. తత్సంబంధ వ్యక్తులు ఈ రకంగా కనీసం రూ. 100 కోట్లు సంపాదించారని ఇటీవల మీడియాలో వార్తలు రావడం నేపథ్యంలో తాజా పరిణామం ప్రాధాన్యం సంతరించుకుంది. మరోవైపు, సంపన్న దేశాల్లో అనిశ్చితితో రాబోయే కొన్ని త్రైమాసికాల్లో వ్యాపారానికి ఒడిదుడుకులు తప్పకపోవచ్చని, అయితే మధ్యకాలికం నుంచి దీర్ఘకాలికంగా చూస్తే అవకాశాలు ఆశావహంగానే ఉన్నాయని చంద్రశేఖర్ వివరించారు.




డివిడెండ్‌పై హర్షం

కెనరాబ్యాంక్ 21వ షేర్‌హోల్డర్ల సమావేశం



బెంగళూరు: కెనరా బ్యాంక్ బోర్డ్ 2022-23 ఆర్థిక సంవత్సరానికిగాను రూ. 10 ముఖ విలువ కలిగిన ఈక్విటీ షేరుకు రూ. 12 డివిడెండ్ సిఫారసు చేయడంపై షేర్ హోల్డర్లు హర్షం వ్యక్తం చేశారు. తాజాగా జరిగిన షేర్‌హోల్డర్ల 21 వార్షిక సార్వత్రిక సమావేశం యాజమాన్యంపై పూర్తి విశ్వాసాన్ని వెలిబుచ్చింది. వీడియో కాన్ఫరెన్స్ ద్వారా జరిగిన ఈ సమావేశంలో పాల్గొన్న బ్యాంక్ ఎండీ, సీఈఓ కే సత్యనారాయణ రాజును చిత్రంలో తిలకించవచ్చు. ఇదిలావుండగా, రూపే క్రెడిట్ కార్డ్‌ల ద్వారా వ్యాపారులకు యూపీఐ చెల్లింపులను ఆఫర్ చేస్తున్నట్లు మరో ప్రకటనలో బ్యాంక్ తెలిపింది. తద్వారా ఈ తరహా సేవలు ప్రారంభిస్తున్న మొదటి ప్రభుత్వ రంగ బ్యాంక్‌గా కెనరా బ్యాంక్ నిలిచిందని పేర్కొంది.

లాభదాయకతకు దగ్గర్లో బైజూస్



న్యూఢిల్లీ: ఎడ్‌టెక్ సంస్థ బైజూస్ నెమ్మదిగా, స్థిరంగా వృద్ధి చెందుతోందని సంస్థ సీఈవో బైజు రవీంద్రన్ తెలిపారు. గ్రూప్ స్థాయిలో లాభదాయకతకు చాలా దగ్గర్లోనే ఉన్నామని ఆయన చెప్పారు. బైజూస్ వృద్ధి, భవిష్యత్తుపై నెలకొన్న అనిశ్చితిపై ఆందోళనలను తొలగించేందుకు నిర్వహించిన టౌన్‌హాల్ సమావేశంలో పాల్గొన్న సందర్భంగా రవీంద్రన్ ఈ విషయాలు తెలిపారు. 1.2 బిలియన్ డాలర్ల టర్మ్ లోన్ బీ (టీఎల్‌బీ) రుణదాతలతో నెలకొన్న వివాదాన్ని పరిష్కరించుకునేందుకు ప్రయత్నాలు జరుగుతున్నాయని, మరికొన్ని వారాల్లోనే సానుకూల ఫలితం రాగలదని ఆయన ఆశాభావం వ్యక్తం చేసినట్లు సంబంధిత వర్గాలు వివరించాయి. అంతర్జాతీయంగా టెక్ కంపెనీలు సవాళ్లను ఎదుర్కొంటున్నప్పటికీ బైజూస్ మాత్రం లాభదాయకత లక్ష్యాల దిశగా గణనీయంగా పురోగతి సాధించిందని రవీంద్రన్ చెప్పారు. బైజూస్ ఆర్థిక పని తీరు, రుణ భారం, ఆర్థిక ఫలితాలను ప్రకటించడంలో జాప్యాలు, కంపెనీ వేల్యుయేషన్‌ను ఇన్వెస్ట్‌మెంట్ సంస్థ ప్రోసస్ 6 బిలియన్ డాలర్లకు కుదించడం తదితర ప్రతికూల పరిణామాల నేపథ్యంలో రవీంద్రన్ వివరణ ప్రాధాన్యం సంతరించుకుంది.

సాక్షి స్పోర్ట్స్




భారత ఫుట్‌బాల్ జట్టు ర్యాంక్ 100

స్వదేశంలో ఇటీవల జరిగిన ఇంటర్ కాంటినెంటల్‌కప్ నాలుగు దేశాల టోర్నీలో టైటిల్ సాధించినందుకు భారత జట్టు ర్యాంకింగ్స్‌లో పురోగతి కనిపించింది. అంతర్జాతీయ ఫుట్‌బాల్ సమాఖ్య (ఫిఫా) తాజా ర్యాంకింగ్స్‌లో సునీల్ ఛెత్రి సారథ్యంలోని భారత పురుషుల జట్టు సరిగ్గా 100వ స్థానంలో నిలిచింది. క్రితంసారి భారత్ 101వ ర్యాంక్‌లో నిలువగా... ఈసారి ఒక స్థానం మెరుగుపర్చుకుంది. 2019 ఫిబ్రవరి 7 తర్వాత భారత జట్టు మళ్లీ టాప్-100లోకి రావడం ఇదే తొలిసారి. 2019 ఫిబ్రవరిలో భారత్ 97వ ర్యాంక్‌లో నిలిచింది. ఆ తర్వాత భారత ర్యాంక్ పడిపోయింది. 1996లో భారత్ అత్యుత్తమంగా 94వ ర్యాంక్‌లో నిలిచింది. ప్రస్తుతం భారత జట్టు స్వదేశంలో జరుగుతున్న దక్షిణాసియా చాంపియన్‌షిప్‌లో బరిలో ఉంది. రేపు జరిగే సెమీఫైనల్లో లెబనాన్ జట్టుతో టీమిండియా తలపడుతుంది. ఫిఫా' ర్యాంకింగ్స్‌లో ప్రపంచ చాంపియన్ అర్జెంటీనా టాప్ ర్యాంక్‌లో కొనసాగుతుండగా... ఫ్రాన్స్ రెండో ర్యాంక్‌లో, బ్రెజిల్ మూడో ర్యాంక్‌లో ఉన్నాయి.

జింబాబ్వే మరింత ముందుకు...

'సూపర్ సిక్స్' మ్యాచ్‌లో ఒమన్‌పై విజయం

- సీన్ విలియమ్స్ భారీ సెంచరీ
- కశ్యప్ ప్రజాపతి శతకం వృథా


సీన్ విలియమ్స్

బులవాయో: మరోసారి సమష్టి ప్రదర్శనతో అదరగొట్టిన జింబాబ్వే జట్టు వన్డే ప్రపంచకప్ క్రికెట్ టోర్నీకి అర్హత సాధించే దిశగా మరో అడుగు ముందుకు వేసింది. లీగ్ దశలో ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ గెలిచిన జింబాబ్వే... గురువారం మొదలైన 'సూపర్ సిక్స్' దశలోనూ శుభారంభం చేసింది. ఒమన్ జట్టుతో జరిగిన మ్యాచ్‌లో జింబాబ్వే 14 పరుగుల తేడాతో గెలిచింది. టాస్ గెలిచిన ఒమన్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకోగా... మొదట బ్యాటింగ్‌కు దిగిన జింబాబ్వే నిర్ణీత 50 ఓవర్లలో 6 వికెట్లు కోల్పోయి 332 పరుగులు సాధించింది. వన్‌డౌన్ బ్యాటర్ సీన్ విలియమ్స్ (103 బంతుల్లో 142; 14 ఫోర్లు, 3 సిక్స్‌లు) ఒమన్ బౌలర్లపై విరుచుకుపడి ఈ టోర్నీలో రెండో సెంచరీ, కెరీర్‌లో ఏడో సెంచరీ పూర్తి చేసుకున్నాడు. సికందర్ రజా (49 బంతుల్లో 42; 6 ఫోర్లు)తో కలిసి నాలుగో వికెట్‌కు సీన్ విలియమ్స్ 102 పరుగుల భాగస్వామ్యం జోడించాడు. చివర్లో ల్యూక్ జోంగ్వి (28 బంతుల్లో 43 నాటౌట్; 4 ఫోర్లు) దూకుడుగా ఆడటంతో జింబాబ్వే భారీ స్కోరు నమోదు చేసింది. ఒమన్ బౌలర్ ఫయాజ్ భట్ 79 పరుగులిచ్చి 4 వికెట్లు తీశాడు. 333 పరుగుల లక్ష్యంతో బరిలోకి దిగిన ఒమన్ జట్టు 50 ఓవర్లలో 9 వికెట్లకు 318 పరుగులు చేసి ఓడిపోయింది. గుజరాత్‌లో జన్మించి ఒమన్ జట్టుకు ఆడుతున్న ఓపెనర్ కశ్యప్ ప్రజాపతి (97 బంతుల్లో 103; 12 ఫోర్లు, 1 సిక్స్) సెంచరీ సాధించాడు. ఆకిబ్ ఇలియాస్ (45; 5 ఫోర్లు), జీషాన్ మక్సూద్ (37; 3 ఫోర్లు, 1 సిక్స్), అయాన్ ఖాన్ (47; 5 ఫోర్లు), నదీమ్ (30 నాటౌట్; 4 ఫోర్లు, 1 సిక్స్) కూడా పోరాడటంతో ఒకదశలో ఒమన్ లక్ష్యం దిశగా సాగుతున్నట్లు అనిపించింది. అయితే కీలక తరుణాల్లో జింబాబ్వే బౌలర్లు వికెట్లు పడగొట్టి ఒమన్ ఓటమిని ఖరారు చేశారు. జింబాబ్వే బౌలర్లలో చటారా, ముజరబాని మూడు వికెట్ల చొప్పున తీయగా... ఎన్‌గరవాకు రెండు వికెట్లు దక్కాయి. సీన్ విలియమ్స్‌కు 'ప్లేయర్ ఆఫ్ ద మ్యాచ్' అవార్డు లభించింది. నేడు జరిగే రెండో 'సూపర్ సిక్స్' మ్యాచ్‌లో నెదర్లాండ్స్‌తో శ్రీలంక తలపడుతుంది.


కశ్యప్ ప్రజాపతి


'టాప్ ర్యాంక్'లోకి...

ఒమన్‌పై విజయంతో జింబాబ్వే 'సూపర్ సిక్స్' దశలో ఆరు పాయింట్లతో టాప్ ర్యాంక్‌లోకి వచ్చింది. లీగ్ దశలో గ్రూప్ 'ఎ'లోని నెదర్లాండ్స్, వెస్టిండీస్ జట్లపై జింబాబ్వే గెలవడం... ఆ రెండు జట్లు కూడా 'సూపర్ సిక్స్' దశకు చేరుకోవడంతో... జింబాబ్వే 'సూపర్ సిక్స్' పోటీలను నాలుగు పాయింట్లతో మొదలుపెట్టింది. తాజాగా ఒమన్‌పై నెగ్గిన జింబాబ్వే రెండు పాయింట్లు సాధించింది. జింబాబ్వే రన్‌రేట్ కూడా (0.75) బాగుంది. ఫలితంగా రన్‌రేట్‌లో చాలా వెనుకబడ్డ వెస్టిండీస్ (-0.35) జట్టు వన్డే ప్రపంచకప్‌కు అర్హత పొందాలంటే 'సూపర్ సిక్స్'లో మూడు మ్యాచ్‌ల్లోనూ భారీ విజయాలు సాధించాల్సి ఉంటుంది. 'సూపర్ సిక్స్'లో తొలి రెండు స్థానాల్లో నిలిచి ఫైనల్ చేరే రెండు జట్లకు ప్రపంచకప్ బెర్త్‌లు లభిస్తాయి.

ఇంగ్లండ్ పోరాటం...

- ఆశలన్నీ స్టోక్స్, బ్రూక్‌పైనే
- ప్రస్తుతం 278/4
- స్మిత్ సెంచరీ
- ఆస్ట్రేలియా 416 ఆలౌట్

లండన్: యాషెస్ సిరీస్ రెండో టెస్టులో ఇంగ్లండ్ జట్టు పోరాటం సాగిస్తోంది. ఒకదశలో 188/1తో పటిష్టంగా ఉన్న ఇంగ్లండ్ జట్టు 34 పరుగుల తేడాలో మూడు వికెట్లు కోల్పోయి 222/4తో కష్టాల్లో పడింది. ఈ దశలో మరో రెండు వికెట్లు పడి ఉంటే ఇంగ్లండ్ ఇన్నింగ్స్ కుప్పకూలేది! కానీ హ్యారీ బ్రూక్ (51 బంతుల్లో 45 బ్యాటింగ్; 4 ఫోర్లు), కెప్టెన్ బెన్ స్టోక్స్ (57 బంతుల్లో 17 బ్యాటింగ్; 1 ఫోర్) పట్టుదలతో ఆడి ఐదో వికెట్‌కు అజేయంగా 56 పరుగులు జోడించి పరిస్థితిని చక్కదిద్దారు. ఫలితంగా రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఇంగ్లండ్ తొలి ఇన్నింగ్స్‌లో 61 ఓవర్లలో 4 వికెట్లకు 278 పరుగులు చేసింది. ఓపెనర్లు జాక్ క్రాలీ (48; 5 ఫోర్లు) రెండు పరుగులతో అర్ధ సెంచరీ... డకెట్ (98; 9 ఫోర్లు) రెండు పరుగుల తేడాతో సెంచరీని చేజార్చుకున్నారు. ఓలీ పోప్ (42; 4 ఫోర్లు) రాణించగా, జో రూట్ (10) విఫలమయ్యాడు. ఆస్ట్రేలియా స్కోరుకు ఇంగ్లండ్ మరో 138 పరుగుల దూరంలో ఉంది. మూడో రోజు స్టోక్స్, బ్రూక్‌లతోపాటు బెయిర్‌స్టో క్రీజులో నిలబడితే ఇంగ్లండ్ జట్టు ఈ మ్యాచ్‌పై ఆశలు ఉంచుకోవచ్చు. ఆసీస్ మేటి స్పిన్నర్ నాథన్ లయన్ కాలి పిక్క గాయం కారణంగా మూడో రోజు బౌలింగ్‌కు దిగుతాడో లేదో అనుమానం. అంతకుముందు ఓవర్‌నైట్ స్కోరు 339/5తో తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన ఆస్ట్రేలియా మరో 77 పరుగులు జోడించి మిగతా ఐదు వికెట్లు కోల్పోయి 416 పరుగులవద్ద ఆలౌటైంది. ఓవర్‌నైట్ బ్యాటర్ స్టీవ్ స్మిత్ (110; 15 ఫోర్లు) కెరీర్‌లో 32వ సెంచరీ సాధించడం విశేషం. ఇంగ్లండ్ బౌలర్లలో రాబిన్సన్, జోష్ టంగ్ మూడు వికెట్ల చొప్పున తీశారు.


స్టీవ్ స్మిత్

22 టెస్టులోని తొలి ఇన్నింగ్స్‌లో అత్యధిక సెంచరీలు చేసిన బ్యాటర్‌గా స్మిత్ నిలిచాడు. ఇప్పటి వరకు స్మిత్ తొలి ఇన్నింగ్స్‌లో 22 సెంచరీలు చేశాడు. 21 సెంచరీలతో రికీ పాంటింగ్ పేరిట ఉన్న రికార్డును స్మిత్ సవరించాడు.



భారత్‌కు నాలుగో విజయం

బుసాన్ (దక్షిణ కొరియా): ఆసియా పురుషుల కబడ్డీ చాంపియన్‌షిప్‌లో డిఫెండింగ్ చాంపియన్ భారత జట్టు వరుసగా నాలుగో విజయం సాధించింది. ఇరాన్ జట్టుతో గురువారం జరిగిన లీగ్ మ్యాచ్‌లో పవన్ సెహ్రావత్ కెప్టెన్సీలోని భారత జట్టు 33-28 పాయింట్ల తేడాతో గెలిచింది. పవన్, అర్జున్ దేశ్వాల్, అస్లామ్ ఇనామ్‌దార్ చక్కటి రెయిడింగ్‌తో నిలకడగా పాయింట్లు రాబట్టారు. ఆడిన నాలుగు మ్యాచ్‌ల్లోనూ నెగ్గిన భారత్ ఫైనల్ చేరడం దాదాపు ఖాయమైంది.

చీఫ్ సెలెక్టర్ రేసులో అగార్కర్!



ముంబై: భారత జట్టు మాజీ ఆల్‌రౌండర్ అజిత్ అగార్కర్ ఢిల్లీ క్యాపిటల్స్ జట్టు అసిస్టెంట్ కోచ్ పదవి నుంచి వైదొలిగాడు. బీసీసీఐ చీఫ్ సెలెక్టర్‌గా అగార్కర్ నియమితుడయ్యే అవకాశాలు ఉండటమే దీనికి కారణం. 45 ఏళ్ల అగార్కర్ భారత్ తరఫున 191 వన్డేలు, 26 టెస్టులు, నాలుగు టి20 మ్యాచ్‌లు ఆడాడు. మరోవైపు చీఫ్ సెలెక్టర్ వార్షిక వేతనం పెంచే ఆలోచనలో బీసీసీఐ ఉంది. ప్రస్తుతం చీఫ్ సెలెక్టర్‌కు ఏడాదికి రూ. 1 కోటి లభిస్తుండగా... కమిటీలోని సభ్యులకు రూ. 90 లక్షల చొప్పున ఇస్తున్నారు.

తొలిసారి ఏటీపీ టోర్నీ ఫైనల్లో యూకీ బాంబ్రీ



మలోర్కా (స్పెయిన్): భారత అగ్రశ్రేణి టెన్నిస్ క్రీడాకారుడు యూకీ బాంబ్రీ తన కెరీర్‌లో తొలిసారి ఏటీపీ టోర్నీలో ఫైనల్లోకి ప్రవేశించాడు. మలోర్కా ఓపెన్ ఏటీపీ-250 టోర్నీ లో యూకీ బాంబ్రీ (భారత్)-లాయిడ్ హారిస్ (దక్షిణాఫ్రికా) జోడీ డబుల్స్ విభాగంలో టైటిల్ పోరుకు చేరింది. సెమీఫైనల్లో యూకీ-హారిస్ ద్వయం 6-4, 7-6 (7/2)తో టాప్ సీడ్ గొంజాలెజ్ (మెక్సికో)-వాసెలిన్ (ఫ్రాన్స్) జోడీపై సంచలన విజయం సాధించింది.

నిశాంత్, హర్షిత్ సెంచరీలు

నార్త్ జోన్ 540/8 డిక్లేర్డ్

బెంగళూరు: దులీప్ ట్రోఫీ క్రికెట్ టోర్నీలో భాగంగా నార్త్ ఈస్ట్ జోన్ జట్టుతో జరుగుతున్న క్వార్టర్ ఫైనల్లో నార్త్ జోన్ జట్టు భారీ స్కోరు నమోదు చేసింది. ఓవర్‌నైట్ స్కోరు 306/6 రెండో రోజు తొలి ఇన్నింగ్స్ కొనసాగించిన నార్త్ జోన్ జట్టు 8 వికెట్లకు 540 పరుగులవద్ద డిక్లేర్ చేసింది. నిశాంత్ సింధు (245 బంతుల్లో 150; 18 ఫోర్లు, 3 సిక్స్‌లు), హర్షిత్ రాణా (86 బంతుల్లో 122 నాటౌట్; 12 ఫోర్లు, 9 సిక్స్‌లు) సెంచరీలతో కదంతొక్కారు. నిశాంత్‌తో కలిసి హర్షిత్ ఎనిమిదో వికెట్‌కు 104 పరుగులు... సిద్ధార్థ్ కౌల్ (9 నాటౌట్)తో కలిసి తొమ్మిదో వికెట్‌కు 64 పరుగులు జోడించాడు. అనంతరం తొలి ఇన్నింగ్స్ ప్రారంభించిన నార్త్ ఈస్ట్ జోన్ జట్టు ఆట ముగిసే సమయానికి తొలి ఇన్నింగ్స్‌లో 20 ఓవర్లలో 3 వికెట్లు కోల్పోయి 65 పరుగులు చేసింది.


హర్షిత్


నిశాంత్

సెంట్రల్ జోన్‌కు ఆధిక్యం

ఈస్ట్ జోన్ జట్టుతో జరుగుతున్న మరో క్వార్టర్ ఫైనల్లో సెంట్రల్ జోన్ జట్టు రెండో రోజు ఆట ముగిసే సమయానికి ఓవరాల్‌గా 124 పరుగుల ఆధిక్యంలో నిలిచింది. సెంట్రల్ జోన్ తొలి ఇన్నింగ్స్ స్కోరుకు జవాబుగా ఈస్ట్ జోన్ జట్టు తొలి ఇన్నింగ్స్‌లో 42.2 ఓవర్లలో 122 పరుగులకే ఆలౌటైంది. సెంట్రల్ జోన్ బౌలర్లలో అవేశ్ ఖాన్, సౌరభ్ కుమార్ మూడు వికెట్ల చొప్పున తీశారు. 60 పరుగుల తొలి ఇన్నింగ్స్ ఆధిక్యం పొందిన సెంట్రల్ జోన్ జట్టు రెండో ఇన్నింగ్స్‌లో ఆట ముగిసే సమయానికి వికెట్ నష్టపోకుండా 64 పరుగులు సాధించింది.

విదేశాల్లో బజరంగ్, వినేశ్ శిక్షణ





న్యూఢిల్లీ: ఆసియా క్రీడలు, ప్రపంచ చాంపియన్‌షిప్ సెలెక్షన్ ట్రయల్స్‌కు సమాయత్తమయ్యేందుకు భారత స్టార్ రెజ్లర్లు బజరంగ్ పూనియా, వినేశ్ ఫొగాట్ విదేశాల్లో శిక్షణ తీసుకోవాలని నిర్ణయించారు. ఈ మేరకు కేంద్ర క్రీడా మంత్రిత్వ శాఖకు ప్రతిపాదనలు పంపించగా వాటికి ఆమోదం లభించింది. బజరంగ్ 36 రోజుల శిక్షణ కోసం కిర్గిస్తాన్‌ను... వినేశ్ 18 రోజుల శిక్షణకు హంగేరిని ఎంచుకున్నారు. ఆగస్టు రెండో వారంలో ట్రయల్స్ జరగనుండగా... వచ్చే వారంలో వీరు విదేశాలకు బయలుదేరుతారు. వినేశ్ వెంట ఫిజియోథెరపిస్ట్ అశ్విని జీవన్ పాటిల్, కోచ్ సుదేశ్, ప్రాక్టీస్ భాగస్వామిగా సంగీత ఫొగాట్... బజరంగ్ వెంట కోచ్ సుజీత్ మాన్, ఫిజియోథెరపిస్ట్ అనూజ్, ప్రాక్టీస్ భాగస్వామి జితేందర్, స్ట్రెంత్ అండ్ కండీషనింగ్ నిపుణుడు కాజీ హసన్ వెళతారు. భారత రెజ్లింగ్ సమాఖ్య అధ్యక్షుడు, బ్రిజ్ భూషణ్‌పై లైంగిక ఆరోపణల కేసును కోర్టులోనే తేల్చుకుంటామని బజరంగ్, వినేశ్ ప్రకటించారు.

క్లుప్తంగా...

ఈటల ప్రాణాలకు ముప్పు!

- నిర్ధారించిన పోలీసు అధికారులు?
- డీజీపీకి సీల్డ్‌కవర్‌లో డీసీపీ నివేదిక
- ఈటల భద్రతపై నేడో రేపో ప్రకటన



సాక్షి, హైదరాబాద్‌: మాజీ మంత్రి, భారతీయ జనతా పార్టీ ఎమ్మెల్యే ఈటల రాజేందర్‌ ప్రాణాలకు ముప్పు ఉన్నట్లు పోలీసు అధికారులు నిర్ధారించినట్లు సమాచారం. సుపారీ గ్యాంగ్‌లు తనను హతమార్చడానికి తిరుగుతున్నాయని ఈటల రాజేందర్‌తో పాటు, ఆయన భార్య జమున కూడా రెండురోజుల కిందట ఆరోపించడం తెలిసిందే. వెంటనే స్పందించిన పురపాలక, పరిశ్రమల శాఖ మంత్రి కె.తారకరామారావు డీజీపీ అంజనీకుమార్‌తో మాట్లాడారు. మేడ్చల్‌ డీసీపీ సందీప్‌ రావు ఈటల ఇంటికి వెళ్లి ఆయనతో ప్రత్యేకంగా సమావేశమై చర్చించారు. హుజురాబాద్‌ జిల్లా పర్యటన సమయంలో అనుమానాస్పద కార్లు తిరగడంపై ఈటల రాజేందర్‌ డీసీపీకి వివరించినట్లు తెలిసింది. ఈటల గృహాన్ని, ఆయన పర్యటన సమయంలో ఎలాంటి రక్షణ కల్పించాలన్న అంశాలను కూడా డీసీపీ పరిశీలించినట్లు సమాచారం. మేడ్చల్‌ డీసీపీ గురువారం ఈటల భద్రతపై నివేదికను సీల్డ్‌ కవర్‌లో డీజీపీకి అందజేశారు. ఈటల రాజేందర్‌ ప్రాణాలకు ముప్పుందన్న వార్తలు రావడంతో కేంద్రం ఆయనకు వై కేటగిరి భద్రత కల్పించాలని యోచించింది. దీంతో రాష్ట్ర ప్రభుత్వమే ఆ భద్రతను కల్పించే అంశాన్ని పరిశీలించాలని మంత్రి కేటీఆర్‌ సూచించిన నేపథ్యంలోనే పోలీసులు ఈ కసరత్తు చేయడం గమనార్హం. భద్రతను కల్పించడంపై ప్రభుత్వం నేడో రేపో తుది నిర్ణయం తీసుకునే అవకాశం ఉంది.

శుభలేఖ పంపితే అమ్మవారి కుంకుమ, అక్షింతలు

దుర్గగుడి పాలక మండలి సమావేశంలో నిర్ణయం



ఇంద్రకీలాద్రి (విజయవాడ పశ్చిమ): మొదటి శుభలేఖను అమ్మవారికి సమర్పించే భక్తులకు కుంకుమతో పాటు అక్షింతలు అందించాలని నిర్ణయించినట్లు దుర్గగుడి చైర్మన్‌ కర్నాటి రాంబాబు చెప్పారు. శ్రీ దుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థాన పాలక మండలి సభ్యుల సమావేశం గురువారం జరిగింది. ఇందులో దుర్గగుడిలో విధులు నిర్వహిస్తోన్న కాంట్రాక్ట్‌ ఉద్యోగులను క్రమబద్ధీకరించాలనే ప్రతిపాదనను పాలక మండలి తీర్మానించినట్లు చెప్పారు. సీనియారిటీ ప్రకారం ఎస్‌ఎంఆర్‌లను పర్మినెంట్‌ చేస్తామన్నారు. ఇకపై రూ.300 టికెట్‌ కొనుగోలు చేసే ప్రతి భక్తుడికి ఉచితంగా ఒక లడ్డూ ఇవ్వాలని తీర్మానం చేశామని చెప్పారు. దేవస్థానానికి చెందిన సీవీ రెడ్డి చారిటీస్‌ స్థలంలో దేవస్థానం తరపున ఆసుపత్రిని నిర్మించనున్నట్లు తెలిపారు. ఘాట్‌రోడ్డుకు అవసరమైన మరమ్మతులు చేపట్టాలని, గిరి ప్రదక్షిణ మార్గాల్లో ఒక ప్రత్యేక బస్సు నడుపుతున్నామని, జూలై 3వ తేదీ పౌర్ణమి రోజున బస్సును ప్రారంభిస్తామని చెప్పారు. దేవస్థానానికి చెందిన ఆధ్యాత్మిక మాస పత్రిక కనకదుర్గ ప్రభను రూ.20కు పెంచనున్నట్లు వెల్లడించారు.

ఓబీసీ కులవర్గీకరణ వివరాలు వెల్లడించాలి

బీసీ కమిషన్‌ చైర్మన్‌ వకుళాభరణం



సాక్షి, హైదరాబాద్‌: దేశవ్యాప్తంగా ఓబీసీ కుల వర్గీకరణ గణాంకాలను బహిర్గతం చేయాలని రాష్ట్ర బీసీ కమిషన్‌ చైర్మన్‌ వకుళాభరణం కృష్ణమోహన్‌ కేంద్ర ప్రభుత్వాన్ని కోరారు. రాష్ట్ర పర్యటనలో భాగంగా గురువారం హైదరాబాద్‌ వచ్చిన జాతీయ బీసీ కమిషన్‌ చైర్మన్‌ హన్స్‌రాజ్‌ గంగారం అహీర్‌ను రాష్ట్ర బీసీ కమిషన్‌ చైర్మన్‌ వకుళాభరణం కృష్ణమోహన్‌ కలిశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ విద్య, ఉద్యోగావకాశాల్లో బీసీలకు అన్యాయం జరుగుతోందని తెలిపారు. ప్రధానంగా క్రీమీలేయర్‌ నిబంధనలను సైతం సవరించాలని, ఈ పరిమితిని రూ.8 లక్షల నుంచి రూ.15 లక్షలకు పెంచాలని కోరారు. డీవోపీటీ నిబంధనలను మూడేళ్లకోసారి సమీక్షించి సవరించాలని, కానీ క్రీమీలేయర్‌ పరిమితితో బీసీ విద్యార్థులకు అవకాశాలు అందడం లేదని వివరించారు. తెలంగాణలో బీసీలుగా విద్యా, ఉద్యోగ రంగాలలో లబ్ధి పొందుతున్నప్పటికీ, కేంద్రం సుమారు 40 సామాజిక కులాలను ఓబీసీ జాబితాలో చేర్చనందున ఉన్నత అవకాశాలు కోల్పోవలసి వస్తోందని పేర్కొన్నారు.

నేడు 'జోసా' సీట్ల కేటాయింపు

సాక్షి, హైదరాబాద్‌: దేశంలోని ప్రతిష్టాత్మక ఐఐటీలు, ఎన్‌ఐటీలు, ట్రిపుల్‌ ఐటీలు కేంద్ర ప్రభుత్వ నిధులతో నడిచే సంస్థల్లో ఇంజనీరింగ్‌ విభాగంలో సీట్ల కేటాయింపును శుక్రవారం చేపట్టనున్నారు. ఇందుకు సంబంధించి అన్ని ఏర్పాట్లు చేసినట్లు 'జాయింట్‌ సీట్‌ అలకేషన్‌ అథారిటీ'(జోసా) తెలిపింది. తొలి విడత సీట్ల కేటాయింపును ఉదయం 10 గంటలకు ప్రకటిస్తున్నామని, అభ్యర్థులు josaa.nic.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్‌ నెంబర్ల ద్వారా సీటు ఎక్కడ వచ్చిందో తెలుసుకోవచ్చని 'జోసా'పేర్కొంది. సీట్లు పొందిన అభ్యర్థులు జూలై 4లోగా ఆన్‌లైన్‌ రిపోర్టింగ్‌ చేయాలని, అభ్యంతరాలుంటే జూలై 5లోగా పంపాలని సూచించింది.

దొంగ వేషాలు బట్టబయలు

- భుజాలు తడుముకుంటున్న పచ్చ ఓట్ల దొంగలు
- ఇప్పుడు బయట పడుతున్న దొంగ ఓట్లన్నీ 2019 జనవరికి ముందు చేర్పించినవే
- ఇదే విషయాన్ని ఏపీ ఎన్నికల ప్రధాన అధికారి స్పష్టం చేసినా ఆగని తప్పుడు ప్రచారం
- ఇప్పుడే దొంగ ఓట్లు చేర్చినట్లు ఈనాడు, దాని తోక పత్రిక దుష్ప్రచారం



ముందే చెప్పిన సాక్షి : టీడీపీ హయాంలో దొంగ ఓట్లపై 17.3.2019న 'సాక్షి' ప్రచురించిన కథనం

తెలుగుదేశం పార్టీ దొంగ ఓట్ల వేషాలు ఇప్పుడు బయటపడుతున్నాయి. కేంద్ర ఎన్నికల సంఘం ప్రత్యేక ఓట్ల సవరణ కార్యక్రమంలో భాగంగా నిశిత పరిశీలనకు తోడు, ఆధార్‌ సీడింగ్‌ చేస్తుండటంతో 2019లో టీడీపీ భారీగా చేర్పించిన దొంగ ఓట్ల బాగోతం బట్టబయలవుతోంది. ఈ విషయం ప్రజల్లోకి వెళితే పార్టీ ఉనికే ప్రశ్నార్థకంగా మారుతుందని రాజగురివింద విలవిల్లాడిపోతున్నారు. ఈ తప్పులకు వక్రభాష్యాలు చెబుతూ విష ప్రచారానికి తెరలేపారు. ప్రస్తుత ప్రభుత్వ హయాంలోనే ఇది జరిగినట్లు ఈనాడులో కట్టు కథలను వండివారుస్తున్నారు.

సాక్షి, అమరావతి: గత ఎన్నికల్లో గెలవడం కోసం తెలుగుదేశం పార్టీ అనేక అడ్డదారులు తొక్కింది. ఏకంగా ప్రజల విలువైన వ్యక్తిగత సమాచారాన్ని హైదరాబాద్‌కు చెందిన ఐటీ గ్రిడ్‌ అనే ప్రైవేటు సంస్థ ద్వారా తస్కరించింది. ఏపీలోని ప్రజల ఆధార్‌ డేటాను ఈ–ప్రగతికి అనుసంధానం చేసి, అక్కడి నుంచి ఆ సమాచారాన్ని దొంగిలించి తెలుగుదేశం పార్టీకి సంబంధించిన సేవా మిత్ర యాప్‌కు చేరవేసింది. ఈ యాప్‌ ద్వారా సర్వేలు నిర్వహించి ఓటు వేయరనుకున్న వారిని గుర్తించి, ఫారం7 ద్వారా వారి ఓట్లను తొలగించింది. వారి స్థానంలో పెద్ద ఎత్తున దొంగ ఓటర్లను చేర్పించింది. ఇప్పుడు ఈ విషయాన్ని గుర్తించి, దొంగ ఓట్లను తొలగిస్తుంటే.. అదే పెద్ద తప్పిదమైనట్లు ఈనాడు, దాని తోకపత్రిక అడ్డగోలు కథనాలతో ప్రజలను పక్కదారి పట్టించేలా కథనాలు వండివారుస్తున్నాయి. ఈ పత్రికలు అచ్చేసిన దొంగ ఓట్ల కథనాలు, ఆయా ఇంటి నంబర్లను 2019 ఓటర్ల జాబితా, 2023 ఓటర్ల జాబితాలో పరిశీలించి చూస్తే బాబు బాగోతం స్పష్టంగా తెలిసిపోతోంది. ఇదే చంద్రబాబు కుప్పం నియోజకవర్గంలో ఇలా 36 వేలకు పైగా పక్క రాష్ట్రాలకు చెందిన దొంగ ఓటర్లను చేర్పించి గట్టెక్కారు. మరి దీనిపై కూడా ఓ కథనాన్ని వండి వార్చగలరా?

రామోజీ.. అప్పుడు కనిపించలేదా?

విజయవాడలో ఒకే ఇంటి నంబర్‌పై 506 ఓట్లు అంటూ జూన్‌ 15న ఈనాడు ఓ కథనం అచ్చేసింది. ఇది దురుద్దేశంతో కూడిందన్న విషయం 2019, 2023 ఓటర్ల జాబితాను పరిశీలిస్తే స్పష్టంగా తెలుస్తోంది. విజయవాడ సెంట్రల్‌ నియోజకవర్గం పోలింగ్‌ స్టేషన్‌–80 సూర్యారావు పేటలో అసలు ఇంటి నంబరు లేకుండా కేవలం కడియాల వారి వీధి పేరుతో పెద్ద ఎత్తున ఓట్లు నమోదై ఉన్నాయి. ఈనాడు రాసిన కథనంలో చెబుతున్నట్లుగా ఈ ఓట్లను పరిశీలిస్తే అవి 2019కి ముందు నమోదు చేసినవే. కొత్తగా ఒక్క ఓటు కూడా నమోదు కాకపోగా ఈ సంఖ్య ఇంకా తగ్గింది. కనీసం ఈ పూర్వాపరాలను పరిశీలించకుండా.. కేవలం ప్రభుత్వంపై బురద చల్లాలనే ఆలోచనలతో ఈనాడు దుష్ప్రచారం చేసిందని స్పష్టమవుతోంది. తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో జరిగిన తప్పులను ఇప్పుడు ఎన్నికల సంఘం సరిదిద్దుతుంటే వాటికి వక్రీకరణలు, అబద్ధాలు జోడించి, ఎల్లో మీడియాతో ప్రచారం చేయించి ప్రజలను తప్పుదోవపట్టించేలా టీడీపీ వ్యూహం పన్నింది. ఈ కథనంపై ఏపీ ఎన్నికల ప్రధాన అధికారి స్పందిస్తూ 2018 నుంచి ఈ ఓట్లు ఒకే వీధి పేరుతో ఉన్నాయని స్పష్టం చేయడమే కాకుండా గణాంకాలతో సహా వివరించారు. 2018లో 674 మంది ఓటర్లు ఉంటే 2019లో 675 మంది ఇప్పుడు 516 మంది ఓటర్లు ఉన్నారని చెప్పారు. ఇప్పుడు క్షేత్ర స్థాయిలో పరిశీలించి, నకిలీ ఓట్లు ఉంటే తొలగిస్తామని స్పష్టం చేశారు. అలాగే గుంటూరు పశ్చిమ నియోజకవర్గంలో ఒకే ఇంటి నంబర్‌పై 800 ఓట్లు ఉన్నాయంటూ ఈనాడు తోకపత్రిక మరో కథనాన్ని వండి వార్చింది. చంద్రబాబు హయాంలోనే చేర్పించారన్న విషయాన్ని దాచిపెట్టి ఈ ప్రభుత్వంపై, వైఎస్సార్‌సీపీపై నింద వేసింది. గుంటూరు పశ్చిమ నియోజకవర్గం పోలింగ్‌ స్టేషన్‌ 38కి సంబంధించి 2019, 2023 ఓటర్ల జాబితా పరిశీలిస్తే ఈ ఓట్లన్నీ 2019 జనవరి నుంచే కొనసాగుతున్న విషయం స్పష్టం అవుతోంది. అంటే ఈ ఓట్లన్నీ చంద్రబాబు నాయుడే చేర్పించారని ఇట్టే స్పష్టమవుతోంది.

ఇక ఆటలు సాగవని అక్కసు

ఒక వ్యక్తి రెండు మూడు చోట్ల ఓట్లు కలిగి ఉంటే వాటిని గుర్తించి, వారు కోరుకున్న ఒక్క చోట మాత్రమే ఉంచేలా కేంద్ర ఎన్నికల సంఘం వ్యవహరిస్తోంది. ఇలా రాష్ట్రంలో 15 లక్షల మంది ఓటర్లు ఉంటే, పరిశీలించి 10.20 లక్షలు తొలిగించినట్లు ముఖేష్‌ కుమార్‌ మీనా తెలిపారు. కొంతకాలంగా ఓటర్ల జాబితాలో జరిగిన తప్పులను ప్రస్తుతం జరుగుతున్న ప్రత్యేక ఓటర్ల సవరణ 2024లో సరిదిద్దనున్నట్లు హామీ ఇచ్చారు. జూలై 21 నుంచి ఆగస్టు 21 వరకు బీఎల్‌వోలు ఇంటింటి సర్వే చేసి ఓటర్ల సవరణ చేస్తారని, ఈ సమయంలో గుర్తింపు పొందిన రాజకీయ పార్టీలు బీఎల్‌వోలతో కలిసి సర్వేలో పాల్గొనాలని కోరారు. దీంతో ఇంతకాలం దొంగ ఓట్లతో గెలుస్తూ వచ్చిన తెలుగుదేశం పార్టీ.. ఎల్లో మీడియాను అడ్డు పెట్టుకొని దుష్ప్రచారం సాగిస్తోంది. ఇందులో భాగంగానే 'దొంగే.. దొంగ దొంగ అని అరిచినట్లు'దొంగ ఓట్లంటూ ఫిర్యాదులు కూడా చేస్తుండటం గమనార్హం.

బీఆర్‌ఎస్‌ తీరుపై కామ్రేడ్ల కస్సుబుస్సు

- పొత్తులపై అధికార పార్టీ మౌనంతో వామపక్షాల్లో అసహనం
- సీఎం అపాయింట్‌మెంట్‌ అడిగినా లభించకపోవడంపై మండిపాటు
- తదుపరి కార్యాచరణపై నేడు ఇరు పార్టీల రాష్ట్ర కార్యదర్శుల భేటీ



సాక్షి, హైదరాబాద్‌: పొత్తుల విషయంలో బీఆర్‌ఎస్‌ తీరుపై వామపక్షాలు గరంగరంగా ఉన్నాయి. పొత్తులుంటాయా ఉండవా అనే అంశంపై సీపీఐ, సీపీఎం కేడర్‌లో గందరగోళం నెలకొంది. పొత్తులు, ప్రజాసమస్యలపై చర్చించేందుకు సీఎం కేసీఆర్‌ను అపాయింట్‌మెంట్‌ కోరినా ఇప్పటివరకు లభించకపోవడంపై కామ్రేడ్లు కస్సుబుస్సులాడుతున్నారు. మునుగోడు ఉప ఎన్నిక సమయంలో బీఆర్‌ఎస్‌ తమను ఉపయోగించుకొని పొత్తులపై చర్చించాలనే సరికి మాత్రం పక్కనపెడుతోందని కొందరు నేతలు మండిపడుతున్నారు. ఖమ్మంలో నిర్వహించిన సభకు తమ జాతీయ నేతలైన కేరళ సీఎం పినరయి విజయన్‌, డి.రాజా వంటి వారిని వెంటపడి మరీ పిలిపించుకున్న సీఎం కేసీఆర్‌... ప్రస్తుతం అపాయింట్‌మెంట్‌ ఇవ్వడానికి కూడా ఆసక్తి చూపించకపోవడాన్ని తప్పుబడుతున్నారు. ఈ నేపథ్యంలో సీపీఐ, సీపీఎం నేతలు శుక్రవారం ఎంబీ భవన్‌లో కీలక సమావేశం నిర్వహిస్తున్నారు. సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కూనంనేని సాంబశివరావు, సీపీఎం రాష్ట్ర కార్యదర్శి తమ్మినేని వీరభద్రం సహా ఆ పార్టీల ముఖ్య నేతలు హాజరుకానున్నారు.

బీజేపీని వ్యతిరేకించే శక్తులతోనే ముందుకు...

మునుగోడు ఉపఎన్నిక సందర్భంగా బీజేపీకి అడ్డుకట్ట వేయగలిగేది బీఆర్‌ఎస్‌ మాత్రమేనని భావించి ఆ పార్టీకి వామపక్షాలు మద్దతిచ్చాయి. అనుకున్నట్లుగానే బీజేపీ గెలవకుండా అక్కడ వామపక్షాల ఓట్లు సహకరించాయి. రానున్న ఎన్నికల్లోనూ బీజేపీని ఓడించే సత్తాగల పార్టీకే మద్దతు ఇవ్వాలన్నది వామపక్షాల వైఖరి. ఇందులో భాగంగా సీపీఐ, సీపీఎంలు బీఆర్‌ఎస్‌ను చెరో 10 అసెంబ్లీ స్థానాలు కోరాలనుకుంటున్నాయి. చర్చల్లో చివరకు చెరో ఐదు స్థానాలు తప్పనిసరిగా అడగాలన్నది వారి ఉద్దేశం. కానీ ఈ స్థానాలు ఇవ్వడానికి బీఆర్‌ఎస్‌ సిద్ధంగా లేదన్న వాదనలు వస్తున్నాయి. బీఆర్‌ఎస్‌ సిట్టింగ్‌లున్న ఆయా స్థానాలను కామ్రేడ్లకు ఇవ్వడం వల్ల ప్రస్తుత ఎమ్మెల్యేలు అలిగి సహకరించకపోతే ఓటు బదిలీ జరగక వారు ఓడిపోయే ప్రమాదం ఉందన్న భావనలో బీఆర్‌ఎస్‌ ఉందని వామపక్షాలు అంచనా వేస్తున్నాయి. అలాగే పది సీట్లు ఇచ్చినా వామపక్షాలు డబ్బు ఖర్చు పెట్టవని, దానివల్ల కూడా సీట్లు కోల్పోవాల్సి వస్తుందని కూడా బీఆర్‌ఎస్‌ భావిస్తున్నట్లు చెబుతున్నారు. ఈ నేపథ్యంలో బీఆర్‌ఎస్‌తో పొత్తు కుదరకపోతే కాంగ్రెస్‌తో పొత్తు కుదుర్చుకొనే దిశగా కూడా వామపక్షాలు ఆలోచిస్తున్నాయి. అయితే కాంగ్రెస్‌ కూడా ఇప్పటివరకు వామపక్షాలతో పొత్తుపై ఆసక్తి చూపించడంలేదని సమాచారం.

మిల్లర్ల బకాయిలు రూ. 2,072 కోట్లు

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్రంలోని మిల్లర్లు రాష్ట్ర ప్రభుత్వానికి రూ. వేల కోట్లలో బకాయి పడ్డారు. కస్టమ్‌ మిల్లింగ్‌ రైస్‌ (సీఎంఆర్‌) కోసం ఇచ్చిన ధాన్యాన్ని సకాలంలో మిల్లింగ్‌ చేసి ఎఫ్‌సీఐకి ఇవ్వకుండా సొంత ప్రయోజనాలు చూసుకుంటున్నారు. దీంతో 2019 యాసంగి నుంచి 2022 యాసంగి వరకు పౌరసరఫరాల సంస్థకు రూ. 2,072 కోట్ల విలువైన 5.83 లక్షల మెట్రిక్‌ టన్నుల బియ్యం బకాయిపడ్డారు. ఈ మొత్తం బియ్యాన్ని లేదా అందుకు సమానమైన నగదును 25 శాతం జరిమానాతో డిఫాల్ట్‌ అయిన మిల్లుల నుంచి వసూలు చేయాల్సి ఉంది. ఈ మేరకు పౌరసరఫరాల శాఖ ఎక్స్‌అఫీషియో కార్యదర్శి హోదాలో కమిషనర్‌ అనిల్‌ కుమార్‌ ఇప్పటివరకు నాలుగు ఉత్తర్వులు జారీ చేశారు. దీంతో పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్లు ఆయా మిల్లులకు రికవరీ నోటీసులు జారీ చేస్తున్నారు.

ఆ బియ్యం విలువే రూ. 1,630 కోట్లు

2021–22 యాసంగికి సంబంధించి 2,37,310 మెట్రిక్‌ టన్నుల బియ్యాన్ని ఎఫ్‌సీఐకి అప్పగించాల్సి ఉండగా ఈ గడువు గత మే నెలాఖరుతో ముగిసింది. దీంతో ఈ బియ్యాన్ని 25 శాతం పెనాల్టీతో రికవరీ చేయాలని లేదంటే బియ్యం విలువ రూ. 842.09 కోట్లను 25 శాతం పెనాల్టీతో వసూలు చేయాలని పౌరసరఫరాల సంస్థ జిల్లా మేనేజర్లు ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే గత నెల 23న 2021–22 వానాకాలానికి సంబంధించిన 2.22 లక్షల మెట్రిక్‌ టన్నుల బియ్యాన్ని 25 శాతం పెనాల్టీతో 494 మిల్లుల నుంచి రికవరీ చేసేందుకు ఆదేశాలు జారీ అయ్యాయి. ఈ బియ్యం విలువ రూ. 787.67 కోట్లు. ఈ రెండు సీజన్‌లలోనే రూ. 1,630 కోట్ల వరకు రావాల్సి ఉంది.

2019 యాసంగి బకాయి 48,762 మెట్రిక్‌ టన్నులు

ఇక్కడ ఆశ్చర్యకరమైన విషయం ఏమిటంటే 2019 యాసంగి సీజన్‌కు సంబంధించి 118 మిల్లుల నుంచి సీఎంఆర్‌ కింద లక్షల మెట్రిక్‌ టన్నుల బియ్యం రావాల్సి ఉంది. దీనికి సంబంధించి ఈ ఏడాది మార్చిలోనే పెనాల్టీతో 125 శాతం రికవరీ చేయాలని ఉత్తర్వులు జారీ అయ్యాయి. అయితే ఈ మిల్లులు గడువులోగా బియ్యం ఇవ్వకపోవడంతో నెలకోసారి గడువును పెంచుతూ వచ్చారు. ఎట్టకేలకు ఈ నెలలో 14 మిల్లులు 125 శాతం బియ్యం రికవరీ చేశాయి. మరో 89 మిల్లులు 100 శాతం రికవరీ కింద సర్కారుకు సీఎంఆర్‌ అప్పగించాయి. ఇంకా 15 మిల్లులు ఎలాంటి రికవరీ చేయలేదు. దీంతో ఇంకా 48,762 మెట్రిక్‌ టన్నుల బియ్యం ఆయా మిల్లుల నుంచి రావాల్సి ఉంది. ఇప్పటికీ ఈ మిల్లులకు పెండింగ్‌ సీఎంఆర్‌ రికవరీ చేసుకొనే అవకాశం ఇస్తూ ఈ నెల 19న ఉత్తర్వులు జారీ చేశారు. అలాగే 2020–21 సంవత్సరం యాసంగికి సంబంధించి మరో 73 మిల్లుల నుంచి 75,878 మెట్రిక్‌ టన్నుల బియ్యం రావాల్సి ఉండగా ఈ మొత్తాన్ని కూడా పెనాల్టీతో 125 శాతం రికవరీ చేయాలని సైతం ఈ నెల 19నే ఉత్తర్వులు జారీ చేశారు. ఈ రెండు సంవత్సరాలకు సంబంధించిన బియ్యం 1.25 లక్షల మెట్రిక్‌ టన్నులు కాగా, ఈ బియ్యం విలువనే రూ. 442 కోట్లు.

- 2019–20 నుంచి 2021–22 వరకు సీఎంఆర్‌ కింద ఇవ్వాల్సిన బియ్యం 5.83 ఎల్‌ఎంటీ
- దీని విలువ రూ. 2,072 కోట్లు.. డిఫాల్ట్‌ మిల్లర్ల నుంచి 125 శాతం రికవరీకి ఆదేశాలు
- బకాయిలను 25% జరిమానాతో చెల్లించాలని నోటీసులు
- 25 శాతం పెనాల్టీతో రికవరీ అయిన మిల్లులకే వచ్చే సీజన్‌కు సీఎంఆర్‌

బియ్యం బకాయిలు, దాని విలువ (క్వింటాల్‌కు రూ. 3,548.5 లెక్కన)

సంవత్సరం	బియ్యం బకాయి (మెట్రిక్‌ టన్నుల్లో)	విలువ (రూ.కోట్లలో)
2019-20	48,762.210	173.03
2020-21	75,877.750	269.25
2021-22 (వానాకాలం)	2,22,000	787.67
2021-22 (యాసంగి)	2,37,310	842.09
మొత్తం	5,83,949.96	2,072.04



25 శాతం నగదు... 100 శాతం బియ్యం రికవరీ

డిఫాల్ట్‌ మిల్లర్ల నుంచి 125 శాతం బియ్యాన్ని రికవరీ చేసే ప్రక్రియలో ముందుగా 25 శాతం బియ్యాన్ని లేదా అందుకు సమానమైన మొత్తాన్ని పెనాల్టీ రూపంలో ప్రభుత్వానికి అప్పగించాల్సి ఉంటుంది. ఇందులో 5 శాతం ఈ ఉత్తర్వులు వెలువడిన వెంటనే ఇవ్వాల్సి ఉంటుంది. అలా చేస్తేనే తరువాత సీజన్‌కు మళ్లీ సీఎంఆర్‌ ఇచ్చేందుకు వీలు కలుగుతుంది. అయితే 25 శాతం పెనాల్టీలో ఐదు శాతమే ఇప్పటికిప్పుడు ఇవ్వడం, మిగతా పెనాల్టీ మొత్తాన్ని 4 వాయిదాల్లో చెల్లించే వెసులుబాటు ఉండటంతో మిల్లర్లు ఇదే అదనుగా వ్యాపారాన్ని యథేచ్ఛగా సాగిస్తున్నారనే విమర్శలున్నాయి.

తెలుగులో తొలి తీర్పు

- రాష్ట్ర హైకోర్టు చరిత్రలో తొలిసారి ప్రాంతీయ భాషలో తీర్పు
- వెలువరించిన జస్టిస్‌ పి.నవీన్‌రావు, జస్టిస్‌ నగేశ్‌ భీమపాక
- భూవివాదం కేసులో 45 పేజీల్లో తీర్పు



జస్టిస్‌ నవీన్‌రావు



జస్టిస్‌ నగేశ్‌ భీమపాక

సాక్షి, హైదరాబాద్‌: రాష్ట్ర హైకోర్టు చరిత్రలో తొలిసారి ఓ తీర్పు తెలుగు భాషలో వెలువడింది. ఉమ్మడి హైకోర్టు చరిత్రలోనూ ప్రాంతీయ భాషలో ఉత్తర్వులు రావడం ఇదే మొదటిది కావడం విశేషం. సికింద్రాబాద్‌ మచ్చ బొల్లారంలోని ఓ భూవివాదానికి సంబంధించి దాఖలైన అప్పీల్‌ను కొట్టివేస్తూ జస్టిస్‌ పి.నవీన్‌రావు, జస్టిస్‌ నగేశ్‌ భీమపాక ధర్మాసనం ఈ నెల 27న 45 పేజీల తీర్పును తెలుగులో ఇచ్చింది. ఈ కేసులో విచారణ జరిపి కింది కోర్టు ఇచ్చిన తీర్పును సమర్థిస్తూ ఉత్తర్వులు జారీ చేసింది. ట్రయల్‌ కోర్టు ఇచ్చిన ఆదేశాల్లో జోక్యం చేసుకోవాల్సిన అవసరం కనిపించడం లేదని వ్యాఖ్యానించింది. కోర్టు అధికారిక కార్యకలాపాల కోసం ఆంగ్లంలో కూడా ప్రతిని వెలువరించింది. కొన్ని ఆంగ్ల పదాలకు సందర్భానుసారం తెలుగు పదాలు అందుబాటులో లేకపోవడంతో, మరికొన్ని ఆంగ్ల పదాలు జన బాహుళ్యంలో ఎక్కువగా వినియోగంలో ఉండటంతో వాటిని తీర్పు కాపీలో ఆంగ్లంలోనే పేర్కొన్నారు. ఇదిలాఉండగా, దేశంలో ప్రాంతీయ భాషలో హైకోర్టు తీర్పు వెలువరించడం ఇది రెండోసారి. కేరళ హైకోర్టు గతంలో అక్కడి స్థానిక భాషలో తీర్పునిచ్చింది.

కేసు ఇదీ..

మచ్చబొల్లారంలో సర్వే నంబర్‌ 162, 163లో కె.వీరారెడ్డికి 13.01 ఎకరాల భూమి ఉండేది. వీరారెడ్డికి ఇద్దరు కొడుకులు. వీరారెడ్డి మరణానంతరం అందులో 4.08 ఎకరాలు తల్లి సాలమ్మకు ఇచ్చి మిగిలినది కొడుకులిద్దరు పంచుకున్నారు. సాలమ్మ జీవించి ఉండగానే ఆమె భూమిని వాదప్రతివాదులు మౌఖిక అగ్రిమెంట్‌ ప్రకారం చెరోసగం తీసుకున్నారు. 2005లో సాలమ్మ చనిపోవడంతో తనకు ఆమె ద్వారా సంక్రమించిన ఆస్తిని మ్యుటేషన్‌ చేయాలని ఒక కుమారుడు కె.చంద్రారెడ్డి మండల రెవెన్యూ అధికారికి దరఖాస్తు చేసుకున్నారు. సాలమ్మ రాసిన వీలునామాపై మరో కుమారుడు కె.ముత్యంరెడ్డి అభ్యంతరం వ్యక్తం చేశారు. హిందూ వారసత్వ చట్టం–1956 ప్రకారం హిందూ మహిళ తన భర్త నుంచి వారసత్వంగా సంక్రమించిన ఆస్తి (4.08 ఎకరాలు)ని భర్త వారసులకు బదలాయించాలని, భారత వారసత్వ చట్టం–1925కు అనుగుణంగా వీలునామా లేదని, సాలమ్మను 80 ఏళ్ల వయసులో భయపెట్టి వీలునామా రాయించారని, కాబట్టి ఆమె ఆస్తిని వారసులందరికీ సమంగా పంచాలన్నారు. వీరి వాదనలను కిందికోర్టు ఆమోదించింది. ఈ తీర్పును రద్దు చేయాలని కోరుతూ చంద్రారెడ్డి హైకోర్టులో అప్పీల్‌ చేశారు. దీనిపై జస్టిస్‌ నవీన్‌రావు, జస్టిస్‌ నగేశ్‌ ధర్మాసనం విచారణ జరిపి తీర్పునిచ్చింది.

ఆ ఉద్యోగాలను క్రమబద్ధీకరించండి: హైకోర్టు

పోలీస్‌ హౌసింగ్‌ కార్పొరేషన్‌కు హైకోర్టు ఆదేశం

సాక్షి, హైదరాబాద్‌: ఏళ్లకు ఏళ్లు కాంట్రాక్టు ఉద్యోగులుగా సేవలు వినియోగించుకుని.. తర్వాత వారి ఉద్యోగాలను పోలీస్‌ హౌసింగ్‌ కార్పొరేషన్‌ తొలగించడాన్ని హైకోర్టు తప్పుబట్టింది. రెగ్యులర్‌ నియామకాల పేరుతో ఎంతోకాలంగా పనిచేస్తున్న వారిని తొలగించడం చట్టవిరుద్ధమని వ్యాఖ్యానించింది. కార్పొరేషన్‌లో సైట్‌ ఇంజనీర్‌, జూనియర్‌ అసిస్టెంట్‌లుగా కాంట్రాక్ట్‌ పద్ధతిన 2012 నుంచి పనిచేస్తున్న వారిని నిబంధనల ప్రకారం క్రమబద్ధీకరించాలని ఆదేశించింది. తమ సర్వీస్‌ను క్రమబద్ధీకరించాలని తొలగింపునకు గురైన వారు వినతి పత్రం అందజేయాలని, దీన్ని పరిశీలించి మూడు నెలల్లో నిర్ణయం తీసుకోవాలని స్పష్టం చేసింది. గతంలో వారు పనిచేసిన చోటే నియమించాలని, సర్వీస్‌ను తొలగించరాదని పేర్కొంది. 2012 నుంచి తమ సేవలు వినియోగించుకుని రెగ్యులర్‌ చేయకుండా కొత్తవారి కోసం నియామకాలు చేపట్టడాన్ని సవాల్‌ చేస్తూ కాంట్రాక్ట్‌ ఉద్యోగులు హైకోర్టులో పిటిషన్‌ దాఖలు చేశారు. దీనిపై జస్టిస్‌ ఈవీ వేణుగోపాల్‌ విచారణ చేపట్టి ఇటీవల తీర్పునిచ్చారు. దశాబ్దకాలంపాటు పనిచేసిన వారిని అకస్మాత్తుగా తొలగిస్తే ఎలా అని ప్రశ్నించారు. వయసు మీరిన వారు ఇప్పుడు మరో ఉద్యోగం ఎలా పొందుతారని, ఆ కుటుంబాలన్నీ రోడ్డున పడతాయని ఆందోళన వ్యక్తం చేశారు. సుదీర్ఘ కాలం అందించిన వారి సేవలను గుర్తించి క్రమబద్ధీకరించాలని పోలీస్‌ హౌసింగ్‌ కార్పొరేషన్‌ను ఆదేశించారు.

రూ. 40 కోట్ల ఐటీ రిఫండ్‌ స్కాం!

- కమీషన్‌ ఆశ చూపి కొందరు ఉద్యోగులకు వర్తించని సెక్షన్ల కింద రిటర్న్‌లు ఫైల్‌
- 8 కన్సల్టెన్సీల నిర్వాకం.. ఐటీ అధికారుల పరిశీలనలో వెలుగులోకి

సాక్షి, హైదరాబాద్‌: ఆదాయపన్ను శాఖ నుంచి పన్ను రీఫండ్‌లో భారీ కుంభకోణం జరిగినట్లు వెలుగులోకి వచ్చింది. ఐటీ శాఖ అధికారుల ప్రాథమిక అంచనా ప్రకారం రూ. 40 కోట్ల మేర రిఫండ్‌ పేరిట స్కాం జరిగినట్లు తెలుస్తోంది. ఐటీ ఇన్వెస్టిగేషన్‌ వింగ్‌, హైదరాబాద్‌ బృందాలు రెండు రోజుల క్రితం హైదరాబాద్‌, విజయవాడల్లోని పలు ప్రాంతాల్లో నిర్వహించిన దర్యాప్తులో ఈ విషయం వెలుగులోకి వచ్చింది. ఐటీ రిఫండ్‌ స్కాంలో ప్రైవేటు ఉద్యోగులతోపాటు రైల్వేశాఖకు చెందిన ఉద్యోగులు, పోలీస్‌శాఖలోని ఉద్యోగులు సైతం ఉన్నట్లు ఐటీ అధికార వర్గాల ద్వారా తెలుస్తోంది. ఎల్బీనగర్‌, వనస్థలిపురం, నిజాంపేట ప్రాంతాల్లో చేపట్టిన దర్యాప్తులో 8 కన్సల్టెన్సీలకు ఈ స్కాంతో సంబంధం ఉన్నట్లు అధికారులు ప్రాథమికంగా గుర్తించినట్లు తెలిసింది. ఆయా కన్సల్టెన్సీలు ఉద్యోగులకు కమీషన్‌ ఆశ చూపి వారికి వర్తించని ఐటీ సెక్షన్ల కింద ఐటీ రిటర్న్‌లు ఫైలు చేయడంతోపాటు కొన్ని తప్పుడు ధ్రువపత్రాలు సమర్పించినట్లు అధికారుల ప్రాథమిక దర్యాప్తులో తెలిసింది. ఈ ఉదంతంపై క్రిమినల్‌ కేసులు నమోదు చేసే యోచనలో అధికారులు ఉన్నట్లు సమాచారం. 2017లోనూ 200 మంది వరకు సాఫ్ట్‌వేర్‌ ఉద్యోగులు తప్పుడు ధ్రువపత్రాలు చూపి ఐటీ రీఫండ్‌ పొందిన వ్యవహారంపైనా హైదరాబాద్‌ సీసీఎస్‌లో కేసు నమోదు చేసిన విషయాన్ని ఐటీ అధికారులు గుర్తుచేశారు.

2,878 పరీక్ష కేంద్రాలు... 39,600 మంది ఇన్విజిలేటర్లు

9 వేల ఉద్యోగాలు... 9.5 లక్షల మంది అభ్యర్థులు

రేపటి గ్రూప్‌–4 పరీక్షకు సర్వం సిద్ధం

సాక్షి, హైదరాబాద్‌: ప్రభుత్వ విభాగాల్లో గ్రూప్‌–4 ఉద్యోగ ఖాళీల భర్తీకి సంబంధించిన అర్హత పరీక్షల నిర్వహణకు తెలంగాణ స్టేట్‌ పబ్లిక్‌ సర్వీస్‌ కమిషన్‌ పకడ్బందీ ఏర్పాట్లు చేసింది. ఒకవైపు అత్యధిక సంఖ్యలో పోస్టులు... మరోవైపు అత్యధిక సంఖ్యలో అభ్యర్థులుండటంతో టీఎస్‌పీఎస్సీ వ్యూహాత్మక కార్యాచరణతో చర్యలు చేపట్టింది. రాష్ట్రవ్యాప్తంగా వివిధ శాఖల్లో 9 వేల గ్రూప్‌–4 ఉద్యోగ ఖాళీలున్నాయి. వీటికి 9.51 లక్షల మంది అభ్యర్థులు దరఖాస్తు చేసుకోగా... గురువారం రాత్రి వరకు 8.55 లక్షల మంది అభ్యర్థులు హాల్‌టికెట్లను డౌన్‌లోడ్‌ చేసుకున్నారు. రాష్ట్రవ్యాప్తంగా 33 జిల్లాల పరిధిలో 2,878 పరీక్ష కేంద్రాల్లో గ్రూప్‌–4 పరీక్షల నిర్వహణకు కమిషన్‌ ఏర్పాట్లు చేసింది. ప్రతి పరీక్షా కేంద్రానికి ఒక లైజన్‌ అధికారి, ఒక చీఫ్‌ సూపరింటెండెంట్‌ ఉంటారు. ఈ పరీక్షా కేంద్రాల పరిధిలో దాదాపు 40 వేల పరీక్ష హాల్‌లలో అభ్యర్థులను సర్దుబాటు చేస్తారు. ఒక్కో పరీక్ష హాలులో గరిష్టంగా 24 మంది అభ్యర్థులుంటారు. పరీక్షల నిర్వహణలో ఇన్విజిలేటర్ల పాత్ర కీలకం. దీంతో ఇన్విజిలేటర్లకు ప్రత్యేకంగా శిక్షణ సైతం టీఎస్‌పీఎస్సీ ఇచ్చింది. జూలై 1న శనివారం ఉదయం 10 గంటల నుంచి 12.30 గంటల వరకు, మధ్యాహ్నం 2.30 గంటల నుంచి సాయంత్రం 5 గంటల వరకు రెండు పేపర్లు ఉంటాయి. పరీక్ష సమయానికి 15 నిమిషాల ముందే పరీక్షా కేంద్రం గేట్లు మూసివేస్తారు.

పరీక్ష కేంద్రంలో పక్కాగా పరిశీలన...

గ్రూప్‌–4 ఉద్యోగాలు పెద్ద సంఖ్యలో ఉండటంతో ఆశావహులు సైతం భారీగా ఉన్నారు. ఈ క్రమంలో అభ్యర్థుల పరిశీలన, నిర్ధారణకు టీఎస్‌పీఎస్సీ ప్రత్యేక ఏర్పాట్లు చేసింది. ఇన్విజిలేటర్లకు సైతం నిర్ధారణ బాధ్యతలు అప్పగించింది. తొలుత పరీక్ష కేంద్రంలోకి ప్రవేశించే సమయంలో అభ్యర్థి హాల్‌టిక్కెట్‌తో పాటు గుర్తింపు కార్డులు పరిశీలిస్తారు. ఆ తర్వాత అభ్యర్థిని క్షుణ్ణంగా తనిఖీ చేస్తారు. ఎలక్ట్రానిక్‌ పరికరాలను అనుమతించరు. అభ్యర్థులకు కనీసం బెల్టు సైతం అనుమతించబోమని టీఎస్‌పీఎస్సీ ఇప్పటికే తేల్చి చెప్పింది. పరీక్ష హాలులో అభ్యర్థిని ఇన్విజిలేటర్‌ మరోమారు తనిఖీ చేస్తారు. హాల్‌ టికెట్‌లోని ఫోటో ద్వారా, అభ్యర్థి ఫోటో గుర్తింపు కార్డు ద్వారా పరిశీలిస్తారు. ఆ తర్వాత ఓటీఆర్‌లో ఉన్న సంతకం ఆధారంగా అభ్యర్థి చేసిన సంతకాన్ని పరిశీలిస్తారు. నామినల్‌రోల్స్‌ పైన సంతకం తప్పనిసరి చేసింది. దీంతో పాటు అభ్యర్థి వేలిముద్రను పరీక్ష హాలులోనే సమర్పించాలి. ఐదు పద్ధతుల్లో ఎక్కడ పొరపాటు గుర్తించినా అభ్యర్థిని పరీక్షకు అనుమతించమని టీఎస్‌పీఎస్సీ తేల్చిచెప్పింది. గ్రూప్‌–4 పరీక్ష ఓఎంఆర్‌ పద్ధతిలో నిర్వహిస్తున్నట్లు కమిషన్‌ తెలిపింది. ఓఎంఆర్‌ జవాబు పత్రంలో అభ్యర్థి ముందుగా హాల్‌టిక్కెట్‌ నంబర్‌, ప్రశ్నపత్రం కోడ్‌ను బబ్లింగ్‌ చేయాలి. ఓఎంఆర్‌ జవాబు పత్రంపై అభ్యర్థి హాల్‌టిక్కెట్‌ నంబర్‌, ఫోటో ఉంటాయని వస్తున్న ఊహాగానాలను పట్టించుకోవద్దని కమిషన్‌ ఇప్పటికే స్పష్టం చేసింది.

తాళి తొలగిస్తే ఊరుకోం

టీఎస్‌పీఎస్సీకి వీహెచ్‌పీ హెచ్చరిక

సాక్షి, హైదరాబాద్‌: పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థినుల నుంచి మంగళ సూత్రాలను తొలగిస్తే ఊరుకునేది లేదని విశ్వ హిందూ పరిషత్‌ (వీహెచ్‌పీ) టీఎస్‌పీఎస్సీని హెచ్చరించింది. రకరకాల నిబంధనలతో హిందువులను అవమానిస్తే ఊరుకునేది లేదని, సంప్రదాయాలను మంటగలిపే దుర్మార్గమైన చర్యలకు పాల్పడితే తీవ్ర ప్రతిఘటన ఉంటుందని పేర్కొంది. ఈ మేరకు గురువారం టీఎస్సీపీఎస్సీ చైర్మన్‌, కార్యదర్శికి వీహెచ్‌పీ రాష్ట్ర కార్యదర్శి పండరినాథ్‌, ఉపాధ్యక్షుడు జగదీశ్వర్‌, ప్రచార ప్రముఖ్‌ పగుడాకుల బాలస్వామి, బజరంగ్‌ దళ్‌ రాష్ట్ర కన్వీనర్‌ శివ రాములు తదితరులు కలిసి వినతి పత్రం సమర్పించారు.

Published and Printed by V. Murali on behalf of Jagati Publications Limited, Printed at Jagati Publications Limited, Sakshi Press, Plot no. D-75 & E-52, Industrial Estate (APIE), Balanagar, Medchal Dist. and Published at 6-3-249/1, Sakshi Towers, Road No. 1, Banjara Hills, Hyderabad - 500 034, Editor: V. Murali, (Responsible for selection of News under the PRB Act) Phone No. +91-40-23256000 (30). RNI Reg No. TELTEL/2008/23482.